ఓం నమో వేంకటేశాయ

# శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి
# 101వ జయంతి విశేష సంచిక

**గౌరవ సంపాదకులు :**

**శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి**

ఐ.డి.ఇ.ఎస్.

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

**సహ సంపాదకులు :**

**డా॥ శ్రీ ఆకెళ్ళ విభీషణశర్మ**

సంచాలకులు, అన్నమాచార్య ప్రాజెక్టు,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

**ప్రకాశకులు :**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2023**

**శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి 101వ జయంతి ఉత్సవ విశేష సంచిక**

2023 సం॥   200 ప్రతులు

వెల : అమూల్యం

ప్రతులకు : **అన్నమాచార్య ప్రాజెక్టు,**
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

ముద్రణ : తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# నివేదన

శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల పరిష్కరణ అనగానే సాహిత్యలోకంలో శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి గారి, శ్రీరాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి పేర్లు మాత్రమే వినిపిస్తాయి. అలాగే వీటిని మొట్టమొదటగా గుర్తించి, వెలుగులోకి తీసుకురావడానికి తనవంతు కృషిని చేసిన మహనీయులు శ్రీసాధుసుబ్రహ్మణ్యం శాస్త్రిగారిని కూడా పేర్కొంటారు. కానీ శ్రీమాన్ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, శ్రీ పి. టి. జగన్నాథాచార్యులు, శ్రీకలబరిగి వేంకట రమణశాస్త్రిగారు, పండిత శ్రీవిజయరాఘవాచార్యులుగారు మొదలైన వారి కృషి, సహకారం ఎందుకో మరుగున పడింది. పూర్వాపరాలన్నీ సమన్వయించుకొని, శ్రీ రాళ్ళపల్లి వారికి సహాయక బాధ్యత నెరపి తాళ్ళపాక సంకీర్తన వాఙ్మయం పూర్తిగా, పుస్తకాల రూపంలో వెలుగుచూడడానికి అపూర్వకృషి చేసిన పెద్దలు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిని విస్మరించడం దురదృష్టకరం.

'శిరోమణి' 'విద్వాన్' శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు – అవధాన విద్య, తెలుగు సంస్కృత భాషల్లో ఆశుకవితను చెప్పడంలో గంగానదికి సాటి. మంత్రశాస్త్రము, ఆయుర్వేదం తెలిసిన ప్రజ్ఞాశాలి. రాయలసీమలో పుట్టినందువల్ల దేశితెలుగు నుడికారాలను తెలుసుకొన్న సదాచార సంపన్నుడు. ఎట్టకేలకు తిరుమల తిరుపతి దేవస్థానము వారి ప్రత్యేక చొరవతో, శ్రీ గౌరిపెద్ది వారి శతజయంత్యుత్సవాల సంపూర్ణమైన నేపథ్యంలో, వారి విగ్రహ ఆవిష్కరణ చేపట్టడం చారిత్రకాంశము. ప్రతి ఏటా వర్ధంతి, జయంతి ఉత్సవాల నిర్వహణను కూడా కొనసాగించడం ముదావహం. ఈ పవిత్ర తిరుపతిలో ధార్మిక జీవనం సాగించి, ఎందరో అవధానులకు తెలుగు భాషాధ్యయనం చేసిన అధ్యాపకులకు శ్రీగౌరిపెద్ది ద్రోణాచార్యుడు. తాళ్ళపాక వాఙ్మయ పరిష్కర్తగా సేవచేసిన ఈ పుణ్యమూర్తి 101వ జయంతి నాడు, (10–09–2023) వారి విగ్రహావిష్కరణ చేయడం నా భాగ్యం.

తాళ్ళపాక వారి కీర్తనల్లో సాహిత్య సంబంధమైన అంశాలపైనే కాక, వాగ్గేయకారుల భాష, సామాజిక దృష్టి, వ్యాకరణంలో ప్రత్యేకతలు మొదలైన వాటిని చాలా లోతుగా పరిశీలించిన మహనీయుడు.

శ్రీ గౌరిపెద్ది వారి పరిష్కరణలో వచ్చిన సంపుటాల్లోని పీఠికలు భావి పరిష్కర్తలకు చక్కని దారిదీపాలు. రాయలసీమ మాండలికాలకు, నుడికారాలకు, సామెతలకు, జాతీయాలకు వారిచ్చిన ప్రాధాన్యత ఆదర్శవంతమని నేను భావిస్తున్నాను. తమ తండ్రిగారిపైన ఆదరంతో, వారి సాహిత్యంపై ఎంతో గౌరవంతో, నా దగ్గరకు ఎన్నో సార్లు వచ్చి శ్రీగౌరిపెద్ది వారి కృషిని గుర్తుచేసిన వారి సుపుత్రుడు శ్రీ గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్‌కు నా శుభాభినందనలు.

సదా శ్రీవారిసేవలో

**(భూమన కరుణాకర రెడ్డి)**

అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానములు

మరియు శాసనసభ్యులు, తిరుపతి.

# మేలిమాట

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి సాహిత్య కైంకర్యం అన్నమాచార్య వాఙ్మయానికి అరుణోదయం. శ్రీరాళ్ళపల్లి, శ్రీ వేటూరి వంటి మహనీయుల కృషిని వీరు కొనసాగించారు. నిరంతరం లక్ష్యసాధనకై, గ్రంథశోధనకై, నిర్విరామంగా పనిచేసిన కర్మిష్ఠి. తాళ్ళపాక కవుల వాఙ్మయం – లోహపత్రాల నుండి, వ్రాతపత్రాలలోకి తేవడం శ్రీసాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారితో శ్రీకారం చుట్టబడింది. శ్రీ వేటూరి ప్రభాకర కరస్పర్శతో ముద్రణాయజ్ఞం కావ్యరూపం ధరించింది. కానీ తన పూర్వపరిశోధకుల గుండెల్లోని తాళ్ళపాక కవుల కవితాతపస్సును, సమీక్షించిన సంప్రదాయాన్ని అందిపుచ్చుకొన్న మహనీయులు శ్రీ గౌరిపెద్దివారు. వీరి అవధానాలలో "ధారణాశక్తి", తాళ్ళపాక కీర్తనల ప్రచురణ పీఠికలలో "విశ్లేషణాశేముషి" 'పరిశోధనాకృషి" అసాధారణమైనవి.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో అధ్యాపకులుగా, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా శ్రీ గౌరిపెద్దివారి సేవలు వెలలేనివి, వారి శతజయంతి (1922–2022) వేడుకల్లో విశేషంగా స్మరణీయమైనవి. ఈ నేపథ్యంలో వారు ఉద్యోగించిన కళాశాలలో విగ్రహప్రతిష్ఠను చేయడం, సదస్సును నిర్వహించడం, విశేష సంచికను ఆవిష్కరించడం సముచితంగా భావిస్తున్నాను. వీరి శతజయంతి ఉత్సవ విశేష సంచికలో శ్రీ శలాక, బేతవోలు, సముద్రాల వంటి మేధావులు మరియు శ్రీగండ్లూరివంటి మేటి అవధానుల వ్యాసాలలో గౌరిపెద్ది వారి పాండిత్యం, వ్యక్తిత్వం, శిష్యవాత్సల్యం సమగ్రంగా స్పష్టమౌతున్నాయి. శ్రీ తాళ్ళపాక వారి వాఙ్మయ పరిశోధకులకు శ్రీగౌరిపెద్ది వారు పరిష్కరించిన తాళ్ళపాక కీర్తనలు, వాటికి సమకూర్చిన పీఠికలు భవిష్యత్తరాలకు దారిదీపాలు. గౌరిపెద్ది వారి సాహిత్య కైంకర్యానికి అంజలి ఘటిస్తూ....

వేంకటేశ చరణౌ, శరణం ప్రపద్యే

"అవ్వలివ్వల శ్రీహరి రూపుగాని వా రెవ్వరు లేరని యెరుక దోచిన జాలు..."

సదా శ్రీవారిసేవలో...

**(ఏ.వి.ధర్మారెడ్డి)**

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు



*His Holiness, Courtallam Sankaracharya, Jagadguru*

**SRI SIDDHESWARANANDA BHARATI SWAMY**

*Peetadhipati - Siddheswari Peetam*

**Office :**
**Mounaswamy Mutt**
**Courtallam-627 802.**
Thirunelveli Dist., (T.N.)
TAMILANADU
Ph : 04633 - 283707

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు
**శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి**
సిద్ధేశ్వరీ పీఠాధిపతి - కుర్తాళం

**Camp Office :**
Swayam Siddha Kaali Peetam
4th Line, Ravindra Nagar
Guntur - 522 006. (A.P.)
Ph : 9440208103

తేది : 15-08-2023

# ఆశీర్వాద శ్రీముఖము

బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు మహా పండితులు. భార్గవరామాయణ, భీష్మవిజయాది గ్రంథములెన్నో రచించిన కవిశేఖరులు. మహనీయులైన శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు వీరిని "నడిచే నిఘంటువన్నా"రంటే అంతకంటే విశిష్టమైన గౌరవపదం ఇంకేమి కావాలి? ప్రసిద్ధులైన విద్వత్కవులెందరో వీరిశిష్యులు. విశేషించి వేదాంతసునిశ్చితార్థులు. అరవై సంవత్సరాల క్రింద శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో పిహెచ్.డి. డిగ్రీ కొరకు రిసర్చి స్కాలర్‌గా ఉన్నప్పుడు వారున్న వీధిలోనే ఉండే వాడిని. వారిని బాగా ఎరుగుదును. తరువాత కాలంలో ప్రసాదరాయ కులపతిగా "కవితా మహేంద్రజాలమ"నే గ్రంథమును ఆంధ్రప్రభలో ప్రచురించినపుడు ఎందరో విద్వత్కవుల విశేషాలు వ్రాస్తూ వీరిని గురించి కూడా ఒక వ్యాసం రచించాను.

అటువంటి పండిత కవివర్యుని 101వ జయంతి ఉత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు జరుపటం ప్రశంసనీయమైన అంశం. శ్రీ వేంకటేశ్వరుని కరుణాకటాక్షములచేత ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆశీర్వదిస్తున్నాను.

నారాయణస్మృతితో...

**సిద్ధేశ్వరానంద భారతీ స్వామి**

# కృతజ్ఞతాంజలి

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, పిలిచిన పలికే దైవము – శ్రీ వేంకటేశ్వరస్వామివారు. శ్రీవారి అనుగ్రహంతో శ్రీతాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనల పరిష్కరణలలో సింహభాగము మాతండ్రిగారైన శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారిదే. వారి పరిష్కరణ వరివస్యలో 27 సంకీర్తన సంపుటాలు వెలికిరావడం శ్రీనివాసుని సంకల్పమే.

శ్రీ గౌరిపెద్ది వారి సేవలను, పరిశ్రమను వెలికితీసి, దొడ్డ మనసుతో గుర్తించి గౌరవిస్తూ, సముచిత నిర్ణయం తీసుకుని తి.తి.దే. నేతృత్వంలో తరపున వారి శతజయంత్యుత్సవాలు నిర్వహించడం మహాభాగ్యం. శ్రీ గౌరిపెద్ది వారి కాంస్య విగ్రహము నెలకొల్పడమనే చారిత్రాత్మక బాధ్యతను భుజాలకెత్తుకున్న ప్రస్తుత ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర రెడ్డిగారికి, శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీమాన్ ఎ.వి. ధర్మారెడ్డి గారికి వినయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి సదాభార్గవి ఐ.ఏ.ఎస్., శ్రీ వీరబ్రహ్మం ఐ.ఏ.ఎస్., ఇతర తి.తి.దే. ఉన్నతాధికారులకు నమస్సులు. ఈ కార్యక్రమంలో ప్రధాన భూమిక వహించిన అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు శ్రీ ఆకెళ్ల విభీషణశర్మగారికి నా ధన్యవాదములు.

బ్రహ్మశ్రీ గౌరిపెద్ది వారి 101వ జయంత్యుత్సవాల సందర్భంగా వెలువడుతున్న ఈ సాహిత్య లోకానికి అపరిచితుడనైనా, నేను అడిగినదే తడవుగా ఔదల దాల్చి మహోత్సాహంతో తమ అమూల్యమైన వ్యాసములను పద్యరూపకములను, శ్రీ గౌరిపెద్ది వారితో అనుభవాలను పంచుకున్న మేటి అవధాన చక్రవర్తులు, పాండితీప్రకర్షులైన పరిశోధక శిఖామణులు సకాలములో అందజేసినందులకు  పేరు పేరునా వారికి కృతజ్ఞతాపూర్వక నమశ్శతములు.

శ్రీ గౌరిపెద్దివారు ముద్రించిన అవధాన విశేషాలను సేకరించినారు. జీవిత, సాహిత్య విశేషాలను సిద్ధాంతవ్యాసంలో నిక్షిప్తం చేసి, వారి వాక్రువంతిని టేప్ రికార్డర్ ద్వారా భద్రపరచిన యమ్.ఫిల్ విద్యార్థి శ్రీమధురాంతకం జానకిరామరెడ్డి గారు పాఠకలోకానికి విలువైన విశేషాలు అందజేసారు.వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ముఖ్యంగా శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి శతజయంత్యుత్సవ సమితి సభ్యులందరూ అన్నివేళలా సలహాలిస్తూ సహకరిస్తూ, సత్కార్యభారాన్ని పంచుకుని నాకు వెన్నంటి నిలిచినారు. అందరికీ పేరుపేరునా నా కృతజ్ఞతలు.

**గౌరిపెద్ది వేంకటశంకర భగవాన్**
సమన్వయకర్త
శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి
101వ జయంత్యుత్సవ సమితి



ఇహమేకాని యిcకc బరమే కాని
బహళమె హరి నీపై భక్తే చాలు ॥పల్లవి॥

యెందు జనించిన నేమి యెచ్చోటనున్న నేమి
కందువనీదాస్యము గలిగితేc జాలు
అంది స్వర్గమే కాని అలనరకమేకాని
అందపునీనామము నా కబ్బుటే చాలు ॥ఇహ॥

దొరయైనc జాలుc గడుc దుచ్ఛపుబంటైనc జాలు
కరcగి విన్నుcదలcచcగలిగితేcజాలు
పరులు మెచ్చిన మేలు పమ్మిదూషించిన మేలు
హరినీసేవాపరుcడౌటే చాలు ॥ఇహ॥

యిలc జదువులురానీ యిటు రాకమాననీ
తలcపు నీపాదములతగులే చాలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చలపట్టి నాకు నీ శరణమేచాలు ॥ఇహ॥

(అధ్యాత్మ కీర్తనలు, సంపుటము-2, పాట-131)

# పరిష్కరణలో పెద్దపీట - శ్రీగౌరిపెద్దిదే

భారతీయ సంస్కృతి అంటే వైదిక సంస్కృతే. పరమ పవిత్రమైన భరతభూమిపై వేదోక్తమైన ధర్మాన్ని ఆచరించడం మహాభాగ్యం. కానీ కాలప్రభావంచేత, ప్రకృతి ప్రభావాదుల వల్ల ఆర్ష ధర్మాచరణలో మార్పులొస్తాయి. ఈ మార్పులు వస్తున్న వేళలో మూఢ, స్వార్థ శక్తుల యుక్తులు కలసి, సంకుచిత సిద్ధాంతాలు ఏర్పడుతాయి. ఆ సమయంలో సంస్కారోద్యమాలు బయలుదేరి విమర్శనాగ్నితో సత్యదృష్టిని ప్రబోధిస్తాయి. నిజమైన వేదసంస్కృతిని నిగ్గుతేలుస్తాయి. నీతిబాహ్యమైన, ధర్మహీనమైనవాదాలు వేదోపదేశాలు కావని నిరూపిస్తాయి.

ఈ నేపథ్యంలోనే ఆంధ్రావనిలో పాదులూనిన విజ్ఞానసంపద, తాళ్ళపాక కవుల సాహిత్యం. మహర్షులచే ఉపదేశించబడిన ఉపనిషత్తుల, పురాణ, ఇతిహాసాదుల సారం. ఆచరణాత్మక ధార్మిక, నైతిక ప్రబోధం. ఈ వాఙ్మయంలో పద్యాలు, గద్యాలు, ద్విపదలు, రగడలు, వచనాలు వంటి ఎన్నో ప్రక్రియలున్నాయి. ప్రధానమైనది సంకీర్తనా వాఙ్మయం, ఈ కీర్తనాత్మక కవిత్వానికి ఆద్యుడు, ఆరాధ్యుడు, అనవద్యుడు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులు. సకల వేదాలు, సంకీర్తనలుగా మల్చిన తిరుమల ఆలయకవి. శ్రీహరి నందకాంశ సంభూతుడు. సకల దేవతా స్వరూపుడిగా శ్రీవేంకటేశ్వర స్వామిని కొనియాడిన ఆకళంకుడు, “శ్రీ అన్నమయ్య”. ఈ ద్రావిడాగమ సార్వభౌముడి శ్రీ వేంకటేశ్వరాత్మక పదసాహిత్య ప్రచారదీక్షను కొనసాగించిన మహనీయులెందరో. వారిలో పెదతిరుమలయ్య, చినతిరుమలాచార్య, తాళ్ళపాక తిమ్మక్క, రేవణూరి నరసింహాచార్యులు వీరందరూ ప్రాతఃసర్మణీయులే.

శ్రీవారి ఆలయంలో హుండీకి ఎదురుగా తాళ్ళపాక వారి అరలో ఈ వెలలేని వాఙ్మయం లభించింది. ఈ వాఙ్మయానికి “అరుళప్పాడు” (సంప్రదాయరీతిలో ఆదరించే) వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు. ఇలా సమాదరించబడిన ఈ శ్రీవేంకటేశ్వర సారస్వతంతో సంస్కృతం చాలా స్వల్పం. తాళ్ళపాక పదసాహిత్యం అచ్చతెలుగులో, విశేషించి రాయలసీమ మాండలికాలలో, నుడికారాలతో, జాతీయాలతో విరాజిల్లుతోంది. పదాలు, దరువులు, ఏలలు, ఓలలు, ధవళంబులు, శోభనాలు, మంగళారతులు, ఉయ్యాల, జక్కులరేకులు, చందమామ పదాలు వంటి ప్రక్రియలకు – “పెట్టనికోట” అన్నమయ్య సంకీర్తన లహరి.

గోవర్ధనగిరిలో బ్రహ్మదేవుడుంచిన గోసంతతిలా, తాళ్లపాక వాఙ్మయం ఐదు శతాబ్దాలు తిరుమల ఆలయంలో భద్రంగా నిలిచింది. వందేళ్ళ క్రితం ఆలయ బయటకొచ్చిన ఈ వాఙ్మయం పరిష్కరణకు, ముద్రణకు నోచుకొంది. ఇందుకు మహోన్నత సేవనందించిన శ్రీసాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వంటి మహనీయులలో అద్వితీయులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ.

తాళ్ళపాక సంకీర్తనల పరిష్కరణ చాలా సంక్లిష్టమైనది. 1.భాష "శతాబ్దాల"కు పూర్వమున్న జనసామాన్యానికి చెందినది. ఆనాటి పదప్రయోగం ఈనాడు మరుగునపడింది. 2. వీటి మాతృక కేవలం లోహపత్రాలపై లభించడం అపూర్వమైన అంశం. 3.పైగా వ్రాయసకాండ్ర చేతివాటంలో అరసున్నలు, నిండుసున్నలు స్వీకరించడంలోని కాఠిన్యత. 4.సంగీత, సాహిత్యాల మేలుకలయిక కనుక సంగీత దృష్టిలో హ్రస్వాక్షరాలను దీర్ఘాక్షరాలుగాను, దీర్ఘాక్షరాలను హ్రస్వాలుగా చేసిన ప్రత్యేకత 5. నాటి కాలంలో నున్న వ్యావహారిక ప్రయోగాలు, రసదృష్టితో ఎంచుకొన్న వ్యాకరణ పద్ధతి – ఇవన్నీ పరిష్కర్తలకు ఎదురు నిల్చిన పర్యనుయోగాలు. ఇలాంటి సమస్యలకు ఎదురొడ్డిన మరోమందర పర్వతం శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ. అధ్యాపకుడిగా తెలుగు, సంస్కృత భాషల్లో ఆశుకవిగా, అవధానియేకాక, మంత్ర, తంత్ర శాస్త్రము లెరిగిన వేదమూర్తి. ఆయుర్వేదం, జ్యోతిషం వంటి ఆర్ష విద్య లెరిగిన ప్రజ్ఞాశాలి.

తొలుత తాళ్లపాక కీర్తనా వాఙ్మయ పరిష్కరణలో శ్రీరాళ్లపల్లి వారికి సహకరించారు. తరువాత తానే స్వయంగా కొన్ని (15) సంపుటాలను పరిష్కరించారు. అంతేకాక పూర్వ పరిష్కర్తలను సమీక్షించడం, రాగిరేకుల వర్గీకరణలో ఎంచుకొన్న శాస్త్రీయ దృక్పథం, ఇవన్నీ శ్రీ గౌరిపెద్దిని కార్యోత్సాహ పూర్ణుడిగా నిరూపించాయి.

వీరికున్న రాయలసీమ నుడికారాలపై పట్టు, వేదోపనిషత్తుల అధ్యయన సంపద, సంస్కృతాంధ్ర వ్యాకరణాలపై పట్టు ఒక ఎత్తు. ఇంతకు మించిన శ్రీవేంకటేశ్వరస్వామి భక్తి, ప్రపత్తి, శరణాగతి భావాలు మరో ఎత్తు. ఈ ప్రతిభాపుణ్యసంపదే తాళ్ళపాక కవుల కీర్తనలలో సింహభాగం పరిష్కరించే భాగ్యాన్ని కటాక్షించింది.

వీరికి తలపెట్టిన '10వ జయంతి' సంస్మరణోత్సవంలో – భాగ గ్రహీతలందంరికీ తప్పకుండా పద్మావతీ శ్రీనివాసుల అనుగ్రహం సిద్ధిస్తుంది.

"ఓం నమో వేంకటేశాయ"


"విడవిలేని శ్రీ వేంకట విభుడవు కడదాక నను కాతువు గాక"

**డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ**
సంచాలకులు
అన్నమాచార్య ప్రాజెక్టు, తి.తి.దే.

# విషయసూచిక



| | |
|---|---|
| నివేదన – భూమన కరుణాకర రెడ్డి | iii |
| మేలిమాట – ఏ.వి.ధర్మారెడ్డి | v |
| ఆశీర్వాద శ్రీముఖము – శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి | vi |
| కృతజ్ఞత – గౌరిపెద్ది వేంకటశంకర భగవాన్ | vii |
| పరిష్కరణలో పెద్దపీట – శ్రీగౌరిపెద్దిదే – డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | x |
| సారస్వత మహాశిఖరం – ప్రాచార్య డా॥ శ్రీ శలాక రఘునాథశర్మ | 1 |
| లిఖిత ప్రతుల నుంచి ముద్రిత ప్రతుల దాకా – ఆచార్య డా॥ బేతవోలు రామబ్రహ్మం | 4 |
| గౌరిపెద్ది వారి వరివస్య – ఆచార్య పప్పు వేణుగోపాల రావు | 9 |
| ఆరాధ్యుడు – గౌరిపెద్ది – డా॥ సముద్రాల లక్ష్మణయ్య | 14 |
| శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన సంపుటాల పరిష్కరణ – విశేషాంశాలు – ఆచార్య కె. సర్వోత్తమరావు | 18 |
| కవితా పుష్పాంజలి – బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ యఎ.ఏ.పి.హెచ్‌డి. | 99 |
| అపర వ్యాస మహర్షి – శ్రీ గౌరిపెద్ది గురుదేవులు – మేడసానిమోహన్ | 102 |
| ఆదర్శ గురుదేవుడు – అవధాని శ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ | 108 |
| గజరాజు సరియుద్ది గౌరిపెద్ది – డా॥ నరాల రామారెడ్డి | 123 |
| శ్రీ మతాం గౌరిపెద్ది రామ సుబ్బ శర్మణాం – 101వ జయంతి ఉత్సవ శుభాభివందనాని – ఆచార్య రాణి సదాశివమూర్తిః | 128 |
| గౌరిపెద్ది పీఠికాసారస్వతం – పరిశోధన రత్నాకరం – గంధం బసవ శంకరరావు | 130 |
| విద్వత్సంస్తవనీయసారస్వతమూర్తి – సాంప్రతి సురేంద్రనాథ్ | 134 |
| శబ్ద సిద్ధుడు – శతావధాని ఆముదాల మురళి | 139 |
| పద్యవందనము – శతావధాని ఉప్పలధడియం భరతశర్మ | 140 |

బహుముఖ ప్రజ్ఞాశాలి – గౌరిపెద్ది – గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ 141
గౌరిపెద్ది ఆ పేరే చాలు – డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ 147
శ్రీ గురుభ్యో నమః – డా॥ సురభి నరసింహప్రసాద్ 149
బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మతో గారితో నా అనుభవాలు
– డా॥ విద్వాన్ అమరవాది శేషయ్య 152
నా స్మృతిపథంలో గౌరిపెద్దివారు – శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ 155
జయంతి తే సుకృతి నః – 'కళారత్న డా॥పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ 157
ప్రాతః స్మరణీయులు – డా॥ మృణాళిని 162
పరిశోధన కళా సంరంభకులు – డా॥ కోలవెన్ను మలయవాసిని 165
కరదీపికలు – ఈ పీఠికలు – డా॥ శ్రీమతి రెడ్డిశ్యామల 171
శ్రీ గురువందనం! – శ్రీ జూలకంటి బాలసుబ్రమణ్యం 176
శ్రీ గౌరిపెద్ది అంతరంగం – శ్రీ గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ 182
రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ – కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ 190
కవితా మహేంద్రజాలం – డా॥ ప్రసాదరాయ కులపతి 206
అష్టావధాని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ – రాపాక ఏకాంబరాచార్యులు 210
నడిచే నిఘంటువు గౌరిపెద్ది – కీ॥శే॥ కామిశెట్టి శ్రీనివాసులు 214
వరుణుని మెప్పించిన గౌరిపెద్ది – ఆచార్య తిరుమల రామచంద్ర 218



వేదమూర్తులు, తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనల పరిష్కర్త

**గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు**



# సారస్వత మహాశిఖరం

ప్రాచార్య డా॥ శ్రీ శలాక రఘునాథశర్మ
71-1-3/ఎ5, బ్లూమూన్ అపార్ట్‌మెంట్స్,
ప్రకాశం నగర్, రాజమండ్రి- 533 103
చరవాణి - 98660 68542

బ్రహ్మశ్రీ వేదమూర్తులు కీర్తికాయులు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు ఒక సారస్వతమహాశిఖరం. విద్యావైభవంలో, పరిశోధనరంగంలో, కవితా సామ్రాజ్యంలో వారిది విశిష్టమైన, అవిస్మరణీయమైన ముద్ర.

విద్యావైభవంలో ప్రధానంగా రెండు స్రవంతులు. మొదటిది ఆర్జన. రెండవది బోధన. మొదటి విషయంలో శ్రీశర్మగారిది పటిష్ఠమైనపునాదులతో ఏర్పడిన రాజమార్గం. వారి తొలిగురువు చదువుల వేంకటరాయలవారట. వేదశాస్త్రాది సంప్రదాయ విద్యను, వైద్య విద్యను, వేదాంగమైన జ్యోతిషమును రంగరించి పోసినవారు తాతగారు మర్మాల చెంగయ్యగారు. వేదాంత విద్యలో భద్రమైన స్థితిని కల్పించినవారు మండలీక వేంకటశాస్త్రిగారు, వేంకటేశ్వరదీక్షితులవారు. ఈ మహాత్ములు ఆధునిక కాలంలో అవతరించిన వసిష్ఠ వామదేవసాందీపని మహర్షుల కోవకు చెందినవారు. అట్టివారు గురువులని చెప్పుకోవటమే ఒక గొప్ప విషయం. అట్టి మహానుభావుల వరవడిలో రూపుదిద్దుకొన్న అధ్యాపక జాతిరత్నం శ్రీగౌరిపెద్ది వారు. వారి శిష్యకోటిలో ఎవరిని పలుకరించినా వీరి బోధకతాప్రాభవాన్ని గురించి ఆనందపూర్ణహృదయంతో ప్రశంసావాక్యాలు కొల్లలుగా వినవస్తాయి.

సాధారణంగా ఉపాధ్యాయవృత్తిలో కుదురుకొన్నవారు, అంతకుమించి సాధించవలసిన ఇంకేముంటుంది, వృత్తిధర్మంగా పాఠాలు చెప్పుకుపోతూ ఉంటే జీవితం సుఖమయంగా సాగిపోతూ ఉంటుందికదా! అనే భావనతో ఉంటారు. కానీ, శ్రీ శర్మగారు తమ మనః ప్రవృత్తిని పరిశోధన మాగాణంలోనికి, కవితాసామ్రాజ్యంలోనికి మళ్ళించారు. అటువైపు వారు పట్టుదలతో చేసిన వ్యవసాయం పదికాలాలపాటు నిలిచే ఫలసాయాన్ని కుప్పలు తెప్పలుగా అందించింది. దానికి నిదర్శనమే అన్నమాచార్య సంకీర్తనల పరిష్కరణ కార్యక్రమం.

ఆంధ్ర సారస్వతంలో. తాళ్లపాక అన్నమాచార్యులవారి సంకీర్తనలు అనేక అనర్ఘ వాఙ్మయ రత్నాలకు తరుగని గని. వానిని త్రవ్వి తీయటం, సానపట్టటం, కాంతి పుంజాలను పట్టుకోవటం, వానిని తెలుగుల హృదయమందిరాలలో ఆరని దీపాలుగా నిలిపి ఉంచటం ఏదో ఆషామాషీ వ్యవహారం కాదు. పండిత ప్రకాండులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, విలక్షణ రచనా చాతుర్యంతో తెలుగువారి హృదయాలలో భద్రమైన స్థానం సంపాదించుకొన్న రసరాట్టు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు మొదలైన వారి సరసన కూర్చొని సంకీర్తనల పరిష్కరణను సాధించినవారు గౌరిపెద్ది వారు. వారి పనితనం ఆ సంకీర్తన సంపుటాలలో నిర్నిద్రంగా, భద్రంగా నిక్షిప్తమై తెలుగు జాతిని అలరిస్తూ 'ఉన్నది'. ఇది శ్రీగౌరిపెద్ది వారి సర్వతోముఖమైన ప్రతిభకు శాశ్వతమై నిలిచి ఉండే తార్కాణం.

ఇంక మూడవది వారి కవితా శక్తి. వారు తెలుగు దేశం నలుమూలలా అనేక అష్టావధానాలు జనమనోరంజకంగా చేశారు. అవధాన విద్యలో వారి అద్భుతమైన ప్రతిభను గూర్చి మాన్యమిత్రులు కీర్తిశేషులు రాపాక ఏకాంబరాచార్యులవారు సమగ్రసుందరమైన వ్యాసం వ్రాశారు. అది చదువుతున్నంతసేపు రసికుల హృదయాలు చకచ్చకితమైపోతూ ఉంటాయి. ఒకటి రెండు శతావధానములు కూడా చేసినట్లు వీరి సంగ్రహ జీవిత చరిత్ర తెలియజేస్తున్నది.

వీరు ఆదిశంకరుల కనకధారాస్తవము, శ్రీనీలకంఠ దీక్షితుల వారి ఆనందసాగరస్తవము, కొన్ని ముక్తకాలు, భీష్మ విజయము, భార్గవరామాయణము మొదలైన పద్యకావ్యములు రచించినట్లు తెలుస్తున్నది. ఏ కారణముననో అవి యేవియు ముద్రితములు కాలేదు. వారి వారసులు వానిని సంపాదించి ముద్రింపజేయగలరని నేను సంభావిస్తున్నాను.

అష్టావధానాలలో అతిక్లిష్టమైనది సమస్యాపూరణం. సమస్యను కూర్చినవాడు గంటలతరబడీ భావన చేసీ చేసీ ఏకదేశాన్ని అవధాని ముందు ఉంచుతాడు. అవధాని అందులో పైకి కనిపించే అసంగతత్వాన్ని పరిహరించి అర్థవంతమైన భావాన్ని ఆశువుగా పద్యంలో నిబంధించాలి. చివరిపాదంలో నిబద్ధమైన ప్రాసాక్షరాన్ని పై మూడు పాదాలలో లక్షణ వైరుధ్యం లేకుండా కూర్చుకొంటూ పోవాలి. అవధానం భంగం చేయటానికి శక్తినంతా ఉపయోగించే అప్రస్తుత ప్రసంగ అవరోధాలను దాటుకొంటూ పోవాలి. ఈ వ్యవహారమంతా కత్తిమీద సాము వంటిది. అయినా సమర్థులైన అవధానులు ఈ సాముగరిడీలను సమర్థంగానే ఎదుర్కొని విజయం సాధిస్తారు. శ్రీ గౌరిపెద్ది వారు ఆ విషయంలో

అనేక సందర్భాలలో అత్యద్భుతమైన ప్రతిభతో సభారంజనం చేశారు. ఒక్క ఉదాహరణ-

"కలలో గర్భమునిల్చెఁగోమలికి లోకంబింక నిందింపదే" అనే సమస్యకు వారు "రాకపోకలలో" అనే పదానుసంధానం ద్వారా సమాధానం చెప్పటం గొప్పవిషయం. వారి ప్రజ్ఞ నికషోపలం వంటిది.

బ్రహ్మశ్రీ వేదమూర్తులు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు నాకంటే కొంచెం తక్కువగా ఇరవై సంవత్సరాలు పెద్దవారు. విద్యాజ్ఞాన విషయాలలో వారి వృద్ధత్వం కొలతలకు అందనిది. అయినా 1970 సంIIల ప్రాంతంలో ఒకటి రెండు మార్లు కలసినపుడు నన్ను తమతో సమానస్థాయి వానినిగా వ్యవహరించారు. ఇదీ ఆయన దొడ్డ బుద్ధి సంపద. ఇటువంటి మహావ్యక్తిని గూర్చి నాలుగు మాటలు వ్రాయగలిగినందులకు నా హృదయం ఆనందవీధీ విహారం చేస్తున్నది. ఒక సారస్వతమహాశిఖరం ఔన్నత్యాన్ని రేఖామాత్రంగా దర్శింప గలిగిన పరితృప్తితో ముగిస్తున్నాను.

*కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని*

*పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు*

*తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడను*

*అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు.*

**- అన్నమయ్య**

# లిఖిత ప్రతుల నుంచి ముద్రిత ప్రతుల దాకా



**డా॥ బేతవోలు రామబ్రహ్మం**
101, శ్రీ వర్షిణి ప్యారడైజ్,
ఎ.ఎస్.ఆర్. నగర్,
సీతమ్మధార,
విశాఖపట్నం – 530 013, ఆం.ప్ర.
చరవాణి : 98481 69769

లిఖితప్రతులనుంచి – అవి లోహపత్రలో తాళపత్రలో శ్వేతపత్రలో ఏవైనా కావచ్చుగాక – తొట్టతొలిగా ముద్రణకు మేలు ప్రతులను సిద్ధం చెయ్యడం చాలా శ్రమతో కూడుకొన్న పని. శ్రమపడటం ఒకటే చాలదు. ఆ వ్యక్తికి ఛందోవ్యాకరణ పురాణాదుల పరిజ్ఞానం పుష్కలంగా ఉండాలి, వైచక్షణ్యం వుండాలి, అన్నిటినీ మించి నిజాయితీ ఉండాలి. ఒకసారి ముద్రణ పొందాక మరింక లిఖిత ప్రతుల ఊసెత్తేవారు ఉండకపోవచ్చు. లిఖితప్రతులే మిగలకపోవచ్చు. అందుకని మేలి ప్రతి సిద్ధం చేసే వ్యక్తి – తనకు సందేహాస్పదాలైన తావులలో తన నిర్ణయం మేరకు ఒక పాఠం నిర్ధారించినా, లిఖిత ప్రతిలో సాధువో అసాధువో ఉన్నది ఉన్నట్లు పాదసూచికలోనో కుండలీకరణంలోనో పొందుపరచడంగానీ తాను చేసిన నిర్ధారణలోని ఔగాములకు పాఠకులూ భవిష్యత్తరాలూ ప్రమాణమని సవినయంగా ప్రకటించడంగానీ నిజాయితీకి నికషోపలం. ఇది మన ముందుతరాల పాఠ నిర్ణాయకులలో చాలా తక్కువమంది పాటించిన ప్రజాస్వామిక విధానం.

మన అదృష్టం బాగుండి ఆ తక్కువ మందిలో ఉద్దండులైన ఇద్దరు వేటూరి ప్రభాకరశాస్త్రి గారూ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారూ అన్నమాచార్య సంకీర్తనల రాగిరేకులనుంచి మేలు ప్రతుల్ని ముద్రణకు సిద్ధం చేసే మహాయజ్ఞానికి తొలితరం ఋత్విక్కులయ్యారు. వీరినుంచి – మరీ ముఖ్యంగా అనంతకృష్ణశర్మగారినుంచి ఏవంవిధ సర్వ సద్గుణాలనూ, శక్తులనూ పుణికిపుచ్చుకొని వారికి సర్వాత్మనాశిష్యప్రాయులై ఈ మహాయజ్ఞాన్ని దిగ్విజయంగా ముందుకు నడిపించిన మహానుభావులు ప్రాతఃస్మరణీయులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలకు

పెద్ద దిక్కుగా నిలిచి, జీవితంలోని ఉత్తరభాగాన్ని ఈ మహాయజ్ఞ నిర్వహణతో సార్థకం చేసుకొన్న ధన్యజీవి.

ఈ త్రిమూర్తుల కృషి ఫలితంగా అన్నమాచార్య కీర్తనలలో అధికభాగం భాండాగారం నుంచి వెలుగుచూసి గ్రంథాలయాలకు చేరింది. ఎందరెందరో పరిశోధకులకు డిగ్రీలూ ఉద్యోగులూ ఉపకారవేతనాలూ ఇత్యాదిగా భారీగా భిక్ష పెట్టింది. తల్లి పిహెచ్.డీ.లూ పిల్ల పిహెచ్.డీ.లు తామరతంపరగా వర్ధిల్లాయి. నాకు తెలిసి వేటూరి ఆనందమూర్తిగారి సిద్ధాంతగ్రంథంలో మొదటి భాగం – రెండు పిహెచ్.డీ.లకూ, రెండవ భాగం మరో రెండు పిహెచ్.డీ.లకు పురుళ్లు పోశాయి. ఈ పిల్ల పిహెచ్.డీలు ముమ్మూర్తులా తల్లి పిహెచ్.డీలే. కలికాలంలో ఇలాంటివి పెద్దగా పట్టించుకోవలసినవి కావు గానీ, ఒకటి మాత్రం నిజం – ఈ ముడిసరుకును ఏయే కోణాలనుంచి పరిశోధించవచ్చునో పరిశీలించాలో తమ విలువైన పీఠికలలో దిక్ప్రదర్శన చేసిన పెద్దలుకూడా ఈ ముగ్గురే. ఇందునా గౌరిపెద్దివారిదే సింహభాగం. మా అన్నమయ్య–మా అన్నమయ్య అని సగర్వంగా ప్రకటించుకొన్నంతటి తాదాత్మ్యం వీరిది. రస అలంకార–వ్యాకరణ–భాషాశాస్త్ర–సామాజికాది కోణాలలో కీర్తనలను విశ్లేషించిన ప్రజ్ఞ వీరిది.

పాఠనిర్ణయాలూ అర్థనిర్ణయాల విషయంలో లిఖితప్రతికి ప్రత్యంతరాలు అనేకం ఉంటే, అవన్నీ ఉపకరిస్తాయి. సహకరిస్తాయి. వాటి సహకారం అందుకోవలసిన బాధ్యత సంపాదకుడిది. ప్రత్యంతరమే లేని అన్నమాచార్య సంకీర్తనల వంటి వాటి విషయంలో సంపాదకుడి పని–కత్తిమీద సామే! ఇక్కడ అప్రస్తుతమే అయినా ఒక విషయం ముచ్చటిస్తాను.

సంస్కృత హరివంశానికి సంపాదకత్వం వహించిన (భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పూణే) ఆచార్య వైద్యగారు దాని పీఠికలో శమంతకమణి కథ దగ్గర ఒక ప్రస్తావన చేశారు. సత్రాజిత్తు "సముద్రాన్మణిం లబ్ధ్వా" అని లిఖిత ప్రతులు చాలా వాటిలో ఉంటే, ఒక సంపాదకోత్తముడెవరో పొరపాటుగా చదివి తయారుచేసిన "స సూర్యాన్మణిం లబ్ధ్వా" అనే పాఠం, అనంతరకాలంలో సత్రాజిత్తును సూర్యోపాసకుడిగా సూర్యమిత్రుడిగా ఆవిష్కరించే ఉపకథలకు దారి తీసింది – అన్నారు. నిజమే మరి – మణి సముద్రంనుంచి లభిస్తుందే తప్ప సూర్యుడి నుంచి ఎలా వస్తుంది?! లిఖిత ప్రత్యంతరాలను సంప్రదించని సంపాదకుడి ప్రమాదం చాలా ఉపకథలకు ప్రాణం

పోసింది. లాభనష్టాలను బేరీజు వెయ్యడం తరవాత సంగతి. అయితే అన్నమాచార్య కీర్తనలకు రాగిరేకులే తప్ప లిఖిత ప్రత్యంతరాలు లేకపోవడం ఈ దిశలో సౌకర్యమే.

లేఖకుడు ప్రమాదపడవచ్చు. సంపాదకుడు ప్రమాదపడవచ్చు. ప్రూఫు రీడరు ప్రమాదపడవచ్చు. అందుకని – ముద్రిత ప్రతికి మూలాధారం లిఖితప్రతియే కాబట్టి, దాన్ని ఎప్పటికీ ఏదో ఒక రూపంలో భద్రపరిచి ఉంచడం చాలా అవసరం. అనంతరకాలంలో పాఠకుడికి ఆ కృతిలోని ఒక పదమో పదబంధమో సమన్వయం కాకపోతే లిఖితప్రతిని సంప్రదించే వెసులుబాటు ఉండాలి. ఇది లేని సందర్భంలో ఏమి చెయ్యాలో గౌరిపెద్ది వారు నేర్పారు. “ఆ పట్టులను పాదదీపికలో ఈ పాటలోని భావము సుస్పష్టమగుటలేదు అని సూచించుచునే వచ్చినాను” అని స్పష్టంగా ప్రకటించారు (సంపుటి 29 పీఠిక). అన్నమాచార్యులు చేసిన అపురూపమైన కొన్ని కృత్తద్ధితరూపాలను శృంగగ్రాహికగా చర్చించి చర్చించి విత్తనాలు చల్లి కడపట “పైపై పాఠములు పరిశోధనము చేయు సహృదయులు ఆ పదరాశినంతటిని చర్చింపగలరు” (సంపుటి 28 పీఠిక) అని ఆశావహంగా పలికారు. అనంతరకాలంలో ఇది జరిగిందా, ఎంతదాకా జరిగింది – ఇత్యాదులు అప్రస్తుతాలు కానీ, సంపాదకుడికి ఉండవలసిన నిజాయితీకి వీరి ఈ వాక్యాలు నిలువెత్తు నిదర్శనాలు.

లిఖితప్రతిని సంప్రదించే వెసులుబాటు ఉండి, దాన్ని సంప్రదించినా కూడా పదస్వరూపామూ అర్థమూ అవగతంగాని దుస్థితి ముద్రిత గ్రంథ పాఠకుడికో వ్యాఖ్యాతకో దాపురిస్తే ఏమి చెయ్యాలి? పెద్దలను సంప్రదించాలి. అయినా ప్రయోజనం లేకపోతే – వ్యాఖ్యాత స్వయంగా ఒక నిర్ణయం తీసుకుని పరిష్కరించి సమన్వయం కుదిర్చి, ఈ స్వాతంత్ర్య స్వీకరణ నేపథ్యాన్నంతటినీ పరమవిధేయంగా వ్యాఖ్యానంలో పొందుపరచాలి. శుకసప్తతిలో ఒక సీసపద్యానికి (2–76) ఎత్తుగీతి ముగింపులో ఈ దురవస్థ తటస్థించింది. అక్కడ గౌరిపెద్దివారి నిజాయితీని గుర్తుచేసుకొని ఈ దాసుడు అదే చేశాడు. (వర్ణన రత్నాకరము – ఆరవ సంపుటము పుట. 18–బే.రా.)

మరొక కవి – ఎవరో ఎక్కడో గుర్తు లేదు గానీ – తోమని మూకుడు అన్నాడు. స్వామి సన్నిధిలో జరిగే నివేదన సంప్రదాయం ఎరిగిన పెద్దలు ఆచార్య సర్వోత్తమరావుగారిని సంప్రదిస్తే అది మట్టిమూకుడు అని చెప్పారు. న హి సర్వస్సర్వం విజానాతి అనీ, పరమేశ్వరస్యాపి సర్వజ్ఞత్వమస్తివా న వేతి విచికిత్సాయామ్... అనీ అంటారు. కనుక పాఠకులకూ వ్యాఖ్యాతలకూ కాళ్లూ చేతులూ

అందని దురవస్థలు ఎదురైనప్పుడు నిరహంకారమైన నిజాయితీ ఒక్కటే తరణోపాయం. ఇది గౌరిపెద్దివారు మనకందించిన ప్రమాణం.

అన్నమాచార్యునితో గౌరిపెద్దివారికున్న తాదాత్మ్యం మా అన్నమయ్యతో మొదలై (సంపుటం–28) మన అన్నమయ్యగా (సంపుటం–29) విస్తరించింది.

ఇంతటి తాదాత్మ్యం ఉన్నా దేశకాల పరిస్థితులను బట్టీ భాషానియమాలను బట్టీ పొసగని అంశాలను ప్రస్తావించడంలో వీరు వెనుకాడలేదు. అలాగని పెద్దమనిషి తరహా ఔచిత్యాన్నీ వీరు విడనాడలేదు. కొన్ని శృంగార కీర్తనల్లో కనిపించే పచ్చిదనాన్ని సున్నితంగా ప్రస్తావించారు. కొన్ని "పదములలోని భావములు వివరించితే పచ్చి యగునని వదలితిని". "వ్యాఖ్యానిస్తే పువ్వు నలిపి వాసన చూచినట్లగునని మానితిని' (సంపుటం–29 పీఠిక) అన్నారు.

"ఎప్పుడైన భాషను భావమును మరచి తన్మయీభావము చేకూరినపుడు, తన నోటి వెంట ఏమి వచ్చుచున్నదోకూడ ఈ కవిమహాత్ముడు గమనించినట్లగడపదు" (29) అని గౌరవంగా పలికారు. పన్నెండవ సంపుటం పీఠికలోనూ (పుట. 21) ఈ మాట అన్నారు.

అన్నమయ్య చేసిన కొన్ని అపురూపమైన పదప్రయోగాలను వీరు చర్చించారు. కొన్నింటిని కష్టపడి వ్యాకరణ సమ్మతాలని తేల్చారు. అయిరేణి–ఇంద్రాణికి తద్భవం కావచ్చుననవడం, జాజరను శాద్వలభవంగా సమన్వయించడం విలువైన విషయాలు. విడిచిన నెప్పటి చని యాగడములు చేసెదు (హరివంశము–పూర్వభాగం 5–243) అనే ఎఱ్ఱన "అద్వితీయ" ప్రయోగం ఆధారంగా అన్నమయ్య ప్రయోగాన్ని (106–పల్లవి. అప్పటి, అప్పటిని) సమర్థించడం అపూర్వం. ఈ పద్యానికి – విడిచిన చని ఎప్పటి ఆగడములు చేసెదు – అనినా వ్యాఖ్యానంలో సమన్వయించాను. ఇది సంస్కృత భాషాపద్ధతిలో చేసిన ప్రయోగం అనుకొన్నాను. ఇవన్నీ పన్నెండవ సంపుటి పీఠికలోనివి. 28వ సంపుటిలోనూ ఇలాంటివి కొన్ని చర్చించారు. సాధించారు.

ఒకటి రెండింటి విషయంలో వక్తవ్యం ఉంది. వైపరివి ఇటువంటివాడవు (సంపుటము 27, పాట 167) వైపు + అరి = వైపు కలిగినవాడు అని సమన్వయించారు. కానీ వైపు అనేది దిక్కు (నా వైపు – కుడివైపు) అనే అర్థంలో ప్రసిద్ధం. దిక్కు అయినవాడవు – ఆధారమైనవాడవు అని కాస్త సాగదీసి భావార్థం చెప్పవచ్చునేమో.


తరువరివాఁడమ్మ (సంపుటం-28, పాట-69) అనే చోట ఉత్తరువు మీద నుంచి సాధించడం కొంచెం కృతకంగా ఉంది. తరుము అనే పదంలోని చివరి ము వర్గాన్ని ఆనునాసిక్యంతో కూడిన వు వర్ణంగా పలకడమూ, పూర్ణానుస్వారంగా పలకడమూ మా గోదారోళ్ళకి అలవాటు. తరుఁవుకుంటూ వచ్చాడు - తరుం కూత ఇలా పలుకుతాం. తాలిమి ఇంచుకైనా లేని తరువరివాడు = తరుఁవుకు వచ్చేవాడు = వేగరి అనడం మరింత ప్రాకరణికం అవుతుంది.

నెఱతనీఁడవన్నిటా (సంపుటం 26, పాట-515) నెఱతనము + ఈఁడు అని కష్టపడి కిట్టించడం కన్నా నెఱత - నీడవు = మాకు నీడ ఇచ్చేవాడవు = రక్షకుడవు అని అరసున్న తొలగించి సమన్వయించడం సులవు,

చనవి మనవులు (రేకు 1602, సంపుటము-32, పాట-7) దగ్గర మను + వి = మనవి అనీ అలాగే చను + వి = చనవి అనీ అసాధారణ సమన్వయం చేశారు. మనవి అనేది అవ్యుత్పన్నం. ఆచ్ఛికపదం. చనవు ప్రసిద్ధం. “చనవు మనవులు” అనేది కవికి ఉద్దిష్ట ప్రయోగమనుకుంటాను. రాగిరేకుల లేఖకుడి ప్రమాదం వల్ల “చనవి” అనే రూపం ఏర్పడి ఉంటుంది. ఈ కొమ్ము తగిలించేపాటి స్వాతంత్ర్యం సంపాదకులు తీసుకోవచ్చు, దాన్ని చెప్పవచ్చు. పైగా కీర్తనలు వేదమంత్రాలేమీకాదు. కనుక చిరుమార్పులు చెయ్యడం - వీరు వేరే సందర్భంలో అన్నట్టు - పంచమహాపాతకాలలో లేనిదే. వింతలూ విడ్డూరాలూ అపురూపాలూ అని ఈ దినుసు ప్రయోగాలను పేర్కొనడంలో గౌరిపెద్ది వారి గడుసుదనం అస్మదాదులకు కూసువిద్య ! !

*ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి*
*యెపుడూఁ దీర్ఘప్రసాదేచ్ఛతోడ*
*నిపుణత శ్రీ వేంకటనిలయుఁడే గతియని*
*ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము*

*- అన్నమయ్య*



# గౌరిపెద్ది వారి వరివస్య

**ఆచార్య పప్పు వేణుగోపాల రావు**
చైర్మన్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్,
యూనివర్సిటీ ఆఫ్ సిలికాన్ ఆంధ్ర,
మిల్పిటాస్, అమెరికా

ఒక వంద సంవత్సరములకు ముందు అన్నమాచార్యులవారిని గూర్చి ప్రపంచమునకు తెలిసి యుండినచో దక్షిణ దిశ సంగీత చరిత్ర వేరు విధముగా వ్రాయబడి యుండెడిది. పదకవితకు అన్నమయ్య, తెలుగు సాహిత్యమునకు నన్నయవంటివాడు. ఆయన తొలి తెలుగు వాగ్గేయకారుడు. హరిసంకీర్తనాచార్యుడు, పంచమాగమ సార్వభౌముడు, అన్నమయ్యను వెలికి తెచ్చిన ఘనత వేటూరి ప్రభాకర శాస్త్రి వంటి పరిశోధకులది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారి వంటి సాహితీ సంగీత శాస్త్ర సవ్యసాచులది. ఆ కోవకే చెందిన ఇంకొక మహనీయుడు గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారు. వీరి మార్గము వేరు, శైలి వేరు, రచనా వైదుష్యము వేరు.

గౌరిపెద్దివారు కొన్ని సంవత్సరములు తిరుమల తిరుపతి దేవస్థానమువారి అన్నమాచార్య పరిశోధనా సంస్థలో పరిష్కర్తలుగా గణనీయమైన సేవలందించినారు. వారు పరిష్కరించిన అన్నమయ్య సంపుటములు పరిశోధకులకు పాఠ్యగ్రంథములవంటవి. కొన్నిటిలో వారు అందందుగల వ్యాకరణ విశేషములను కూలంకుషముగా చర్చించియున్నారు. కాని వారు పరిష్కరించిన ఆధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనముల సంపుటములు వారి అనన్యమైన పాండిత్యమునకు, ధిషణకు నికషదృషత్తులు. ఆధ్యాత్మ సంకీర్తనల సంపుటములో వారు అన్నమయ్య వేదాంతమును గురించి వ్రాసిన కొన్ని విషయములు శిరోధార్యములు.

శరణాగతి గూర్చి వారి అభిప్రాయము వివిధ గ్రంథములనుండి ఉద్ధృతమైనవే అయినను పునరాలోకింప దగినవి. ముందు విగ్రహవాక్యమును, అమరమున శరణ శబ్దమునకు గల విశేషములని వివరించ తరువా వారు సంహిత నుండి ఆగమములనుండి కొన్ని ఆసక్తికరమైన నిర్వచనములను వివరించియున్నారు.

అహిర్బుధ్న్య సంహితలో ఇట్లున్నది :
ఉపాయా గృహరక్షిత్రోశ్శబ్దః శరనమిత్యయం వర్తతే
వర్తం సాంప్రతం చైష ఉపాయార్తైక వాచకః –
అంతియ కాక శరణాగతి ఆరు విధములని
అనుకూలస్య సంకల్పః – ప్రాతికూలస్య వర్జనం
రక్షిష్యీతి విశ్వాసః – గోప్తృత్వ వరణం తథా
ఆత్మ విక్షేప కార్పణ్యే – షడ్విదాశ్శరణాగతిః

ఈ ఆరింటిలో ఒక్కొకటి నిర్వచించి వివరించిన విద్వత్తు వారిది. వీటిలో ఆత్మ విక్షేపమే ఉత్తమమైనదని తెలియచేసినారు.

అట్లే ప్రపత్తిని గురించిన వారి పరిశోధన అనన్యమైనది. వైష్ణవులకు తలమానికమైనది.

ముందు ప్రపత్తికి విగ్రహవాక్యమును చెప్పి నిర్వచనము వివరించిరి.
భగవంతుడొక్కడే నా రక్షకుడని తెలిసికొనుట ప్రపత్తి అనినారు.

ఆయా విషయవివరణకు వారు పేర్కొనిన గ్రంథములు సామాన్యులకు అందనివి. అందు రహస్యత్రయ సారమనునది యొకటి. న్యాస దశకమనునది వేరొకటి. ఈ నిర్వచనములకు సాక్షీభూతములైన అన్నమాచార్యులవారి రచనలు ఉదాహరించుట వారి పరిశోధనా పటిమకు నిదర్శనము.

వైష్ణవ సంప్రదాయమున వడగలై, తెంగలై అనునవి రెండు మార్గములు. తాళ్ళపాక వారు వడగలై శాఖకు చెందినవారిని నిర్ధారించియున్నారు.

అటులనే వైష్ణవమున పంచ సంస్కారములను ఒక్కొక్కదాని విశిష్టతను నిర్వచించిరి.

ఆయా విషయ వివరణమునకు రామాయణ మహాభారతాది గ్రంథములను పేర్కొనుట వారి విద్వత్తునకు నిదర్శనము. ఆ విషయమునకు సంబంధించిన అన్నమయ్య రచనలను కొన్నిటిని తెలిపిరి. అన్నమయ్య తన రచనలో "అనాయుదాసో" అను ఒక్క ఋక్కును పేర్కొని యుండగా దానికి గౌరిపెద్దివారు దేవస్థాన వైదిక పండితులను సంప్రదించి వివరము వ్రాసిరి. ఆ ఋక్కు ఆరవ అష్టకమున

ఆరవ అధ్యాయమున ముప్పది మూడవ వర్గమునకు చెందినదని దానినుదహరించుట ఒక గౌరిపెద్ది వారికే చెల్లినది.

ఇది అంత లోతుగా పరిశీలించుటకు కారణము స్వయముగా జన్మచే స్మార్తుడైన అన్నమయ్య వైష్ణవమును స్వీకరించుటకు అన్నమయ్య వేద విద్యా ప్రావీణ్యుడని నిరూపించుటకే.

దానికి సాక్ష్యములైన కొన్ని అన్నమయ్య సంకీర్తనలు ఉదహరించిరి.

ఆధ్యాత్మిక సంకీర్తనల సంపుటమునకు ఇంతటి వివరణాత్మకమైన విశ్లేషణ వ్రాసిన గౌరిపెద్దివారు శృంగార సంపుటమునకేమి వ్రాసిరో తెలుసుకొనుట ఆసక్తికరమైన విషయమే. వారి పీఠికలలో ఇది ఇరువది ఆరవ సంపుటము. కొన్నిట వ్యాకరణము, కొన్నిట భాష, కొన్నిట ఆయా సంపుటములందు గల కీర్తనల విశిష్టము వివరించిరి. 12వ సంపుటమున అన్నమయ్య భక్తిని వివరించిరి.

26 వ సంపుటము శృంగార సంకీర్తనలు.

అన్నమయ్య వెలయించినవి 32 వేల సంకీర్తనలని చిన్న తిరుమలయ్య ద్విపదలో వివరించియున్నాడు. కాని ఈ నాడు మనకు లభ్యమగుచున్నవి సుమారు 14 వేల పైచిలుకు. అందులో సుమారు 2 వేల పైబడినవి ఆధ్యాత్మిక సంకీర్తనలు, మిగిలిన దాదాపు 12 వేలు శృంగార సంకీర్తనలు.

వీటిని తిరుమల తిరుపతి దేవస్థానములు 1922 లో వెలికి తీయించిరి..

వారికి లభించిన రాగి రేకుల వివరములు ఇవి :

ఆధ్యాత్మిక సంకీర్తనలు 363 రేకులు

శృంగార సంకీర్తనలు 1921 రేకులు

గౌరిపెద్దివారి దృష్టి ఈ శృంగార సంకీర్తనలను భక్తికి అన్వయించుట

కాని చిన్న తిరుమలయ్య తన తాతగారి పదములలో పది లక్షణములున్నట్లు చెప్పిన పద్యము వారెరుగనిది కాదు.

చిన్న తిరుమలయ్య అన్నమయ్య మనుమడు. ఆయన తాతగారి జీవిత చరిత్ర వ్రాసినవాడు. అన్నమయ్య కాలములో జీవించినవాడు. చిన్నతిరుమలయ్య చెప్పిన పద్యము ఇది :

శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞానసారంబులై
యతిలోకాగమవీధులై వివిధ మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైల వల్లభరతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళ్ళపాక అన్నమయ వచోనూత్నక్రియల్ చెన్నగున్.

ఇందులో మనము గ్రహించవలసినది అన్నమయ్య శృంగార సంకీర్తనలను గురించి చిన్న తిరుమలయ్య చెప్పిన లక్షణము – వేంకటశైల వల్లభరతిక్రీడా రహస్యంబులై అని.

అన్నమయ్య జీవించిన కాలమున తెలుగు సాహిత్యమున పుంఖానుపుంఖములుగ శృంగార ప్రబంధముల కాలము. అన్నమయ్యకును స్వామికివలెనె ఇరువురు భార్యలు. శ్రీవేంకటేశ్వరుడు మన్మధుని తండ్రి. శృంగారమునకు ఏమి కొదవ.

గౌరిపెద్ది వారి ఆ విషయమును గ్రహించియే ఈ శృంగార సంపుటి పీఠికలో అన్నమయ్య 'భక్తి శృంగారమును' ప్రతిపాదించినారు.

దానికిముందు మతము పేరుతో విశృంఖలమైన శృంగారమును ప్రతిపాదించు కొన్ని గ్రంథములను వినర్శించి అన్నమయ్య శృంగారము దైహికమైన శృంగారము కాదని అది భక్తి శృంగారమని వివరించిరి. దీనికి తార్కాణముగా భాగవతమునందు గోపికల ఆత్మ నివేదనము శృంగారమని బాహ్యముగ అనిపించినను అది భక్తి యని వక్కాణించిరి. తాతగారి రచనలు ఎట్టివో చెప్పిన చిన్నతిరుమలయ్యయే వారి సంకీర్తనలు గురించి మరిన్ని పద్యములు వ్రాసియున్నాడు. అందొకటి ఇట్లున్నది :

పావనములు హరిభక్తి వి – భావనములు సర్వమంత్రపరమరహస్యో
ద్భావనములు గాయకనిక – రావనములు తాళ్ళపాకన్న యపదముల్

ఈ విషయములను లౌకికమైన శృంగారముతో ముడిపెట్టరాదని గౌరిపెద్దివారి అభిమతము. అందుకు వారెన్నియో గ్రంథములనుండి ఉదాహరించి స్పష్టముగా ధ్రువపరచిరి. అందందే భాగవత పురాణం శ్లోకములను వాటికి శ్రీధరీయవ్యాఖ్యను వారు ఉటంకించిరి. బాహ్యముగ శృంగారమనిపించినను, అంతరముగనది భగవత్పరమైనందున పవిత్రమేనను శ్రీధరీయ వ్యాఖ్యను

ఉల్లేఖించినారు. నారదభక్తి సూత్రములను తార్కాణముగా చూపించిరి. భగవద్గీతా శ్లోకములను మధుసూదన సరస్వతి వ్యాఖ్యానమును పేర్కొనిరి. భక్తిరసాయనమను గ్రంథమున ఆయా శ్లోకములనుదహరించి భక్తి శృంగారమునకు ప్రాతిపదిక ఏర్పరచియున్నారు.

పిమ్మట కొన్ని ఈ సంపుటములోని అన్నమయ్య సంకీర్తనలు ఉదాహరించి తరువాత శివానందలహరి నుండి కొన్ని ఉదాహరించిరి.

అంకోలం నిజబీజ సంతతిరయస్కాన్తో పలం సూచికా
సాధ్వీ నైజవిభుం లతా క్షితిరుహం సింధుః సరిద్వల్లభమ్ ।
ప్రాప్నో తీహ యథాతథా పశుపతేః పాదారవిన్దద్వయం
చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే ॥

అని అందున్న భక్తి నిర్వచనమును తెలిపిరి.

అయినను అన్నమయ్య సంకీర్తనలలో కొన్ని ఎడల అందందు ప్రబంధములలో వలె పచ్చిశృంగారమున్నదని అంగీకరించిన విద్వన్మణి గౌరిపెద్దివారు.

అట్టి కీర్తనములను కూడా ఉదాహరించుట వారి నిష్పక్షపాత విమర్శనాత్మ వైదగ్ధ్యమునకు తార్కాణము.

ఈ విధముగా వారి రెండు సంపుటములను మాత్రమే పరిశీలించినదీవ్యాసము. వారి పీఠికా విన్యాసము బహుముఖీనమైనది. వారి వరివస్య అనిదంపూర్వమైనది.

వారి శత జయంతికి ఎందఱో పరిశోధకులకు ప్రామాణికమైన వారి పీఠికలే సాక్షి. వారికెందరో ఏకలవ్య శిష్యులు.

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః ।
నాస్తి తేషాం యశః కాయం జరా మరణజం భయం ॥

గౌరిపెద్ది రామసుబ్బ శర్మ వంటి విద్వన్మణుల కీర్తికి జరామరణములు లేవు.

స్వస్తి

**ఆచార్య పప్పు వేణుగోపాల రావు**



# ఆరాధ్యుడు - గౌరిపెద్ది

మహామహోపాధ్యాయ
డా॥ సముద్రాల లక్ష్మణయ్య
తిరుపతి.
చరవాణి : 79936 69216

ఆధ్యాత్మికనగరంగా ప్రశస్తి పొందిన తిరుపతి సాటిలేని మేటి పుణ్యక్షేత్రంగా కీర్తింపబడుతున్నది. ఈ క్షేత్రప్రశస్తికి ముఖ్యకారణం ఏడుకొండల స్వామి. ఈ నగరానికి ప్రసిద్ధి కలిగించిన కారణాలలో శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల గూడ పేర్కొనదగివున్నది.

ప్రాచీనకాలం నుండీ ఈ పుణ్యక్షేత్రం ప్రసిద్ధ పండితులకు నెలవై భాసించింది. ఉత్తర భారతావనిలో కాశీక్షేత్రంలాగా దక్షిణాన తిరుపతి వాసి కెక్కింది.

1884వ సంవత్సరంలో నెలకొల్పబడిన ప్రాచ్యకళాశాల క్రమంగా వికాసం పొందింది. 'మాతృదేవో భవ, పితృదేవో భవ' అన్నట్లే ఒక విద్యాలయంలో విద్యనభ్యసించిన వారు ఆ విద్యాలయాన్ని గూడా పవిత్ర భావంతో చూడడం అవసరం. దానిని సరస్వతీ మందిరంగా ఆరాధించాలి. విద్యార్థులు గ్రహింపదగిన విషయమిది.

అంతేకాదు, ఆ విద్యాలయంలోని అధ్యాపకులను గూడా ఎన్నటికీ విస్మరించరాదు. 'ఆచార్యదేవో భవ' అని వేదానుశాసనం. తల్లిదండ్రులవలె గురువు కూడా పూజనీయుడే.

నేను 1947 నుండి 1954 వరకు శ్రీమలయాళ సద్గురు స్వాములవారు ఏర్పేడులో స్థాపించిన వ్యాసాశ్రమంలో సంస్కృతం ప్రధానంగా ఉన్నత పాఠశాలావిద్య నభ్యసించాను. తరువాత తిరుపతి ప్రాచ్యకళాశాలలో చేరి 1954 నుండి 1958 వరకు సాహిత్యశిరోమణి కక్ష్యలో ఉన్నత విద్య నభ్యసించాను. 1958లో శిరోమణి ఫైనల్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను.

ఆపై 8 సంవత్సరాల తరువాత యస్.వి. ప్రాచ్యకలాశాలలోనే సంస్కృత విభాగంలో అధ్యాపకుడుగా నియమింపబడ్డాను. 1997 వరకూ అక్కడే పనిచేశాను. ఆ తరువాత గూడా 20

సంవత్సరాలకు పైగా ధర్మప్రచార పరిషత్, పురాణేతిహాస ప్రాజెక్టు మున్నగు ప్రాజెక్టుల కధికారిగా పనిచేసి విశ్రాంతి పొందాను.

నేను విద్యార్థిగా ఉన్నప్పుడు అధ్యాపకులుగా ఉండిన ఆచార్యులలో అనేకులు తరువాత నాకు సహాధ్యాపకులుగా గూడ పనిచేయడం జరిగింది. ఇది నాకెంతో సంతోష కారణం.

కళాశాలలో ఆనాడు తెలుగు విభాగంలో పనిచేస్తూ వుండిన ఆచార్యులలో బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు నాకు స్మరణీయులు. వారు సంస్కృతాంధ్ర భాషలలో ఉద్దండపండితులు, శతావధానకళానిపుణులు, అనల్పమైన వాగ్వైభవంతోపాటు అమోఘమైన వాఙ్మయపరిశోధనలోగూడ సిద్ధహస్తులు.

అన్నమాచార్య ప్రాజెక్టులో వుంటూ వారు రాగిరేకుల నుండి పాటలను పరిశోధన పూర్వకంగా ఎత్తివ్రాసి పీఠికలు రచించి ముద్రణకు సిద్ధంచేసే వారు. తాళ్లపాకవారి సంకీర్తన వాఙ్మయాన్ని వెల్గులోకి తేవడంలో నిరుపమానమైన కృషి గావించినవారు శ్రీరామసుబ్బశర్మగారు.

కొన్ని పాటలకు ముద్రణార్హమైన ప్రతివ్రాయుటలో వారికి సహకారం అందించే సదవకాశం నాకు కల్గింది. ఈ విషయం వారు 12వ సంపుటం పీఠికలో ఇలా...

'మంద వేగము గలిగిన నాచేయి ఈ పీఠికను వ్రాయలేక యున్న సమయమున, శరవేగముతో వ్రాత సాగింపగల చిరంజీవి సముద్రాల లక్ష్మణయ్య, ఈ మధ్యనే ఈ అన్నమాచార్య కార్యములో ఒక శాఖకు తీర్పరిగా వచ్చి నా పీఠిక లేఖన విషయమున సహకరించినందులకు, అతని ఋణము నేనెట్లు తీర్చుకొనవలెనో తోచకున్నది' అని పేర్కొని యున్నారు.

1976లో సంస్కృత విభాగంలో చాలినంత పని లేదన్న కారణం చేత అప్పటి విద్యాలయాధికారులు కొంతకాలం అన్నమాచార్య ప్రాజెక్టులో నన్ను పనిచేయమన్నారు. శ్రీ గౌరిపెద్ది వారు అంతకుముందునుండే అక్కడ పనిచేస్తుండినారు. నేను 150 అన్నమయ్య ఆధ్యాత్మిక కీర్తనలకు విపులవ్యాఖ్య వ్రాశాను. సందేహం కల్గినప్పుడు శ్రీ గౌరిపెద్ది వారితో సంప్రదించేవాడిని.

1978 జూన్ నాటికి నా వ్యాఖ్యా రచన సమాప్తమయింది. అందులో 80 పాటలకు పైగా వ్యాఖ్యానం ఎప్పటికప్పుడు 'సప్తగిరి' మాసపత్రికలో ప్రకటితమయింది. ఈ నా పనిలో శ్రీ గౌరిపెద్ది వారు నాకందించిన సహకారాన్ని నేనెన్నటికీ మరువలేను.

ఈ వ్యాఖ్యా గ్రంథం "అన్నమాచార్య సంకీర్తనామృతం" అన్న పేరుతో రెండు భాగాలుగా మొదట ముద్రింపబడింది. ప్రస్తుతం రెండు భాగాలు ఒకే సంపుటంగా దేవస్థానంవారిచే ప్రచురింపబడుతున్నది. సుప్రసిద్ధ కవీశ్వరులు శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు, శ్రీముదివర్తి కొండమాచార్యులుగారు మున్నగు ప్రముఖులు ఈ గ్రంథాన్ని ప్రశంసిస్తూ పద్యాలూ, పీఠికలూ వ్రాశారు.

ఇందలి రెండవ భాగానికి శ్రీ గౌరిపెద్దివారు విస్తృతమైన ప్రస్తావన వ్రాసి నన్ను అనుగ్రహించారు. వ్యాఖ్యాన వైశిష్ట్యం, వ్యాఖ్యాతను ఆదరించవలసిన ఆవశ్యకత, లొల్ల లక్ష్మీధరుడు, మల్లినాథుడు మున్నగువారు వ్యాఖ్యానవిషయంలో పేర్కొన్న అంశాలు, మున్నగు విషయాలను వారు అందులో వివరించారు.

ఒకసారి వారు శ్రీరాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారిని కలుసుకోవడం జరిగింది. ఈ వ్యాఖ్యాన విషయాన్ని వారితో ప్రస్తావించి వారి ఆశీస్సులు గూడా శ్రీ గౌరిపెద్ది వారు నా కందజేసి నన్ను ధన్యుణ్ణి కావించారు.

వాఙ్మయసేవతో ప్రాచ్యకళాశాలకే కాక తిరుపతి క్షేత్రానికి గూడ ప్రాశస్త్యం చేకూర్చడంలో సిద్ధహస్తులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, మానవల్లి రామకృష్ణ కవిగారు, శ్రీరాళ్లపల్లివారు మున్నగు పండితుల కోవకు చెందిన శ్రీ గౌరిపెద్దివారు సదా సర్మణీయులనడంలో సందేహం లేదు.

ప్రాచ్యకళాశాలలో నేను విద్యార్థిగానున్న సమయంలోనే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కాళిదాస విరచిత శాకుంతల నాటకాన్ని ప్రదర్శించాలని అధికారులు నిర్ణయించారు. శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు నాటక ప్రదర్శనకు డైరెక్టర్‌గా ఉండి నటులకు చక్కని శిక్షణయిచ్చారు. శ్రీ గౌరిపెద్దివారు, నేను శార్ఙ్గరవశారద్వతులుగా శిక్షణ పొందాము. కాని ఏ కారణం వల్లనో నాటక ప్రదర్శనకు అంతరాయం ఏర్పడి ప్రదర్శన ఆగి పోయింది.

శ్రీ గౌరిపెద్ది వారు జ్యోతిశ్శాస్త్రంలో గూడ ప్రవీణులు.

1975లో నేను మా గురుదేవులు శ్రీమలయాళ స్వాములవారి జీవిత చరిత్ర వ్రాశాను. అది 1976 లో మొదటి ముద్రణ పొందింది. పిదప పలు పర్యాయాలు ప్రకటితమయింది. అందలి కథ

'సద్గురుదర్శనం' అన్న పేరుతో టి.వి.లో నేటికి (యూట్యూబ్) ప్రదర్శింపబడుతున్నది.

అందు శ్రీ స్వాములవారి జన్మలగ్నాన్ని నేను అందజేయగా, శ్రీగౌరిపెద్దివారు ప్రేమతో దానిని పరిశీలించి శ్రీగురుదేవుల జన్మకాల వైశిష్ట్యాన్ని విశ్లేషించి అందలి విశేషాలను 4 పుటలకు సరిపడేటట్లు విస్తరించి వ్రాశారు. తద్ద్వారా శ్రీస్వాములవారి భక్తుల కందరికీ అమందానందం కల్గించారు.

ఈ విధంగా బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు అనన్యసామాన్యమైన వాఙ్మయసేవ చేయడమేకాక నా బోటి వారికెందరికో తగిన ప్రోత్సాహమిచ్చి ధన్యులను కావించారు.

వారి సౌజన్యాన్ని ఏనాటికీ మరువజాలము.

**గౌరిపెద్ది కులాంభోధిశశినం విద్వదుత్తమమ్ ।**
**శ్రీరామసుబ్బశర్మాణం ప్రణమామి ముహుర్ముహుః ॥**

**శ్రీతాళ్ళపాక వాఙ్మయ పరిశోధకపండితం మహాప్రాజ్ఞమ్ ।**
**అవధాన కళానిపుణం వందే శ్రీరామసుబ్బశర్మాణమ్ ॥**

**జ్యోతిశ్శాస్త్ర విశారద మాశ్రితవిద్యార్థివత్సలాచార్యమ్ ।**
**వరసంస్కృతాంధ్ర వాఙ్మయ నిష్ణాతమహం నమామి గురువర్యమ్ ॥**

తిరుపతి **– సముద్రాల లక్ష్మణయ్య**

13-8-2022

# శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి

## తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన సంపుటాల పరిష్కరణ విశేషాంశాలు

- ఆచార్య కె. సర్వోత్తమరావు

**తిరుపతి,** 97041 0400

**1. అన్నమాచార్య సంకీర్తన సంపటాల ముద్రణ :**

తాళ్లపాక పదకవులనగానే చప్పున గుర్తుకు వచ్చేవారు తాళ్లపాక అన్నమాచార్యులు, తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలా చార్యులు. వీరిలో అన్నమయ్య 32వేల కీర్తనలు వ్రాసినట్లు చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో గ్రంథస్థం చేశాడు. 'పరమతంత్రములు ముప్పది రెండువేలు' అని అతని గణనం. అన్నమయ్య సంకీర్తనలసంఖ్యకు సాక్ష్యమున్నట్టు పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య కీర్తనలకు ఎక్కడా లెఖ్ఖ కనబడదు. ఏతావతా ముగ్గురు పదకవులలో దొడ్డభాగం అన్నమయ్యదే అనడం నిర్వివాదాంశం. లభ్యమవుతున్న రాగిరేకుల సంఖ్యకూడా ఈ వాదాన్ని బలపరుస్తూ ఉంది.

తాళ్లపాక పదకవుల సంకీర్తనల పరిష్కరణకు మొదట శ్రీకారం చుట్టినవారు శ్రీసాధుసుబ్రహ్మణ్యశాస్త్రిగారే. రేకులలోని వ్రాతలను కాగితాలకు ఎక్కించిన వారు శ్రీ కలబరిగి వేంకటరమణశాస్త్రిగారు. అయితే అవి ముద్రితములు కాలేదు. సరికదా చెత్తకాగితాలుగా పరిగణింపబడి నష్టం కావడం దురదృష్టం. ఆపై రెండవసారి 1936.37 ప్రాంతంలో శ్రీ విజయరాఘవాచార్యులు అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు అను పేర ముద్రించారు. కాని అవి అసడ్డ ప్రచురణలుగా పరిగణింపబడ్డాయి. ఆపై మూడవసారి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు లభ్యమయిన రాగిరేకులను స్వాధీనం చేసుకొని జాగ్రత్తగా పరిశీలించి 1947-1950లలో రెండు సంపుటాలు ప్రచురించారు. ఈ ప్రచురణలే తరువాతి వారికి మార్గదర్శకాలు. తరువాతికాలంలో శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మలు వివిధ సంపుటాలను పరిష్కరించి పీఠికలు వ్రాశారు. మొత్తానికి అన్నమయ్య అధ్యాత్మ, శృంగార సంకీర్తనల సంపుటాల పరిష్కరణలో ముద్రణలో ఈ నలుగురినే ఎంపిక చేసుకోవడం అతిశయోక్తి కాదు. పైపెచ్చు శ్రీ విజయరాఘవాచార్యుల వారితో మొదలయిన పరిష్కరణ శ్రీ గౌరిపెద్ది వారి అంకురితదీక్షతో పూర్తికావడం విశేషం.

**2. శ్రీగౌరిపెద్దివారి అన్నమయ్య సంకీర్తనల సంపుటాల పరిష్కరణ :**

తిరుమల తిరుపతి దేవస్థానంవారు కొత్త నెంబర్లతో 1998–1999లో తాళ్ళపాక పదసాహిత్యము – సంపుటము పేరుతో 29 సంపుటాలు ప్రచురించారు. వాటిలో రెండు పెదతిరుమలయ్యవి. ఒకటి చినతిరుమలాచార్యులవారివి కాగా తేలినవి 26. వీటిలో 2 సంపుటాలలోను పరిష్కర్తగా శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి పేరే కనిపిస్తుంది. వీటిలో 1,2,3,4,5 ఒకప్పుడు పరిష్కృతమై, ముద్రితమై మరల శ్రీ గౌరిపెద్ది వారిచే పున:పరిష్కృతమై పునర్ముద్రితములయినవి. కొత్త నెంబరుగల 13,14,16 సంపుటాలకు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పరిష్కర్తలయినా శ్రీ గౌరిపెద్ది వారు సాహాయ్యకులు కాగా కొత్త నెంబరుగల 18,19,20,21,22, 23,24, 25,26, 27,29 సంపుటాలు గౌరిపెద్ది వారిచే స్వతంత్రంగా ఎవరి తోడ్పాటు లేకుండా సాగినవే. మొత్తానికి **20 అన్నమయ్య సంకీర్తనల సంపుటాల పరిష్కరణ**లో శ్రీ గౌరిపెద్దివారి భాగస్వామ్యం ఎంతటిదో విహంగావలోకన దృష్టితోనూ గుర్తింవ వచ్చు.

**2.1. శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారికి సహాయకులుగా సాగించిన పరిష్కరణ :**

శ్రీ రాళ్లపల్లివారు శ్రీగౌరిపెద్దివారి సాయంతో నాలుగు సంపుటాలు పరిష్కరించారు. ఈ సంపుటాల పరిష్కరణలో శ్రీ రాళ్లపల్లివారు గౌరిపెద్దివారిని శ్లాఘించిన తీరు గుర్తించదగ్గది.

“ఈ గొప్ప పనికి నాకు చేదోడువాదోడుగా శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాల యందలి ఆంధ్రసంస్కృత సాహిత్యాధ్యాపకులగు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శిరోమణి, విద్వాన్ గారిని ఏర్పరచుట నా యదృష్టము. శ్రీ శర్మగారు అష్టావధానము, ఉభయభాషలందును ఆశుకవిత, మంత్రతంత్రశాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలు విషయములలో పరినిష్ఠితులు. నిష్కల్మషమై, నిష్పక్షపాతమైన మేధ, ప్రామాణికమైన దృష్టి, ఆత్మార్థకమైన సదాచారసంపత్తి కలవారు. ఈ పల్లెపట్టులందలి దేశి తెలుగు నుడికారములు చక్కగా నెరిగినవారు. మీదు మిక్కిలి నా యెడ సుస్నిగ్ధమైన హృదయము గలవారు. కార్యోత్సాహపూర్ణులు’ అని తన సంతోషాన్ని (13 పీఠిక) బహిర్గతం చేశారు. ఆలాగే 14వ సంపుటం పీఠికలో కూడా –

“ఈ కైంకర్యమునకు సర్వవిధముల సాహాయ్యము నెరపు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు నా రెండు చేతులయూత. అందుమీద శ్రీనివాసులదయ” అని సంభావించారు.

13,14 సంపుటాలకు శ్రీరామసుబ్బశర్మగారు సహాయకులుగా ఉన్నప్పటికిని తన పేరుతోనే పీఠిక ప్రకటించుకొన్న శ్రీ రాళ్లపల్లివారు 16వ సంపుటంలో తాను చిరుపీఠికతో స్వస్తి పలికి బృహత్ పీఠికను శ్రీ రామసుబ్బశర్మగారికి అవకాశమివ్వడం విశేషం. ఆ సంపుటంలోనే శ్రీ రాళ్లపల్లివారు –

"నేను, శ్రీ రామసుబ్బశర్మగారును కలిసి పనిచేయుచుండగా ఈ సంపుటము నందలి చాల భాగము పరిశోధించి ముద్రణార్హముగా వ్రాయబడినది... శ్రీ రామసుబ్బశర్మగారు యీ ప్రయత్నము సాంగముగా తుద దాకించునట్లు అందుకు వలయు దీర్ఘాయురారోగ్యాదివృద్ధిని శ్రీశ్రీనివాసులనుగ్రహింతురు గాక" అని ముగించినారు.

కొత్తనెంబరుగల 5వ సంపుటం లోగడ రాళ్లపల్లి వారే స్వతంత్రంగా ముద్రించినవారే. అయినా ఆ సంపుటాన్ని తి.తి.దే. వారు పునర్ముద్రించదలచు కొన్నప్పుడు ఆ బాధ్యత గౌరిపెద్దివారికి అప్పచెప్పినపుడు శ్రీ గౌరిపెద్దివారు అడుగడుగునా శ్రీ రాళ్లపల్లివారిని సంప్రతించి 'సర్వమూ ఎరుకపరచి' పెద్ద పీఠిక వ్రాశారు.

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు తాము పూర్తిగా పరిష్కరణ బాధ్యత తీసుకొన్నపుడు సంకీర్తనలకు ప్రధాన ఆకరాలయిన రాగిరేకులను స్వాధీనం చేసుకొన్నారు. రేకుల గజబిజిని గుర్తించారు. శ్రీవేటూరివారు కేవలం 'అ' 'శ్రీ' గుర్తుల ఆధారంగా వర్గీకరించిన రేకుల్లోని ప్రామదికాలు గుర్తించారు. ఏవి అన్నమయ్యలో ఏవి పెదతిరుమలయ్యవో తెలియక తికమకపడిన సంగతిని గుర్తించారు. గౌరిపెద్దివారు పరిశీలించి రేకుల వ్రాతలోని వ్రాయసకాండ్ర దోషాలను గుర్తించారు. చివరకు –

"శ్రీ శాస్త్రిగారు ఆ మాత్రము శ్రమతీసికొనకుండినచో రేకుల విషయమున ఈ పాటి నిర్ధారణ కూడా నేటికిని కుదిరి యుండదు. వారి జాగ్రత్త చాల మెచ్చుకొన దగిన"దని మొదటి సంపుటం పీఠికలో గౌరిపెద్ది వారు ప్రశంసించారు. అలాగే వేటూరి వారు పాఠపరిగ్రహణంలో ఇతర ప్రాంతాలనుండి తెచ్చిన రేకులను అంతగా పరిగణలోనికి తీసుకోలేదనే అంశం గుర్తించారు. ఇతర ప్రాంతాలనుండి అనేకం తెప్పించుకొన్న తరువాత పరిశీలించవచ్చని భావించారని గౌరిపెద్ది తన సందేహం వ్యక్తపరచారు.

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మపట్ల గౌరిపెద్దివారికున్న గౌరవం అతివేలం. కొత్తనెంబరుగల 18వ సంపుటం పీఠికలో –

"పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి చేతికింద నేను నేర్చినంతమతికి తగినట్లుగా ఈ సంపుటం నుండి కొన్ని సంపుటములు పరిష్కరించుటకు పూనుకొంటిని" అన్నారు. ఆలాగే తానెందుకు పదవాఙ్మయపరిష్కరణలో భాగం పంచుకొన్నానో అనడాన్ని కూడా ఈ సంపుటం చివర–

"ఈ వాఙ్మయమునందలి పవిత్రమైన భక్తి, భాషలోని మాధుర్యము, నేనీ పని చేసినచో శ్రీరాళ్లపల్లి వారికి తృప్తి పాత్రమగుదునను భావము నన్నీ పనికి పురికొల్పినవి. ఈ దొడ్డ కార్యమును నాచే చేయించుటకు శ్రీశ్రీనివాసుని నిండుదయ, తాళ్లపాక కవుల అనుగ్రహము, పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్లపల్లివారి మంగళా శాసనములు అండగ నిలిచి కడతేర్పగలవు" అన్నారు. ఆపై తన భక్తిని శ్లోకరూపంలో పీఠికాంతంలో 19, 20, 21, 22, 23, 24, 25, 1, 2, 3, సంపుటాలలో ప్రకటించుకొన్నారు.

### 3. పరిష్కరణ సమస్యలు :

ఆంగ్లేయుల సాహచర్యంతో భారతీయవిద్వాంసులు తమ నైపుణ్యాన్ని పెంచుకొన్న కళ 'పరిష్కరణ' 19వ శతాబ్దం మధ్యకాలంలోనే అముద్రిత గ్రంథాల పరిష్కరణ, కొత్త పద్ధతిలో ముద్రించడం మొదలయింది. ఆలాగే శాసనాల పరిష్కరణ కూడా.

పరిష్కరణకు సంబంధించిన సమస్యలు అనేకం. వాటిలో మొదటిది పెక్కు ప్రతులుగల పుస్తకాలుగాక ఏకైక మాతృకగల పుస్తకాల ప్రతి సమస్య ఒకటి. రెండవది– వ్రాయసగాండ్ర 'చేతివాటం'. మూడవది – వ్రాతవిధానం. నాల్గవది – జనవ్యవహారంలో ఒకప్పుడు విరళంగా ఉండి ప్రస్తుతం వాడుకలో లేని పదాల స్వరూపాలు. ఐదవది – చేబూనిన పరిష్కరణ సంగీతసాహిత్యసంబంధి కావడం. ఆరవది గతంలో ఎక్కడా లేకున్న ఇంత విస్తృతంగా రాగిరేకులలో సాహిత్యం చెక్కబడడం, వాటి పరిష్కరణ లేకపోవడం. ఏడవది – కొత్తగా పరిష్కరణ చేబట్టినవారికి ముందున్న వారు చాల అసడ్డగా పరిష్కరించారని తెలియచేయడం.

### 3.1. ఆకరాలు – రేకుల సేకరణ :

తాళ్లపాక పదవాఙ్మయ పరిష్కరణలో పరిష్కర్తలు ముందు ఎదుర్కొనే సమస్య 'ఆకరాలు'. తమిళంలోని 'నాలాయిరం' కొంతకాలం వ్యవహారంలో మరుగుపడింది. వీటిని నాథమునులు

అతిప్రయాసతో పునరుద్ధరించి ఒక వ్యవస్థ ఏర్పరచారు. రామానుజులు శ్రీ వైష్ణవాలయాలలలో నాలాయిరాన్ని నియతం చేసి జీవంపోశారు. అలాగే అన్నమయ్య కీర్తనలు వ్యవహారంలో ఉన్నా క్రమంగా నశించవచ్చని పెదతిరుమలాచార్యులు భావించి వీటిని రాగిరేకులపై చెక్కించారు. చెక్కించడమేకాదు శ్రీవారి ఆలయంలో హుండీకి ఎదురుగా 'తాళ్లపాక అర'లో భద్రపరచారు. అక్కడ 'అరుళప్పాడు'కు ఒక వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు.

పెదతిరుమలయ్య చెక్కించిన రాగిరేకులకు పుత్రికలు వెలువడ్డాయి. ఇతర ఆలయాలలోనూ వ్యాపించాయి. తాళపత్రాలలోను భద్రపరచబడ్డాయి. వీటిని గుర్తించిన రాళ్లపల్లివారు "11వ సంపుటమందువలె ఇందును సాధారణపు రేకులు (సా.రే) నిడురేకులు (ని.రే), పెద్దరేకులు (పె.రే) తంజావూరి సరస్వతీ భండారపు ప్రతి (తం.ప్ర) శ్రీ తాళ్లపాక వేంకటశేషాచార్యుల వారింటి వ్రాతప్రతి (తా.వె) అను ఐదు మూలములను పోల్చి సరిచూచి పాఠములను నిర్ణయంచితిని" అని 5వ సంపుటం పీఠికలో తెలిపి ఉన్నారు.

రేకుల లెఖ్ఖలను సప్రమాణంగా నిరూపించి భద్రతకు పాటుపడినవారు శ్రీగౌరిపెద్దివారు. కొత్త నెం.16వ సంపుటంలో శర్మగారు తాళ్లపాక కవుల రాగిరేకుల వివరణము, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పీఠికలలో పేర్కొనని తాళ్లపాకవారి లఘుకృతులరేకుల వివరణ, కవుల వారిగ లెఖ్ఖ, పైన పేర్కొన్న సాధారణమైన రేకులు కాక మిగిలిన సన్న పెద్దరేకుల వివరణము అను శీర్షికలతో రేకులు 2531+170 వెరసి 2635 అని నిర్ధారించారు. అంతేకాదు రేకుకు సాధారణంగా 6 పాటలయిన పక్షంలో అన్నమయ్య ముప్పది రెండువేలపాటలకు దాదాపు 5400 రేకులుండాలని లెక్కించారు. దురదృష్టంవల్ల సగానికి తక్కువగానే రేకులు లభ్యమయ్యాయని ఆవేదన చెందారు. ఈ సందర్భంలో మరొక్క అంశం పరిశీలనార్హం. తి.తి.దే. నుండి మదరాసు మ్యూజియానికి, ఆలాగే కాకినాడకు తరలి వెళ్ళిన రాగిరేకుల ఆచూకి తెలియదని కూడా ఒక వదంతి లేకపోలేదు.

### 3.2. రేకులలోని వ్రాతవిధానం – పరిష్కర్తల కృషి :

ధ్వనులకు సంకేతం లిపి. తెలుగులిపి అనాదిగా ఒకే రకంగా లేదు. కన్నడాంధ్రలిపి క్రమంగా తెలుగులిపిగా మారింది. ఈ లిపి శాసనాలలో, రాగి రేకుల్లో సహజంగా కనిపిస్తుంది. మరి

రాగిరేకులలోని లిపి శాసనలిపికి దగ్గరిది. అలాగే భాషావిషయంలో గ్రాంథికవేషము సంతరించుకొన్న వ్యావహారిక శబ్దరాశి.

రేకులలో వ్రాతవిధానం గురించి గౌరిపెద్దివారు 1, 5 సంపుటాలలో తర్కించారు. వాటిలో ప్రధానమయినవి –

1. హ్రస్వదీర్ఘాలకు నేటివ్రాతలద్వారా విడివిడి గుర్తులు లేకుండడం.
2. హల్లులపై కూడే నూ, మీ, మూ, మో, యీ, లూ, వూ తప్ప దీర్ఘాక్షరములు కానరాకుండుట. ఇవేగాక అక్షరాలపై ఇ, ఈ కారములు, ఎ,ఏ కారములు, ఒ, ఓ కారములు పరిష్కర్తయే వింగడించుకోవలసి రావడం.
3. మో, యోలు అంతటా దీర్ఘమే కావడం.
4. ఎంత, ఏల మొదలయినవి యంత, యాలగా కనబడడం.
5. ఇతర ప్రయోగాలలో కానరాని అరసున్నలు కొన్నిపట్ల కానరావడం.
6. వ్యావహారిక పదాలలో సహితం అవ్యవస్థగా శకటరేఫములుండడం.
7. అజాదిపదాలు యకార వకారాదిగా కనబడడం.
8. ద్విత్వహల్లుకు ముందు పూర్వానుస్వారము కనబడడం
9. విసంధిగా వ్రాయడం.
10. ఉకారాంతాలపై కూడా అచ్చులకు యవలను సంధించడం.
11. ద్రుతసంధులు అక్కడక్కడ యథేచ్ఛగా మానడం.
12. ద్రుతాంతాలపై అచ్చులకు యవలు సంధించడం.
13. సకారాది శబ్దాలు శకారాదిగా ఉండడం మొదలయినవి.

**శ్రీ గౌరిపెద్దివారి పరిష్కరణ విధానం :**

1. పూర్వపరిష్కర్తల విధానం కొనసాగించడం.
2. శ్రీ వేటూరివారు య, వు, వూ, వొ, వోలు అజాదిగా, శకారాది శబ్దాలను (తెలుగు పదాలను) సకారాదిగా పరిష్కరించిన విధానం కొనసాగించడం.

3. ద్విత్వానికి ముందున్న పూర్వానుస్వారం పూర్తిగా తొలగించడం.

4. ద్విత్వరహితమయిన హల్లునకు ముందున్న నిండుసున్నను అరసున్నగా గ్రహించడం.

5. పదవాఙ్మయమంతా సంగీతసాహిత్యముల సమష్టి పంట కావడంవల్ల సాహిత్య దృష్టితో అనవసరంగా తోచిన దీర్ఘాలను అక్కడక్కడ హ్రస్వం చేయడం.

6. సముచ్చయాత్మకమయిన దీర్ఘాన్ని లయకు అనుగుణంగాను విధిగా అన్ని చరణాలలో పాటించబడిన దీర్ఘాన్ని మాత్రం హ్రస్వం చేయకపోవడం.

7. సుబోధ దుర్బోధములయిన భావాలను, సుగ్రాహదుర్గ్రాహములయని పదాలను, దురన్వయ దూరాన్వయములయిన వాక్యాలను గమనించి వివరించి కామాలు, సెమికోలన్లు ఆయా సందర్భాలకు తగిన విరుపుల గుర్తులు చూపి పాఠకుని మనస్సును రసాస్వాదనవైపు మళ్లించడం. పూ.ము.పా (పూర్వ ముద్రణ పాఠము) అని ఇవ్వడం.

8. పాదదీపిక లిచ్చే రాళ్లపల్లివారి విధానాన్ని విస్తృతపరచడం.

9. గౌరిపెద్దివారు తనదయిన సవరణను * గుర్తుతో సూచించడం.

విశేషం – శ్రీ శర్మగారు 18వ సంపుటంనుండి పరిష్కర్తలయినా అధ్యాత్మ సంకీర్తనల సంపుటాలలో అసంఖ్యాకమయిన 'పాదదీపికలు' ఇచ్చారు. బహుశ: పూర్వముద్రణలోని లోపాలు కావచ్చు. గౌరిపెద్దివారి పరిష్కరణలో 'పాదదీపికలలో' ఎన్నో అమూల్యాంశాలున్నాయి. మచ్చుకు కొన్ని –

1. రేకులకు సంబంధించినవి – ఈ భాగము చిలుముతిన్నది 18. అన్ని పాదాలలో 'క్క' ప్రాస. రెండవపాదంలో ప్రాసాక్షరం చిలుము.

2. అర్థసంబంధి – పాటలో 21–260లో దారకురాలు.
పాదదీపికలో ధారకురాలు – శాంతికలది కావచ్చు.
పాదదీపికలో అట్టువొలకమ్మ – ఈ జాతీయము స్పష్టము కాలేదు.
నిరోధ, నిరుద్ధ శబ్దములకు అడ్డగింపు, అవధి అని అర్థము (20–3)
జక్కిరొ – (19–332). నాట్య విశేషము

కోన్ : ప్రభువు అని తమిళము (19–173)

ఉదారుఁడు అనుటకు ఉదారివాఁడు (22–121)

3. వ్యావహారికములు

వోమినస్రిష్టులు (2–95) సృష్టులకు వ్యావహారిక రూపము.

జయపెట్టువలె ఓ పెట్టు (2–238), వ్యావహారికము.

సంధులకు సంబంధించినవి

పాటలో అందెంది (18–143) పాదదీపికలో అంది + అందె

పాటలో మోవేనుదాకా (19–331) పాదదీపికలో మోవి + అనుదాకా

పాటలో రమణీయం 19–332 పాదదీపికలో రమణీ + ఇయమ్

పాటలో నియ్యిచ్చుల (19–192) వింత త్రికసమాసము.

ఛందస్సంబంధి అంశాలు సూచించడం.

ప్రాసభంగం – చెక్కులే – మొక్కితి – నిక్కి – చికించుక (18–271)

యతిభంగం – చెక్కునొక్కి సతినిన్నుఁ జనకియుఁ దనివోదు (22–464)

యతిభంగం – చిగురుఁబోణి నిన్ను శఁసెలవుల నవ్వీని (23–137)

ఇతర కవుల ప్రయోగాలివ్వడం.

నల్లఁ బజ – (23–157). కిరాతసంఘము. కొమ్ములు మోయ

నల్లవ్రజ శుక (1–224)

పాటలకు సంబంధించినవి (18వ సంపు 153)

కురంజి రాగంతో వున్న 59వ పాట కొంతభేదముతోనిది

పాట ఏ తరగతికి చెందినదో చెప్పడం.

అప్పుడు వేంకటరాయఁడు (18–280). ఇది అధ్యాత్మకీర్తనల ఛాయలోనిది.

ఒక్కరీతినే వుండరా (24–168) ఇందు దశావతార వర్ణన కలదు.

ఎంత నీవు పోతరించి 19–111 సవతుల సంవాదమిది.

ఔలేరా జాణ (19–492) ఇది వాకోవాక్యము.

జనశ్రుతము

కప్పురాన వేసనే (22–394). కర్పూరము, రాతిని కరిగిస్తుందని పగిలిస్తుందని, అతికిస్తుందని కూడ జనశ్రుతి ఆడుఁగ్రోవిలలు చెలఁగి (25–185) ఆడుకోకిలలకు కూతలో ప్రశస్తిలేదు. **పుంస్కోకిలో యన్మధురం చుకూజ** ఇత్యాదిగ మహాకవి కాళిదాసవచనములు.

**3.3. పరిష్కరణలో సాయపడిన వారి సంస్మరణ :**

శాసనాల పరిష్కరణ, తాళపత్రప్రతుల పరిష్కరణ రాగిరేకుల వ్రాతల పరిష్కరణలో అనేకరకాలయిన చిక్కులున్నాయి. పరిష్కర్తకు చారిత్రక, భౌగోళిక, శాస్త్రవైదుష్యపరిజ్ఞానంతోబాటు ఆయా ప్రాంతాల భాషలతో గట్టి పరిచయ ముండాలి. ఆలాగే మతసంబంధిపదజాల అవగాహన తప్పనిసరి. పరిష్కరణలో కవిదర్శనం పరిష్కర్తకు అవసరం. వాటికి సంబంధించి తనకు తెలియని వేళ ఇతరులను సంప్రదించడం అనివార్యం. అది న్యూనత కాదు. శ్రీ గౌరిపెద్దివారు తమ బుర్రను తొలచే సందేహాలేర్పడినవేళ చాలవరకు ఇతరులను సంప్రదించేవారు. పరిష్కరణలో ఆ అభిప్రాయాలు అన్వయించడానికి వీలయినపుడే ఆ అభిప్రాయాలకు విలువ నిచ్చేవారు. కానివేళ తిరస్కరించేవారు. అన్వయానికి సరిపోయిన అభిప్రాయాలు క్రోడీకరించి వారికి కృతజ్ఞతలు ప్రకటించేవారు. పీఠికలలో యథాతథంగా ఉటంకించేవారు. ఇది పరిష్కర్త మార్గం. ఘంటాపథ నిజాయితికి నిదర్శనం కూడా. ఇలాంటి 5,6 సాక్ష్యాలు గౌరిపెద్దివారి పీఠికలలో కనిపిస్తాయి.

**అన్నమయ్య సంకీర్తనలలో 'కనుమల' ప్రస్తావన :**

అన్నమయ్య **'సొంపుల నీ వదనపు సోమశిలకనుమ'** అనే పాట (5–115) వ్రాశారు. ఈ పాట స్త్రీవర్ణనకు సంబంధించింది కావడంవల్ల కేవలం ఔపమ్యంతో అర్థం చెప్పవచ్చు. గద్దెరాతి కనుమలాంటి పిఱుదు, ఎర్రశిల కనుమలాంటి కెమ్మోవి, దొంగలసాని కనుమలాంటి చిత్తమని, కాని గౌరిపెద్దివారు సందేహం నివృత్త్యర్థం కడపమండల భౌగోళికపరిజ్ఞానంగల శ్రీమైనంపాటివారిని సంప్రతించారు. శ్రీమైనంపాటివారు ఆ కనుమల కడ చెన్నకేశవస్వామి ఆలయాలున్నాయని, కనుమలు షట్చక్రాకృతి

అని, సుదర్శనచక్రానికి దీనికి సంబంధముండవచ్చని 15-7-76వ తేదీన ఒక ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరాన్ని శ్రీ గౌరిపెద్దివారు యథాతథంగా (5-40) పీఠికలో ఉటంకించారు.

ఆలాగే రాగిరేకులమీద వ్రాతగురించి గౌరిపెద్దిగారికి సందేహం కలిగింది. మైనంపాటివారే గౌరిపెద్దిగారికి 'రేకులను చదరించుకొని వానిపై, కరిగిన మైనంలో రంగు కలిపి దానితో గీతలు వేసుకొని దానితోనే అక్షరాలు వ్రాస్తారు. ఆ వ్రాసిన అక్షరాలన్నిటిని తన కిందివారు చెక్కుతారని' చెప్పారట. అలాగే రాగిరేకులకు సంబంధించి చిత్తూరు సంతసేటలోని శ్రీవల్లంపాటి అశ్వత్థంగారు మరో కథనం చెప్పినా సందేహం నివృత్తి కాకపోయినా వారి అభిప్రాయాన్నికూడా పీఠికలో గ్రంథస్థం చేశారు.

అన్నమాచార్యుల ఆధ్యాత్మక సంక్తీరనలలో చేరదగిన **'అదె శిరశ్చక్రము లేనట్టి దేవరలేదు** (2-435)లో **ఆనాయుదానో అసురా అదేవ; యచ్చ ఇంద్రే, యచ్చసూర్యే నేమినా తప్తముద్రాందాయేత్'** లాంటి వాటికి ప్రామాణికతకోసం తి.తి.దే వేదపారాయణదారులు శ్రీ సుబ్బావధానులను సంప్రతించారు. అవధానులవారు వేదం – ఋక్కు – అష్టకం – అధ్యాయం వర్గంతో సహా మంత్రం వ్రాసి యిస్తే వాటిని యథాతథంగా (2-17) ముద్రించారు.

అన్నమయ్య స్మార్తుడయనా వైష్ణవం స్వీకరించినవాడు. అహోబలంలో విశిష్టాద్వైతరహస్యాలు తెలుసుకొన్నవాడు. తన సంకీర్తనలలో ఆ రహస్యాలను పాటలుగా పాడినవాడు. గౌరిపెద్దివారు స్మార్తసంప్రదాయంవారయినా విశిష్టాద్వైత పరిజ్ఞానం కలవారు. కాని వైష్ణవ సంబంధి అంశాలకు సంబంధించి తన సతీర్థులు మహోపాధ్యాయులు, సహృదయులు శ్రీమాన్ టి.ఏ. కృష్ణమాచార్యులను సంప్రతించి వాటిని పీఠికలో (2-2)స్మరించారు. అలాగే తమకు అవసరమయిన పుస్తకాలను సమకూర్చిన శ్రీ కందాడై శేషాచార్యులవారిని, శ్రీ కుంటిమద్ది శేషశర్మగారిని వినుతించారు.

గౌరిపెద్దివారికి అన్నమయ్య ప్రయోగమయిన **కాకి జున్ను** శబ్దం గురించి సందేహం వచ్చింది. (2-167) నిఘంటువులలో వివరణ లేదు. కాని అనుకోకుండ తమ యింటికి వచ్చిన శ్రీ వి.వి. శేషాచార్యులుగారిని అడుగగా వారిచ్చిన సమాధానాన్ని (2-52) పీఠికలో గ్రంథస్థం చేశారు. ఆలాగే ఉత్తరంద్వారా వివరణ యిచ్చిన శ్రీ జంగా సుబ్బయ్యగారి వాక్యాలను కూడా పొందుపరచడంలో శర్మగారి నిజాయితి సువ్యక్తం.

శ్రీగౌరిపెద్దివారు స్మరించిన వ్యక్తులలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు అధ్యయనశాఖాధ్యక్షులు ఆచార్య జి.యన్. రెడ్డిగారొకరు. అన్నమయ్య శృంగారసంకీర్తనలు 5వ సంపుటం పునర్ముద్రణకావడానికి  ఎం.ఏ. (తెలుగు) వారికి విశిష్ట పాఠ్యభాగంగా నిర్ణయించడమే కారణం. అందువల్ల శ్రీశర్మగారు ఈ సంపుటం పాతనెంబరు 12న ముద్రణకు మిత్రులు, గౌరవార్హులు అయిన ఆచార్య జి.యన్. రెడ్డిగారు కారకులని (5–6) వ్రాశారు. అలాగే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని అభినందిస్తూ –

అన్నమాచార్యుల కృతులను తెలుగు ఎం.ఏ వారికి విశిష్టపాఠ్యభాగముగ నిర్ణయించుటచే శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయంవారి ఆంధ్రసాహిత్య ప్రీతి, అన్నమయ్య వాఙ్మయమునందుగల అనురక్తి. భక్తి దీనిని గడ్డకు తీసుకొని రావలెనను దొడ్డ సంకల్పము మిగుల కొనియాడదగియున్నవి అన్నారు.

పాతకాలంనాటి పండితులు వ్రాతకు అలవాటు పడినవారు కారు. అనర్గళంగా ఉపన్యసించగలరేగాని అరఠావు ఉత్తరము వ్రాయడానికి అరగంటకంటె ఎక్కువపట్టేది. గౌరిపెద్దివారు పదసాహిత్యసంపుటాలపరిష్కరణలో తలమునక లైనప్పుడు సాయపడిన శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారిని మరువలేదు.

'మందవేగము గలిగిన నా చేయి ఈ పీఠికను వ్రాయలేక యున్న సమయమున శరవేగముతో వ్రాత సాగింపగల చిరంజీవి సముద్రాల లక్ష్మణయ్య, ఈ మధ్యనే ఈ అన్నమాచార్యకార్యమున ఒక శాఖకు తీర్పరిగా వచ్చి నాకీ పీఠికాలేఖన విషయమున సహకరించినందుకు అతని ఋణము నేనెట్లు తీర్చుకొనవలెనో తోచకున్నది' అని (5–61,62) వ్రాశారు.

**3.4. పూర్వపరిష్కర్తల పరిష్కరణలో ప్రామాదికాలు :**

శ్రీగౌరిపెద్ది వారికంటె ముందు సంకీర్తనల పరిష్కరణ బాధ్యత వహించిన వారు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి,  శ్రీరాళ్లపల్లి వారు. శ్రీ గౌరిపెద్దివారు పూర్వులు ముద్రించిన భాగాలను పునర్ముద్రించేవేళ ఆవేదన మథనం వారికి కలిగిందనడం వాస్తవం. పెద్దలు చెప్పిన 'సత్యవాక్' సిద్ధాంతానికి కట్టువడి వారిరువురి పరిష్కరణలోని ప్రామాదికాలను శ్రీ గౌరిపెద్దిగారు చూపారు.

శాస్త్రిగారు రేకులలోని 'ర' సాధురేఫం. పాటల సవరణ వేళ గ్రాంథికదృష్టితో శకటరేఫాలయ్యాయని

ఒక పరిశీలన. ఆలాగే పరిష్కరణలో యతిప్రాసస్థానములు గమనింపబడలేదని మరొక అభియోగం. అన్నిటికంటె అన్నమయ్య జయంతి, జనన సంవత్సరంపట్ల గౌరిపెద్దివారు పూర్తిగా విభేదించారు.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమయ్య జనన సంవత్సరాన్ని మొదట క్రీశ.1408 అని భావించారు. ఆ తరువాత క్రీ.శ.1424గా నిర్ణయించారు. శ్రీ గౌరిపెద్దివారు జ్యోతిశ్శాస్త్రపండితులు కావడంవల్ల గణనం చేసి వేటూరివారు ఎక్కడ పొరబడ్డారో సంపుటంలో విశదీకరించారు.

రేకులమీద 'స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగు నేఁటి క్రోధి సంవత్సరమందు శ్రీతాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదునారు యేండ్లకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైతేను, అది మొదలుగాను శాలవాహన శక వరుషంబులు 1420 అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్ళపాక అ్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు అనే వాక్యం. ఇది జన్మనిర్యాణములను తెలుపుటకు ఏర్పడినది కాదు. జీవితకాలములో సారభూతకాలాన్ని తెలిపేది. 16 ఏండ్లదాకా సారహీనకాలం. ఆపైని ఒక దినానికి ఒక కీర్తన. కనుక 79+16 – 95. 1408 సంవత్సరం విరోధి వైశాఖ శద్ధపూర్ణిమ విశాఖానక్షత్రముజన్మ మనుట సబబు అని తేల్చారు.

అలాగే రాళ్లపల్లి వారు లోగడ ప్రచురించిన 12వ సంపుటంలో **'ఇట్టి ముద్దులాడి బాలుదేఁడవాఁడు'** పాట (12.148) రేకుల్లో ఉన్నా ముద్రణలో తప్పిపోయింది. ఈ అంశాన్ని శ్రీ గౌరిపెద్దివారు ఉత్తరముఖత: తెలియజేశారు. ఆ ఉత్తరానికి జవాబిస్తూ శ్రీమాన్ రాళ్లపల్లివారు –

**'ముద్దులాడి కీర్తనము'** నా చేయి జారిపోయినదని మీ జాబులో చదివినపుడు చాలా వేదన పడితిని. పలుమారు నేను వదరుకొను పదములలో అదొక్కటి. వ్రాసి పెట్టలేదుగాని దేవగాంధారి రాగమున దానికి నేను కల్పించుకొన్న స్వరమూర్తి నా సంకల్పమందే స్థిరముగా నిలచియున్నది. పొరబడుట నాకు అస్వాభావిక మేమియు గాదని ఎఱుఁగుదును. కాని ఇది పెద్ద పొరబాటుగా తోచి నొప్పించినది' అని వ్రాశారు.

ఆలాగే 5వ సంపుటంలో –

**దిక్కులేక పోయె నిట్టే దినదినము**
**వెక్కసపు లోకమేలే విభుఁడెవ్వఁడో (5-155)**

పాట విశదం కావడం లేదని గౌరిపెద్ది వారు వ్రాయగా శ్రీ రాళ్లపల్లివారు

'ఈ సంపుటమందలి 155వ పాట అర్థము తాత్పర్యము నా పంటికిని చిక్కలేదు. సమకాలికమైన ఏదో చారిత్రక విప్లవమును తుదకు దాని ప్రశాంతియు దానిలో ఉద్దేశింపబడినట్లున్నది. ఇంతకంటె స్పష్టపరచుమాట లేవియు అందు కనబడలేదు అని 27-7-76న జవాబిచ్చారు. గౌరిపెద్దివారు ఆ లేఖను అట్టే ఉటంకించారు.

గౌరిపెద్దివారు 5వ సంపుటంలో 193 పాటలో ఒక చరణం చివర **'యెలమిఁ గోవిల కూఁత యేదో పోదో'** అని అసమగతి వాని రాక అదోపాదోలు రేకులలో పటో పాటో - ఆటోపాటోగా ఉండడాన్ని గుర్తించినందుకు రాళ్లపల్లివారు తమ లేఖలో సంతోషం వ్యక్తపరచారు.

**4. సంకీర్తనల సంపుటాల పీఠికలలో చర్చితాంశాలు :**

శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారు తాము స్వతంత్రంగా పరిష్కరించిన 12 సంపుటాలకు పీఠికలు వ్రాశారు. ఆయా పీఠికలలో తాము చెప్పదలచుకొన్న అంశాలకు ఉపశీర్షికలు కూడా సూచించారు. ఈ 12 సంపుటాల పీఠికల పుటలు 350 కావడం విశేషం. ఈ పీఠికలు ఒక మూసలో పోసి అచ్చొత్తినట్లుగా కనిపించవు. అయితే గౌరిపెద్దివారు జీవించిన కాలంలోనే పీఠికల రచనలో ఒక క్రమపద్ధతి లేదని, శాఖాచంక్రమణం ఎక్కువ అని గుసగుస లాడినవారు లేకపోలేదు. అన్నమయ్య సంకీర్తనల సంపుటాల పరిష్కరణ ఒక చేతిమీదుగా సాగకపోవడం, ఆయా సంపుటాల కనుగుణంగా కొన్ని అంశాలు ప్రస్తావించవలసిందిగా కొందరు ఆదేశాలివ్వడం, సాహిత్యాంశాల కంటె భాషావిషయకమయిన అంశాలను ప్రస్తావించండని ఉచితసలహాలు కొందరివ్వడం నాకూ తెలిసిన లోగుట్టే. అయినా ఈ సలహాలను శ్రీ గౌరిపెద్దివారు త్రోసిపుచ్చక వివిధ సంపుటాలలో వినూతనాంశాలను ప్రకటించడంలో రాజీపడలేదనడం వాస్తవం.శ్రీ శర్మగారి 350 పుటల పీఠికాంశాలను 8 రకాలుగా వింగడించు కోవచ్చు.

### 4.1. సంపుటాల పరిష్కరణలో ఆద్యంతాల విధానం:

శ్రీగౌరిపెద్దివారు కొత్తనెంబరుగల 19 నుండి 25వ సంపుటందాక ఆలాగే కొత్తనెంబరు గల 1,2,3 సంపుటాల పీఠికలన **అన్నమయ్య నుతి**తోనే ప్రారంభించడం ఒక విశేషం. ఆలాగే పీఠికాంతంలో **శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ**గారికి చేమోడ్పు ఆడడం ఒక సామాన్యధర్మం. ఈ ఆద్యంతాలు రెండు సంస్కృతశ్లోకాలు కావడం గుర్తించదగ్గవి.

### 4.2. సంపుటంలోని కీర్తనలకు సంబంధించిన రేకుల చర్చ :

శ్రీ గౌరిపెద్దివారు ఏ సంపుటం పరిష్కరించినా ఆ సంపుటంలోని సంకీర్తనలకు ఆకరాలయిన రేకులక్రమం విశదీకరించడం ఒక అంశంగా ఎన్నుకొన్నారు. గతంలో రేకులు చూచి వ్రాతలకు ఎక్కించినవారు ప్రామాదికంగా కొన్నిపాటలు వదిలేయడాన్ని శ్రీ గౌరిపెద్దివారు గుర్తించడం వలననే ఈ రేకులచర్చ ప్రధానమయింది. అలాగే మధ్యమధ్య కొన్నిరేకులు లభ్యం కాలేదనే అంశం కూడా పాఠకులకు తెలియడానికి వీలయింది. మచ్చుకు –

“తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనలుగల మొదటి వందరేకులకు సంబంధించినది యీ సంపుటము. ఈ వందలో 51 నుండి 60 వరకుగల 10 రేకులు, 71 నుండి 72 వరకుగల 7 రేకులు వెరసి 17 రేకులు లేవు. కాగా 83 రేకులలోని పాటల సంపుటమిది” అని వ్రాయడం.

### 4.3. సంపుటాల సంకీర్తనలకు సంబంధించిన గ్రాంథిక వ్యావహారిక భాషాచర్చ

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు సంప్రదాయకవులు. పండితులు. అయినా వ్యావహారిక భాషాప్రయోగానికి వ్యతిరేకులు కారు. ప్రత్యేకించి అన్నమయ్య సంకీర్తనలలోని భాషాగతులను గుర్తించినవారు. అందుకే వారు స్వతంత్రంగా పీఠిక వ్రాసిన కొత్తనెంబరు 18వ సంపుటంలో తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.

తాళ్లపాకకవుల వాఙ్మయమునందు గ్రాంథిక వ్యావహారిక భాషలు రెండింటికి విడివిడిగ సింహాసనములు గలవు. వీనిలో ఒకదానికొకటి తీసిపోదు. అయితే సంకీర్తనములందు మాత్రమే గ్రాంథిక వ్యావహారికభాషా సాంకర్యము..

ఈ నాటి వ్యావహారికభాషావాదులకు, వ్యావహారికభాషకు ఆనాటి వ్యావహారిక భాషకు హస్తిమశకాంతరమున్నది. అన్నమయ్య కాలమునాటి గ్రాంథిక భాషకు సన్నిహితమై వ్యాకరణ లక్షణములకు దూరముకాని వ్యవహార భాషయే గ్రంథముల కెక్కుట కర్హముగా కనబడినది. వ్యవహారభాషకు పదవాఙ్మయమున కెక్కించి సాహిత్య సామ్రాజ్యమునందు దానికి ఒక పెద్దరికము కూర్చిన తొలి తెలుగు సాహసికుడు తాళ్లపాక అన్నమాచార్యులే.

అంతేగాదు ఆయా కవులు వాడిన వ్యావహారిక పదజాలాన్ని గ్రాంథికం చేయరాదని గౌరిపెద్దివారి అభిప్రాయం. ఈ సందర్భంలో శ్రీగౌరిపెద్దివారు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి అభిప్రాయాలను గౌరవిస్తూ 'ముందటి కవుల ప్రయోగము లుండిననే గాని భాషా పరిణామచరిత్రను తెలిసికొనుటకు వెనుకటివారి కాధారముండదు. కాబట్టి వాటిని మార్చకూడదు. కవి ఇష్టపడి వాడుకొన్న భాషను మార్చుటకు పరిష్కర్త కేమధికారము. అట్లు మార్చుట లిటరరీ ఫోర్జరీ అనిపించుకొనును' అనే వాక్యాలను సమర్థించారు.

పదసాహిత్యాన్ని యథాతథంగా ముద్రింపించి ఆంధ్రుల మన్ననలకు పాత్రులయినారని శ్రీ విస్సా అప్పారావు, శ్రీ పురిపండ అప్పలస్వామి, శ్రీ మండపాక పార్వతీశ్వర శాస్త్రిగార్లను ఘనంగా భూషించి తమమార్గం కూడా ఇదే అని గౌరిపెద్దివారు పరోక్షంగా సూచించారు.

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారితో కలిసి పరిష్కరణ చేబట్టిన తరుణంలోనే 16వ సంపుటం పీఠికలో –

'గ్రాంథిక, వ్యవహారభాషల సాంకర్యముతోనే వీరి పదవాఙ్మయమంతయు భావబంధురమై, బహుజనోపయోగ్యమై, భక్తిసంభరితమై అలరారుచున్నది. ఈ వాఙ్మయము నంతటిని గ్రాంథిక శబ్దసారముగ వడియగట్టు పూనిక ఆ కవుల సంకల్పమునకు దూరమగుటయేగాక, సముద్రమున కేతమెత్తినట్లు కాగలదని నా భావము' అన్నారు.

**4.4. అన్నమయ్య జీవితం, సంతతికి సంబంధించిన చర్చ :**

శ్రీ గౌరిపెద్దివారు కొత్త నెంబరుగల 5వ సంపుటం పీఠికలో అన్నమాచార్య చరిత్రము, ఆపై నందవరీకుల చరిత్రను విశదం చేశారు. ఆపై కొత్త నెంబరుగల 1వ సంపుటంలో 'నరసింహకవి' గురించి అనేకాంశాలను ప్రస్తావించారు.

ఈ సంపుటాలు వెలువడడానికి ముందే శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చిన్నన్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రను 131 పుటల పీఠికతో వెలువరించారు. ఈప్రచురణ 1949 నాటిది. ఈ బృహత్పీఠికలో అన్నమయ్య సంతానము నరసింహకవికి సంబంధించిన అంశాలు ఆలాగే నందవరీకులు – వైష్ణవతకు సంబంధించిన అంశాలు సంగ్రహంగా ప్రస్తావితాలు. కాని ఈ అంశంపట్ల తరువాతికాలంలో శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యగారు, శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు తదితరులు చర్చ చేసినవారే. శ్రీమాన్ రాళ్లపల్లి వారు కూడా తమ అభిప్రాయాన్ని కొత్తనెంబరు 13వ సంపుటంలో విశదం చేశారు. ఆపై కవికర్ణరసాయనంపై పిహెచ్.డి. చేసిన డా॥ చలపతిగారు మరొక వివాదానికి తెరదీశారు. వీటినన్నిటిని పరిశీలించిన గౌరిపెద్దివారు నరసింహకవి అన్నమయ్య కుమారుడు కావచ్చు అనడానికి సంకీర్తన సాక్ష్యం వెలికి దీశారు.

**'దయమాలి తిరుగ నాత్మజుఁడొకఁడు గలిగె'** అనే వాక్యంలో 'నరసింహకవి' కావచ్చని చెప్పారు. అయినా నరసింహకవి కవికర్ణరసాయనంలో తండ్రిపేరు తడవకుండడం, వంశం చెప్పకపోవడం, సంకుసాల తిరుమలకవి నరసింగనికి ఒకడే కొడుకు అని వ్రాయడం, అష్టమహిషీకల్యాణంలో మరొకరీతిగా ఉండడం గుర్తించి అన్నమాచార్యుల పుత్రుడే కవికర్ణరసాయనకర్త నరసింహకవి అని నిర్ధారించడం సాహసమని తేల్చిపారేశారు.

ఆలాగే నందవరీకులకు సంబంధించి అనేకాంశాలు చర్చించి గౌనిపల్లి రామప్పకవి చౌడేశ్వరి మాహాత్మ్యంలోని అంశాలను జతచేశారు.

### 4.5. అన్నమయ్య మతం – అద్వైత విశిష్టాద్వైత భావనలు :

అన్నమయ్య నందవరీకుడు. స్మార్తుడు. తిరుమల మీద ఘనవిష్ణువు కృపతో వైష్ణవుడయినవాడు. శ్రీవైష్ణవులతో సహపంక్తిలో 'సాపాటు' భాగ్యానికి నోచుకొన్న వాడు. అహోబలంలో ఆదివన్ శఠగోపులదగ్గర సకలవేదాంతపఠనం చేసినవాడు. ఆపై సంకీర్తనల రచన విరివిగా చేపట్టినవాడు.

అన్నమయ్యది స్వీకృతవైష్ణవం కావడంవల్ల సంకీర్తనలలో అద్వైతవాసన లున్నాయని మొదట చెప్పినవారు శ్రీ గౌరిపెద్దివారే. శ్రీ గౌరిపెద్దివారే వాక్య చమత్కారంతో కొన్ని పట్టులందు వంశక్రమముగ వచ్చిన 'అద్వైత వాసనపు జిడ్డు' ఈతనిని వదలలేదని తోచుచున్నదని వ్రాశారు.

ఇందుకు బలంగా అన్నమయ్య సంకీర్తనలలోని మాయావాదాన్ని, బల రామావతార ప్రశంసను, నమక చమకాదులతోడి నారసింహ ఆరాధనను మొదటి సంపుటం పీఠికలో విశదీకరించారు. ఆలాగే రెండవ సంపుటంలో కూడా –

'అన్నమయ్యది మధ్యవైష్ణవముగదా! ఎన్నో జన్మలనుండి వెంబడించిన అద్వైత వాసన ఈతనిలో పూర్తిగా మాసినట్లు కానరాదు. ఆ మార్పు పెదతిరుమలాచార్యు లందు స్పష్టముగ కానవచ్చుచున్నది. ఒక్కొక్క పట్టులందు తనకు తెలియకనే అద్వైతభావన ఇతని పాటలో దొరలుచున్నట్లు కానవచ్చుచున్నది' అని సమర్థించారు.

అన్నమయ్య అధ్యాత్మసంకీర్తనలలోని అద్వైత చర్చ శ్రీగౌరిపెద్దివారి కాలంనాటి శ్రీవైష్ణవులను నొప్పించి ఉండవచ్చు. అయినా భల్లూకపు పట్టుగల శ్రీగౌరిపెద్దివారు మూడవసారిగా మూడవ సంపుటంలో 'ఈతనిలో జన్మసిద్ధమైన అద్వైతం వాసన పూర్తిగ నశించలేదని, అక్కడక్కడ మినుకుమినుకుమని గోచరించుచున్నదని **కని గుడ్డును నదె విని చెవుడును నిదె'**లో 'భ్రమసెదరు' అనుభావము (3–185) మాయామయమై మనియెడి జగమిది (3) నడుమ రెంటికిని నా మేను వడఁబడె యెండలి వాఁడనొ నేను (3–342), ఎన్నఁడిక యేది గొలఁది పాటు (3–440) అను పాటలనుదాహరించారు.

శ్రీగౌరిపెద్ది వారు సద్విమర్శకులు కనుక అన్నమయ్య అద్వైతానురక్తిని విశదీకరించినా అన్నమయ్యను 'ఆవేశించిన వైష్ణవాన్ని'కూడా పీఠికలలో తర్కించారు. ఈ వైష్ణవ విశదీకరణలో శ్రీవైష్ణవ దీక్షకు సంబంధించిన పంచసంస్కారాలు, ఆ సంస్కారాలకున్న వేదప్రామాణ్యం, శరణాగతి, ప్రపత్తి మొదలయిన అంశాలను సంకీర్తనల ఉదాహరణాలతో సమన్వయించారు. ఆలాగే అన్నమయ్య వైష్ణవసిద్ధాంత భక్తిని, దాసభక్తిని విశదపరచారు.

శ్రీ గౌరిపెద్దివారు వైష్ణవులకు ప్రత్యేకించి వడగలై వారికి ఆరాధ్యమయిన నారసింహభక్తిని, నవనారసింహుల గురించి ప్రథమసంపుటంలో విశదీకరించారు. అలాగే విజయనగరకాలంలో వ్యాప్తమయిన విరలునిగూర్చి వివరించి 770 మంది చేత పాడించుకొన్నవాడని తెలిపి ఈ రెండుచిట్టాలు చరిత్రకారులు, శ్రీ మద్భాగవత పరిశీలకులు తేల్చవలసియున్నదని (2–40)లో స్పష్టం చేశారు.

ఏది ఏమయినా గౌరిపెద్దివారు సామాజిక దృష్టితో అధ్యాత్మసంకీర్తనల గురించి చెప్పిన అంశాలు చాల తక్కువే అనడం సాహసం కాదు.

శ్రీగౌరిపెద్దివారు అన్నమయ్య శృంగారకీర్తనలకు సంబంధించి అనేకాంశాలు తెలియజేశారు. వాటిలో చాలా ప్రధానమయినది బాహ్యనిర్మాణము శృంగారము గాని అంతర్నిర్మాణము ఆధ్యాత్మికమనడం. ఈ దృష్టితో చూడకపోతే అన్నమయ్యకు అపచారం చేసినట్లే. ఈ అంశాన్ని గౌరిపెద్దివారు

'అన్నమయ్య తన శృంగార సంకీర్తనలన్నీ లోపలి అర్థముతో అధ్యాత్మపరము లుగా వర్ణించినాడని సాహిత్యజ్ఞులమాట (25-9) అన్నారు. ఇందుకు ఉదా హరణగా -

**అంటి నిన్నుఁ బాయలేని దాపె తలనే వేఁగెనా**
**వెంట వెంటఁ దిరుగరా వెలఁదు లెల్లాను**

**తలకొని నీమోము తప్పక చూచి తేను**
**వలవరా యెటువంటి వనితలైనా**
**సెలవుల నే పాటైనా చిరునవ్వు నవ్వితేను**
**మొలకవా పులకలు మోపుల కొలఁదులు (25-282)**

అనే పాటను ఆధ్యాత్మికపరంగా అన్వయించి అన్నమయ్య శృంగారసంకీర్తన లన్నీ పైకి శృంగారతరములైనా లోపల స్వామి అనుగ్రహమునకు పాత్రములగుట అనుభక్తనాయికాధర్మముతో వెల్లివిరియుచున్నవి' అని (25-12) స్పష్టం చేశారు.

### 4.6. అన్నమయ్య సంకీర్తనలలో సాహిత్యాంశాలు :

భారతీయ ఆలంకారికులు కావ్యాత్మగురించి అనేకాంశాలు చెప్పినవారు. ఆ సంప్రదాయాలలో రససంప్రదాయమొకటి. రసము ఏకమా? అనేకమా? రసరాజమేది? అనడంలో అభిప్రాయభేదాలున్నాయి. వాటిలో భక్తి రసమా? కాదా? అనే చర్చ బలీయం.

భగవద్విషయకమయిన రతికూడా ఆనందాశ్రువులు మొదలయిన అను భావాలతో అప్పుడప్పుడు ఏర్పడే ధృతి, చింతాస్మృత్యాది సంచారిభావాలతో తన్మయీ భావపర్యంతమై రసశబ్ద వాచ్యమవుతుందని

మధుసూదనసరస్వతి భక్తి రసాయనంలో నిరూపించాడు గౌరిపెద్దివారు.

'అద్వైతసిద్ధి వ్రాసిన మధుసూదనసరస్వతియే ఈ భక్తి భావాన్ని పెద్దపీఠ మెక్కించి దానికై భక్తిరసాయనమనే గ్రంథమునే రచింపగా, పుట్టుకతో మాత్రమే అద్వైతియైన అన్నమయ్య యీ భక్తిభావనకు తల యొగ్గుటలో వింతయేమున్నది' అని సమర్థించినారు.

శ్రీ గౌరిపెద్దివారి దృష్టిలో అన్నమయ్య భక్తికి శ్రీమద్భాగవత విష్ణుపురాణాల లోని గోపికాభక్తి, ఉత్తరభారతము నుండి ప్రాకిన వల్లభ చైతన్యాదుల భక్తిభావ స్రవంతి, భాగవత సంప్రదాయంలోని వాత్సల్య, అధ్యాత్మ, స్వామిభావాలు, ఆళ్వారుల నాయికాభావన కారణాలు. వీటితోబాటు శృంగారసంకీర్తనలలోని వియోగశృంగారం కీర్తనాంతంలో వియోగాన్ని సహింపక సంయోగాంతం కావడం విశేషమని వారి భావన. మొత్తానికి అన్నమయ్య సాహిత్యమంతా శ్రీవైష్ణవ సిద్ధాంతంపై ఆధారపడినదని గౌరిపెద్దివారి అభిప్రాయం.

అన్నమయ్య సంకీర్తనలరాశి మూదురకాలని చిన్నన్న అన్నమాచార్యచరిత్రలో –

**'యోగమార్గంబున నొకకొన్ని బుధులు**
**రాగిల్ల శృంగార రసరీతిఁగొన్ని**
**వైరాగ్యరచనతో వాసింప కొన్ని'** అని ఉల్లేఖితం.

ఈ వాక్యాలబట్టి అధ్యాత్మసంకీర్తనలు, శృంగారసంకీర్తనలు, యోగకీర్తనలుండేవని కొందరు భావించారు. కాని రాగిరేకులలో 'అ' శ్రీ గుర్తులే కనిపిస్తున్నాయి. ఈ విభాగంవల్ల చదువరి, పాఠకుడు, సంగీతజ్ఞుడు, భక్తుడు భావించేతీరులో తేడాలుండడం తప్పనిసరి. అధ్యాత్మకీర్తనలలో భగవంతుని సౌందర్యం, ఆ స్వామి మహిమలు. ఆ మహిమలను చాటెడి చరిత్రలు. రసత్వం చేకూర్చేరీతిలో శృంగార సంకీర్తనలలో స్త్రీజాతి కరచరణ ముఖనేత్రాదుల ఇసుమంత కదలికలు కూడా అనంతభావ పరిమళ పరంపరలున్నట్లుగా భాష్యం చేయడమే ప్రత్యేకత. గోపికలు కృష్ణుని భావించినట్లే శ్రీ వేంకటేశ్వరుని శ్రీకృష్ణపరబ్రహ్మగా భావించడం అన్నమయ్య శృంగారసంకీర్తనల వైవిధ్యానికి కారణం.

శ్రీ గౌరిపెద్దివారు కొత్తనెంబరుగల 24.25 సంపుటాలలో 'శృంగారరస' చర్చ చేశారు. లోకసాధారణమైన నాయికానాయకుల విషయమున కవులు వర్ణించు శృంగారానికి, అన్నమయ్య

శృంగారవర్ణనకు తేడాలున్నాయని వారి అభిప్రాయం. సామాన్యజనులతో కలిసిపోయే మనస్తత్వం కలవాడు అన్నమయ్య కావడంవల్ల రచనలో స్వాతంత్ర్యభావం, పచ్చిదనం, దుందుడుకుతనం, సొల్లుందనపు మాటలు కనిపిస్తున్నాయని వారి పరిశీలన. అందుకే అన్నమయ్య చేతిలో కొన్ని వేలమంది చెలికత్తెలు, నాయికలు, ప్రతినాయికలు, కొందరు మహానాయికలు ఈ వాఙ్మయంలో తీరినారని వారి సారాంశం. అందుకే గౌరిపెద్దివారు కొత్తనెంబరుగల 24,25 సంపుటాలలో చాల కీర్తనలను వ్యాఖ్యానించినారు. అన్నమయ్య శృంగార సంకీర్తనలలో పలురకాలయిన ఆంగికాలున్నా ఏ పాటలోగాని **నన్నేలెను, నిన్నేలెను, ఆపెను యేలెను లాంటి** అనుగ్రహ పర్యాయములయిన రక్షణాత్మకములయిన శబ్దాలున్నాయి గాని శారీరక సంబంధివాచకములయిన శబ్దాలు సమాగమ సూచకములుగా లేకుండుట చిత్రము' అన్నారు.

శ్రీ గౌరిపెద్దివారు రసచర్చ తరువాత ప్రత్యేకంగా వ్రాసినభాగం గుణాలంకార సరణి. (23వ సంపుటం) ఈ భాగంలో వారు గుర్తించిన అంశాలు –

(అ). తేట తెలుగు పదాలతో దుర్బలంగా కనబడుతున్నా నెమరువేసే కొద్ది భావాలు ఉవ్విళ్ళూరడం.
(ఆ). ఆధ్యాత్మిక సంబంధి శృంగారానికి వాడుకొనే విధానం.
(ఇ). అధ్యాత్మశృంగార కీర్తనలలో ప్రసాదం, శృంగార కీర్తనలలో మాధుర్యం

**ఆలంకారిక శైలి :**

గౌరిపెద్దివారు 'అలంకారాల గురించి' చెప్పిన విశదీకరణం తార్కికం (23–2)

అలంకారములు శబ్దార్థములద్వారా రసస్ఫోరకములు. **అలంక్రియతే అనేన అలంకార:** ఈ శబ్దార్థముల అలంకరించునవి అని అంటే అలంకరింపబడునది వేరొకకటి ఉండవలె కదా! ఈ అలంకార్య వస్తువు ఏది? అని ప్రశ్నించుకొంటే మరలా రసము దగ్గరకే ప్రయాణం. అధ్యాత్మకీర్తనలయందు శాంతరసం, శృంగార సంకీర్తనలయందు నానావిధములైన శృంగార రసము అలంకార్యములే.

అనేక సంకీర్తనలను పరిశీలించిన శ్రీ గౌరిపెద్దివారు

అన్నమయ్య "ఉపయోగించిన రూపక, పరిణామ, అపహ్నవ, స్మరణ, ఉదాత్త, అతిశయోక్తి అలంకారములు ప్రధానముగ ఎక్కడ చూచిన కన్పడునవి. తక్కిన అలంకారములు సాధారణముగ అరుదని చెప్పవచ్చు. అక్కడక్కడ దశావతారములను జోడించు నపుడు మాత్రము శ్లేషకూడ స్థానము కల్పించుకొనుచు వచ్చినదన్నారు శ్రీగౌరిపెద్ది వారు. కొత్త నెం.23వ సంపుటంలో అన్నమయ్య శబ్దాలంకారాల గురించి చర్చించారు.

ఈతని కవిత్వమునందు ఛేకానుప్రాస, వృత్త్యనుప్రాస, పునరుక్తవదాభాస, లాటానుప్రాసములు చాల స్వల్పముగ కన్పడుచుండును. అంత్యానుప్రాసములు పై వానికంటె విరివిగ తోచుచుండును.

**వదన కమలమటువంచి**
**పొదిగొను చూపులఁబొంచి**
**మెదలేటి కళలను మించి**
**అదె నీ పయి ఁజెలి యాసలునించీ (23-308)**

**4.7. తులనాత్మక పరిశీలన - అనుకరణములు :**

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్యచరిత్ర పీఠికలో అన్నమయ్య - ఆళ్వారులకు గల సామ్యాలు, అన్నమయ్య - క్షేత్రయ్య, త్యాగయ్యలకుగల అనుబంధాలు, అన్నమయ్య పదాలను విస్తారంగా వాడుకొనిన ప్రబంధకవుల ప్రయోగాలను విశదీకరించారు. ఆలాగే గౌరిపెద్దివారు 2వ సంపుటంలో అన్నమయ్య - పోతనలో కనిపించే ఏకభావస్వామ్యాన్ని, యథావాక్కుల అన్నమయ్య భావాలు అన్నమాచార్యుల రచనలలోని స్మృతిగా వర్ణింపబడడాన్ని విశదీకరించారు.

అలాగే అన్నమయ్య పదసంపత్తిని అట్టే అనుకరించిన ప్రబంధకవుల ప్రయోగాలను గౌరిపెద్దివారు 5వ సంపుటంలో (44-45) విశదీకరించారు. మచ్చుకు -

కొనవాండ్లైతేను (అన్న. 1-264). ఇది వాఁడి శబ్దబహువచనరూమే

విషమశరుఁడేయు తూపుల వేండ్లకన్న వాండ్లు వాధూల మునిశాపవర్ణ తతులు. పాండరంగమాహాత్మ్యం (5-314)

మొగమున కెగరెడి మొనవాఁడి గుబ్బలు (1-261) అన్నమయ్యలో కనబడితే ఇదే భావం మొగమున కెగయు నీ వలుదవలి చనుగుబ్బలు రామరాజభూషణుని (5-113) కావ్యాలంకార సంగ్రహంలో కనిపిస్తుంది.

ప్రసిద్ధమయిన **ఇన్నిరాసుల యునికి యింతి చెలువపురాశి** (5-143) భావం రామరాజభూషణుని వసుచరిత్రలో **'అళిఘట మీన కేసరి శరాసన గోమకరంబులన్** (5-53)లో కనిపిస్తుంది. ఇలాగే వింత మీనశని వెలఁదుల కన్నుల యెంతగన మౌనొ అనే అన్నమయ్య భావం (3-170) ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యంలో తూలె జగంబు మీనశనిదోషముదాకిలోఁ(3-153)

**వనిత లావణ్యంపు వదన శశికలములు**
**చను గిరులపై నేల జారిపడెనే**
**వెనకఁ దురుమను రాహు వేవేలు రూపులై**
**తనర ముఖచందురుఁడు తలకఁడుగదా॥ 5-348**

ఈ కీర్తన భావం -

**చంద్రభీత ఘనధ్వాంత సంచయమున**
**కభయ మొసఁగి వేణీభరంబను నెపమున**
**తన వెనుక వేసికొన్నది తరుణిమొగము**
**చంద్రుఁగైకొనమి కిదియ సాక్షిగాదె (2-67)**

ప్రభావతీప్రద్యుమ్నంలో కనిపిస్తుంది.

చివర గౌరిపెద్దివారు కొత్తనెం 5వ సంపుటంలోని

**కాలమెల్లా మోసపోవు కానియ్యరా వేకల**
**కాలమెల్లా జరపేవు కానియ్యరా**

**ఎడపుల జవ్వనపుటింతి నొకతెఁగూడి**
**కడలనే తిరిగేవు కానియ్యరా**

**మెడగట్టు కొకతెకు మేలువాఁడవై నీవు**
**కడకు బొంకవు నాతో కానియ్యరా**

**బంగారు మెఱుఁగు చాయపడతి నొకతె గూడి**
**కంగనాదేవు నాతో కానియ్యరా**
**అంగన నొకతె వెనక మరదాఁచుకొని చొ**
**క్కగఁజేసి ముద్దాదేవు కానియ్యరా (5-51)**

ఆలాంటిదే

**అంత సేయకుండితే నేనాఁట దాననా**
**పంతపు నీ బిగువెల్ల బయట వేయింతునా**

**కూరిమిసతుల భీతి గోర నన్ను నంటనీక**
**సారెకుఁ దప్పించుకొంటా సాము సేసేవు**

**యేరా నీకు నింత వెరపిటువంటి నిన్ను నే పో**
**జీరలు మేనెల్లఁ జేసి సిగ్గు విడిపింతువా (5-81)**

దాక్షిణాత్య శృంగారగ్రంథాలకు ధ్వజాలన్నారు.

అంతేకాదు మామూలు ప్రబంధశృంగారముకంటె దాక్షిణాత్యయుగకావ్యము లందు శృంగారము పచ్చిదనము కొనగొమ్మ లెక్కనదని చెప్పక తప్పదు. ఆ పచ్చిదన మున కంతటికి మన అన్నమయ్యయే గురుపీఠమా? యనిపించుచున్నదన్నారు. (24-1)

### 4.8. అన్నమయ్య సంకీర్తనల సంపుటాలలో భాషావిశేషాలు :

శ్రీ గౌరిపెద్దివారు సంస్కృతపండితులయినా ఆంధ్రసాహిత్యంపై గట్టిపట్టు కలవారు. అంతేగాక వారు తమ్ము కడపజిల్లావాసులుగా చెప్పుకొంటారు. వారి జన్మస్థానం వాయల్పాడుతాలూకా తలకోన సమీపగ్రామం అయినా ఒకప్పుడు అది కడపజిల్లాలోనిది కావడం విశేషం. అన్నిట సునిశితంగా పరిశీలించే స్వభావం కలవారు కనుక వారికి భాషాప్రయోగాలపై పట్లకూడ శ్రద్ధ ఎక్కువే. రాళ్లపల్లివారు

గౌరిపెద్దిని ఎంపిక చేయడంలో ఇదికూడ ఒక అంతరార్థం.

అన్నమయ్య సంపుటాలను పరిష్కరించిన శ్రీగౌరిపెద్దివారు 5వ సంపుటంలో

"ఇందలి భాషయంతయు గ్రాంథిక వ్యావహారక పదములతో సంకీర్ణము. వ్యావహారిక పదములన్నియు గ్రాంథిక సన్నిహితరూపములతో అరసున్నలు, బండి ఱాలను విడువక వ్రాతకెక్కినవి. ఇది భాషాశాస్త్రము లో వ్యాకరణశాస్త్రంలో సాధనచేయువారికి తంగేటిజున్ను. గ్రంథముల కెక్కు యోగ్యత కోల్పోయితిమే అని వెనుక కొదిగి కుంగుచున్న వ్యావహారిక పదములకు జళుకుదీర్చి, వాటికి తన పదవాఙ్మయమున వలసినంత విడిది యిచ్చి, అర్థసౌలభ్యముతోబాటు కావ్య భావనాసౌరభము గూడ గల్గించిన మేటి యీతఁడు. ఈ పని అందరును చేయలేరు' అన్నారు.

అన్నమయ్య సాహిత్యం అర్థం చేసుకోవడంలో ప్రధానంగా రెండు ఇబ్బందు లున్నాయి. మొదటిది చాలపదాలు నేడు వాడుకలో లేకపోవడం. రెండవది పదప్రయోగం విలక్షణరీతిలో కనిపించడం. ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకొని శ్రీ రాళ్లపల్లివారు సంపుటాల చివర కొంత వివరణ ఇచ్చారు. గౌరిపెద్దివారు ఈ పద్ధతిని విస్తృతపరచారు.

1. ఆయా సంపుటాలలో వ్యాకరణాంశాలకు ప్రాధాన్యమివ్వడం. 19వ సంపుటంలో అనుస్వారచర్చ 21వ సంపుటంలో సమాసచర్చ, 22వ సంపుటంలో కృత్తద్ధిత నామధాతువుల చర్చ, 5వ సంపుటంలో సంధులు, సమాసములు, సామెతలు, జాతీయము చర్చ.

శ్రీగౌరిపెద్దివారు 19వ సంపుటంలో అనుస్వారచర్చ చేస్తూ సంస్కృతంలోనే సంయమి, హరిం వందేలలో తేడాలున్నాయన్నారు. వర్గపంచమాక్షరవిధానం గట్టిగా పాటించని తెలుగులోనే ఈ అనుస్వారచర్చ ప్రధానమయిందని చెప్పారు. పైగా సిద్ధ, సాధ్య, ఖండ అఖండ భేదాలతో ఉండడం వినోదకరమన్నారు. మూలపదా లలో అనునాసికాక్షరాలు లేకపోయినా తద్భవాలలో ఉండడం, మూలంలో అనునాసికాక్షరాలున్నా తెలుగులో లేకపోవడం చిత్రమని విపులంగా చర్చించారు. స్త్రీ – ఇంతి; కక్ష – చంక.

అన్నమయ్యలో ఈ అరసున్న రాగిరేకులలో చిత్రంగా కనబడడాన్ని శ్రీ గౌరిపెద్దిగారు కూలంకషంగా చర్చించారు. ఏటికి అరసున్నలేదు. రేకులలో ఏఁటికి – అంట, ఎసఁగులలో అరసున్న లేకుండుట

చిత్రం. ఆలాగే 22వ సంపుటంలో పూర్వకవి ప్రయోగాలలో కనిపించని ఆడి, ఈఁడు, అరిలాంటివాటిని చర్చించారు. ఆలాగే 5వ సంపుటంలో నకారపు పొల్లే అన్నమయ్య మతంలో ద్రుతమని నిర్ధారించి 'పోవుఁద్రోవ'ను సమర్థించారు. 21వ సంపుటంలో తెలుగులో కూడా అవ్యయీభావ సమాసాలున్నాయని తెలిపారు. ఆలాగే ఏకాదేశాన్వయ విశేషాలు సోదాహరణంగా చర్చించారు.

2. పీఠికలలోనే ఇతరాంశాలతోపాటు శబ్ద- అర్థ - వ్యాకరణ చర్చ చేయడం.

ఈ విధానం 1వ సంపుటంలో 2వ సంపుటంలోనూ కనిపిస్తాయి.

3. ప్రాచీనుల మార్గంలోనే పీఠికకు అనుబంధంగానో, సంపుటం చివరో సందిగ్ధ పదసమీక్ష చేయడం. ఈ శీర్షిక క్రింద గౌరిపెద్ది వారు విశదీకరించిన శబ్దాలు (చూ.అనుబంధం -1)

4. శ్రీ గౌరిపెద్దివారు ఆయా సంపుటాలలో పాదదీపికలలో అన్నమాచార్యుల విశిష్ట పదప్రయోగాలను సంధివిశేషాలు, ఉచ్చారణావిధానంలోని తేడాను, సమాస కల్పనలోని వైచిత్రిని, మారిపోయిన పారిభాషిక పదజాలాన్ని ఇచ్చారు. ఈ విధానం లోగడ ప్రచురించిన 18, 19, 20, 21, 22, 23, 24, 25 లకంటె 5, 1,2,3,4 లలో అత్యధికం. ఈ పదాలన్నీ ఏరి వింగడించి పరిశీలించవలసిన అవసరముంది.

**గౌరిపెద్దివారి సూచనలు :**

అన్నమయ్య సంకీర్తనల సంపుటాలను పరిష్కరించడంలో విశేషపరిశ్రమ చేసిన శ్రీగౌరిపెద్దివారు సుదీర్ఘకాలం సాగిన తాళ్లపాకసాహిత్యప్రచురణపట్ల ఆయా సంపుటాలలో కొన్ని సూచనలు చేశారు. ఇవి తి.తి.దే.వారు, పాఠకులు, పరిశోధన చేసేవారు గుర్తించవలసిన అంశాలు.

1. అన్నమయ్య నారసింహమంత్రోపాసకుడు. అన్నమయ్య కుమారులు, మనుమలు తండ్రి, తాతల బాటలో నడచినవారు. అన్నమయ్య అహోబలంలో విద్యలు నేర్చినవారు. అహోబలేశుని కీర్తించినవాడు. వారు సూచించిన విధానం.

| | |
|---|---|
| అన్నమాచార్య అధ్యాత్మకీర్తనల సంపుటాలు | 4 |
| శృంగార కీర్తనలు | 20 |
| పెద్దతిరుమలయ్య అధ్యాత్మకీర్తనలు | 1 |

| | |
|---|---|
| శృంగార కీర్తనలు | 1 |
| చినతిరుమలాచార్యుల అధ్యాత్మ శృంగార కీర్తనలు | 1 |
| తాళ్లపాక కవుల లఘుకృతుల సంపుటం | 1 |
| చిన్నన్న రచించిన ద్విపద కావ్యములు | 3 |
| అన్నమాచార్య చరిత్రతో | 4 |
| వెరసి | 32 |

'తాళ్లపాక కవుల వాఙ్మయ నారసింహము' (3-27)అని నామకరణము సూచించారు.

2. శృంగారదృష్టితోనైన వేంకటేశ్వర నామాంకిత కీర్తన సాగించి కృతార్థులగుదురు గాక! యని గుడజిహ్వికా న్యాయముతో శృంగార కీర్తనల రాశిని పెంచినట్లున్నది. మనబోటివారీ స్థాయి నందుకొనకలేక పోయినను హాస్యము చేయకున్న చాలును. మన మీ బడిలో మొదటి తరగతిలో చేరుట కింకా ఎన్నో జన్మలెత్తవలసి యున్నది (5-24)

3. చారిత్రకాంశములతో, భక్తిభావముతో, భాషావిశేషములతో, లోకోక్తులతో కూడిన వాఙ్మయము సారస్వతపట్టభద్రులు కాదదచినవారికి ఎంతైనను సాము గరిడీ కావచ్చును. దీనికి నాందిగా మన వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వారు దీనిని పాఠ్యభాగముగా తీర్మానించినారేమో యని తోచుచున్నది. కాలమీ విషయమును తేల్చవలసి యున్నది (5-60)

4. పరిష్కరణ విషయంలోకూడా గౌరిపెద్దివారి సూచనలు పాటింపదగినవి.

   గ్రాంథిక వ్యావహారికభాషల పాలునీరువలె కలసిసాగిన ఈ వాఙ్మయములో మనము వ్యాకరింపకుండుట మంచిదేమో (1-5)

5. ఒక పెద్దవారు నిశ్చయించిన దానిని హేత్వాభాసముతో తారుమారు చేయుట మంచి సంప్రదాయము కాదు (1-15)

6. తాళ్లపాక వాఙ్మయసాగరమున కొంతకాలము మునిగి తేలినవారికి వ్యుత్పన్నునికిగాని దీనిలోతు తెలియుట కష్టము. మామూలు వాఙ్మయమును చూచిన దృష్టితోగాక దీనిని విశేష దృష్టితో గమనింపవలసిన అవసరమెంతైన గలదు (1-10)

**వినమ్రతా కృతజ్ఞతాంజలి :**

శ్రీగౌరిపెద్దివారు చిరకాలం తి.తి.దేతో అనుబంధం కలవారు. ఆ కారణం వల్ల తాము పరిష్కరించిన అన్ని సంపుటాల చివర తి.తి.దే.ఛైర్మన్లైన శ్రీ చెలికాని అన్నారావు, శ్రీ ఎన్. రమేశన్, శ్రీ శ్రావణకుమార్, శ్రీ సత్యనారాయణరాజు, శ్రీ బి.ఎన్. రెడ్డిగార్లను స్మరించారు. ఆలాగే అప్పటి కార్యనిర్వహణాధికారులయిన శ్రీ పి.యస్. రాజగోపాలరాజు, శ్రీ పి.వి.కె.ఆర్. ప్రసాద్, శ్రీ ఎన్. లక్ష్మీనారాయణ లను గుర్తుకు తెచ్చుకొన్నారు. ఆలాగే తి.తి.దే. ముద్రాక్షరశాల అధిపతులు శ్రీవిజయకుమారరెడ్డిగారిని, సప్తగిరి సంపాదకులయిన శ్రీ కె. సుబ్బారావు గారికి వందనాలు చెప్పడమే కాకుండా తనకు కొంతవరకు వ్రాయసకులుగా పనిచేసిన శ్రీ రామచంద్రరాజుగారిని ఆశీర్వదించారు. తదనంతరం 21వ సంపుటం నుండి తుదిదాకా తనకు వ్రాయసుకులుగా వ్యవహరించిన శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారిని 'కనుచూపుల వెంట కార్యమునడపే విధేయునిగా, శ్రద్ధాసక్తులకు వెలితిలేకుండా వినయసంపదతో అన్ని విధాలయిన పనుల తోడ్పాటు వారిగా పరిష్కరణలో కుడిచేయిగా పనిచేయువారిగా సంభావించినారు.

రాగిరేకులను పరిష్కరించి ముద్రించడంలో తి.తి.దే తీసుకున్న చొరవ సామాన్యమయింది కాదు. పరిష్కరణలో ఏ లోపము వచ్చిన తి.తి.దే సంస్థకు కలిగే నష్టం పూడ్చుకోరాంది. సమర్థనీయం కానిది. అందుకే గౌరిపెద్దివారు త్రికరణశుద్ధిగ ఈ కార్యం నిర్వహిస్తూ ప్రతి సంపుటం చివర తన వినయాన్ని ప్రకటించుకొన్నారు. మచ్చుకు –

**"ఎంతమెలకువనైనను తారుమారు చేయగల ముద్రణ**
**దోషములను సహృదయులు మన్నించి తెలిపిన ముందు**
**జాగ్రత్త పడగలను" (18 పీఠిక –12)**

అని ముద్రణాదోషములను మాత్రమ తెలియజేసిన శ్రీశర్మగారు

**'నామతిమితికి తగినంతగ జరిగిన ఈ పరిష్కరణమునందు దోషములను గమనించిన సహృదయులు పెద్ద మనసుతో తెల్పినచో పైపై పరిష్కరణములందు జాగ్రత్తపడగలనని మనవి** (20 పీ.26)

అని పరిష్కరణాంశంలో కూడా తన వినతి ప్రకటించుకొన్నారు.

**పెద్దల పరిష్కరణములను మరలా పరిష్కరించుటలో నా వలన ఏర్పడిన గుణదోషములన మరలా పుస్తకములు చదివిన సహృదయులు ఎత్తిచూపిన, విధేయతలో స్వీకరించి పైపై పరిష్కరణములలో జాగ్రత్త వహించగలను –** (3వ . పీఠిక 60).

చదివెడి సహృదయులకు ఇందులో ఏవైన సందేహములు తోచిన, సోదర భావముతో నన్ను తీర్దిదిద్దగలరని వారిని పున: పున: ప్రార్థించుచున్నాను. (5వ సం. పీఠిక 61).

శ్రీగౌరిపెద్దివారి అన్నమాచార్య సంకీర్తనల పరిష్కరణ ఎంత నిర్మాణాత్మకమో ఎంత పరిశ్రమోపేతమో అనడానికి ఈ పరిశీలన ఒక నివాళి.




**గత సంవత్సరం శతజయంత్యుత్సవాలు సందర్భంగా విశేష సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ వీరబ్రహ్మంగారు ఐ.ఏ.ఎస్., జె.ఈ.ఓ., టి.టి.డి., తిరుపతి.**

# అనుబంధం

## సందిగ్ధ పద అకారాది సూచిక


| కీర్తన | పుట | కీర్తన | పుట |
|---|---|---|---|
| అందుకాచేవు | 36 | ఇదుపు | 39 |
| అందగారి మాటలు | 36 | ఈటు | 39 |
| అగ్నీకరణ | 36 | ఈటుమీరు | 39 |
| అచ్చురాన | 36 | ఉంగిటి | 40 |
| అడ్డికపుదాననా | 36 | ఉంగిటిగా | 40 |
| అద్దలించు | 36 | ఉంచాన | 40 |
| అప్పటి, అప్పటిని | 36 | ఉంటవింట | 40 |
| అప్పణ | 37 | ఉంబళి | 40 |
| అప్పన | 37 | ఉడిబడివారు | 40 |
| అప్పనము | 37 | ఉద్దండీడు | 40 |
| అయకట్టేవు | 37 | ఉబ్బరికాడు | 41 |
| అయిటిగాలి | 37 | ఉమురుకూటములు | 41 |
| అయిరాణి | 37 | ఊరఁగూటము | 41 |
| అరవీసము | 37 | ఊసివాసులు | 41 |
| అవుఁదున | 38 | ఎంచీనా తలగీనా మానీనా | 41 |
| అస్సారము | 38 | ఎకసక్కేలు | 42 |
| అసోదము | 38 | ఎచ్చరవయ్య | 42 |
| ఆఁడుబోఁడి | 38 | ఎడగొల్లకత్తె | 42 |
| ఆడనుంటే | 39 | ఎడ్డ | 42 |
| ఆయిటిగాలి | 39 | ఎత్తలగొండలు | 42 |
| ఆలజాలము | 39 | ఎదుగా | 42 |
| ఆసోదకాడు | 39 | ఎదురాకలు | 43 |

| | |
|---|---|
| ఏటలు | 43 |
| ఏతులు | 43 |
| ఏటిఁకి | 43 |
| ఏతువులు | 43 |
| ఏమిరే | 43 |
| ఏలాటాలు | 43 |
| ఒలఁగె | 43 |
| ఒలవేయు | 43 |
| ఒలినిలయా | 44 |
| కంకిగా | 44 |
| కగ్గక | 44 |
| కడమదొడమలు | 44 |
| కప్రపుఁబడివారము | 44 |
| కమ్మటి | 44 |
| కరికుంభజఘనపుగజరాజలక్ష్మిని | 44 |
| కలగంప | 44 |
| కలికితనాలు | 44 |
| కలితే | 45 |
| కలుపడఁజేసితి | 45 |
| కల్లమాడదొడ్డము | 45 |
| కాకరి | 45 |
| కాకరివిద్యలు | 45 |
| కాకిజున్ను | 45 |
| కాయకము | 47 |
| కాయటుది | 47 |
| కాలానుభాగి | 48 |
| కిచ్చు | 48 |
| కిమ్ములన్ | 48 |
| కిసుకాటము | 48 |
| కుట్టిచాతని వారికి | 48 |
| కులిగి | 49 |
| కుసిగుంపు | 49 |
| కెదటుచు | 49 |
| కొండలమొయిలు మేసినట్లు | 49 |
| కొండవేలు | 49 |
| కొండించేరు | 49 |
| కొనపరిదాన | 49 |
| కొనరంటలు | 49 |
| కొమరాక మానిపండు | 50 |
| కోఁడికోఁడిచూపులు | 50 |
| కోడతిరునాళ్లు | 50 |
| కోలగాచి పందెమాడుట | 50 |
| కోలుముందుగ | 50 |
| గజరు | 50 |
| గడిచీటి | 50 |
| గడ్డెము | 51 |
| గరబులు | 51 |
| గరివడు | 51 |
| గరిసించు | 51 |
| గామిడి | 51 |

| | |
|---|---|
| గుచ్ఛులు | 51 |
| గుద్దిరాన | 51 |
| గుమితము | 52 |
| గురుమ | 52 |
| గొదిలేను | 52 |
| గొరబు | 52 |
| గొల్లముంజులు | 52 |
| గోటారించి | 52 |
| గోదిలివిరహోన | 52 |
| గోనాలగొందులు | 52 |
| గోవాళుండు | 53 |
| గోసమాణే | 53 |
| గోసమాణే | 53 |
| చండిపారనోపను | 53 |
| చదురాండులు | 53 |
| చదురాలు | 53 |
| చప్పుచాడు | 53 |
| చలిమి బలిమి | 54 |
| చల్లజంపు | 54 |
| చల్లదుబ్బెడు | 54 |
| చింక | 54 |
| చింద్రికె | 54 |
| చిక్కుజీరు | 54 |
| చిట్లు | 54 |
| చిత్తరువాతపటము | 54 |
| చిలుగువాడిచూపులు | 54 |
| చిలుపాలు | 54 |
| చీరుమారుగా | 55 |
| చూపరి | 56 |
| చెలప చెమటలు | 56 |
| చేతలాడి | 56 |
| చేపట్టుగుంచమవు | 56 |
| చేముంచి | 55 |
| చేలాగు | 55 |
| చేసేటి బత్తి | 55 |
| చౌరు | 55 |
| జంగిలి | 55 |
| జరయు | 56 |
| జాజర | 56 |
| జాజరకాడు | 57 |
| జాతులు | 57 |
| జామట | 57 |
| జాముట | 57 |
| జుంటీగ | 57 |
| తండుముండుపడేవారే | 58 |
| తగులువిరితనాన | 58 |
| తడిసూళ్లు | 58 |
| తలపిడి కొలుపిడి | 58 |
| తలపోసేవు | 59 |
| తాదుపడు | 59 |

| | |
|---|---|
| తావళించి | 59 |
| తిట్టవెట్టి | 59 |
| తిరువాముడిమంటపము | 60 |
| తిరువు మొరువు | 60 |
| తీసిపెట్టుగానితమిన్ | 60 |
| తూకొని | 60 |
| తెమ్మ | 60 |
| తొక్కుమెట్టు చెమటలు | 60 |
| తొట్టుదీరిచేవు | 60 |
| తోతోయ | 60 |
| దంగుడు | 60 |
| దదత | 61 |
| దాయిదండ | 61 |
| దార్ష్టీకము | 61 |
| దిచ్చురి | 61 |
| దుస్సేవే | 61 |
| దూరై | 62 |
| దేవుళ్లనడుమ | 62 |
| దోమట | 62 |
| దోమటి | 62 |
| దోయడు | 62 |
| నాఁగువాణే పొందులు | 62 |
| నాటకీడు | 62 |
| నానుడిమాట | 62 |
| నాపపంట | 63 |
| నాపాటిదేవులవా | 63 |
| నిజపట్టేవు | 63 |
| నిట్టి పిడిమేనిదాని | 63 |
| నిరుమోహి | 63 |
| నెంజెరివి | 63 |
| పంకించు | 63 |
| పంగించు | 64 |
| పంతమిచ్చు | 64 |
| పగిడివెట్టినవ్వితే | 64 |
| పడితళించు | 64 |
| పన్నారుకాఁగులలో | 64 |
| పయ్యాడించి | 64 |
| పరభావము | 64 |
| పరిణాము | 64 |
| పళి | 64 |
| పాఁగిన | 64 |
| పాటముగొమ్మవలే | 65 |
| పాదాలెచిగురుగాని | 65 |
| భావమెల్లానిండుజేగ | 65 |
| పానిపట్టి | 65 |
| పారితేగా | 65 |
| పాలార్చు | 65 |
| పాలుదీసును | 65 |
| పుణుఁగుపువ్వు గట్టినటులు | 65 |
| పుక్కట | 65 |

| | |
|---|---|
| పురువేదనలు | 65 |
| పులుcగాలు | 65 |
| పూసగొండి | 66 |
| పూసాటి | 66 |
| పూసుగోడై | 66 |
| పెంటల పూజలు | 66 |
| పేనిపట్టుక | 66 |
| పేరడి | 66 |
| పేరువళి | 66 |
| పైcబిల్లగొట్లాడుచున్నాడు | 66 |
| పొట్టcబొరుగు | 66 |
| పొడిబడి | 67 |
| పొదవు | 67 |
| పొలమేర | 67 |
| బగివాయకాపెమీcది పరాకుననున్నవేళ | 67 |
| బలువురాలు | 67 |
| బాయట, బాయిట | 67 |
| బాలులు, బాలులాల | 67 |
| బాసటము | 67 |
| బుగంధించు | 67 |
| బుద్బుజములు | 68 |
| బెంగ | 68 |
| బెట్టిమాటలు | 68 |
| బేంట్లు | 68 |
| బేడలు | 68 |
| బ్రహ్మమనుకోనీరము | 68 |
| మక్కువ నేర్చితిcగా మంకునేరనైతి | 69 |
| మనిమని | 69 |
| మలఘుని నిన్న పెరుమాళ్లు | 69 |
| మాటమాట | 70 |
| మానాపతులము | 70 |
| ముక్కుదాయిటిరేగె | 70 |
| మునిపితే | 70 |
| ముమ్మదము | 70 |
| ముమ్మదము | 70 |
| ముయి | 70 |
| మెనకులు | 71 |
| మెరవణివి | 71 |
| మేకతాకులు | 71 |
| మేసులన్ | 71 |
| మొగదారికి | 71 |
| మొత్తగాడు | 71 |
| మొరయన్ | 71 |
| మోమోము | 71 |
| యద్భావం తద్భవతి | 72 |
| యతిస్థానంలో చర్చ | 72 |
| రండు | 72 |
| రళిత | 72 |
| రాcగిన | 73 |

| | |
|---|---|
| రాఁపు | 73 |
| రాచాజ్ఞ | 73 |
| రాతిట | 73 |
| రావాడి | 73 |
| లాగవేగాలు | 73 |
| లేవె | 74 |
| వట్టఁగట్టా | 74 |
| వరుసపద్యము | 74 |
| వలపక్షలు | 74 |
| వాఁకపువలపులు | 74 |
| వాండ్లు | 74 |
| వాగపు | 74 |
| వాగము | 74 |
| వాతరొట్లు | 75 |
| వానగుంటలు | 75 |
| వారకాన | 75 |
| వారపట్ట | 75 |
| విటుకులాడి | 75 |
| విణ్ణావఁజివారు | 75 |
| విత్తరాలు | 75 |
| వినయపువిత్తరాలు | 75 |
| విసుపేటికి | 75 |
| వెఱఁజరో | 75 |
| వెలకా | 76 |
| వెలకావేగునిందాక | 76 |
| వెలుమజోలి | 76 |
| వేయిటిపై జవ్వాదికొమ్ము | 76 |
| వొందిలి | 76 |
| వొరట్లు | 76 |
| శాఖా | 76 |
| శాలామాలము | 76 |
| సంతపాకలంజ | 76 |
| సంతము | 77 |
| సంతమొట | 77 |
| సందడించేరు | 77 |
| సందుసుడిన్ | 77 |
| సటకారితనము | 77 |
| సహజి | 77 |
| సద్దాత్ము | 78 |
| సాగబ్రహ్మమయాఖ్యుని | 78 |
| సాసముఖా | 78 |
| సుమాళము | 78 |
| సుసరాన | 79 |
| సూసరము | 79 |
| సెగ్గెము | 79 |
| సెరబడివారము | 79 |
| సొలతు | 79 |
| సోలిగాను తప్పకచూచుట | 79 |
| స్వరూపదీక్ష | 80 |
| హాసమీచీన | 80 |

# సందిగ్ధ పద సూచిక

**అందుకాచేవు : (సం.18) పాట 150** – అందు = Goning near అని కిట్టల్. 'అంద్రై' అని తమిళము. 'అండ' అని తెలుగు. కాచుధాతు – సాహచర్యముతో అందు శబ్దము, దగ్గరగ తిరిగి రహస్యమును గుర్తించు అనునర్థమున మాండలికముగ ప్రసిద్ధము. కిట్టలిచ్చిన యర్థమున కిది కొంత విశేషార్థము కావచ్చు.

**అందగారి మాటలు : (సం.13) పాట 82** – 'అందఁగాడు' అనుటకు కన్నడమున 'అందగార' అని రూపము. ఇది దాని – ఔపవిభక్తికము కాగలుద. తెలుగువారికి కర్ణాటక సామ్రాజ్యముతోడి పొత్తు గలిగిన ఫలముగ వచ్చిన అనేక శబ్దము లతో ఇది యొకటి.

**అగ్నీకరణ (సం.1): పాట –281**

ఈ పదము అనన్వితముగా ఉన్నదని కాబోలు పూర్వముద్రణమునందు 'అగ్నౌకరణ'గా సవరింపబడియున్నది. అన్ని హోమములను 'అగ్నౌకరణ' మనుట లేదు. శ్రాద్ధమునందు పితృదేవతాతృప్తికై చేయు హోమము మాత్రమే అగ్నౌకరణము. అది వైదికపరిభాష. దానిలో తప్పొప్పులచర్చ మనది గాదు. 'అగ్నీకరణ' అన్న రేకుపాఠమునకు నాకు తోచిన అర్థమును ఈ పాటపాద దీపికలో చూపియున్నాను. (భస్మీకరణములాంటిదని వివరణ)

**అచ్చులాన : (సం.14) పాట 599** – వదలక, దాఁచక అని అర్థము. 'అచ్చుల' శబ్ద భవము. 'స్ఖలితం ఛలమ్' అని అమరము.

**అడ్డికపు దానవా : (సం.14) పాట 572** – ఎల్లపుడు సమీపము నందుండు పరిచారికయా? అని యిక్కడ తోఁచెడిని వివరము తెలియలేదు.

**అద్దలించు : (సం.16) పాట 570**

అదలించునకు వింతయగు రూపాంతరము. ప్రాసస్థానమగుటచే సవరణలకు లోగదు.

**అప్పటి, అప్పటిని : (సం.5) (106)**

అప్పుడు శబ్ద మౌపవిభక్తికము. ఇతర వాఙ్మయమునందు అప్పటికి ఇత్యాది విభక్తి ప్రతిరూపకావ్యయములే కానవచ్చుచున్నవి. ఈ వాఙ్మయమున మాత్రము ఇది క్రియావిశేషణముగ

నుపయోగించుట వింత. 'విడిచిన నెప్పటి చని" హరి – పూ.భా. 5–243 అను ఎఱ్ఱన హరివంశ ప్రయోగమొక్కటి మాత్రము దీని కీడుగా నాకు తోచుచున్నది.

**అప్పణ : (సం.13) పాట 202** – ఆజ్ఞ అని యర్థము. కన్నడము 'అప్పణె'. అర్పణ శబ్దభవము. 'ఆజ్ఞాపన' శబ్ధభవమని కిట్టల్.

**అప్పన : (సం.5) (7–1–1)**

ఇది అర్పణశబ్దభవము. మన తెనుగున అందరు వాడెడి 'అప్పన' గాదిది. ఆజ్ఞ అను నర్థమున ప్రయోగింపబడుచున్నది. అప్పణె = ఆజ్ఞ అని కిట్టల్.

**అప్పనము : (సం.18) పాట 16** – అప్పసము = నిచ్చలు. సతతము అని శ.ర. సూ.ని. కానీ ఇక్కడ. ఎప్పుడూ కావలిగనుంచుట అనునర్థముగ తోచుచున్నది.

**అయకట్టేవు : (సం.18)** పాట 324 వ పాట ఆయకట్టు = ధనము వచ్చు బడియొక్క నిర్ణయము అని శ.ర. ఆయకట్టు = 1. రాబడియొక్క నిర్ణయము, 2. చెఱువు మొదలగు వానిక్రింద సేద్యమగు భూమియొక్క పరిమితి అని సూ.ని. ఇక్కడ సాగుచేసి పండించు అను నర్థము సరిపోవునట్లున్నది.

**అయిరాణి : (సం.5) పాట 189–2–1**

ఇది 'అయిరేని' అని మన ఇతర తెనుగు వాఙ్మయమునందు గలదు. 'అరివేణి కుండలు' అని లోకవ్యవహారమీనాడును కన్పట్టుచున్నది. కాని 'అయిరాణి' అను ప్రాకృతరూపము శుద్ధముగా పైకీర్తనలో నున్నది. "అయిరాణి, ధుంధుమారి, పరాచి చ శక్రవల్ల భాయామ్" అని షడ్భాషాచంద్రిక – ఝాడాది 318సూ. ఇది ఇంద్రాణీ శబ్దభవముగా తోచుచున్నది. ఈ అయిరేని కుండలతో జరుపు పూజయు శచీపూజయే. వివాహకాలమున సౌమంగల్యసిద్ధికై శచీపూజ ప్రశస్తమై యున్నది. 'సాన్నిధ్యయోగాత్కిల తత్ర శచ్యాః' రఘు – 7–3 అనిన కాళిదాస ప్రయోగము దీనికి సాక్ష్యము.

**అరవీసము : (సం.14) పాట 85** – అర+వశము, అరవసము = సగములోఁగుట. లోఁగీలోఁగ కుందుట అని భావము.

**అవుఁదున : (సం.21) పాట 116** – అరసున్నతోకూడిన యీ పదము తెలుగు నిఘంటువులలో కానరాదు. "అవుడల = అవుడలికె, అవుడలు, అవుడ్ల, అవుడ్లు, అవుణ్డ, అవుణ్డి ఇత్యాదిగా కిట్టెల్.

ఆముదపు చెట్టు అను నర్థములో 'అవుండ్ల' అనుపదమే 'అవుఁదు'గా మన తెగున మారినదేమో ఆనాటి కర్ణాటాంధ్ర భాషల సంబంధముతో మనకిది సంక్రమించినదేమో? 'అవుండ్ల' శబ్దము 'ఆమండ' శబ్ద భవమా? అనిపించుచున్నది.

**"అథై రండె హస్తపర్ణోఽ ప్యలంబక:**
**దువు: పంచాఙ్గులశ్చంచు రామండ స్తరుణోఽ ంబుక:**
**గంధర్వహస్తో రువుకో వాతిఘ్నోవ్యాఘ్రపుచ్ఛక:"–** అని వైజయంతి
గంధర్వహస్తకోమండ ఆమండో వ్యాఘ్రపుచ్ఛక:" ఇతి 'తారపాల:' అని అమరసుధ.

"అమండ: ఆమండ: అనియు కలదు" – అని గురుబాల ప్రబోధిక.

మకారము, వకారమగుట సహజమే. ఇక్కడ 'ఆముదము' కావచ్చు. ఆయిందెము, ఆందెము అనియూ వ్యవహారము నేటికినీ కలదు.

**అస్సారము : (సం.18) పాట 160 –** ఇది నిఘంటు వ్యాకరణములను దాటిన ప్రయోగము. అసార శబ్దమునే అస్సారమని నిస్సార శబ్దార్థములో నిస్సార సాదృశ్యముతో స్వతంత్రించి ప్రయోగించినట్లున్నది. 'ఋషీణాం పునరాద్యానాం వాచమర్థో సుధావతి" అను ధీమాగలవారిలో అన్నమాచార్యులొకరు. ప్రాసస్థలము గావున దుశ్చికిత్స్యము.

**అసోదము : (సం.13) పాట 18 –** ఇది 'ఆస్వాద'శబ్దభవమని పండితులొక్కరు సూచించిరి. 'ఆచోద్య' భవమా? అని మేమనుకొనుచుంటిమి. "రమణీయత" అర్థము కావచ్చును.

**ఆఁడుఁబోఁడి : (సం.19) పాట 517 –** 'ఆఁడుబోఁడిమి'లో సామాసికముగ 'మి'లోపించి యేర్పడిన రూపము కావచ్చు. ఈ పద్ధతి ఈ వాఙ్మయమున అక్కడక్కడ కానవచ్చు చున్నది. చూ: "మఱి యాఁడుఁబోఁడెడ్డెడు మగపోడిమా నేఁడు" 22వ సంపుటము 456 పాట. అక్కడ "దీని యర్థము విచార్యము" అని వ్రాసియుంటిని. పరిశీలింపగా 'ఆఁడువారి పద్ధతి, ఆఁడుఁదనము' అని అర్థముగా తోచుచున్నది.

**ఆడనుంటే : (సం.14) పాట 437 –** అక్కడనుండియే. 'నుంచి, నుంటి, నుండి, నించి, మంటి' – అనికూడ 'ఉండి' వ్యవహారమునఁగలదు.

**ఆయిటిగాలి : (సం.18)పాట 152** – ఆయిటి అనునది 'ఆవర్త' శబ్దభవమైన వ్యావహారిక రూపముగా తోచుచున్నది. సుడిగాలి అని యర్థము. గ్రీష్మర్తువులో వీచే పెనుగాలికి ఆవటిగాలి, ఆవిడిగాలి అనియు వ్యవహారమున్నది.

**అలజాలము (సం.1) : పాటలు– 218,321**

ఈపదము నిఘంటువులలో కానరాలేదు. ఆలజాలంబు = నీరు దండిగా నిండినపుడు, దానిపై మూతిదగ్గర తోకదగ్గర రెండు రెండు పొడవైన వెంట్రుకలు కలిగి సన్నని శరీరముతో (సాలెపురుగువలె) ఈదులాడెడు జలచరమా? అనిపించు చున్నది. ఈ అర్థము పాటలోని ప్రకరణముబట్టి మాత్రమే నిర్ణయింపబడినది. నీటిప్రవాహమునందు కోలాహలముగ తిరుగులాడు ఈ జలజంతువుల ఆటయే కాబోలు నేటికిని, చాలా ఉత్సాహముతో చెలరేగిన కార్యక్రమమును చెప్పునప్పుడు 'ఆలజాలంగా వుంది' అని వ్యవహారములో కలదు.

**ఇడుపు : (సం.14) పాట 255** – ఇడుపు = నడుము అని తమిళము. 'ఇడుపునఁ జేర్చుట = ఎత్తుకొనుట.

**ఈటు : (సం.13) పాట 37** – ఇంత అని కన్నడమందర్థము. (1) వ్యర్థము, (2) శూన్యము అని శ.ర. ఇచ్చిన అర్థము ఇక్కడ అతుకదు. 'ఈడు' అను తమిళ శబ్దమునకు గౌరవము. తృప్తి, బహూమానము – మొదలగు అనేకార్థములు గలవు.

**ఈటు మీరు: (సం.14) పాట 106** – కొలఁది మీరు. కన్నడమున 'ఈటు= ఇంత' అని కలదు.

**ఉంగిటి : (సం.19) పాట 149** – ఉంగిడి ='ఊపిరియాడనిస్థితి' అని వా.ని. ఆ 'ఉఁగిడియే ఉంగిటి' అయి యుండవచ్చు. ఉంగిడికి ఛాయార్థముగా 'మీదమీద' 'యెడతెరపిలేక' ఇత్యాద్యర్థములలో ప్రయోగించినట్లున్నది.

**ఉంగిటిగా : (సం.13) పాట 116** – ఉంగిడి = పశురోగము (నాము) అని శ.ర. ఇక్కడ దాని గౌణార్థముగ బాధ, తొందర – అనువచ్చును.

**ఉంచాన : (సం.13) పాట 207** – 'ఉచ్చ' శబ్దమునకు ఉంచ అను కన్నడ రూపమును కిట్టల్ ఇచ్చినాడు. దీని తెలుగురూపము ఉంచము; ఉంచమున – ఉంచాన, కావచ్చును. హిందీలోని

'ఊంచ్' కూడ నిదే కావచ్చును. పెద్దగా అని అర్థము. 402 పాటలోని 'ఉంచవు' కూడ ఉంచ+అవు కావచ్చును.

**ఉంటవింట : (సం.16) పాట 562** – ఉంటలు, ఉంటలవంటి చిన్నరాళ్లు వేయు విల్లు కావచ్చు. ఈ జాతిదానికి 'ఇంటెలదబ్బ' అని నేటికి వ్యవహారము గలదు.

**ఉంబళి : (సం.2) పాట 310**

> **పంచుకొన్నభాగాలు పంచమహాభూతాలు**
> **పంచేంద్రియములే పరివారాలు**
> **యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి**
> **తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుపనేమున్నది**

ఉంబళి = పన్ను లేక అనుభవించువస్తువు అని శ.ర. అదియే ఇక్కడ సరిపోవుచున్నది 'ఉమ్మడి' శబ్దము, 'పొత్తుల' 'ఒకే సమయమున' ఇత్యాద్యర్థములలో ప్రసిద్ధమగు టచే దీనితో అర్థమున సామ్యము లేదు.

**ఉడి బడి వారు : (సం.22) పాట 121** – ఉడి + బడి + వారు = ఉపద్రవమైన పద్ధతి కలవారు, ఉడి = To burst to crack, to split, to brake ఇత్యాదిగా కిట్టెల్. బడి = పద్ధతి. ఉపద్రవమైన పద్ధతి గలవారు కావచ్చు. తాత్పర్యార్థము దుర్జనులు, అట్టివారిని పాలింపదు అని ప్రకరణార్థము.

**ఉద్దండీఁడు : (సం.16) పాట 2**

ఉద్దడుఁడు, ఉద్దండత, ఉద్దండము ఇత్యాదులు అతిశయ – సాహ – సాద్యర్థములలో కానవచ్చుచున్నవి. ఉద్దండ భావార్థమై మతుబర్థమున 'ఈఁడు' వచ్చుట వింత. తెగువరి అర్థము కావచ్చు.

**ఉబ్బరికాఁడు : (సం.18) పాట 105** – 'ఉబ్బు' ఉబ్బు ధాతు కృదంతరూపము. దానిపై మతుబర్థక రూపము ఉబ్బరి. మరల దానిపై మతుబర్థకకాఁడు వర్ణకము. 'నతద్ధితా త్తద్ధిత:' అను వ్యాకరణ నియమ మేమూల నుండెనో? లేక ఉబ్బు ధాతువునుండి, ఉబ్బరము అనునర్థమున 'ఉబ్బరి' అను కృదంతరూపమేర్పడి, దానిపై మతుబర్థక 'కాఁడు' వచ్చిన రూపమైన కావలెను.

**ఉమురు కూటములు : (సం.14) పాట 448 –** 'ఉమరి, ఉమిరి' = నత్త అని తమిళము. ఇక్కడ నత్తగుల్లల గుంపుకావచ్చును.

**ఊరంగూటము : (సం.23) పాట 44 –** వేర్వేరు ఊర్లవారు ఒక యూరిలో కలియుట, ఊరంగూటమని లాక్షణికముగ వాడినట్లున్నది. పరస్పరము సంబంధము లేని పదార్థములు ఒకచో కలియుటకు ఈ వ్యవహారము ఆనాడుండినదేమో.

**ఊసివాసులు : (సం.14) పాట 377 –** 'పుసి, హుసి' = అబద్ధము అని కన్నడము. అదియే 'ఊసి' యైనచో 'ఊసివాసులు' = అసత్యములైన విలువలు కావచ్చును. 'ఊసివాసము' = ఈర్ష్య అని శ.ర., సూ.ని.యు. దీని కాధారమగపడుట లేదు.

**ఎంచీనా : తలఁగీనా : మానీనా : (సం.2) పాట 168**

**నిజము దెలియనిమా నేరమే కాక**
**భజన నీవు చేపట్టినందుఁ గడమా ॥పల్లవి॥**

**అంచలఁ బరుసము లోహపుఁగాళికల నెల్ల**
**యెంచీనా పసిఁడి గావించుఁగాక**
**నించిన నిన్నా తుమఁ జింతించువారి పాతకాలు**
**మించనిచ్చేవా మేలే మెరయింతుగాక ॥నిజ॥**

**నలువంక రవికిరణాలు మేల గీదని**
**తలఁగీనా యిన్నిటిలోఁ దానేకాక**
**యిల నీ దాసుఁడు జాతి నెవ్వఁడైనా నీ కృపఁ**
**జెలఁగి పావనుఁజేసి చేకొనుఁగాక ॥నిజ॥**

**పూనిన దిక్కులగాలి పొందుగ నీడాడని**
**మానీనా లోకమెల్లా మరయుఁగాక**
**మానక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే –**
**దేనెలవైనా నీ కిరవేకాదా ॥నిజ॥**

ఈ పాట ప్రతిచరణము రెండవపాదమునందు "యెంచీనా, తలcగీనా, మానీనా" ఇత్యాదిగ సవరింపబడినవి. పూర్వముద్రణమునందు "యెంచినా, తలcగినా, మానినా" ఇత్యాదిగా కలదు.ప్రకరణమునుబట్టి చూస్తే నీవు చేపట్టినందుc గడమా అనే పల్లవిలోని దీర్ఘము ప్రశ్నార్థకముగా స్పష్టము. యెంచినా, ఇత్యాదిగా వుంటే 'ఎంచినను' ఇత్యాదిగా అర్థము వచ్చునేకాని ప్రశ్నార్థకము రాదు. 'పరుసము లోహపుc గాళికలనెల్ల యెంచీనా" అన్న స్థలములో లోహపుముక్క లను ఇది పలానా ఇది పలానా జాతికి చెందినది; అని లెక్కపెడుతుందా? అంటే లెక్కపెట్టదు అని అర్థము. తాను సోకిన ముక్కలనన్నిటిని బంగారుగా చేయుటయే దాని పని. ఇట్లనే తక్కినస్థలముల యందుకూడ. ఇక్కడ గూడ హ్రస్వ దీర్ఘములకు ఒకే లిపియుండుటే కారణము.

**ఏకసక్కేలు : (సం.16) పాట 87 –** ఏకసఖ్య శబ్దభవమా? అనిపించును. ఎకసక్కెమునకు బహురూపములిచ్చి, పరిహాసార్థకమని సూ.ని. ఇందు 'ఏగసక్కె' మనియు నున్నది. అర్థములో విశేషము లేదు.

**ఎచ్చరవయ్యా: (సం.13) పాట 37 –** 'ఎచ్చిఱు' అని సూ.ని. మేలుకొను అని యర్థము. 'ఎళ్చరు' 'ఎచ్చరు' అని కన్నడ రూపములు. అర్థమొకటే.

**ఎడగొల్ల కత్తె: (సం.13) పాట 494 –** సందు చూచి కొల్లగొను నాడుది.

**ఎడ్డ: (సం.13) పాట 495 –** ఎడ్డె. కన్నడమున 'హెడ్డ' 'ఎడ్డ' అని రూపములు గలవు. బుద్ధిహీనుడు, మోసగాడు – అని అర్థములు.

**ఎత్తలcగొండలు : (సం.14) పాట 421 –** 'ఎత్తులకొండలు'? = ఎత్తైనకొండలు 'ఎత్తల్' అని ఎక్కడ అను నర్థమున కన్నడపదము గలదు. కాని, 'ఎందు' అనుపద మీవాక్యమందే యున్నది; గనుక పునరుక్తి యగును.

**ఎదుగా : (సం.13) పాట 18 –** ఎక్కువగా అను నర్థమున, రాయలసీమ సామాన్య వ్యవహారములో 'ఎదగా' అను పక్షము కలదు. 'ఎనుగు' ధాతువు రూపమే కావచ్చును.

**ఎదురాcకలు : (సం.14) పాట 584 –** ఎదురుగ అడ్డగించుటలు. విఘ్నములు;

**ఏఁటలు : (సం.16) పాట 81** – ఏఁట = వేట అని, 'ఏట' అను నిర్బంధుకమునకు ప్రధానము వగైరా అర్థమని సూ.ని. దీనియర్థము విచార్యము.

**ఏటిఁకి : (సం.5)** – ఈ వాఙ్మయమునందు తప్ప తక్కిన స్థలముల యందెచ్చటను ఈ పదము సార్ధానుస్వారముగ నగపడదు. ఇది 'ఏమిటి' శబ్దవికారము గనుక మధ్యనున్న మకారము లోపించినప్పుడు తత్స్థానమున అర్ధానుస్వారముండుట న్యాయ్యమే. ఈ పద్ధతి ఈ వాఙ్మయమునందంతటను గానవచ్చుచున్నది. ఇది 'ఏటిదబ్బా' ఇత్యాది వ్యవహారమునందు గూడ గుర్తింపవచ్చును.

**ఏతులు : (సం.16) పాట 30** – ఏచుధాతుభవము కావచ్చు. దంభము అర్థమని సూ.ని. అది కొంత మార్పుతో గొప్పలు అని ఇక్కడ సరిపడవచ్చు.

**ఏతువులు : (సం.18) పాట 563** – హేతుశబ్దభవము కావచ్చును. అర్థమూ అదే. 'ఏతవ లెత్తి, మాటలాడినాడు. అను వ్యవహార మీనాటికిని గలదు. నెపము లెత్తిచూపుట అను విశేషార్థమున పై వ్యవహారము గలదు.

**ఏమిరే : (సం.18) పాట 11** – ప్రార్థనార్థక మధ్యమపురుష ఏకవచన బహువచనములందు వు – రులపై వచ్చు 'చెప్పవే' 'చెప్పరే' వంటి రూపము అవ్యయముపైగూడ చేసినట్టు కానవచ్చుచున్నది. లేక ఏమిరా అను పుంలింగరూపము వలె, ఏమిరే స్త్రీలింగరూపమైన కావచ్చు. ఈ వాఙ్మయములో ఏమిరే అని పుంలింగరూప ప్రయోగములును గలవు. సంబోధక 'ఓరి' కి వ్యావహారికమైన 'ఓరే'లోని శేషభాగమైన కావచ్చు.

**ఏలాటలు : (సం.13) పాట 206** – పరిహాసము అని సూ.ని. 'హేలా' శబ్ద భవము ఏల కావచ్చును.

**ఒలఁగె : (సం.16) పాట 301** – కన్నడ సంబంధముతో వచ్చినది కావచ్చు. మెల్లగ అని అర్థము.

**ఒలవేయు : (సం.13) పాట 28** – 'వలవేయు' శబ్దముయొక్క వ్యవహారరూపము కావచ్చును. లోఁబరుచుకొను' ఆకర్షించు – అని తాత్పర్యము.

**ఒలినిలయా : (సం.19) పాట 414** – ఒలి = 'శబ్దము' అని తమిళము. అదే మన 'ఉలివు' కావచ్చు. ఒలి శబ్దార్థమునకు ఛాయగా (శుతి, వేదము) అని అర్థమైనచో, వేదాధారా అని అర్థము కావచ్చు.

**కంకిగా : (సం.14) పాట 97–** గింజముదిరిన యెన్ను. ఇక్కడ లాక్షణికముగా నిండుఁదనము అని అర్థము.

**కగ్గక : (సం.14) పాట 33 –** 'కగ్గు' = వివర్ణమగు అని సూ.ని. దానిఛాయార్థము – గా 'సంకోచింపక' కావచ్చును.

**కడమదొడమలు : (సం.19) పాట 181 –** ఇది జంటపదముగా తోచుచున్నది. ఈనాటి వ్యవహారములో కానవచ్చుట లేదు. 'మిగిలింది, తగిలింది', 'వచ్చింది, పోయింది' ఇత్యాద్యర్థములలో వాడినట్లు తోచుచున్నది. 'మిగిలినది' అను నర్థమున కడమ శబ్దమీనాటికిని వ్యవహారములో గలదు.

**కప్రపుఁబడివారము : (సం.13) పాట 112 –** నాయకుడిచ్చు కర్పూరమునకు పాలివారు. నాయకుడు ఒప్పందమునకై నాయికకు కర్పూరమిచ్చుట ఈ వాఙ్మయమున పలుచోట్ల గలదు.

**కమ్మటి : (సం.16) పాట 11 –** క్రమ్మర అనుట కీయొపవిభక్తిక రూపమపురూపముగ కానవచ్చుచున్నది.

**కరికుంభజఘనపు గజరాజ లక్ష్మిని : (సం.18) పాట 532 –** జఘనమును (నితంబమును) కరికుంభములతో పోల్చుట వింత. ఒకదశలో సాదృశ్యము సులభమే.

**కలగంప : (సం.18) 13వ పాట.** కలగూరగంపయొక్క మధ్యమపదలోప రూపము గావచ్చు.

**కలికితనాలు : (సం.14) పాట 596 –** కన్నడమున 'కల్' ధాతువు 'నేర్చు' అను నర్థమున నున్నది. దీని తెలుఁగు 'కఱచు'. కన్నడ ధాతుకృదంత భావరూపము 'కలికె', ఇదియే తెలుగున ధర్మివాచకముగ 'కలికి' అయినది. తక్కిన యర్థములు లాక్షణికములు.

**కలితే : (సం.18) పాట 530 –** కలుగు ధాతువునకు వ్యావహారిక రూపమా? లేక కలుగు ధాత్వర్థమున కలుధాతు వొకటియుండెనా? ఈ ధాతు వీ వాఙ్మయమున విస్తారముగ కలదు.

**కలుపడఁజేసితి : (సం.19) పాట 481** ఇది నిఘంటువుల కానరాదు. ప్రకరణమునుబట్టి 'నివ్వెరపడునట్లు,' 'మ్రాన్పడునట్లు' 'కలవరపడునట్లు' చేసితివి ఇత్యాదిగ నూహింప వచ్చు.

**కల్లమాడ దొడ్డముద్ర – (సం.14) పాట 377 –** 'చెల్లనికాసుకు గిఱ్ఱలెక్కువ' అను సామెత వంటిది.

**కాకరి : (సం.13) పాట 98 –** కాక గలది అని అర్థము కావచ్చు. కాని అరసున్న ఇందులేదు. కాకు చేయునది అనియైనను చెప్పనగును.

**కాకరి విద్యలు : (సం.16) పాట 9 –** కాకు = బాధ అని శ.ర, సూ.ని. గ్రౌణ్యము. ఆ యర్థమిందు అంతసంగత మనిపించదు. కాకు +అరి = వంచన. మాయ గలవాడని తోచెడిని.

**కాకి జున్ను: (సం.2) పాట167**

**అనరాదు వినరాదు అతనిమాయలు నేఁడు**
**దినదినకొత్తలాయ ద్రిష్ట మిదే మాకు ॥పల్లవి॥**

**ఆడెడిబాలుల హరి అంగిలి చూపుమని**
**తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి**
**యీడ మాతోఁ జెప్పఁగాను యిందరముఁ గూడిపోయి**
**చూడఁబోతే పంచదారై చోద్యమాయనమ్మా ॥అన॥**

**తీఁటతీగెలు సొమ్మంటా దేహమునిండాఁ గట్టి**
**తీఁటకుఁగాక బాలులు తెగి వాపోఁగా**
**పాటించి యీ సుద్ది విని పారితెంచి చూచితేను**
**కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా ॥అన॥**

**కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తినిపించి**
**వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా**
**అకడ శ్రీవేంకటేశుఁ డాబాలులకంటినీరు**
**జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము ॥అన॥**

ఈ పదము నిఘంటులలో కానరాదు. 'కాకివెండి, కాకి బంగారము, కాకి యెంగిలి, కాకి వెదురు, కాకి చిప్ప ఇత్యాదులు ప్రసిద్ధములుగా నున్నవి. వెండికాని దానిని వెండిగా వ్యవహరించేటప్పుడు కాకివెండి, అట్టులే పైవికూడ. కాని జున్ను కాని దానిని జున్నుగా వ్యవహరించినట్లు ఇక్కడ కావలెను. 'కాకిజున్ను' యేదో అర్థము కాలేదు. పలువురు విద్వాంసుల నడిగియు ప్రయోజనము లేకపోయినది.

1. ఈ పీఠిక సిద్ధమైన వెనుక శ్రీ వి.వి. శేషాచార్యులు (70 సంవత్సరములు) అనంతపురము వారు మా యింటికి వచ్చియుంటిరి. వారిని విచారించగా, వర్షా కాలమున చెట్లవెంబడి బుడగలు బుడగలుగా నురుగుమాదిరిగ జారే వస్తువును, నీళ్ల పారుదలతో పాచిపట్టిన బండల వెంబడి ఆ పాచికి పక్కగా తెల్లగా, ఎఱ్ఱగా, రంగురంగులలో బుడగలుగా తయారయ్యే వస్తువును కాకిజున్ను అని వ్యవహరిస్తుం డగా నా చిన్నతనములో విన్నాను. అది పట్టుకొంటే చేతికి రాదుకూడా. మూతికి రాస్తే జిల్ అని అవుతుంది. దానికి పిల్లలు ఏడుస్తారు అని సెలవిచ్చిరి.

2. తాళ్ళపాకలోనే నివసిస్తున్న జంగా సుబ్బయ్యగారిని (దాదాపు 70 ఏండ్ల వయస్సువారు) ఉత్తరముతో విచారించగా, వారు "కాకి జున్ను అను పదమును గూర్చి మా గ్రామ పరిసరప్రాంతములలో విచారించగా తేలిన సారాంశము : పాలు ఆముదము రంగలించి అందులో ముసాంబరము మాత్రను సాదిన ఉగ్గును పిల్లలకు పెట్టుట అనాదిగా ఆచారము. పిల్లలు పాలు త్రాగుట మాన్పించుటకు ఈ ఉగ్గును పెట్టెదరు. ఈ ఉగ్గును త్రాగునపుడు పిల్లలకు బాధాకరంగా ఉంటుంది. కారణం ఆ ఉగ్గు చేదు పదార్థము. కాకిజున్ను = ముసాంబరము, కలబంద పాలతో ముసాంబరమును తయారు చేయుదురు. కాకిజును – జున్ను (తేనె) కానిది కాకి జున్ను. ఈ పదము ఆయుర్వేద వైద్యశాస్త్రంలో సాంకేతిక పదముగా వాడబడుచున్నది" అని సమాధానమిచ్చిరి. ఈ రెండును కూడ ప్రకరణమునకు అంతగా అతుకునట్లు తోచదు.

అదీగాక పైరెండు చరణములలో దుమ్మే చక్కెరగా, తీఁటదీగెలు సొమ్ములుగా మారినట్లు వర్ణింపబడినవి. ఇక్కడ కాకిజున్నే ముత్యములుగా మారలేదు. కాకిజున్ను తిన్నవారి కన్నీళ్లు ముత్యములుగా మారినవి. చక్కెర అని దుమ్మువేస్తే చక్కెరగా మారింది. సొమ్ములు అని తీఁటతీగెలు వేస్తే సొమ్ములుగా మారినవి. జున్ను కాని కాకిజున్ను తినిపిస్తే, వాండ్లు ఏడిస్తే, వాండ్ల కన్నీళ్లు ముత్యాలుగా అయినాయి. ఇక్కడ ప్రక్రమభంగముకూడ నున్నది. ఈ శబ్దము యొక్క అర్థము ఇంకనూ తెలిసినవారి వలన తెలుసుకోదగియున్నది.

**కాయకము : (సం.2) పాటలు 242, 306**

**మాయమౌఁ గొన్నాళ్లకు మానుషకృత్యములెల్లా**
**మాయముగానివి దైవికమహిమలెల్లా**

**కాయకములే తమ కల్పితము లన్నియును**
**కాయకము గాక నిల్చుఁ గమలాక్షుమన్నన ॥తలఁ॥**

**కాయకము లందరునుఁ గార్యవశపరులే**
**పాయని నీవకారణబంధుఁడవు**
**దాయగాం డ్లెవ్వరినైనాఁ దప్పించుకొనేవారే**
**బాయటనున్నా నీ వాపన్న శరణ్యుఁడవు ॥ఎవ్వ॥**

ఈ పదముకూడ సాక్షాత్తుగ నిఘంటువలందు కానరాదు. ప్రకరణములను బట్టి మాయలు, అశాశ్వతములు అనునర్థమున ప్రయోగించుట్లున్నది.

ప్రత్యహవృద్ధి, రోజువడ్డి (కే.వి) 2. తాకట్టు పెట్టిన ఆవులు మున్నగువాని నుపయోగించుకొని ఆ రూపమునఁ బుచ్చుకొనువడ్డి.

కాయకము = శరీరమునకు సంబంధించినది (పాపాది) అని సూ.ని. ఇచ్చిన అర్థములు ఇందు పొసగదు. 'కాయక' 'కాయిక' 'యకార' 'యికార' ములకు మన అన్నమయ్యలో అంత పట్టింపు లేదు కావున ఈ సూ.ని. చూపితివి.

**కాయాటుది : (సం.18) పాట 184 –** కాయవాటు శరీరము గలది అను వ్యావహారిక ప్రయోగమునకు సంగ్రహరూపముగా కానవచ్చుచున్నది. కాయవాటు శరీరము = గట్టి శరీరమని వ్యవహారమున్నది.

**కాలానుభాగి : (సం.2) పాట 214**

**పతిఁ బెండ్లాడినయాలు పక్కనుండి నిద్రించితే**
**కొత్తదికి కాలానుభాగి గొనవచ్చునా?**
**తతి నేపనికి రాక తామసుఁడై వుండినా**
**గతియై శ్రీ వేంకటేశ కావకుండవచ్చునా.**

కాలానుభాగి = ఆయాసమయములందు అనుభవమునకు భాగమైన దానిని, ఉంపుడుకత్తెను అని తాత్పర్యము కావచ్చు.

**కిచ్చు : (సం.13) పాట 66 –** 'చిచ్చు'నకు కన్నడరూపము 'కిచ్చు'

**కిమ్మలన్ : (సం.16) పాట 220 –** లోలోపలనే అనునర్థమున 'కిమ్మలనే' అని నేటికీ వ్యవహారమున కలదు. మెల్లగ, నిదానముగ, గుట్టుగ కావచ్చును.

**కిసుకాటము (సం.14) పాట 148 –** 'కిసుక' 'కృషి' శబ్దభవము. కిసుకాటము = మోటుతనము.

**కుట్టిచాతనివారికి : (సం.2) పాట 237**

> **పట్టిన ముద్రుంగరపుప్రదాని కెదురులేదు**
> **కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు**
> **నెట్టన శ్రీ వేంకటాద్రినిలయము సేవకులము**
> **గుట్టుతోడ బ్రదికేము గుతి మాకు నతఁడే ॥అతఁ॥**

కుట్టిచాతనివారికి = తక్కువజాతి సాతానివారికి కావచ్చునేమో? లేక కుట్టిసైతాన్ అనుక్షుద్రప్రయోగము చేయువారు కావచ్చు. మొదటి అర్థములో కుట్టిశబ్దము వట్టి విశేషము మాత్రమే 'చాత్తాదె' అదె పదము 'చాతాని' 'సాతాని' అవి వ్యవహారములో నున్నది. అది 'చాతని' అను ధాతుజవిశేషణముగ ప్రయోగించి నట్లు ఊహింపవచ్చును. జాతితో తక్కువవాడునై. వైష్ణవము పుచ్చుకొన్న బిగువుతో అందరియొద్ద జంకుగొంకులేక తిరుగువాడని తాత్పర్యార్థము కావచ్చు. 'కుట్టిసైతాన్' అను క్షుద్రప్రయోగము చేయువాడుకూడ. తానూ పెద్దమంత్రశాస్త్రవేత్తవలె అందరి వద్ద జంకుగొంకులేక తిరుగువాడు అను తాత్పర్యముకూడ సరిపోవుచున్నది. ఈ రెండును పాటలోని ప్రధానభావమునకు సరిపడుటలేదు.

**కులిగి : (సం.16) పాట 103 –** కుర్గు = to shink అని కిట్టల్. ఇక్కడ ఘనీభవించుట కావచ్చును.

**కుసిగుంపు : (సం.14) పాట 333 –** 'కుసిగింపు' అనికూడ వ్యవహారము గలదు.

**కెదటుచు : (సం.22) పాట 2 –** కెదఱు (కన్నడం), to scatter, to expand ఇత్యాదిగా కిట్టెల్. దాని సన్నిహిత రూపము కావచ్చు. వ్యాపించి చెలరేగి ఇత్యాది. ఏటికవతల వున్న వారిని ఇవతల వున్నవారు గిలిగించితే అది అంతదూరము వ్యాపించునా? అని కావచ్చు.

**కొండల మొయిలు మేసినట్లు : (సం.19) పాట 559 –** కొండల మొయిలు మేయుట అను పలుకుబడి యీనాటికిని గలదు. దండిగ మబ్బులు కొండలపై పారాడుచుండినచో, అది చూచి గ్రామీణులు 'కొండ మొగిలి మేస్తావుంది వానకు బలమబ్బా' అంటారు. ఆ యర్థములోనే యీ పలుకుబడి నిచట మాండలికముగ ప్రయోగించి నట్లున్నది.

**కొండవేలు : (సం.21) పాట 156 –** వ్యవసాయదారుడు దున్నీ దోకీ కొటారు చేసి గాదెలు నింపిన తర్వాత కడపట సిద్ధించెడి ఫలముగా ప్రకరణమునుబట్టి తెలియుచున్నది. వ్యవసాయదారుల సాంకేతికపదమా? అనిపించుచున్నది. నిఘంటు లలో కానరాలేదు. కొత్తవంట వచ్చిన వెంటనే, 'కొండవేలుపు'నకు నివేదించే పద్ధతి, వ్యావహారికములో 'కొండవేలు', అయియుండవచ్చు. అట్టిది ఇంకేదైనా కావచ్చు.

**కొండించేరు : (సం.16) పాట 325 –** కొండెము శబ్దమునకు అపురూపమైన ధాతురూపము.

**కొనపరిదాన : (సం.16) పాట 334 –** ఈ శబ్దమపురూపమైనది. అర్థమూ విచార్యమే. ప్రకరణముతో గుణవంతురాలు కావచ్చు.

**కొనరంటలు : (సం.22) పాట 3–** 'కొనలు + అంటలు' అని రెండుపదముల సంధిరూపము. విస్తరికుట్టునపుడు ఒక ఆకునుండి ఇంకొక ఆకుకు విడాకులు తగిలించి ఒకరు కుట్టుదురు. ఆ పూర్తికుట్టుపని మరియొకరు చేయుదురు. అంటలు వేయుట అని, కొనలంటించుట అని దీని వ్యవహారము కలదు. ఆవిడాకు కొన మొదలు కుట్టియుండుటచే కదలకుండును. తరువాత పని సులభము. అట్లనే ప్రకృతము రెండు భావములు తగులుకొని వీడరాకున్నవి అని, భావము కావచ్చు.

**కొమరాకమానిపండు : (సం.22) పాట 521 –** కొమరు +ఆఁక + మాను + పండు. యౌవ్వనము నిలుపుకున్న మానిపండు కావచ్చు.

**కోఁడికోఁడి చూపులు : (సం.13) పాట 128 –** కొనచూపులు, 'కోటి' శబ్దభవమో 'కొండికి' రూపాంతరమో కాగలదు.

**కోడ తిరునాళ్లు : (సం.14) పాట 240 –** 'కోడై = వేసవి' అని తమిళము. కోడతిరునాళ్లు = వసంతోత్సవము కాఁదగును.

**కోలగాచి పందెమాడుట : (సం.18) పాట 401** – ఇదియొక పలుకుబడిగా తోచుచున్నది. జాతీయములన్నీ తాత్పర్యార్థ ప్రధానములు. ఒక హద్దుచేసి దానిని దాటకుండ నియమించుట దీని తాత్పర్యము. ఒక గీతను గాని కఱ్ఱనుగాని హద్దుగా చేసికొని దానిని దాటకుండ (చెడుగుడువలె) ఆడునట్టి క్రీడావిశేషమిందు జాతీయముగ ప్రయోగించినట్లున్నది.

**కోలుముందుగా : (సం.13) పాట 207** – ముందుపడి పుచ్చుకొనుట అనునర్థము కావచ్చును. అహమహమిక.

**గజరు : (సం.13) పాట 410** – 'గదురు'నకు రూపాంతరము కావచ్చును. దుర్గంధమని యర్థము. 'గజరుఁగాంత'లనగా చెంచు, గొల్ల – మొదలగు జాతుల స్త్రీలు కాగలదు.

**గడిచీటి : (సం.1) పాటలు 118, 280**

గడి = సీమ, పొలిమేర, సరిహద్దు ఇత్యాదిగా – సూ.ని. ఈ పదముతో కూడిన సమాసమే 'గడిచీటి'. ఒక హద్దు పూర్తి అయినదని తెలిపెడి చీటి. ఇంచుమించు కావచ్చు. ఈ పాట (280) పల్లవిలో, 'పరుసము సోకిన రాగి మొదలగు నాణెములు వెండిగనో, బంగారుగనో మారి తన పూర్వరూపమును కోల్పోవుచున్నవి. అవి మరల పూర్వరూపము నందుట లేదు. అట్లే వేంకటేశ్వరుని కొలిచినవారు మరల కర్మబంధముల పాలు కావలసిన పనిలేదు.' అని తెలిపినాడు. దాని విస్తృత ప్రతిపాదనమే మొదటి చరణములోని కడపటిపాదమగు "గడిచీటిచ్చియునింకఁ గడమున్నదా' = నీవు పాటింపవలసిన హద్దు పూర్తియైనదని చీటి (Certificate) పొందిన తర్వాత, మిగత విషయములు (ముందు కార్యమునకు సంబంధించి నవి) మరలా ఎందకు?" అని అర్థమగుచున్నది. ఈ పాదము పూర్వముద్రణమున "గడియించి తెచ్చియు నింకఁ గడమున్నదా" అని మారినది. కారణము తెలియదు.

**గడ్డెము : (సం.21) పాట 95; 168** – గడ్డెము See కడ్డాయము అని బ్రౌణ్యము, "Compulsion, force, Exaction, forcing people to pay the price set upon articles. వడ్లగడ్డాయము, ఉప్పుకడ్డాయము..." ఇత్యాదిగా చూపియున్నది. అదే ఇక్కడ సరిపడవచ్చు.

**గరబులు : (సం.22) పాట 90** – గరువు = to draw the whole towards oneself; to take any or seize all సర్వాకర్షణ అని కిట్టెల్. అదియే 'గరబు' కావచ్చు. కౌగిలింతతో సర్వము నాకర్షించుట అని ప్రకరణభావమునకు సరిపోవుచున్నది.

**గరివడు : (సం.13) పాట 211 –** గరవడు = గడ్డకట్టు అని సూ.వి. ఇక్కడ 'గరివడు' నకు గూడ దాని గౌణార్థమైన శుష్కమగు – అనుట తగును.

**గరిసించు : (సం.13) పాట 117 –** గర్జించు శబ్దభవము కావచ్చును. 'కరిసించు' అనిగ్రహించి సూ.ని. 'ఘృణ' ధాతుభవము – ఎదిరించు అను నర్థమిచ్చినది.

**గామిడి : (సం.16) పాట 6 –** గ్రామణీ శబ్దభవము, శ్రేష్ఠుఁడు అర్థమని సూ.ని. గామిడి చేఁతలు ఇత్యాదులందు. పెద్దపనులు. పెద్దరికము గల పనులు అని. సూ.ని. తెల్పిన యర్థము సంగతమైనట్లు కన్పట్టును.

**గుచ్ఛులు : (సం.16) పాట 235 –** గచ్చు = గార ప్రసిద్ధమే. గచ్చులు = దంభములు అని సూ.ని. దాని ఛాయార్థముగ అబద్ధములు కావచ్చును. అబద్ధములు అనునర్థమున ఈ పద మీనాటికీ వ్యవహారములో నున్నది.

**గుద్దిరాన : (సం.16) పాట 381 –** కుద్రగేడితనము అని కన్నడమున వ్యవహారము. Envy అసూయ అని కిట్టల్. క్షుద్రశబ్దభవము కావచ్చు.

**గుమితము : (సం.13) పాట 487 –** 'గుంభిత' శబ్ధభవము కావచ్చును. కన్నడము 'గుమిత'. రహస్యవార్త, ఆడుకోలు (వదంతి) అని అర్థము.

**గురుమ : (సం.19) పాట 449 –** 'కురుమై' Lustre, Brightness, Superiority అని తమిళము. అదియే ఇది కావచ్చు. 'పెద్దరికము, మహిమ' ఇత్యాది అర్థములుండవచ్చు. ఈ పదప్రయోగము మరియొకచోట చూ: 517పాట. 'గరిమ' శబ్దవికారమైన కావచ్చు.

**గొదిలేను : (సం.14) పాట 389 –** 'కొదలు = తడఁబడు' అని కన్నడము. 'సంకోచించు' అను తాత్పర్యార్థమిందుఁగావచ్చును. 'ఇంత కొదుల్తావేమిరా, కొతుకుతావేమిరా' అని వ్యవహారము గలదు.

**గొరబు : (సం.16) పాట 61 –** గోరబు, బొరగు అని కన్నడము A clock made of leaves of gas. అని కిట్టల్. వికార విశేషము. వేషము ఇత్యాది కావచ్చును.

**గొల్లముంజులు : (సం.19) పాట 505 –** ముంజు = 'మెదుక' అని వా.ని. ఆ అర్థమిక్కడ సరిపడనట్లు తోచుచున్నది. ప్రకరణమును బట్టి 'ముంజులు = మచ్చులు' గా తోచుచున్నది. మేకల గొర్రెల పెంటలు

బురదగ తడిపి, దానిని చిన్నపేలికలకు అంటించి, మేకపిల్లలు, గొర్రెపిల్లలు తల్లుల దగ్గర పాలుత్రాగకుండుటకై వాటి రొమ్ములకు చుట్టుచుందురు. వాటినే 'నుచ్చు' లని మాండలికముగ వ్యవహరింతురు. ఆ శబ్దము ఇక్కడ 'అసహ్యము' అను ఛాయార్థమున ప్రయోగించినట్లున్నది.

**గోటారించి : (సం.21) పాటలు 142, 149** – బాధపెట్టు, పైకొను, అను నర్థము లలో, గోడాడించు, శబ్దము వ్యవహారములో నున్నది. ఇదే గోడాడు' శబ్దముగా నిఘంటువులలో నున్నది. ఈ యర్థములోనే 'గోటారించు' శబ్దము 'గోటాడించు' అని కొన్ని ప్రాంతములలో. అదియే ఇది కావచ్చు.

**గోదిలి విరహాన : (సం.18) పాట 112** – 'గోదిలి' గూఢశబ్దభవముగా తోచుచున్నది. అర్థమూ అదే కావచ్చు.

**గోనాల గొందులు : (సం.18) పాట 401** – గొంది = చిన్నసందు అని బ్రౌన్యము. గోనము కోణ శబ్దభవము కావచ్చు. గోనాల గొందులు = మూలలోని సందులు కావచ్చు.

**గోవాళుఁడు : (సం.23) పాట 114** – గోవాళుఁడు = యువకుడు, విటుడు ఇత్యాదిగా తెలుగు నిఘంటువులు. "విటనామధేయమౌ విటకాఁడు, వేడుకకాఁడు, బొజుఁగు, ననుపుకాఁడు, లంజకాఁడనఁగ, నివియుఁగాక గోవాళ్లనఁగా నొక్క శబ్దంబు గలదు బహుత" – ఆం.భా. 2–116. దీనిని ఏకవచనములో వాడుట వింత.

**గోసమాణే : (సం.2) పాట 374**

**డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥పల్లవి॥**

**మీనకూర్మవరాహామృగపతి అవతారా**
**దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక ॥డోలా॥**

**వామన రామ రామ వరకృష్ణ అవతారా**
**శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ ॥డోలా॥**

**దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా**
**శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి నిలయ ॥డోలా॥**

ఈ పాటలోని 'గోసమాణే' అనుపదము 'ఘోషమణే' అనుటకు బదులుగ పడినదా అనిపించుచున్నది. ఇది ఇంకను విచార్యము.

**చండిపారనోపను : (సం.14) పాట 503** – చండిపారు = మూర్ఖత్వమున వర్తించు 'చండివడు' దానివంటిది. తెల్లఁబాఱు, వెలవెలఁబాఱు – మొదలగు వానివలె ఇక్కడను, 'పారు' – అగు, పరిణమించు, వర్తించు అను నర్థము నిచ్చును. 'చండిపోరు' అనుటకు పొరపడిన వ్రాఁతయైనను గావచ్చును.

**చదురాఁడులు: (సం.13) పాట 79** – చతురముగ మాటలాడు స్త్రీలు, వగలాఁడి, కులుకులాఁడి వలె. ఏకవచనాంతముపైన 'ఆఁడి' వచ్చుట విశేషము.

**చదురాలు : (సం.5) పాట 71**

చతురురాలునకు తద్భవముగా తోచుచున్నది.

**చప్పుచాడు : (సం.14) పాట 94** – శప్పుచ్చవఱ్ = నిస్సారము, నిస్సారభూమి, చవటినేల – అని తమిళము. 'చప్పుచాడు' – దాని వికారము కావచ్చును.

**చలిమీ – బలిమీ : (సం.13) పాట 40** – 'చెలిమి' శబ్దమే ఇందు చలిమీ అని వాడబడి యుండును.

**చల్లజంపు : (సం.14) పాట 305, 311** – చల్లగాఁ జంపుటయేమో? తడిగుడ్డతో గొంతు గోయుటవంటిది గాఁబోలు. 'పృష్ఠశీతం ప్రాణనాశమ్' అని కలదుగదా? అరసున్న లేకుండుట వింత.

**చల్లదుబ్బెడు : (సం.14) పాట 89** – చల్లదుత్తనిండ. 'దుబ్బి' కన్నడము. అర్థమిదే

**చాయ సేసుకుండితే : (సం.14) పాట 554** – చాయ = మరుఁగు.

**చింక (112-3-3)** – జింకకు మారురూపముగనో, మూలరూపముగనో ఈ వాఙ్మయమున నిది పలుతావుల గలదు.

**చింద్రికె : (సం.22) పాట 39** – ఇది 'చంద్రిక' యొక్క రూపము వ్యవహారమున 'చెంద్రికె' అయి వ్రాతలో పొరబాటున 'చింద్రికె' అని పడినదేమో. అర్థమూ అదే.

**చిక్కుఁజీరు : (సం.14) పాట 356** – ఇవి జంటపదములు. 'చిక్కుఁ సంకటపెట్టు' 'చీరు = కోపించుట తమిళము. 'చిక్కుజీరు' శబ్దమును అరసున్న లేకుండ సూ.ని. బహుతాత్పర్యార్థములతోఁ జూపినది. 'చప్పుచాడు' వంటిది.

**చిట్లు : (సం.14) పాట 429** – చిట్టి+లు = చిన్నకొల పాత్రలు, గిద్దెలు.

**చిత్తరు వ్రాఁతపటము : (సం.14) పాట 466** – వాతఁ – వ్రాఁత. రేఫ సంయుక్తాక్షరములలో రేఫమే లోపించుట, ప్రాఁత – పాత, క్రొత్త – కొత్త ఇట్లు తెలుఁగు వ్యవహారపరిణామము. కాని 'వ్రాఁత – వాఁత'గా గాక 'రాత'గానే నేఁడు సర్వత్ర వ్యవహారమున నున్నది; 'వాత'కు వేరే అర్థము గులుగుటచే కాబోలు. కాని, 'వాఁత' అని కూడ ఈ రేకుల కాలమున వాడుకలో నుండియుండును.

**చిలుగువాఁడి చూపులు : (సం.16) పాట 82** – 'చిలుగు' 'చిలుకు'కు రూపాంతరమా?

**చిలుపాలు : (సం.16) పాట 77** – చిరుపాలు అని శ.ర. బ్రౌణ్యము. చీణ్పాలి, చీళ్పాలు. శిరుపాలి Lailar milk hedge. అని తమిళము జున్ను అని తెలుగు? గిణ్ణు, గిణ్ణ, గెణ్ణు అని కన్నడము. 'బాగా మీఁగడ గట్టునట్లి – గరఁగాచినపాలు' అనవచ్చు.

**చీరుమూరుగా : (సం.18) పాట 31వ పాట**. చీఱుమాఱు = Confusion, తాఱుమాఱు, Ill' treatment అని తమిళము. ఇక్కడ దాని ఛాయార్థముగ అడ్డమాకలు లేక ఇత్యాది కావచ్చు.

**చూపరి : (సం.21) పాట 409** – ఈ పదము, చూడదగువాడు ఇత్యాది అర్థములలో ప్రసిద్ధము. కాని ఇక్కడ ప్రకరణమునుబట్టి "చరగా రాలేపోడి" అనే అర్థముగా కానవచ్చుచున్నది. అన్నమయ్య చాల స్వతంత్రుడు.

**చెలప చెమటలు : (సం.13) పాట 140** – 'చెలమ' శబ్దము యొక్క సామాజిక విశేషణరూపము 'చెలప' అగునేమో?

**చేఁతలాడి: (సం.18)పాట 104** వగలు వన్నెలు మొదలగు బహువచనాంతములపై మతుబర్థమున ఆడి వచ్చుట సహజము. చేఁతలు శబ్దముపై అట్లేవచ్చుట వింత. చేష్టలు (కలది) చేయునది అర్థము కావచ్చు.

**చేపట్టు గుంచమవు : (సం.19) పాట 201** – 'చేతిలోనైవ కొలపాత్రము' అనునర్థమున వాడినట్లున్నది. 'పరాధీనుడు' ఛాయార్థము కావచ్చు.

**చేముంచి : (సం.16) పాట 2** – ఈ పదము నిఘంటువులలో కానరాదు. 'తలమున్కలు' వలె పూర్తిగ పనిలో దిగి అనునర్థమున ప్రయోగించినట్లున్నది.

**చేలాగు : (సం.19) పాట** 14 – 'చేయూత' అను నర్థమున వాడినట్లున్నది. చేయిచ్చి లాగుకొనుటయు కావచ్చు.

**చేసేటి బత్తి : (సం.19) పాట 265** భక్తిశబ్దభవమైన యీ బత్తి, ఈ వాఙ్మయములో స్త్రీపురుష లొకరొకరిపై చూపెడి 'ప్రేమ' కు పర్యాయముగ చాలచోట్ల గలదు. పై యర్థములోనే యొక్కువగ నుండుట గమనింపదగిన విషయము.

**చౌరు : (సం.14) పాట 94** – ఈ చౌకు, 'జౌకు'కు ప్రాచీనరూపమేమో?

**జంగిలి : (సం.13) పాట 155** – పశుసమూహమని సూ.ని. సమూహసామాన్య మని కన్నడము.

**జరయు : (సం.13) పాట 21** – నిందించు అని అర్థము. ఈ యర్థమునందే 'జఱి' 'జఱె' అని కన్నడ ధాతువు.

**జాజర : (సం.5) పాట 274**

ఇదియొక విచిత్రమైన శబ్దము "జాజర = దొంగ, జాజరపాలికలు =అంకు రార్పణ శరావము" అని సూ.ని. ఈ జాజరశబ్దము. పై రెండర్థములందును యథాక్రమముగా తస్కర – శాద్వల శబ్దభవముగా గానవచ్చుచున్నది. 'శాద్వల' శబ్దభవమనుటయే ఇప్పటి చర్చనీయాంశము. "శాద్వల" జాజర అగుట సుప్రసిద్ధమే. అందువలననే 'జాజరపాలికలు' అని సూ.ని. గుర్తించినది.

దీనికొక గ్రామీణమైన ఆచారము తార్కాణగా తోచుచున్నది. వైశాఖశుద్ధ పూర్ణిమను మొలకలపున్నమయని. జ్యేష్ఠశుద్ధపూర్ణిమను ఏరువాక పున్నమయని వ్యవహరించుచున్నారు. వైశాఖశు ద్ధపూర్ణిమకు ఐదారు దినములు ముందుగా పెంకులకుంపట్లలో మట్టివోసి నానాధాన్యములను నారువోయుదురు. అందు ఏ ధాన్యమేపుగా బెరిగిన ఆ ధాన్యము దండిగా బండునని కర్షకుల కొకగుర్తు. కాని నాధారముగా జేసికొని ఏరువాక పున్నమకు వ్యవసాయము సాగింతురు. ఈ మొలకలకుంపట్ల నన్నింటిని దేవాలయములపైన, తమ పితృదేవతల సమాధులపైననుంచి ఆ మొలకల పున్నమనాడు పూజించుట రాయలసీమ పశ్చిమ భాగమునందంతట నేటికిని గలదు. వెన్నెల బలిసినవైశాఖ శుక్లపక్షమునందు, పూర్ణిమనాడును ఆ మొలకనోముతోపాటు జక్కి మొదలగు పలువిధములగు ఆటలాడుట ఈనాటికిని గలదు. అది యొక వేడుక. ఆ 'జాజర' (మొలక)కు సంబంధించిన వేడుక

గావున అది జాజర వేడుకయైనది. క్రమక్రమముగా 'జాజర' శబ్దము వేడుకకు పర్యాయముగా నిల్చినది. 'జాజరపాటలు' ఇత్యాదులందు గూడ ఈ యర్థమే కావచ్చు. ఈ నాయూహను సాహిత్యజ్ఞులు పరిశీలించి తెలిపిన సంతోషింతును. వేఁడి+లు = వేంఢ్లు, వాఁడి + లు = వాండ్లు ఇత్యాది ప్రయోగములును గలవు.

ఇట్లే ఈ వాఙ్మయమున శబ్దచర్చ సాగింపబూనినచో అది అనంతమగును. మచ్చునకు కొన్ని చూపితిని. ఒక్కొక్క పదమున కొక్కొక్క పాటయే ఉదాహరణముగా చూపితిని. తక్కినవి పాఠకులు చూచుకొనగలరు.

**జాజరకాఁడు : (సం.18) పాట 7 –** జాజరకాఁడు = దొంగ అని, జాజాల పాలికలు = అంకురార్పణ శరావము అనియు సూ.ని. జాజర = వంచన అని శ,ర. "జాజర', తస్కర – శాద్వల శబ్దభవము కావచ్చు. ఈ దృష్టితోనే సూ.ని. పై రెండర్థముల నిచ్చియుండవచ్చు. ఇక్కడి జాజర, శాద్వల శబ్దభవమైతే, వైశాఖశుద్ధపూర్ణిమకు ముందు అన్ని ధాన్యములు కుంపట్లలో మొలకపోసి, ఆ మొలకకుంపట్లను ఆ పున్నమనాడు పూజించి, అప్పుడు జక్కి మొదలగు చాలక్రీడావినోదములు (వేడుకలు) సలుపుట మాండలికమైన ఆచారము. అందుకే యీ పున్నమకు మొలకలపున్నమ యనియు వ్యవహారము. క్రమముగ జాజరశబ్దము వేడుకకు పర్యాయమై యుండ వచ్చుననియు, జాజరకాఁడు = వేడుకకాఁడు కావచ్చుననియు తోచుచున్నది. ఈ మొలకనోమును అన్నమాచార్యులు వాకొనియున్నారుగూడ. చూ: – 12 సం. 127 – పాట. ఈ జాజర శబ్దార్థ మింక కొంత విపులముగ 12 సం. ద్వితీయ ముద్రణపీఠికలో చర్చించితిని.

**జాతులు : (సం.21) పాట 355 –** ఈ పదము మామూలు అర్థములలోకాక, ప్రకరణమునుబట్టి 'సైగలు, ఎగతాళి – ఇత్యాది అర్థములు గలదిగా తోచుచున్నది.

**జాముట : (సం.13) పాట 53 –** జాము శబ్దముయొక్క అపూర్వమైన ఔపవిభక్తిక రూపము. "యామమాత్రం సహస్వ" అను కాళిదాసువాక్య మిందు స్మరణీయము.

**జామట : (సం.18) పాట 10 –** ప్రొద్దుట, మాపట శబ్దములవలె జాము శబ్దము నౌపవిభక్తికము చేసి ప్రయోగించినాడేమో?

**జుంటీఁగ : (సం.2) పాట 29**

**భూమెల్ల మేసినా నాఁబోతుకు బందెలేదు**
**నేమపుఁ బ్రపన్నునికి నిందలేదు**
**యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని**
**సోమరి కర్మమంటితే జుంటీఁగకతవును ॥మతి॥**

జున్ను+ఈఁగ. ఔపవిభక్తికకార్యములు జుంటీఁగ తేనెలో బడిన ఈఁగ అన్న అర్థము ప్రకరణమునుబట్టి వచ్చుచున్నది. కాని ఆ యర్థమున జుంటీఁగ రూపము సిద్ధించునా? జున్ను చేసెడి ఈఁగయే కదా 'జుంటీఁగ'. 'సోమరికర్మ మంటితే జుంటీఁగ కతవును' = శరణాగతులు (కర్మలను వదలినవాడు) మరలా కర్మలజోలికిపోతే; అనే అర్థములో 'తేనెలో బడిన ఈగ' అనే అర్థమే సబబని తోచుచున్నది. తేనెటీఁగల చరిత్రలో తల్లిఈఁగ, రాణిఈఁగ ఇత్యాదుల విషయమేమైన సంబంధించియున్నదా అని విచారింపవలసియున్నది.

**తండుముండు పడేవారే : (సం.2) పాట 56**

**నిండుఁ జింతాజలధికి నీళ్లు దనచిత్తమే**
**దండి పుణ్యపాపాలే దరులు**
**కొండలవంటి కరళ్లు కోరికె లెందు చూచినా**
**తండుముండు పడేవారే దాఁటలే రెవ్వరును ॥హరి॥**

తండుముండుపడేవారే = దుందుడుకుగా ముందుకు దూకేవారే అని ప్రకరణముతో తోచుచున్నది.

**కొండో నుయ్యో కుమతులాల**
**తండుముండు తట్టుముట్టు తాఁకైనఁ గనుఁడీ ॥పల్లవి॥**

ఇక్కడ ఈ పదము "గడ్డీగాదము, పిల్లాజిల్లా" వలె జంటపదముగా తోచు చున్నది. ఇంకను అర్థము విచార్యము.

**తగులువిరితనాన : (సం.18) పాట 4 –** తగులు తనము విరియు (విడియు) తనము కావచ్చు. సందర్భానుసారముగ తగులుట = చేరుట, విరియుట = విడివడుట. లేక తగులుయొక్క విరి.

(వికాసము), దానిపైన తన వర్ణకమూ కావచ్చు. రాగము హెచ్చినతనము అని యర్థము.

**తడిసూళ్ళు : (సం.13) పాట 363 –** తడియార్చు గుడ్డలు? పరమయోగి విలాసములో "తరుణికి జిలుగారుఁ దడిసుదులిచ్చి" (358) అను చిన్నన్న ప్రయోగ మిదియే కాగలదు. తడి+ సుదు అని, ఎండింపజేయు అను సూ.వి. ఇచ్చిన వ్యుత్పత్తి సందిగ్ధము.

**తలపిడి కొలుపిడి : (సం.2) పాట 5 –**

**యిలమీఁద తమ సొమ్ము లెవ్వరివద్దనుండి నా**
**తలపిడి కొలుపిడి తగిలినట్టు**
**తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాఁడ**
**వెలయ నీ సొమ్మనుచు విడిపించుకొనవే** ॥పు॥

తలపిడి, కొలుపిడి ఈ పదముల కర్థము నిఘంటువులలో కానరాలేదు. సొమ్ము శబ్దసాహచర్యముతో నే నిట్లూహించుచున్నాను. దండలు మొదలైనవి చేయించునపుడు. ఇన్నిపిళ్ల (పిడుల) కొలత అని చేయించుట నేటికిని సంప్రదాయము. అట్లు చేయించిన సొమ్మును ఎవరైన దొంగలించి, వారివద్ద పట్టుపడినచో, తలపిడి = తొలుత చేయించిన పిళ్లకొలత, కొలుపిడి = (ఇప్పుడా సొమ్మును పట్టుకొన్నప్పుడు) కొలువగా వచ్చిన పిళ్లకొలత ఒకటే ఐనచో ఇది నా సొమ్మే అని నిర్ధరించి తీసికొనునట్లు అనే అభిప్రాయముగా తోచుచున్నది. ఈ శబ్దమింకను విచార్యము.

**తలపోసేవు : (సం.14) పాట 89 –** తలపోయు = రెండు కొలపాత్రల కొలత సరిచూచు. ఇది రేనాటి ప్రయోగము.

**తాడుపడు : (సం.13) పాట 317 –** తాటిచెట్టువలె నిర్భయముగ నిల్చు; ప్రూన్పడు వంటిది.

**తావళించి : (సం.16) పాట 259 –** తావళము = అవకాశము అని సూ.ని. ఇక్కడ. అవకాశము చూచుకొని, యథావకాశముగ, అలస్యముగ అనిగూడ అర్థము కావచ్చు.

**తిట్టపెట్టి : (సం.2) పాట 45 –**

**చెట్టుల కెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలానఁ**
**బుట్టి కాచి పూచి నిండాఁ బొదలుమని**

**గుట్టుతో జై తన్యమై గుణములన్నిటికిని**
**తిట్టపెట్ట రచించిన దేవుఁ డింతేకాక ॥నేన॥**

తిట్టపెట్టి = దిట్టముచేసి 'కావచ్చు', 'ఈ వస్తువు స్వభావము ఇట్లా' అని నిర్ణయించుట. 'దిద్దు' నకు 'తిద్దు' ప్రయోగము ఈ వాఙ్మయమున ఎక్కువగ నుండుటచే దిట్టమును 'తిట్ట' అని వ్యవహరించిరేమోయని నా యూహ. అట్లే –

**యేదతపము నాకేదజపము నే**
**వాడికఁ జేయఁగ నీకు వచ్చేనదేమి**
**వాడికఁ జేయఁగ నీకు వచ్చేనదేమి**
**బేడిదపుఁ బెద్దలెల్లా బెట్టినతిట్టములంటా**
**యీడుకుఁ జేసెగాక యిందేమిగలు ॥నమ్మి॥**

అను ప్రయోగముకూడా దీని కాధారమే.

**తిరువాముడి మంటపము : (సం.14) పాట 368** – తిరు+వాయ్+మొళి = శ్రీ శ్రీయుతమైన నోటిమాట. దివ్యప్రబంధము పై అరవశబ్దమే తెనుఁగున 'తిరువాముడి' యైనది. అది పారాయణము సేయు మంటపమే తిరువాముడి మంటపము.

**తిరువుమొరువు : (సం.19) పాట 12** – 'తికమక' అనునర్థమున వాడినట్లున్నది. ఈ యర్థమున శకటరేఫతో నీజంటపదము తమిళ నిఘంటువున గలదు.

**తీసిపెట్టుగానితమిన్ : (సం.19) పాట 96**: తీయుటకు పెట్టుటకు వలనుపడని, లేదా తొలగించుటకు సాధ్యపడని' అను నర్థమున నీధాతుజవిశేషణములు క్త్వాం తముతో కూర్చి ప్రయోగించినట్లున్నది.

**తూకొని : (సం.18) పాట 173** – తూకము +కొని = తూకము చేసి అనునర్థమున వాడినట్లున్నది.

**తెమ్మ : (సం.14) పాట 161** – తేమ యొక్క రూపాంతరమని శ.ర. 'తెమ్మల్' గుంపు అని కన్నడము. ఈ యర్థమే యిక్కడ సరిపడుచున్నది. శ.ర. చూపిన "మదగంధంబుల తెమ్మలకు" అను లక్ష్యమందుఁగూడ నిదే యర్థము చెప్పవచ్చును.

**తొక్కుమెట్టు చెమటలు : (సం.18) పాట 258 –** పైరెండు ధాతుజ విశేషణములు అతిశయార్థమున ప్రయోగించినట్లున్నది. పెల్లుబ్బివచ్చు చెమటలు కావచ్చు.

**తొట్టు దీరిచేవు : (సం.14) పాట 198 –** తాఁకి, శాస్త్రము చెల్లింతువు. 'తొట్టు' అనునది, తమిళమునఁగల 'తొడు' ధాతువు 'క్త్వార్థక' రూపము కావచ్చును.

**తోతోయ : (సం.16) పాట 120 –** తోయము = తడవ అని శ.ర. దాని ద్విరుక్త రూపము. మాటికి మాటికి అని యర్థము.

**దంగుడు : (సం.1) పాట 130 –** ఈ పదము గ్రంథములందును నిఘంటువులందును మాత్రము కానవచ్చు చున్నది. ఈ నాటికి తెలంగాణాలో కొంతప్రాంతమున 'బియ్యము దంగినాయ్' ఇత్యాది వ్యవహారమున్నట్లు వినికిడి. దంచు, అను ప్రేరణ చువర్ణాంతమునకు ఇదియే మూలరూపము కావచ్చు. 'వంగు' 'వంచు'వలె సకర్మక చువర్ణాంతములు చాల భాగము ప్రేరణ చువర్ణాంతములుగనే భావింపవచ్చు.

**దాదాత : (సం.2) పాట 246, 518 –**

**నాదించ వెఱచి సింగినాదా లూదుకొంటాను**
**సొదించేరంటాఁ గొందరు జోగురలైరి**
**యీదెస శ్రీవేంకటేశ యిన్నియి మాని కొందరు**
**దాదాత నీ శరణవి దాసరులైరి**

**వేదములు నాటివే వినుకులు నాటివే**
**ఆదినుండి చదివే నదియే నేను**
**వేదతో వెన్నవట్టి నేయి వెదకఁబోయినయట్టు**
**దాదాత నా తెలివి యితరుల నడిగేను ॥కాన॥**

ఈ పదము నిఘంటులయందు కానరాలేదు. ప్రకరణమునుబట్టి ఆయా స్థలములందు 'గట్టిగా' 'ఇంచుమించు' ఇత్యాది అర్థములయందు ప్రయోగించి నట్లు కానవచ్చుచున్నది. ఇది ఇంకను విచార్యము.

**దాయిదండ : (సం.16) పాట 267 –** 'దాయి' ధాత్రీ శబ్దభవమని కిట్టల్. తల్లివలె రక్షకురాలవు అని యర్థము కావచ్చు.

**దార్ష్టికము : (సం.18) పాట 143 –** ధృష్ట శబ్దభవమైన భావార్థక వ్యావహారికరూపము గావచ్చు. ఇక్కడ ప్రాకరణికముగ పొగరుబోతుతనము అర్థము కావచ్చు. "అంత దార్ష్టికము లేకుండా మాట్లాడుతాడు" ఇత్యాది వ్యవహారములో ఈ శబ్దము దాక్షిణ్యశబ్ద భవముగను తోచుచున్నది.

**దిచ్చరి : (సం.13) పాట 18 –** దిక్చారి – ద్రిమ్మరి అని అర్థము.

**దుస్సేవే : (సం.18) పాట 496 –** దూయు ధాతువునకు వ్యావహారిక రూపము కావచ్చు. దూసిపోయుట అర్థము. ప్రాకరణికముగ పరంపరగ పంతములు రాల్చుట కావచ్చు.

**దూరై : (సం.13) పాట 136 –** దూకు+ఐ దూరమ, 'దూరి' మను శబ్దము కన్నడమున 'దూరు'గా కలదు.

**దేవుళ్ల నడుమ : (సం.14) పాట 368 –** 'దేవి శబ్దము బహువచనము దేవులు. అది, గౌరవసూచకమై యేక వ్యక్తిపరముగా 'నేను నీ దేవులు' ఇత్యాదిగ వాడుకలో నిల్చి బహుత్వమును బోఁగొట్టుకొన్నది. దాని బహువచన రూపమే దేవుళ్ళు. తెనుఁగులోని 'దేవేరి' శబ్దమును ఇట్టిదే. 'దేవి యరు' అను కన్నడ బహువచన రూపము, గౌరవ వ్యవహారమున నేకవ్యక్తిపరమై 'దేవేరి' అయినది.

**దోమట : (సం.13) పాట 25 –** దోమట్లు అని కూడ (124)లో బహువచన రూపము గలదు. అన్నము అని సూ.ని. శ.ర. లిచ్చిన అర్థము ఇక్కడ పొసగదు. 'దోమటి దొడుకు' అను ప్రయోగము శబ్దపల్లవమువలె పలుచోట్ల నిందు కాన వచ్చుచున్నది.

**దోమటి : (సం.18) పాట 186 –** దోమటి = అన్నము అని శ.ర. సూ.ని. ఆ యర్థమీ వాఙ్మయమున సరిపడదు. మడ్డితనము మొరటుతనము దొమ్మివంటివి కావచ్చు. ఈ పద మీ వాఙ్మయమున విపులముగ నున్నది. "దోమటిదొడుకు" అని జంటగను గలదు.

**దోయఁడు : (సం.16) పాట 528 –** 'దోసెఁడు'కు విచిత్రముగ పరిమాణార్థమున రూపాంతరము గాబోలు.

**నాఁగువాణే పొందులు : (సం.13) పాట 529 –** నాఁగు = ధాన్యపువడ్డి, 'నాము, నావు' కూడ వ్యవహారమున గలవు. వడ్డి వాఱు, పెరుగు – అని యర్థము.

**నాcటకీcడు : (సం.13) పాట 501 –** నాటకమాడువాడు, 'నాcటక'ములో అర సున్న పొరబాటేమో!

**నానుడిమాట : (సం.2) పాట 298 –**

**సరిగాcడు వీcడనవలదు జగమునరాజు వలసినది దేవులు**
**యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాట ॥పల్లవి॥**

'నాcడు'కు సంబంధించిన 'నుడి' 'నానుడి'. నేడు నానుడులనీ, పలుకుబళ్లనీ, జాతీయములనీ, వ్యవహరించు పదములన్నియు ఇంచుమించు ఒక జాతికి చెందినవే. 'ఈ సీమయందు వాడుకొనే మాట' అనవచ్చు. ఇక్కడ మాట శబ్దమునకు పునరర్థము శంకింపరాదు. నానుడి అనునది సమస్తవ్యవహారము, మాట సామాన్యముగా ప్రయోగించినది. 'నానుడియైన (లోకమున ఈ యర్థమున యీ మాట ప్రసిద్ధము అయిన) మాట. విగ్రహము.

**నాపపంట : (సం.14) పాట 73 –** 'నాంబు' = సన్నమగు అని తమిళము. ఇదే శక్తిలేమి, ఆలస్యము – అనునర్థములలోc గన్నడమున. వీని ఛాయార్థము 'లేcత'గా తెనుcగున నుండవచ్చు. అరసున్న లేకుండుట విచార్యము. లేcతజొన్న, ఆముదపాకు – మొదలగు వానిని దినినc గలుగు పశు రోగమునకుcగూడ 'నాము' అని పేరు. వరి మొదలగు వానిలో మరుగోలెతో పండుపంటకుc గూడ నాపపంట యనిపేరు.

**నాపాలిటి దేవులవా : పాట 538 –** నాతో సరిగ పాలుపంచుకోcదగిన భార్యవా?

**నిజపట్టేవు : (సం.19) పాట 48 –** 'భయము + పడు = భయపడువలె, నిజము + పట్టు = నిజపట్టు' వాడినట్లున్నది. ఇది అపురూపమే.

**నిట్టిపిడిమేనిదాన : (సం.19) పాట 435 –** నిఘంటువుల కానరాదు. ప్రకరణమునుబట్టి, 'నిలువైన పిడివంటి శరీరముగలదానను' అని తోచుచున్నది. 'సౌందర్యము లేకుండుట' దీనిలో అభివ్యక్తమగునేమో?

**నిరుమోహి : (సం.14) పాట 360 –** వృద్ధాది గణములో 'నీచ' శబ్దమునకు, పుంస్త్వమున పాక్షిక 'డుజ్' లోపమును వైయాకరణులు విధించిరి. అది యిచ్చట స్త్రీత్వమునc గన్పట్టుచున్నది.

**నెంజెరివి : (సం.14) పాట 170** – నెంజి+ ఎరివు = ఎదలోని తాపము. మనోవ్యథ అని తమిళము. అదయే యిది కావచ్చును.

**పంకించు : (సం.16) పాట 4** – బురదగ చేయు, సరిచేయు ఇత్యాద్యర్థములని సూ.ని. అవి ఇక్కడ పొసగవు. గౌరవించు, పెద్దగ చూచు అనునర్థములలో ప్రయోగించినట్లు న్నది. 'నిన్నెవరు పంకిస్తారురా' ఇత్యాది వ్యవహార మీనాటికీ గలదు. 'తలపంకించు' లోగూడ దీని తాత్పర్యమే యగపడును.

**పంగించు : (సం.16) పాట 258** – పంగించు = కోపగించు అని సూ.ని. పంగెన = ఓదము అని శ.ర. 'దెప్పిపొడుచు' అనునర్థముగ తోచుచున్నది. ఇది మాండలికము. 'బలే పంగిస్తాడు' 'నీ పంగెనలు నాకెందుకు ఇత్యాది జనవ్యవహార మీనాటికి సుప్రసిద్ధమే. 'భంగించు' శబ్దభవము.

**పంతమిచ్చు : (సం.16) పాట 34** – పంతము నిచ్చు = మాటిచ్చు అని సూ.ని. కానీ యీ వాఙ్మయము నందంతట 'ఇచ్చు' ధాతుసాహచర్యముచే, పట్టుదల వదలుట తప్పంగీకరించుట ఇత్యాద్యర్థములలో ప్రయోగించినట్లు కన్పడుచున్నది.

**పగిడివెట్టి నవ్వితే : (సం.14) పాట 245** – 'పగిడి' = పరిహాసము, వెక్కిరింపు అని తమిళము.

**పడితళించు : (సం.22) పాట 345** – పడిత్తళ్ = పరవశము ఇత్యాదిగా తమిళము. అదియే ఇది కావచ్చు.

**పన్నారు కాఁగులలో :** (సం.14) **పాట 456** – పన్నారులు = చిన్నపాత్రలు, కాఁగులు = పెద్దవి, యీ రెండింటిలోని బియ్యమును చేతికి దొరికినట్లెల్లా సేసలు చల్లుచున్నాఁ డని యర్థము. పన్నారులు, పన్నరులు = చిన్నగురిగెలు గూడనగును.

**పయ్యాడించి :** (సం.14) **పాట 32** – 'పయ్య' = విభాగము అని కన్నడము. పయ్య+ ఆడు = వేరుపడు. పయ్యాడించి = వేరుపరచి కావచ్చును. 547వ పాటలో 'పయ్యాడితే' అను పలుకుబడి గలదు. అక్కడఁగూడ నీయర్థము సరిపడును.

**పరభావము : (సం.16) పాట 532** – పెద్దబాధ్యత అర్థము కావచ్చు.

**పరిణాము :** (సం.14) **పాట 37** – 'పరిణామ' శబ్దభవము. తీర్మానము అని అర్థము. 'పరిణాపుమాటలు' ఇత్యాదలు సామాసిక పుంప్వాదేశములు గూడఁగలవు.

**పళి :** (సం.14) **పాట 276 –** 'పళి' = నింద అని తమిళము. తెనుఁగు 'ప్రయి' యిదే.

**పాఁగిన : (సం.16) పాట 184 –** 'పొంగు' అని తమిళ శబ్దము. క్షేమము అని యర్థము. ఇక్కడ క్షేమంకరమైన అని యర్థము కావచ్చు. తెలుఁగు 'బాగు'గూడ నిదియే కావచ్చు. అరసున్న లేకుండుట విచార్యము.

**పాటము గొమ్మనవే :** (సం.14) **పాట 504 –** పాఠము – పాటము. తనకు తానే వల్లించు కొమ్మనవే అని తాత్పర్యము.

**పాదాలె చిగురుగాని భావమెల్లా నిండుఁజేగ – (529)** 'చిగురుఁగొమ్మైనఁ జేవ' అను నానుడిలోనిది 'చిగురుచెట్టే' కాని. 'చిగురు'గాదని, చిగరచెట్టు చేవ యెప్పుడును లేనిదని ఒక వాదమున్నది. అది సరిగాదని యీ ప్రయోగము తెలుపుచున్నది.

**పానిపట్టి : (సం.16) పాట 148 –** 'పనిపట్టి' అను శబ్దమునకు, జోరుగ వాడిన వ్యావహారిక రూపమా? అనిపించుచున్నది?

**పారితేఁగా :** (సం.14) **పాట 553 –** పారిరాఁగా. 'పారితేరఁగా' ఇట్లైనది కాఁబోలును.

**పాలార్చు : (సం.13) పాట 112 –** పాలు + ఆఱుచు = పాలార్చు, నశింప జేయు అను నర్థము స్పష్టమే. కానీ ఆ యర్థమిచ్చుట సరిపడదు. పాలు + ఆడించు = పాలార్చు. తనపాలిదిగా చేయు అను అర్థము సరిపడును. దీనికి 475, 498 కూడ చూచునది.

**పాలుదీసును :** (సం.14) **పాట 99 –** దేహసత్త్వము తగ్గును.

**పుణుఁగు పువ్వు గట్టినట్టు :** (సం.14) **పాట 418 –** పునుఁగురాచి పువ్వు గట్టినట్లు. పునుఁగు తీడినదారముతో పువ్వుల మాలకట్టుట మైసూరులో నుండినది.

**పుఱవేదనలు :** (సం.14) **పాట 337 –** పురువేదనలా? 'పురు భూయిష్ఠ'మ్ అని అమరము. ఇక్కడ తొందర, ఆత్రము – అని చెప్పవచ్చును. బండి ఱా ఈ వ్యుత్పత్తికి కొంత బాధకము.

**పుక్కట : (సం.13) పాట 33 –** పుక్కట, పుక్కటె, పుకసాటి – అని కన్నడ రూపములు. తేరకు, వ్యర్థముగా అని అర్థము దీని రూపాంతరములు. పుగసాటి,

**పులుఁగాలు :** (సం.14) **పాట 408** – పులగమా? దీనికి 'పులుంగ' మనియు రూపము గలదా?

**పూసగొండి :** (సం.14) **పాట 292** – 'పూశల్' = కలహము అని తమిళము. 'పూసగొండి' = కలహ స్వభావము గలవాఁడు. 'కొండి' లేక 'గొండి' అను ప్రత్యయము తాచ్ఛీల్యార్థమునఁ గలదు. 'లంచగొండి' 'జగమొండి' వలె.

పూసాటి – మొదలగు అనేకములు గలవు. 'పుక్కిటి పురాణము'లోని తొలిపద మిదియే కావచ్చును. అసందర్భమైన ప్రసంగమని యర్థము.

**పూసుగోడై : (సం.16) పాట 9** – అస్థిరము; తప్పు కప్పిపుచ్చుట అనునర్థములలో, 'పూసిన గోడ', 'పూసినగోళ్లు' వంటివి కావచ్చు. 'పూసుగోళ్లు' అనుటకు 'పూసుగోడు' అను ఏకవచనరూపము అపురూపమే. కన్నడమున సాధింపవచ్చునేమో?

**పెంటల పూజలు : (సం.18) పాట 70** – పెంట = ఎరువుకుప్ప అని శ.ర. పెంట = శాఖానగరము అని సూ.ని. ఇక్కడ సమృద్ధి అనునర్థమున గానవచ్చుచున్నది. ఈ పద మీ వాఙ్మయమున నీయర్థమున ఇంకను గలదు. నన్నయ 'కంపు' వలె స్వీకరింపవలసి యున్నది.

**పేనిపట్టుక : (సం.19) పాట 186** – అక్కడక్కడ 'పానిపట్టి' అని కానవచ్చు దాని కిదియే మూలరూపమా? అనిపించుచున్నది. ఈ 'పానిపట్టి' 'పనిపట్టి' అనుదాని వ్యావహారిక రూపము కావచ్చునని, 22వ సంపుటము సందిగ్ధ పదసమీక్షలో 30వదిగ నిచ్చియున్నాను. పరిశీలించగ పేనిపట్టి లేక పూనిపట్టి అనువానివికారముగ తోచుచున్నది.

**పేరడి : (సం.13) పాట 207** – పెద్ద అడుగు, ఎక్కువ అని యర్థము.

**పేరువళి : (సం.16) పాట 365** – పేరుగలవాఁడు. ప్రకరణమున ప్రశస్తవాచకము గావచ్చు.

**పైఁబిల్లగొట్లాడుచున్నాఁడు :** (సం.14) **పాట 456** – 'పిల్లగోట్లు'; 'పిల్లగోరు', 'బిల్లగోడు' – అని సూ.ని. 'బిల్లగోడు' – అని శ.ర. బిళ్లంగోడు' అనియు వ్యవహారము. 'చిల్లాకోలు', 'చిల్లాకట్టె', జిల్లాకట్టె – అనికూడ వాడుక.

**పొట్టఁబొరుగు : (సం.13) పాట 109** – పట్టపగలు వంటిది. మిక్కిలి సమీపమని యర్థము. అరసున్న చింత్యము.

**పొడిcబడి : పాట 337** – (సం.14) పొడిన్+పడి. 'పొడివడు' అని యుండునేమో? చులుకనై, చిన్నతనముతో.

**పొదపు :** (సం.14) **పాట 162** – ఇది పొదుపే కావచ్చును.

**పొలమేర :** (సం.14) **పాట 305** – పొలము + మేర = పొలిమేర. యిదే పొలి – బలి.

**బగివాయ కాపెమీంది పరాకున నున్నవేళ : (సం.19) పాట 189** – ఇక్కడ పరాకు శబ్దము 'పరవశము – మగ్నత' అను నర్థమున సరిపోవచున్నది. పరాఙ్ముఖ శబ్దభవము గదా ఇది. పై తెల్పిన యర్థములోనే 'విస్మరణం బైనది మాటలపరాకుచే ననుచు కళా 3–81. దీనినే వా.ని. కూడ నుదాహరించినది.

**బలువురాలు : (సం.18) పాట 580** – బలువుcడు పుంలింగ రూపము గాగా, బలువురాలు అని స్త్రీలింగమున ప్రయోగించినట్లున్నది.

**బాయట, బాయిట: (సం.5) (3–3–4)**

బహిశ్శబ్దభవము 'బయలు' కాగా, బాహ్యాశబ్దభము బాయట, బాయిట కావచ్చును. ఈ రెండురూపములు ఈ వాఙ్మయమున తరచుగా నగపడుచుండును. వీని సం|గ్రహ – ఔపవిభక్తిక రూపమే 'బయట – బయటికి, 'బైటికి' ఇత్యాదులు కావచ్చు.

**బాలులు, బాలులాల: (సం.5) (230 – 2– 2)**

అదన్తదీర్ఘపూర్వలోపధములపై విభక్తి లకారమునకు రేఫము లేకుండ ప్రయోగించుట ఈ వాఙ్మయమున విరివిగా గన్పట్టుచున్నది.

**బాసటము : (సం.16) పాట 98** – బాసట ప్రసిద్ధమే. బాసటము = విషము అని సూ.ని. అది ప్రకరణాని కతుకుతుంది గూడ.

**బుగంధించు : (సం.21) పాట 341** – ఇది అపురూపమైన పదము. 'పువు + గంధించకుండునా' అను పదముల సం|గ్రహరూపముగా తోచుచున్నది. ప్రకరణమును బట్టి 'వాసనకొట్టదా?' అని చెప్పవచ్చు.

**బుద్బుజములు : (సం.2) పాట 450**

**చేరి నిన్నుc బూజిందనిచేయి దంతెనపుcజేయి**

**తారి నీకు మొక్కనట్టితలయే పెదతల**

**సారె నీ ముద్రలేని భుజములు బుద్బుజములు**
**తేరి నీ దాస్యములేని దేహము సందేహము ॥అటు॥**

ఇది ఈ యాకారముతో నిఘంటువులందు కానరాలేదు.

**"బుద్బుదమనంగఁ దనరును బుద్బుదంబు**
**లడ్డువయనంగ లట్వ చెలంగు చుండు...."**

భక్ష్య విశేషమని సూ.ని. ఆ భక్ష్యమేదో తెలియరాలేదు. కొంచెము గుండుగా సుమారుపాటి పొడవైన భక్ష్యవిశేషమైతే ప్రకరణానికి సరిపోతుంది బుద్బుదమునకు బుద్బుజము అవి వ్యావహారికమేమో? ఇది ఇంకను విచార్యము. పెద్దనదులందు, సముద్రములందు, పొడవుగ నేర్పడే బూడగ గూడ సరిపోతుంది.

**బెంగ :** (సం.14) **పాట 216 –** తాపము. ఇక్కడ తాపము గలది.

**బెట్టిమాటలు : (సం.16) పాట 119 –** బెట్టు శబ్దమౌపవిభక్తిక మగుట వింత.

**బేంట్లు :** (సం.14) **పాట 576 –** ఎండిన పలుకులు. 'బేఁటు" శబ్దము సానుస్వారమనుట కిదియు నొక యుదాహరణము.

**బేడలు : (సం.2) పాట 350 –**

**వేడుక వాల మాకాశవీధితోఁ బెనచినాఁడు**
**యేడు జలధులు చేసె నిదే మోకాళ్లబంటి**
**వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు**
**బేడలుగాఁ జేసినాఁడు పెద్ద హనుమంతుఁడు॥ఏను॥**

రెండుగా చీలిన పప్పుధాన్యములు. కందిబేడలు సెనగబేడలు వగైరా. ఈ బేడలు వ్యవహారము రాయలసీమయందు మాత్రమే ప్రసిద్ధము. సర్కారువారిలో కందిపప్పు, సెనగపప్పు అనియే వ్యవహారము. రాయలసీమలో వుడికినదానికే పప్పు అని వ్యవహారము.

**బ్రహ్మ మనుకోనేంము : (సం.2) పాట 30**

**నేమే బ్రహ్మ మనుకోనేరము :నేము**
**కామించిన స్వతంత్రము గడు లేదుగాన ।।పల్లవి।।**

పూర్వముద్రితములో 'బ్రహ్మ మనుకొనేరము = బ్రహ్మము అనుకొందుము' అనే నర్థమున ఆ పాఠము గ్రహించినట్లున్నది. ప్రకరణమునుబట్టి అనుకోనేరము = అనుకొనుటకు చాలము అని తోచుచున్నది. ఈ రేకులపాఠములో హ్రస్వదీర్ఘము లకు ఒకేలిపి కావున ఇటువంటి పాఠభేదములు అక్కడక్కడ దొర్లుచుండవచ్చు.

**మని మని :** (సం. 14) **పాట 268 –** పెద్దగాఁ బ్రదికి.

**మక్కువ నేర్చితిఁగాని మంకు నేరనైతి :** (సం. 14) **పాట 548 –** 'మంకు' పదము – నకు అవివేకము, మొండితనము – మొదలైన అర్థము – లిక్కడ పనికిరావు. తాత్పర్యముచేత ఆర్జవము, మంచితనము అనఁదగును.

**మలఘుని నిన్న పెరుమాళ్లు :** (సం. 14) **పాట 368 –** మలై+ కునియ + నిన్ర + పెరుమాళ్లు = కొండ క్రుంగునట్లు నిలుచున్న దేవుఁడు. వేంకటేశ్వరుని మూలమూర్తి. 'మలై కినియ' అని, 'తిరుమలై ఒళుగు' అనుగ్రంథమున నున్నది. ఇందు 'కినియ' కు వ్యాపించు అని యర్థము.

**మాఁట (188 –2– 1)**

ఈ పదము అరసున్నతో కలిసియు, కలియకయు ఈ వాఙ్మయమున నున్నది. అరసున్న కలిగిన ప్రయోగమే ఎక్కువ. పలుతావుల అరసున్నలుండుటచే ప్రామాదిక మనుటకు వీలుగాదు. ఇది మాత్రాశబ్దభవమైన 'మాట్రం' అను అరవపదమునుండి పుట్టినదిగా తోచుచున్నది. సబిందుక నిర్బిందుక ప్రాససాంకర్యమునకు ఉదాహరణముగా, అనంతుడు తన ఛందోదర్పణమున ఈ క్రింది లక్ష్యమిచ్చినాడు:

**వీఁపు మూపులు మఱితలమోపులయ్యె**
**మాఁటలేఁటికి మేటి తాఁబేటి కనఁగ (1–52)**

ఇట్లే కొన్ని యెడల 'మాఁటి మాఁటికి' అనిగూడ సార్ధబిందుకముగ రేకులలో గలదు.

**మాఁట – మాట : (సం.13)** – ఇట్లు రెండురూపములును బహుళముగా గలవు. మాట యందు అరసున్న ఒకానొక కాలమందున్నట్లున్నది. సబిందుక – నిర్బిందుక ప్రాస సాంకర్యమునకు ఉదాహరణముగ అనంతుడు తన 'ఛందోదర్పణము'న ఈ క్రింది లక్ష్యము లిచ్చినాడు.

**"వీఁపు మూఁపులు మఱి తలమోపులయ్యె**
**మాఁటలేఁటికి మేటి తాఁబేటి కనఁగ" (1–52)**

ఇట్లే కొన్నియెడల'మాఁటి మాఁటికి' అనికూడ సబిందుకముగ రేకులలో గలదు.

**మానాపతులము : (సం.13) పాట 15 –** 'మానవతుల' మనుటకు వ్యావహారిక రూపము. నేటికిని కడప మండలములో గలదు.

**మేకులు : (సం.13) పాట 18** – మేకు = పెద్దఱికము అని కన్నడమున.

**ముక్కుదాయిటి రేఁగె : (సం.18) పాట 82** – ముక్కందు + ఆ యిటి. ఆ యిటి = ఆవిరితో గూడిన గాలి కావచ్చు. చూ: 152వ పాట.

**మునిపితే : (సం.23) పాట 110** – ముని = మునిపు = మునిసు = ముళిసు = కోపము, ఇత్యాదిగా కిటెల్. దాని రూపమే 'మునిపితే' కావచ్చు.

**ముమ్మదము : (సం.21) పాట 336** – మూడు + మదములు = ముమ్మదము. 'ముమ్మఱమునకు' రూపాంతరముగనో, వ్యావహారికముగనో వాడినట్లున్నది. లేక రూప – యౌవన – అభిజాత్యమదములు మూడుగానీ, కాయిక – వాచిక – మానసికములగు మూడు మదములుగానీ కావచ్చు.

**ముమ్మదము : (సం.23) పాట 297** – 'ముచ్చట, మున్నీరు' వలె, కాయిక – వాచిక – మానసికములైన మదములు మూడు ముమ్మతమై ఉండవచ్చు.

**ముయి :** (సం.14) **పాట 69, 80** – వివాహాదులందిచ్చునట్టి బహుమతి. దానికి బదులిచ్చుట 'ముయికి ముయి'

**మెనకులు : (సం.22) పాట 101** – మెనకు = ఎనచు, మెత్తజేయు ఇత్యాదిగా సూ.ని. దాని

ఛాయార్థమే నలచుట, బాధించుట, ఇత్యాదిగా ప్రకరణమునుబట్టి ఊహింపవచ్చు. మనసు నొప్పించెడి వాదులాటలు కావచ్చు. ఇంకా విచారింప వలసియున్నది.

**మెరవణివి : (సం.22) పాట 405** – మెరవణి = ఊరేగింపు. 'మెరవణిని' అని వ్యక్తిపరముగా నిర్దేశించుట వింత. 'మెరవణి' శబ్దచాయార్థమే 'అందరెరిగినవాఁడు' అని కావచ్చు.

**మేక తాఁకులు :** (సం.14) **పాట 584** – అజాయుద్ధము క్షణికమని వినికి. అట్లే ఇవి క్షణికములు.

**మేసులన్ : (సం.22) పాట 62** – 'మేయు' ధాత్వర్థమే అనుభవించు అను ఛాయార్థముగ మారినట్లున్నది.

మేసులన్ = అనుభవములతో అని కావచ్చు.

**మొగదారికి :** (సం.14) **పాట 86** – ముఖదాక్షిణ్యము – మోమోటము. 'సాక్షి' శబ్దము 'సాకిరి' యైనట్లు 'దాక్షిణ్య' శబ్దము 'దాకిరి'గా నిలుచును గాఁబోలు.

**మొత్తగాఁడు : (సం.18) పాట 540** – మొత్తము గలవాఁడు అను నర్థమున తద్ధితాంతమైన ఈరూప మపురూపము.

**మొరయన్ :** (సం.14) **పాట 572** – ఉరిమి చూచుటకు, 'ఏమిరా మొరుస్తా' వని చిత్తూరు జిల్లాలో నొక భాగమున వ్యవహారము. "అనిరుద్ధుతోఁగూడ నయ్యుషాకన్యఁ జెరవేయుఁడని క్రోధచిత్తుఁడై యరిగె మొరయుచు" అని చిన్నన్న 'ఉషాకల్యాణము' 999వ పంక్తి.

**మోమోము : (సం.19) పాట 437** – మోము + మోము = మోమోము అని విచిత్రమైన ఆమ్రేడితసంధి. ప్రతివారి ముఖము అనియే కాక, ఒకరిముఖము నింకొకరు చూచుట, (మొగము మొగముచూచుకొంటే) అను నర్థముగూడ సరిపోవుచున్నది.

**యతిస్థానంలో చర్చ : (సం.2) పాట 419**

**యీతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు**
**యీతఁడు నీట మునుఁగఁ డీతఁడు గాలిఁ బోఁడు**
**చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁ దేమిటను**
**యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు ॥దేహి॥**

ఇక్కడ 'చలియించు' అను తత్సమపదము యతిస్థానములో 'చెలియించు' అని ప్రయోగింపబడియుండుట, వీరి వ్యావహారిక భాషాదృష్టికి తార్కాణము కాగలదు. ఇట్టి వింకను అక్కడక్కడ గలవు.

**యద్భావం తద్భవతి: (సం.2) పాట 435**

**ధరలో "నెద్భావం తద్భవ " తనెఁగాన**
**హరిమయమే జగమంతాను ॥పల్లవి॥**

ఈ 'యద్భావం' అనుదానికి పాదసూచికలో అప్పటికి తోచిన దానిని ఇచ్చినాను. 'యద్భావ్యం తద్భవతి' అనుట సముచితమేమో అనిపించుచున్నది. యద్భావం తద్భవతి అనుటకు వ్యావహారికమేమో యద్భవం కర్మ తత్ భవతి అర్థము కావచ్చు.

**రండు :** (సం.14) **పాట 417** – రెండు శబ్దవికారమా? అవును – కాదు అని రెండును చెప్పువారు. పట్టులేనివారు.

**రళిత : (సం.2) పాట 81 –**

కలితసుదర్శన కఠిన విదారణ
కులిశకోటిభవఘోషణా
ప్రళయానలసంభ్రమవిభ్రమకర
రళిత దైత్యగళరక్తవికిరణా ॥మర్ద॥

రల – ధాతువు కానరాలేదు. 'లల ఈప్సాయాం' అను ధాతు కృదంతరూప మగు 'లలిత'మునకు 'రలయోరభేద:' అను న్యాయమును జోడించి 'రళిత' వాడి నట్లున్నది. 'గలిత' అనుట సహజము. యతిభంగమగునేమో? అయినను అన్నమయ్య సంస్కృతముపై మనమింత చర్చచేయవలసిన పనిలేదు. ఆయన చాల స్వతంత్రుడు.

**రాఁగిన : (సం.16) పాట 152 –** 'రాగిల్లు'నకు రూపాంతరమా? అరసున్న విచార్యము. 'రంగు'కు రూపాంతరము కావచ్చు. అనురాగము గలిగిన ప్రీతిపడిన అని యర్థము కావచ్చు.

రాఁపు : పాట 363 – 'రంపు' ఇదియే కాఁబోలును.

**రాచాజ్ఞ : (సం.2) పాట 447**

**రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన**
**యేచి నీకు శరణంటి నిది మానుపవే ॥పల్లవి॥**

రాచాజ్ఞ = రాజాజ్ఞ, రాజ్ఞ: ఆజ్ఞా అని విగ్రహము. ఇది సమానైకదేశము తద్భవీకరించిదైనా కావచ్చు. 'రాచవారి యొక్క ఆజ్ఞ' అని తద్భవ శబ్దముతోనే స్వతంత్రముగ సమసించిన సమాసమైనా కావచ్చు.

27వ సంపుటములో 'సమాసములు' అను విషయముపై సాగించిన నా చర్చను చూచిన డా॥ సరస్వతీపుత్ర శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారు, "వ్యావహారికభాషను యధేచ్ఛగ వాడిన అన్నమాచార్యుల కృతులలో వ్యాకరణ చర్చ ఏలబ్బా" అన్నారు. కాని "ఆకృతులలోనే అరసున్నలు శకటరేఫలు స్థానపతి తములు, ఆస్థానపతితములు దండిగనుండుటచే, ఆ భాషను శిష్టవ్యావహారికము గనో, అశిష్టవ్యావహారికముగనో గ్రాంథిక సన్నిహితమైన దానిని విమర్శించక ఎట్లుండేది స్వామీ" అన్నాను. 'సరే నీ యిష్టము' అన్నారు.

**రాతిట : (సం.13) పాట 53 –** పై చూపిన 'జాముట' వంటిది. రాత్రియందు.

**రావాడి : (సం.13) పాట 217 –** రావు + ఆడు. 'రాహు' శబ్దభవము రావు. 'రావు గొట్టేముఖము' అని వ్యవహారము. రావాడు = కఱకుదనమును చూపు అని అర్థము కావచ్చును.

**లాగవేగాలు : (సం.19) పాట 234 –** 'లాఘవ' శబ్దభవము 'లాగ' కాగా 'సుళువుగ వేగముగ' అని యీ జంటపదముల కర్థము కావచ్చు. వేగమునకు లాఘవము కారణమూ కావచ్చు. అప్పుడు ద్వంద్వము పొసగదు.

**లేవె : (సం.18) పాట 361.** లేపు = Bed అని కిట్టక్. ఇక్కడ అదే కావచ్చు.

**వట్టఁగట్టా : (సం.1) పాట 280**

ఇది పై తెలిపిన పాటలో రెండవచరణములోనిది. వట్టఁగట్టా = బ్రహ్మచర్యమా? అనునర్థములో అశ్లీలపదము ప్రయోగించినట్టు కానవచ్చుచున్నది. ఈ తరగతి కవులకు విషయప్రతిపాదన తీవ్రతలో శ్లీలాఽ శ్లీలములు అంతవ్రత లెక్కకు రావు. వ్యాసుడే దీనికి ప్రథమోదాహరణము.

వట్టన్ + కట్లా (కట్టులా) అని పదవిభాగమేమో? లేకున్న అరసున్న చింత్యము.

**వరుస పద్యము :** (సం.14) **పాట 555** – పదిమంది విద్యార్థులలో నెవనివంతు పద్యము వాఁడు చెప్పుట. తక్కిన పద్యముల జోలి వానికక్కరలేదు. శాస్త్రము చెల్లించుట యని భావము.

**వలపక్షాలు : (సం.13) పాట 538** – పక్షపాతములు. ఇది వ్యవహారమున నున్నది. దీనికే 'వలపక్ర' మని గూడ వ్యవహారము.

**వాండ్లు : (సం.16) పాట 265** – వాఁడీ శబ్దము ప్రథమాబహువచనరూపము, వాఁడి + లు = వాండ్లు. పదనులు అర్థము. ఇట్లే 'వేండ్లు' శబ్దముగూడ. తెనాలి – రామకృష్ణుని ప్రయోగము గలదు.

**వాఁకపు వలపులు : (సం.13) పాట 245** – 'వాఁక'కు 'వాఁకము' అని రూపము కలదా? అట్లైన ప్రవహించు వలపులు అను నర్థము కావచ్చును.

**వాగపు : (సం.23) పాట 245** – 'వాగము' శబ్దము విశేషణించిన రూపమో, లేక 'వాగుస' అను కన్నడపదము యొక్క అర్థాంతరమైన హెమ్మీనో = ఎమ్మె= అది కలిగినవాడు అని అర్థమో కావచ్చు.

**వాగము :** (సం.14) **పాట 1** – 'వాగై' తమిళము. మంచినడత, సమృద్ధి మొదలగు నర్థములు గలవు. అట్లే 'వాగు' అనుపదము గూడ గలదు. 'అంద' మని యర్థము. ఇది తెలుఁగు 'బాగు' ఇంకను అర్థము విచారింపఁ దగినది.

**వాతరొట్లు :** (సం.14) **పాట 214** – 'వాతరట్టు రూపాంతరము. నోటి దురుసుదనము గలవి. "కెలయుఁగీరంబు మిక్కిలి వాతరట్టు" అని చిన్నన్న పరమయోగివిలాసము, 8278.

**వానగుంటలు : (సం.21) పాట 45** – నేడు 'ఓమనగుంటలు' అని వ్యవహారములో, నిఘంటువులలో నున్న పదమునకు, అన్నమయ్య నాడు ఆ సీమలో వ్యావహారిక రూపముగా కానవచ్చుచున్నది. అర్థమూ అదే.

**వారకాన : (సం.13) పాట 204** – వారకుము = సమానత్వమును. 'ఓరిగె' 'వారిగె' అనునవి కన్నడమున ఈ యర్థమునందు గలవు.

**వారపట్టి : (సం.16) పాట 180** – ఓరపట్టు శబ్దమేనా? ఓకమూల స్వాధీనము చేసుకోని అని యర్థముండవచ్చు

**విటుకులాడి :** (సం. 14) **పాట 256** – 'మిటుకులాడి'కి రూపాంతరమేమో?

**విణ్ణావఁజివారు : (సం.18) పాట 281** – విణ్ణప్పం సెయివార్ అను అరవ పదమునకు సంగ్రహమైన రూపము గావచ్చు. ఉత్సవములో ద్రావిడభాషలోని దివ్య ప్రబంధముతో పైవిన్నపము జరుగుట నాయూహకు కారణము.

**విత్తరాలు : (సం.23) పాట 31** – 'బిత్తరాలు' కు రూపాంతరముగా తోచుచున్నది. బిత్తరము = విలాసము. "బిత్తరము కులుకు బెడఁగు బెళుకు హొయలనఁగ విలాసమొప్పుచుండు" – (ఆం.భా 1– 139) – అది కలది బిత్తరాలు.

**వినయపు విత్తరాలు : (సం.22) పాట 323** – విత్తరాలు, 'బిత్తరాలు'కు రూపాంతరము కావచ్చు. ఇట్లే 417 పాటలో కూడ.

**విసుపేఁటికి :** (సం. 14) **పాట 503** – విసుగు ధాతువు భావార్థక రూపము. 'విసువు' వలె, 'విసుపు'ను కావచ్చును. గెలువు – గెలుపువలె,

**వెఱఁజరో : (సం.19) పాట 534** – వెరఁజు ధాతువేనా? శకటరేఫము చింత్యము. అర్థానుస్వారమునుబట్టి పై 'వెరఁజు'గనే భావింపవచ్చు.

**వెలకా : (సం.23) పాట 511** – 'వెళక్కు' శబ్దవికారమేమో; వెళక్కు = దీపము అని తమిళ నిఘంటువు.

**వెలకా వేగునిందాఁక :** (సం. 14) **పాట 343** – వెల్లఁగాఁ (తెల్లఁగా) వేగువరకనియేమో?

**వెలుమజోలి :** (సం. 14) **పాట 1** – వెలమవారి సహవాసము? అది యెట్టిదో తెలియదు. వెలమబంక చాల జిగురని 'వెలమబంకవలె అంటుకొన్నాఁడని'వాడుక. రేనాఁటిలో కలదని ఒక పండిత మిత్రులన్నారు. ప్రకృతమునకీ యర్థము కొంత అనువుగా నున్నది.

**వేయిటిపై జవ్వాదికొమ్ము : (సం.18) పాట 399** – స్పష్టముగ వివరించుటకు వీలుగాని జాతీయముగ నున్నది.

**వొందిలి : (సం.14) పాట 125** – 'ఒందిలి' = దు:ఖము. వ్యాకులత – అని సూ.ని. 'ఒంజిలి' రూపాంతరము. 'ఒంజిల్' అను తమిళధాతువునకు సిగ్గుపడు అను నర్థము కలదు. ఇక్కడ ఆత్రము తొందర కావచ్చును.

**వొరట్లు : (సం.14) పాట 67, 86, 108 –** మోటుపనులు.

**శాఖా : (సం.16) పాట 145 –** పై పాటలో 'చంద్రుని శాఖా శైత్యము' ఛాయార్థముగ కిరణములకు 'శాఖా' శబ్దము వాడినట్లున్నది.

**శాలామాలమూ : (సం.13) పాట 186 –** శాలామాలావాహా = అవకతవకలుగా (Confusedly) అని తమిళ నిఘంటువు.

ఇట్టివే 1. ఈఁదా – మోఁదా (119), 2. దారా – మోనా (111) 3. సాటికి – బేటికి అను జంటపదములు స్పష్టార్థములు కాకున్నవి.

**సంతపాకలంజ : (సం.1) పాట 282**

సంతపాకలంజ = సంతలోనో, సంతప్రక్కనో పాకవేసుకొని వచ్చే పొయ్యేవారికి ఉపయోగపడే వ్యక్తి కావచ్చు. ఇట్టిమాటలు భాణములలో సుప్రసిద్ధములు. 'అయి రతిప్రపే" అని ఒక భాణమున సంబోధన. విషయమును స్పష్టముగ చెప్పదలచినపుడు అన్నమయ్య శ్లీల, అశ్లీల మర్యాదకు తావివ్వడనుటకు ఇదియొక్క ఉదాహరణము.

**సంతము : (సం.19) పాట 197 –** శాంతశబ్దభవముగా తోచుచున్నది. అర్థము అదే. తద్భవించుటలో అన్నమయ్య స్వతంత్రుడు.

**సంతమౌట : (సం.13) పాట 48 –** శాంతశబ్దభవము. నెమ్మది పడుట.

**సందడించేరు : (సం.2) పాట 436**

**హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ**
**నిరతముగ వాకిటను నిలిచినాఁడు**
**సురలు నీయవసరము చూచుకొని కొలువునకు**
**సరవి నా ఇత్తవడి సందడించేరు ॥ఎందాఁ॥**

సందడించేరు = సందడిచేయుచున్నారు. 'సందడివిడువుము సాసముఖా"లో క్రీగీత కలిగిన పదమును వ్యాఖ్యానించునపుడు ఆధ్యాత్మకీర్తనల సంపుటము 1 (1981) నందు 12వ పాటలో

సందడి శబ్దమును వ్యాఖ్యానించలేదు. ఈ అన్నమయ్య వాఙ్మయములో సందడి, సందడించు శబ్దములు 'తొందరపెట్టు' 'అంటుకొనియుండు' ఇత్యాద్యర్థములలో వాడినట్లు ఇక్కడ ప్రయోగమునుబట్టి ఊహించుచున్నాను.

**సందుసుడిన్ : (సం.18) పాట 4** – సందుసుడిన్, సందు సుడితనము, సందుసుడికత్తె అని యీ పద మీ వాఙ్మయమున పలుతావుల గలదు. సందుచూచి చొచ్చుట (అవకాశ వాది) అర్థము కావచ్చు.

**సటకారితనము : (సం.18) పాట 201** – శాఠ్యకారి శబ్దభవము కావచ్చు. కపటముగ నడచువాడు.

**సహజి : (సం.2) పాట 212**

**మహి నుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు**
**సహజివలెనుండేమీ సాధింపలేఁడు ॥పల్లవి॥**

'సహజ:' ఈ శబ్దము వీశేష్యనిఘ్నము. సహజము కలవాడు సహజి. పుట్టినవాడు పుట్టినట్లే (ఏ ప్రయత్నము చేయక) వుండుట. అను నర్థమున ప్రయోగించి నట్లున్నది. 'సహజ: స్వభావ: అన్య అస్తీతి సహజీ' పుట్టినవాడి స్వభావమే కలవాడు. ఏమీ యెరుగనివాడు శబ్దము వ్యాకరణ విరుద్ధము కాదుగాని, బహుళ ప్రయోగ ప్రహతము కాదని మాత్రమే మనవి.

**సద్దాత్మ : (సం.16) పాట 7** – సుద్ధాత్మునకు వ్యావహారిక రూపమా యనిపించును.

**సాగబ్రహ్మమయాఖ్యుని : (సం.1) పాట 141**

'సాగబ్రహ్మమయాఖ్యుని' ఈ క్రీగీతగల భాగము స్పష్టముగా అర్థమగుటలేదు. యతిప్రాసల నిర్బంధముతో ఇట్లుండవచ్చునని సూచించుటకును వీలులేదు.

**సాసముఖా : (సం.1) పాట 12**

ఈ శబ్దము యొక్క అర్థము కొంత విచారింపవలసియున్నది. కొందరు పండితులు 'సహస్రముఖా' కావచ్చునని సూచించిరి. అది ప్రకరణమునకు అతుకునట్లు లేదు, ప్రకరణమునుబట్టి ఈ శబ్దము – యొక్క అర్థమును విచారింతము.

**సాసముఖా : (సం.2) పాట 471**

**సింగారమూరితివి చిత్తజగురుఁడవు**
**సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా ॥పల్లవి॥**
**పూవుల తెప్పలమీఁద పొలఁతులు నీవునెక్కి**
**పూవు లాకసము మోవఁ బూఁచి చల్లుచు**
**దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా**
**సావధానమగు నీకు సాసముఖా ॥సింగా॥**

**అంగరంగవైభవాల సమరకామిను లాడ**
**నింగినుండి దేవతలు నిన్నుఁ జూడఁగా**
**సంగీత తాళవాద్యచతురతలు మెరయ**
**సంగడిఁ దేలేటిమీకు సాసముఖా ॥సింగా॥**

**పరగఁ గోనేటిలోన పసిఁడి మేడనుండి**
**అరిది నిందిరయు నీవారగించి**
**గరిమ శ్రీ వేంకటేశ కన్నుల పండువగాఁగ**
**సరవి నోలాడుమీకు సాసముఖా ॥సింగా॥**

ఆధ్యాత్మకీర్తనల సంపుటము – 1 యందు 12వ పాటలో 'సాసముఖా' శబ్దమును 'సముఖ సముఖ' అను రెండు పదముల ఆమ్రేడిత సంధిగా వ్యాఖ్యానించి యుంటిని. దానికి మరొక్కపాట కూడ 9 సంపుటము 97వ దానిని ఉదాహరణమని చూపియుంటిని. ప్రకృతము ఈ పాటలో 'సాసముఖా' శబ్దము 'జోహారు' అను అర్థములో ప్రయోగించినట్లు ప్రకరణమునుబట్టి తెలియుచున్నది.

**సునరాన : (సం.16) పాట 7 –** ఇది నిఘంటువులలో కానరాదు. సుస్వర లేక సుషిర శబ్దభవము కావచ్చు. సులభముగ అని యర్థము.

**సుమాళము : (సం.14) పాట 158 –** 'సుమాళము' = పారవశ్యము అని శ.ర. 'సుసూన' 'సుమ్మాళ' – అని కన్నడమందుఁగలవు. సంతోషమని అర్థము.

**సుసరాన : (సం.14) పాట 64** – 'సుస్వర' శబ్దభవము కావచ్చును. సులభముగా నని అర్థము. 'సుసర' శబ్దము కన్నడమున నీయర్థమందే కలదు.

**సూసరము : (సం.18) పాట 53** – దీని వ్యుత్పత్తి విచార్యము. ప్రకరణముతో బాసికము అర్థము కావచ్చు. సూసకము = స్త్రీలు తలపై ధరించెడి తిరుగుడుబిళ్ల అని వా.ని.

సెగ్గెము : (సం.14) పాట 232 – 'సెగ్గెము' = రోఁత అని శ.ర. ఇక్కడ 'చింత' కావచ్చును.

**సెరబడివారము : (సం.22) పాట 108** – సెఱె = to narrow, confinement ఇత్యాదిగా కిట్టెల్, నీ దగ్గర చిన్న వారము అని ప్రకరణమున అర్థము కావచ్చు. చేరువకు మూలరూపమిదియే నేమో!

**సొలతు : (సం.14) పాట 556** – సొలయింతును. అంతర్భావితణిజర్థము. 584లోఁగూడ 'ఈతనినేల సొలసేవు' అని యిట్టి ప్రయోగమే కలదు.

సోలిగాను తప్పక చూచుట : (సం.14) పాట 476 – అరవమున 'శోలి' = పని. అదేపనిగా అని ఇక్కడ అర్థము. తెలుఁగు 'జోలి' గూడ ఈ పదమే కాఁగలదు.

**స్వరూపదీక్ష : (సం.2) పాట 148 –**

**తదియ్య గురుప్రసాదపుపురోడాశ మిచ్చి**
**కొదదీర ద్వయమనుకుండలంబులు పెట్టి**
**యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షముచేసె**
**యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మా గురుఁడు ॥జ్ఞాన॥**

స్వస్వరూపమును తెలిసికొనెడి దీక్ష. తన నిజస్వరూపమును గుర్తెరిగెడి దీక్ష అని భావము.

**హా సమీచీన : (సం.2) పాట 368**

**హా సమీచీన మపహాసంతే**
**దాసై ప్రకాశితం దరిదంతులోకే ॥పల్లవి॥**

**ద్వారకా పట్టణే త్వం పురాచ స్వయదీక్షితస్తు స్త్రియ: కేశముష్టి: కథం**
**సారస కురువంతి సరసవేళాయాం ॥హాస॥**

**వరశిరోరక్షణే త్వం పురా చ అహం బ్రమ్మచారి అథోచేస్తదేతిగోప**
**తరుణయ: కిమితి వా తద్వసతి త్వం ॥హాస॥**

**తత్త బృందావనే త్వం పురాచ శ్రియౌ వేంకటాద్రౌ ఇదం నివ్విభాసి ఇదం ॥హాస॥**

**చిత్త మిత్యమరాశ్చ దిసేవంతి సర్వే ॥హాస॥**

ఇది సవరించుటకు వలనుపడనిపాట. రేకులపాఠ మొక్కటే ఆధారమైనందున పాఠాంతరము కూడ లేదు.

**శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారి 'అన్నమయ్య స్తుతి' శ్లోకాలు:**

1. ఆత్మానం నాయికాం కృత్వా రచనాం రసవాహినీమ్
   అర్పయద్వేంకటేశాయ యః కృతీ తముపాస్మహే 19-1
2. ఆశైశవచ్ఛ్రీనివాస పరబ్రహ్మ పరాయణః
   యోఽస్తౌషీ దిందిరానాథం రస్యవాగ్భి ర్నమామితమ్ 24-1
3. భూమికాః నాయికానాం యః ఆస్థాయ బహుధాపుమాన్
   రంజయి త్వాంజనాద్రీశం నిర్వవౌ తముపాస్మహే 20-1
4. మధురై రుజ్జ్వలై ర్భావైః వాచికాంగిక సాత్త్వికైః
   శృంగారంయః పుపోషాద్యే బ్రహ్మణి శ్రీపతౌ నుమః 25-1
5. రామానుజీయ సిద్ధాంత రథ్యావిహరణవ్రతం
   ఆత్మసాత్కృత శేషాద్రినాయకం తం భజేఽన్నమమ్ 2-1
6. వేంకటేశ పరబ్రహ్మ రసతుందిల మానసం
   అధ్యాత్మ విద్యామర్మజ్ఞం అన్నమార్యం నమామ్యహమ్ 1
7. వేంకటేశపరిష్వంగ పుష్పితా మాత్మనిర్వృతిం
   రసభూషితాంధ్ర వచనైః యోఽకరోత్త ముపాస్మహే 23-1

8. శ్రీ వేంకటాచలాధీశాధీన మానస యోగినే
తాళ్ళపాకాన్వయాంబోధి శశనేఽ న్నాయ మంగళమ్ 5-62

9. శృంగారాధ్యాత్మ కల్లోల భక్తిసారస్వతాంబుధౌ
శబ్దరశ్మిర్మణిర్యస్య భాషాంధ్రీ తముపాస్మహే 22-1

10. శృంగారాపాంగమాలాభిః వశీకృత వృషేశ్వరం
నిరస్తపుంస్త్వ మాత్మేచ్ఛా కామశాస్త్రం నమామి తమ్ 21-1

**శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారి శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మ స్తుతులు**

అపపాఠ పరిక్లిన్నా గీర్వాణాంధ్ర సరస్వతీ
యత్సంస్కార కృతోచ్ఛ్వాసా తం వందే కృష్ణదేశికమ్ 22-10

కట్టమంచి సుధీర్యస్య ప్రతిభా పాండితీవశః
మహీశూరపురీ సూరిం తం వందే కృష్ణదేశికమ్ 24-18

చుళుకీకృత గీర్వాణ ప్రాకృతాంధ్ర వచోఽ బ్ధయే
పదసాహిత్య కమలభాస్కరాయాఽ స్తు మంగళమ్ 5-62

నమోస్త్వనంత కృష్ణాయ మమ పుణ్యఫలాఽ ఽ త్మనే
వాణీస్తన ద్వాయాస్వాద ద్వైరాజ్యారూఢ కీర్తయే 5-63

మైసూరు రాజధానీనగర కళాశాలికాబుధం మాన్యం
సంగీత సాహితీవీధీ సంచారం నమామి తం కృష్ణమ్ 2-60

రంగనాథ కవేః సత్తాం సహేతుం యోన్యరూపయత్
కట్టమంచి మతిక్రమ్య రాళ్ళపల్లి గురుం స్తువే 3-28

వ్యాగ్యుద్ధే సోమనాథస్య రంగనాథ కవేస్తథా
ప్రత్యర్థినః పరాంభూతాః యేన తం నౌమి దేశికమ్ 25-14

విశిష్టాద్వైత సిద్ధాన్త వీధీ సంతత సంచరం
అన్నమ ప్రతిరూపం తం రాళ్లపల్లి గురుంస్తువే 1-49

సంగీతమపి సాహిత్యం యస్య నేత్రే ఇవా సతః
ఉన్మేషనమిషా జీవే తం వందే కృష్ణదేశికమ్ 21-23

సంగీతే సాహిత్యే చాంగీకారాయ శారదాముద్రామ్
యస్య నిరేక్షేతన్వయ మభివందే రాళ్లపల్లి కులమందారమ్ 19-8

## ఉపయుక్త సంస్కృతగ్రంథసూచిక

అతిమానుషస్తవం
అప్పయ్యదీక్షితుల శ్లోకాలు
అహిర్బుధ్న్యసంహిత
ఆంధ్రశబ్ద చింతామణి
ఋగ్వేదం
కఠోపనిషత్తు
కామశాస్త్రం
కావ్యాదర్శం
కావ్యాలంకారవృత్తి
కుమారసంభవం
కృష్ణకర్ణామృతం
కౌలాలీ నిర్ణయప్రభంజనం
నారాయణీయం
నైషధం
న్యాసదశకం
ప్రబోధ సుధాకరం
భక్తిరసాయనం
ముకుందమాల

యాజ్ఞవల్క్యస్మృతి
రసగంగాధరం
రహస్యత్రయసారం
వరాహపురాణం
విష్ణుపురాణం
శివానందలహరి
శివలీలార్ణవం
శ్రీమద్భగవద్గీత
శ్రీమద్భాగవతం
శ్రీమద్రామాయణం
శ్రీమన్మహాభారతం
సంగీతరత్నాకరం

**ఉపయుక్త ఆంధ్రగ్రంథాల సూచిక :**

అన్నమాచార్యచరిత్ర
అప్పకవీయము
అష్టమహిషీకల్యాణము
కవికర్ణరసాయనము
నృసింహపురాణము
ప్రభావతీప్రద్యుమ్నము
వైరాగ్యవచనమాలిక
శ్రీమదాంధ్రమహాభారతము
శ్రీమద్భాగవతము
శృంగారనైషధము
సంకీర్తనలక్షణము
సంకుసాల తిరుమలకవి భాగవతప్రబంధము

బ్రహ్మశ్రీమంతులు - కీర్తిశేషులు గౌరిపెద్ది రామ సుబ్బశర్మ గారి

-శత వార్షికోత్సవ సందర్భంగా-

# కవితా పుష్పాంజలి



**అవధాన సరస్వతీ పీఠం**
**అవధాన సహస్రఫణి - బృహత్ ద్విసహస్రావధాని**
**బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ యఎ.ఏ.పి.హెచ్‌డి**
నెం. 42, శారదాబాద్, ఎన్.ఎ.సి.(హైటెక్స్) రోడ్డు మాదాపూర్,
హైదరాబాద్-500084, ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-23116277, సెల్ : 9989773849

**గురుర్ బ్రహ్మా గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః ।**
**గురు స్సాక్షాత్ పరం బ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః ॥**

గురు దేవులు-కీర్తి శేషులు బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి శతజయంతి మహోత్సవాలు జరుపాలని సంకల్పించడం ఎంతో ముదావహం. కొడుకు-కోడండ్రైన - శ్రీభగవాన్ - పద్మ గారలు దీనికి పూనుకొని - బంధువులందరినీ సమన్వయం చేసుకొని - ఆప్తులు - హితులు - శిష్యులు - శ్రేయోஉభిలాషులందరినీ ఇందులో పాలుపంచుకొనే అవకాశం కల్పించడం వల్ల వారి వారి భక్తి శ్రద్ధలను ప్రకటించుకొని ఋషిఋణం తీర్చుకొనే వీలు ఏర్పడింది.

ఈ సందర్భంగా శ్రీ గౌరిపెద్ది గురువుగారి విగ్రహావిష్కరణ - ప్రాచ్యకళాశాలా ప్రాంగణంలో జరిగేటట్లు - ఇందుకోసం శ్రీ భగవాన్ గారి నిరంతర కృషి - దానిని ఫలింప జేస్తున్న శ్రీమత్ తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీకార్యనిర్వహణాధికారులు - తదితర అధికారులు విద్వధధికారులు అందరూ ప్రశంసాపాత్రులు. ఈ శతజయంత్యుత్సవాలు - గురువు గారి విగ్రహ స్థాపన ఆవిష్కరణ అన్నీ దిగ్విజయంగా జరిగేటట్లు ఆకాంక్షిద్దాం. తగిన - సహకారం - కృషి - అందిద్దాం.

వ్యాసం వ్రాద్దామని వ్రాస్తున్న నాకు ఇదిగో ఈ విధంగా పద్య ధార కవితారూపమై ప్రసరించడం వారి ఆశీర్బలంగా భావిస్తున్నాను. శ్రీమాన్ అన్నమయ్య – వాఙ్మయ ప్రచారంలో శ్రీ గౌరిపెద్ది వారు చేసిన అపారమైన కృషిని – సేవను – టీటీడీ వారు సముచితంగా గుర్తించి గౌరవించినట్లు సాహితీలోకం భావిస్తున్నది.

శ్లో॥ 1 శివకామ మహార్ధాంగో రామసుబ్బాహ్వయో గురుః ।
"గౌరీ వృద్ధ" లసద్వంశ్యః జీయాత్ శిష్యైక వత్సలః ॥

2. ఉ॥ ధీరుడు రామసుబ్బ గురుధీమణి పేరు తలంచినంత – ఆ
చార పరాయణంబు, రస సంభృత మానసవృత్తి, శంభు సే
వా రచితా చ్ఛ భూతి పరిసర్పిత ఫాలములొక్క మారుగా
శ్రీరమణీయ మూర్తియయి చెన్నుగ దోచు నమస్కరింపగాన్ ॥

3. సీ॥ ఒక్కటే గుక్కలో ఉదధి పీల్చిన నాటి
"అయ్యగస్త్యుల" వారి నరయ లేదు
బహువాఙ్మయ శ్రీల భద్ర పీఠికనున్న
"వ్యాస దేవుని" జూచు వనరులేదు.
పరమ మాహేశ్వర ప్రథమగణ్యుండైన
"శ్రీనాథ కవి" జూచు చెలువు లేదు.
భస్మత్రిపుంద్రాంక ఫాల భాగపు "టన్న
మయ్య"ను జూచు భాగ్యమ్ము లేదు.

తే॥గీ॥ ఇందఱిని జూడ నట్టి మాకేకమగుచు
ఒక్క రూపాన గనపడి దృక్కు నిలిపె
'గౌరిపెద్ది' వంశాంబుధి 'గ్లౌ'ర్మనీషి
"రామ సుబ్బ శర్మా" ఖ్య ధీర గురు వరుఁడు.

4. ఉ॥ ప్రేమము మీర నన్నమును పెట్టి పురాణములందు – ఎక్కడే
మేమి రహస్యమున్నదొ వచించి, వధాన విశిష్ట విద్యలో

సీమలు దాట జెప్పె ఉలి చేతనుబట్టని శిల్పి, బ్రహ్మ దీ
క్షామణి రామసుబ్బ ఘనశర్మ – గురూత్తము డంజలించెదన్ ॥

5.తే॥గీ॥ అన్నమాచార్య వాఙ్మయ మంత చిలికి
పదములందించి నక్షత్ర పరిధి పెంచెఁ
గనుక గౌరిపెద్ది బుధుని గౌరవించి
గౌరవంబందె – టీ.టీ.డి. ఘనతకెక్కె,

"నక్షత్ర పరిధి" అనడంలో శ్రీగౌరిపెద్ది వారు పరిష్కరించిన – అన్నమయ్య పదాల సంపుటాలు 27.

6.తే॥గీ॥ అతని యిల్లాలును "శివకామమ్మ" గారు
పుట్టుమచ్చను పచ్చల పొడవు వోలె
చెవిని ధరియించు అన్నలక్ష్మీమతల్లి
అడిగి నన్నమ్ము వెట్టిన అమృతవల్లి ॥


7.తే॥గీ॥ పెద్ద కొడుకయి యున్నంత ప్రీతి జూపి
కార్తికేయుండు శివునిలో కలిసి పోయె
భారతీ – చంద్రమణియు కుమారితలుగ
భవ్య గురుకుటుంబము శోభలను గురిసె.

8.మ॥ ప్రతి లేనట్టి సహిష్ణు వౌచు భగవాన్ – పద్మమ్మతో ధ్యాస వె
ట్టి, తపోదీక్షగ యత్నముల్ సలిపి టీటీడీ కళాశాలలో
ప్రతిమన్ తండ్రిది నిల్పగా, విజయతీరంబందె – శ్రీతిర్పతిన్
శతవర్షోత్సవమయ్యె పూర్ణము పితృ శ్రద్ధాలసద్భక్తితోన్ ॥

శుభకృత్
శ్రావణశుక్రవారం
29.7.2022

**గురుమూర్తికి**
సాష్టాంగ నమస్కారములతో
మీ నాగఫణిశర్మ (సం)

# అపర వ్యాస మహర్షి - శ్రీ గౌరిపెద్ది గురుదేవులు



**మేడసానిమోహన్**
పంచ సహస్రావధాని,
తిరుపతి.

నేను టిటిడి యాజమాన్యం లో ఉన్న శ్రీ గోవిందరాజస్వామి కళాశాలలో బి.ఏ చదువుచున్న రోజులవి. నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడే అష్టావధానములు నిర్వహించి యుండుట పండిత లోకమునకు పరిచితమైన అంశమే. ఆ రోజులలో అంటే 1974 లో శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నేను అష్టావధానమును నిర్వహించినాను. ఆ యవధాన సభలో ఆ నాడు టిటిడి ఓరియంటల్ కాలేజీలో అధ్యాపకులుగానున్న శ్రీ ఎస్.బి రఘునాథాచార్యులు, శ్రీ.పి.వి. శ్రీనివాసమూర్తి, శ్రీ.డి.నాగసిద్దా రెడ్డి, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య వంటి ప్రముఖులు పృచ్ఛకులు గా విచ్చేసినారు. సరస్వతీదేవి అనుగ్రహం తో ఆ నాడు అష్టావధాన దిగ్విజయంగా నిర్వహింప గలిగినాను. ఆ నాటి సభానంతరం నాటి పృచ్ఛక వర్యులలో నొకరైన శ్రీ.పి.వి. శ్రీనివాసమూర్తి గారు నాతో ప్రత్యేకంగా సంభాషిస్తూ "అయ్యా! నీవు మా గురువు గారు గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారిని ఎరుగుదువా?" – అని అడిగినారు. అప్పటికే సుప్రసిద్ధులైన ఆ మహానుభావుని గురించి ఎంతో విని యున్నానని వారితో అన్నాను. ఆ తరువాత శ్రీపి.వి. శ్రీనివాసమూర్తి గారి ద్వారానే నేను శ్రీగౌరిపెద్ది గారిని వారి స్వగృహంలో కలుసుకోవడం, ఆశీర్వాదం పొందడం – వంటి సన్నివేశాలు నాకు ఎప్పటికీ తీపి గురుతులే. ఆ నాటి నుండి నేను ఎప్పుడు శ్రీ గౌరిపెద్ది వారిని కలిసినా నాపై ఎంతో వాత్సల్యామృతం వర్షించే వారు. నేను సంస్కృతాంధ్ర సాహిత్యాలను ప్రాచ్యసంప్రదాయంలో చదువుకున్నా గానీ ప్రాచ్యకళాశాల విద్యార్థిని కాదు. అందువల్ల శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి ప్రత్యక్ష విద్యార్థిని కాలేకపోయాను. అయినా మాదృశులకు వారు గురుస్థానీయులే.

ఆ తరువాత కాలక్రమంలో అంటే 1979–80 ప్రాంతాలలో నేను పి.హెచ్.డి విద్యార్థిగా "అన్నమయ్య భాష – వర్ణనాత్మక వ్యాకరణం" – అనే అంశంపై సిద్ధాంత వ్యాసం వ్రాసే ప్రణాళిక లో మళ్ళీ శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారిని కలుసుకోవడం జరిగింది. ఆ రోజులలో వీరు టిటిడి వారి "అన్నమయ్య వాఙ్మయ పరిష్కరణ విభాగమునకు ప్రత్యేకఅధికారిగా ఉండేవారు. ఆ సందర్భంలో నా పరిశోధన వ్యాసాన్ని పూర్తి చేయడం లో వీరి సూచనలు, సలహాలు నాకు ఎంతగానో తోడ్పడ్డాయి. ఆ విధంగా నేను ఈ మహానుభావునికి ప్రత్యక్ష విద్యార్థిని యైనట్లే గదా! యని సంతృప్తి వహించినాను. నా పరిశోధన పర్యవసానంగా 1982 లో నేను అన్నమాచార్య ప్రాజెక్టు టి.టి.డిలో పరిశోధక సహాయకుని (Research Assistant) గా నా ఉద్యోగ జీవితమును ప్రారంభించినాను 1985–86 లో అదే సంస్థకు సంపూర్ణ స్థాయిలో సంచాలకునిగా నియమింపబడినాను. అప్పటికి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు టి.టి.డి సర్వీసు నుండి విశ్రాంతులైనా, టిటిడి లోని వివిధ ధార్మికసంస్థలు నిర్వహించే సదస్సులలో పాల్గొని ఉత్తేజకరమైన ప్రసంగాలతో భక్తలోకాన్ని ఎంతగానో అలరించినారు

అన్నమయ్య వాఙ్మయ పరిష్కరణ మహాయజ్ఞంలో శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు ప్రధాన దీక్షితులు – అని చెప్పక తప్పదు ఎవ్వరైనా ఈ అంశాన్ని పరమ సత్యంగా అంగీకరింపవలసినదే. ఈ పరిష్కరణా ప్రస్థానంలో వీరికంటే ముందు శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీ పండిత విజయ రాఘవాచార్యులు, శ్రీ కె.టి. రాఘవాచార్యులు, శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి, శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ మొ॥ మహోదయులు వారి వారి సేవలు ఇతోఽధికంగా అందించినారు. కాని మహాభారత ఆంధ్రీకరణలో సింహభాగాన్ని తిక్కన్న గారు దక్కించుకున్నట్లే ఈ పరిష్కరణ తపస్సు లో సింహభాగం శ్రీ గౌరిపెద్ది మహర్షికే దక్కుతుంది. అన్నమయ్య సంకీర్తనా సంపుటాలకు, ఇతర లఘుకృతులకు వీరికంటె ముందు పైన పేర్కొన్న పెద్దల పీఠికలు ఉన్నా వీరు సంతరించిన పీఠికలతోనే స్పష్టత ఏర్పడి ఈ సారస్వతంపై కృషిసల్పే భావి పరిశోధకులకు దిశానిర్దేశాన్ని ఏర్పరచినవి. తాళ్ళపాక కవుల – భక్తి వాఙ్మయం ఒక సారస్వతక్షీర సాగరం – అంటూ పూజ్యులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు అభివర్ణించినారు. అయితే ఆ సారస్వత క్షీర సాగరం లోని రత్నాలను బహుళంగా వెలికితీసి భక్తలోకానికి, సాహిత్య జిజ్ఞాసువులకు రససంతర్పణం చేసిన పరమ భాగవతులు శ్రీ గౌరిపెద్ది వారే.

తాళ్ళపాకకవుల సంపుటాలకు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు సంతరించిన పీఠికలలో స్పష్టత, భావి పరిశోధకులకు దిశానిర్దేశం – ఎలా ఆవిష్కరించినారో కొంత విశదీకరించే ప్రయత్నం చేస్తాను.

**(1) పరిష్కరణలో పారదర్శకత**

అన్నమయ్య తొలి తెలుగు వాగ్గేయకారులే కాక తొలి తెలుగు వ్యావహారిక కవి కూడ. సంప్రదాయ వ్యాకరణములను, భాషాసంప్రదాయములను అతిక్రమించి సర్వతంత్ర స్వతంత్రుడై, ప్రజాబాహుళ్య వ్యవహారములందలి పదజాలమునుకూడ తన రచనలో విరివిగా చొప్పించినాడు. ఆనాటి వ్యవహారములోనున్న శబ్దములు పెక్కులు నేడు వ్యవహారమున లేవు. అటువంటి శబ్దములకు అర్థం నిర్ణయమును గావించుటలో శ్రీ గౌరిపెద్దివారు విశేషకృషి సల్పినట్లు తెలియుచున్నది. (1)అగ్నీకరణం, (2) ఆలజాలము, (3) గడిచీటి (4) దంగుడు (5) వట్టఁగట్లా (6) సంతపాక లంజ (7) సాగ బ్రహ్మమయాఖ్యుని (8) సా సముఖా – మొ॥ శబ్దములకు అర్థ నిర్ణయము గావించుటలో వారు అనుసరించిన సహేతుక సత్యదృక్పథం – వివేచనలు భావి నిఘంటునిర్మాతలకు, శబ్ద శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలిచాయి. నన్నయ తిక్కనాది సంప్రదాయ కవుల గ్రంథములకు పీఠికలు సంతరించుట ఒక ఎత్తు. కాని అన్నమయ్య వంటి వ్యావహారిక పదకవి గ్రంథములకు పీఠికలు సంతరించుట అధిక పరిశ్రమతో కూడిన వ్యాసంగము. ఇట్టి వ్యాసంగమున శ్రీ గౌరిపెద్ది వారు సంపూర్ణముగా కృతకృత్యులైనారు. గత పరిష్కర్తల కంటె తాను అనుసరించిన విలక్షణ విధానములను వారే తన మాటలలో ఇట్లు విశదీకరించినారు.

(1) రేకులో అపపాఠముండి పరిష్కర్తల పరిష్కరణములలో మంచి పాఠమెక్కి యున్నచో ఆ పాఠము నట్లే నిలిపి "రేకు" – అని పాదదీపికలో చూపి యుండుట.

(2) రేకులోని పాఠము వ్యావహారికముగనో, మాండలికముగనో ప్రసిద్ధార్థమై యున్నప్పుడు, పరిష్కర్తలు దానిని మార్చియున్నచో రేకుపాఠమును పైనచూపి, పూర్వముద్రిత పాఠమును (పూ.ము.పా) పాదదీపికలో చూపి యుండుట.

(3) రేకు నందును, పరిష్కర్తల పాఠములోను కొంత వింతగా కనబడినపుడు మంచిగా నాకు తోచిన పాఠమును పైన చూపి పాదదీపికలో పూ ము పా రేకు – అని చూపి యుండుట.

పై నియమములను ఏర్పరచుకొనుటకు అన్నమయ్య సారస్వతమునే కాక, పూర్వ పరిష్కర్తల వ్యాసములను కూడ సునిశిత అధ్యయనముతో పరిశీలించి యుండుట మిక్కిలి క్లేశముతో కూడిన పరిశ్రమ.

**(2) అన్నమయ్య రచనల లోని దేశీయత స్పష్టపరచుట**

అన్నమయ్యను సాహిత్యవిమర్శకులు అచ్చమైన దేశీయకవిగా పేర్కొంటూ ఉంటారు. అన్నమయ్య తిరుగాడిన మండలాలు, వైష్ణవ క్షేత్రాలు, ప్రత్యేకంగా ఆ యా ప్రదేశాలలోని కొండ కోనలు, కనుమల పేర్లు కూడ ఆ పదకవి తరచూ పేర్కొంటూ ఉంటాడు. శ్రీ గౌరిపెద్ది గారు అటువంటి కీర్తనలను పాఠకునికి అధ్యయనంలో స్పష్టత ఏర్పడటానికై ప్రత్యేకించి ఉదాహరిస్తూ ఉంటారు. అన్నమయ్య జన్మస్థలమైన తాళ్ళపాక పరిసరాలలో ఉండే కొండ కనుమలను పేర్కొన్న ఈ క్రింది సంకీర్తన ఆవిధముగానే ఉదాహరించినారు.

**“సొంపుల నీవదనపు సోమ శిల కనుమ**
**యింపు లెల్ల జేకొనఁగ నిల్లు నీ పతికి**
**కలికి నీ పిఱుదనే గద్దె రాతి కనుమ**

**మొల నూళ్ల లతలనే ముంచుకొన్నది**
**కలయఁ బోక ముదినే కట్లు వడ్డది**
**అలరు  విలుతు దారి కడ్డము నీపతికి**
**ఇదివో నీనెమ్మోవి యెఱ్ఱ శిల కనుమ**

**కదిసి లేఁ జిగురులఁ గప్పుకొన్నది**
**వదల కింతకుఁ దల వాకిలైనది**
**మదనుని బారికి మాటువో నీపతికి**
**కాంత నీ చిత్తమే దొంగల సాని కనుమ**

**యింతటి వేంకటపతి కిరవైనది**
**పంతపు నీ గుబ్బలే గుబ్బలి కొండ కనుమ**
**మంతనాల కనుమాయ మగువ నీపతికి** (5 స. – 115)

(3) అన్నమయ్య అధ్యాత్మ దృక్పథమును, శృంగార వైశిష్ట్యములను, భాషావిశేషములను స్పష్టీకరించుట పట్ల తన పీఠికలలో వీరు విశేష శ్రద్ధ చూపిస్తారు.

(4) అన్నమయ్య తాను పూర్వ కవుల చేత ఏవిధంగా ప్రభావితుడైనాడో, అలాగే భవిష్యత్ కవులను ఎలా ప్రభావితం చేసినాడో వీరు సోదాహరణంగా వివరిస్తారు.

(5) ఉపమానములను పేర్కొనడంలోకాని, అలంకారములను ప్రయోగించడంలోగాని, నాయికా నాయక మనస్తత్వ ఆవిష్కరణలవంటి అంశముల వర్ణనలలోగాని అన్నమయ్య అనుసరించిన ప్రత్యేక దృక్పథాన్ని సోదాహరణంగా వివరిస్తారు. ఏ సంపుటానికైనా సరే! శ్రీ గౌరిపెద్ది వారు సంతరించిన పీఠిక చదివితే ఆ సంపుటంలో అన్నమయ్య వర్ణించిన వేంకటేశ్వరవైభవం, అలమేలుమంగా తత్త్వం, – ఇత్యాది అంశాల పట్ల పాఠకునికి సముచిత ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. అధునాతన కాలంలో గ్రంథపరిష్కరణ, పాఠనిర్ణయాదులు ప్రత్యేక పరిశోధనాంశాలుగా వివిధ విశ్వవిద్యాలయాలలో పిహెచ్.డి సిద్ధాంత వ్యాసాలు వెలువడుతున్నాయి. ఆ కోణంలో పరిశీలిస్తే శ్రీ గౌరిపెద్ది వారి పీఠికలపై, పరిష్కరణ విధానాలపై కొన్ని సిద్ధాంత వ్యాసాలు వెలువరింపవచ్చు.

1989–90 ప్రాంతాలలో నేను రాజంపేట లోని "త్రిమత వేదిక" అను సంస్థ ఆధ్వర్యములో అష్టావధానం నిర్వహించినాను. ఆ యవధాన సభా నిర్వహణ శ్రీ గౌరిపెద్ది గారి కుమారులు, నాకు సోదరతుల్యులునైన శ్రీ భగవాన్ పర్యవేక్షణలో జరిగింది. ఆ సమయంలో మిత్రులు భగవాన్ రాజంపేటలో ఏదో బ్యాంకులో ఉన్నతాధికారిగా పని చేస్తున్నారు. ఆ నాటి నా అవధాన సభకు శ్రీగౌరిపెద్ది రామ సుబ్బ శర్మ గారే అధ్యక్షులుగా వ్యవహరించినారు. నాటి పృచ్ఛకులలో ఒకరు నన్ను ఏదో అశ్లీలముగా, సారస్యవిదూరముగా ప్రశ్నించు ప్రయత్నము చేయగా, అధ్యక్ష స్థానంలో ఉన్న శ్రీగౌరిపెద్ది వారు ఆయనను సుకుమారముగా మందలించి నియంత్రించినారు. ఆ రోజులలో పుట్టపర్తి నారాయణాచార్యులు, శతావధాని సి.వి.సుబ్బన్న, దివాకర్ల వేంకటావధాని వంటి మహోదయులు ఎవరు తిరుపతికి వస్తే తప్పకుండా వీరి ఆతిథ్యం స్వీకరింపవలసిందే. కొంతమంది పెద్దలు రెండు

మూడు రోజులు కూడ అక్కడే బసచేయడం కూడా నేను చూచినాను.


శ్రీ గౌరిపెద్ది వారు తన పీఠికలలో సందర్భానుసారంగా గతపరిష్కర్తలైన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ ప్రభృతులను ఎంతగానో కొనియాడి యుండుట వీరి మహత్తర సంస్కారానికి నిదర్శనం.

**సూరి లోక సమ్రాట్టు, శ్రీ గౌరిపెద్ది**
**రామసుబ్బశర్మ గురు విరాజమాన**
**పాదమకరంద సేవనా భాగ్యమబ్బె**
**నేటి ఈ వ్యాసరచనతో నియతీ నాకు!**


**– మేడసాని మోహన్.**

1–8–2022

Camp at Chicago (U.S.)



**శ్రీ గౌరిపెద్ది వారు – కవి సామ్రాట్**
**జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి అరుదైన కలయిక**



# ఆదర్శ గురుదేవుడు

అవధాని శ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ
ద్రోణాచలం
నంద్యాల జిల్లా
చరవాణి - 94400 79522

శ్రీగురుభ్యోనమః

**శ్లోకం॥ సంసార విషవృక్షస్య ద్వేఫలే అమృతోపమే ।**
**కావ్యామృతరసాస్వాదః సల్లాప స్సజ్జనై స్సహ ॥**

సంసారమనే విషవృక్షానికి రెండేరెండు అమృతఫలాలు కాస్తున్నాయి. కావ్యామృతరసాస్వాదనం ఒక పండు కాగా సజ్జనులతో సల్లాపాలాడే అవకాశం దక్కడం రెండో ఫలం. ఈ రెండు ఫలాలను ఒక్కరే అందించగలిగితే వారే మహితాత్ములు-అందుకొన్నవారు అదృష్టవంతులు. ధన్యజీవులు.

ఈ రెండు అమృతఫలాల మధురరసాన్ని ఆస్వాదించే అవకాశం, అదృష్టం నాకు లభించింది.

అవి నేను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో చదువుకొంటున్న రోజులు. పాఠం చెప్పిన గురువులు కొందరు. ప్రబోధం చేసిన గురువులు కొందరు. ప్రభావితం చేసిన గురువులు కొందరు. అలా ప్రభావితం చేసిన గురువులలో కనిష్ఠికాధిష్ఠితులు వేదమూర్తులు బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. శ్రీ గౌరిపెద్ది వారికి శిష్యుడు కావడమే ఒక గర్వకారణం. జిజ్ఞాసువులైన శిష్యులకు అట్టి గురువు లభించడం పురాకృతసుకృత విశేషం. అంతేకాదు. అది జన్మాంతర ఋణాను బంధం, “భావ స్థిరాణి జననాంతర సౌహృదాని” అని కదా కాళిదాస సూక్తి. వివరాల్లోకి వెళితే.....

భారతీయ సంస్కృతి సంప్రదాయ మూలాలు వేదాల్లో, ఉపనిషత్తుల్లో ప్రతిపాదితాలై ఉన్నాయి. ఈ వేదవేదాంత సూక్తులు భారతీయులకే కాదు అన్ని మతాలవారికి, అన్ని వర్గాల వారికి, అన్ని ప్రాంతాల వారికి, వయోభేదంగాని, స్త్రీ పురుష వివక్ష గాని లేకుండా అందరికి అన్వయమయ్యేటట్లుగా సదుపదేశంగావిస్తున్నాయి. అందరికి శిరోధార్యమవుతున్నాయి. కావాలంటే ఒందు రెండు సూక్తులను పరిశీలిద్దాం.

"మాతృదేవోభవ" – కన్నతల్లిని దేవతగా భావించు – పూజించు, "పితృదేవోభవ" కన్న తండ్రిని దేవునిగా భావించు, పూజించు – "ఆచార్యదేవోభవ" గురువును దేవునిగా భావించు, పూజించు. "అతిథిదేవోభవ". ఇంటికి వచ్చిన అతిథినికూడ దేవునిగా భావించు, స్వాగతించు, సమాదరించు. అని తైత్తిరీయోపనిషత్తు ప్రవచిస్తోంది. ప్రపంచంలో ఎక్కడైతేనేం? ఎవడికైతేనేం? ఎప్పుడైతేనేం? అమ్మ–నాన్న ప్రత్యక్ష దైవ స్వరూపులు. మనకు పరాయి వారుగా అనిపిస్తున్నా, కనిపిస్తూన్నా గురువు దైవ సమానుడే, అతిథి దైవ సమానుడే – అనే అంశాన్ని కాదనవారుగలరా? ఈపై సూక్తులలో ఒకటైన "ఆచార్య దేవోభవ" అనే సూక్తి గురువుని అమ్మా నాన్నల పంక్తిలో ఎందుకు పేర్కొన్నట్టు? అమ్మ నాన్నల స్థాయికి ఏమాత్రం తీసిపోనివాడనేగా! అమ్మా నాన్నలంటే జన్మ నిచ్చినవారు, పెంచి పోషించినవారు, విద్యా బుద్ధులు నేర్చుకొనుటకు దోహదం చేసినవవారు. తమ బ్రదుకులను పణంగాపెట్టి కలిగిన సంతానాభ్యుదయం కోసం సర్మాత్మనా పాటుపడేవారు. మఱి గురువు? అమ్మ నాన్నల పంక్తిలో వారి తరువాతి స్థానం సంపాదించుకోవడానికి ఆయన అందించిన, అందిస్తున్న చేయూత ఏమిటో? చైతన్య దీప్తి ఏమిటో? అభ్యుదయమేమిటో? ఆనంద స్ఫూర్తి ఏమిటో పరిశీలించాల్సిందే!

**శ్లోకం॥ పరోఽ పి హితవాన్ బంధుః బంధు రప్యహితః పరః ।**
**అహితో దేహజో వ్యాధిః హితమారణ్య మౌషధమ్ ॥**

మన కెవ్వడు మేలు చేస్తాడో పరాయివాడైనా వాడే మనకు బంధువు. మనకెవ్వడు కీడుచేస్తాడో మన రక్తం పంచుకొని పుట్టినవాడైనా సరే వాడు శత్రువు. మన శరీరంలో పుట్టిన పుండు లేదా కురుపు మనకు హాని చేస్తున్నది కనుక అది మనకు శత్రువు. దాన్ని తొలగించుకోవలసిందే. దానికి మార్గం మందు. అదెలా మనకు లభిస్తుంది ? ఎక్కడో కొండల్లోనో, అడవుల్లోనో పుట్టి పెరిగిన ఔషధపు మొక్క మన రోగాన్ని పోగొట్టి ఆరోగ్యాన్ని ఆనందాన్ని చేకూరుస్తున్నది. మనమేనాడు ఆ మొక్కను నాటలేదు. ఎరువువేయలేదు, నీరు పోయలేదు. కంచె పెట్టి కాపలా కాచినదీలేదు. కాని ఆ ఔషధం మొక్క తనను తాను త్యాగం చేసుకొని మన మేలుకోసమే బ్రదికింది, ఎదిగింది, మనకు నిస్వార్థంగా సహకరించి మనము ఎదిగేటట్టు చేసింది. ఇంతచేసిన, చేస్తున్న ఔషధం మొక్క మనకు ఆదరణీయం కాదా? ఆరాధనీయం కాకూడదా? గురువు ఔషధం మొక్క లాంటి వాడు. మన కుటుంబంతో, బలగంతో ఏ బంధుత్వం లేకపోయినా ఆత్మీయంగా చేరదీసి విద్యాబుద్ధులు గఱపి

మనలోని అజ్ఞానాన్ని పోగొట్టి, విజ్ఞాన అమృతాన్ని ప్రసాదించి మనుష్యునిలోని మానవత్వం పరిమళించే లాగా దారి చూపేవాడు, దరి చేర్చేవాడు ధర్మదాత గురువు.

**కం॥ గురువులు ప్రియశిష్యులకున్**
**పరమ రహస్యములు తెలియబలుకుదురు ॥**

అని భాగవతం అంటోంది. అవును. ఆ మాట అక్షరాల నిజం.

ద్రోణాచార్యుడు తన ఒక్కగానొక్క కొడుకు అశ్వత్థామ కోరినా కూడ బ్రహ్మాస్త్రోపదేశం చేయలేదు. తన శిష్యుడైన అర్జునుడు కోరకున్నా – తానే స్వయముగా

**"అన్న! ధనుర్ధరు లన్యులు నీకంటె**
**అధికులుగాకుండునట్లు గాగ**
**గఱపుదు విలువిద్య ఘనముగా నని పల్కి**
**ద్వంద్వ సంకీర్ణ యుద్ధముల తెఱగు**
**రథ, మహీ, వాజి వారణముల పైనుండి**
**దృఢ, చిత్ర, సౌష్ఠవ స్థితుల నేయ**
**తే॥గీ॥ బహువిధ వ్యూహ భేదనోపాయములను**
**సంప్రయోగ రహస్యాతిశయము గాగ గఱపె"**

– అంటోంది భారతం. బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని ఉపసంహారాన్ని బోధించాడు ద్రోణాచార్యుడు. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారన్నట్టు "శిష్యులన్న ఎడదంగల ప్రేముడి చెప్పలేని మెత్తన" అంటే ఇదే కాబోలు. గురువు మహోన్నత వ్యక్తిత్వాన్ని, నిర్వ్యాజశిష్యవాత్సల్యాన్ని తెలుసుకోవడానికీ ఉదాహరణ చాలు. అలాగే గురువు విశిష్టతను మహాత్మ్యాన్ని ప్రకటిస్తూ.

**శ్లోకం॥ "ఉద్యంతు శత మాదిత్యం ఉద్యంతు శత మిందవః ।**
**న వినా విదుషా వాక్యం నశ్యంతి ఆభ్యంతర స్తమః ॥ "**

వందమంది సూర్యులుదయింతురుగాక! వందమంది చంద్రులుదయింతురుగాక! బాహ్య ప్రపంచంలో వ్యాపించిన చీకటిని పోగొట్టగలరేమోగాని మానవుల హృదయాంతరాళాల్లో క్రమ్ముకొన్న

అజ్ఞాన అంధకారాన్ని పోగొట్ట జాలరు. గురువు మాత్రమే ఆపని చేయగలడంటే సూర్య చంద్రప్రభావాన్ని మించిన మహత్వపూర్ణ స్వభావుడు గురువు. అట్టిగురుసేవ లభ్యం కావడం పురాకృత సుకృతం కదా!

గురుశిష్య సంబంధం ఈ జన్మది కాదు. గత జన్మలనుండి పరంపరగా సాగివస్తున్న బంధమది. శ్రీరామకృష్ణ పరమహంస – వివేకానందుల జీవితములే ఇందులకు తార్కాణం.

నరేంద్రుడు (వివేకానందుడు) తనకు భగవంతుని చూచే సదవకాశం కల్పించగల మహత్వ పూర్ణుడైన యోగి కోసం అన్వేషిస్తున్నప్పుడు దక్షిణేశ్వరంలో కాళికామాత ఆలయంలో ఉన్న రామకృష్ణ పరమహంస గూర్చి అక్కడికి వెళ్ళాడు. శ్రీరామకృష్ణపరమహంస నరేంద్రుని అల్లంతదూరములో ఉండగనే సంతోషంతో "రా! నరేంద్ర! నీ కోసమే వేచియున్నాను" అని సాదరంగా పిలిచినాడట. ఆ పిలుపునకు నరేంద్రుడు ఆశ్చర్యపడి రామకృష్ణ పరమహంసతో "నేనిప్పుడే తొలిసారిగా మీ వద్దకు వస్తున్నాను. నాపేరు మీ కెలా తెలుసు?" అని ప్రశ్నించాడట. అందులకు పరమహంస "మన బంధం ఇప్పటిదా? పూర్వజన్మలో మీరు నా గురువు. ఒక సత్కార్య నిర్వహణ కోసం నన్ను "నీవు ముందుగా భూలోకానికి వెళ్ళు. నేను తరువాత వస్తాను అని ఆదేశించి యున్నారు. అందుకే నేను ముందుగా వచ్చి నీరాక కోసం ఎదురు చూస్తున్నాను. ఇక కావలసిన కార్య నిర్వహణ భారం అంతా నీపైనే ఉన్నది" అని అన్నాడట. ఆ తరువాత నరేంద్రుడే వివేకానందుడను పేర దేశవిదేశాల్లో పర్యటించి భారతీయ సంస్కృతిని, సనాతనధర్మవిశిష్టతను ప్రచారం చేశాడు. ఈ సంఘటన ద్వారా గురుశిష్యసంబంధం తరతరాలుగా, జన్మ పరంపరగా కొనసాగేదని తెలుస్తున్నది.

ప్రస్తుతం నాగురుదేవుల సంగతినిచూద్దాం. నేను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో చదువుకొంటున్న రోజులలో వేదమూర్తులు, శతావధాని బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు మాకు గురువుగా పాఠ్యాంశాలను బోధించేవారు. నేను వారి వాగ్ధోరణికి, శిష్యవాత్సల్య స్వభావానికి, పాండితీప్రకర్షకు ఆకర్షితుడనై తిరుపతి పొర్లవీథిలోని వారింటికి వెళ్ళేవాడిని. వారు నన్ను పుత్రవాత్సల్యంతో చేరదీసి అప్పుడపుడే అవధానరంగంలో అడుగు పెడుతున్న నాకు ఎన్నో మెలకువలు బోధించారు. ప్రోత్సహించారు. బహువిధ కావ్యాలలో మహాకవుల ప్రయోగవిన్యాసాలను, విశేషాంశాలను కోకొల్లలుగా వివరించారు. శ్రీగౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు అంటే "నడచి వస్తున్న సంస్కృతాంధ్ర గ్రంథాలయం" అని ఆరోజుల్లో అందరూ ప్రశంసించేవారు. అవునో కాదో మీరే చూడండి.

ఒకప్పుడు వాల్మీకిరామాయణంలోని ఘట్టాలను ఉటంకిస్తూ పితృధర్మం, పుత్రధర్మం, భార్యాధర్మం, మాతృధర్మం, సోదర ధర్మం, ప్రభుధర్మం ఇలా ధర్మస్వరూపాన్ని ఆవిష్కరిస్తూ – ఉన్నప్పుడు నాకున్న సందేహాన్ని గూర్చి ప్రశ్నించాను. అదేమిటంటే "యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపడిపోగా శ్రీరాముడు లక్ష్మణుని గూర్చి పరితపిస్తూ....

**శ్లోకం॥ దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః ।**
**తం తు దేశం న పశ్యామి యత్రభ్రాతా సహోదరః ॥**

అని అంటాడు. ఈ సందర్భంలో వాల్మీకి ప్రయోగించిన "భ్రాతా సహోదరః" అనే ప్రయోగాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? భ్రాత – సహోదర – ఈ రెండు శబ్దాలు సమానార్థకాలే కదా! పునరుక్తి దోషం అవుతుంది కదా? మరొక మాట – శ్రీరామునికి లక్ష్మణుడు తమ్ముడే గాని సహోదరడు – అంటే రాముడు లక్ష్మణుడు ఒకే మాతృ గర్భంలో జన్మించిన వారు కాదు కదా? కాబట్టి సహోదరుడెలా అవుతాడు? అని సందేహాన్ని వెలిబుచ్చినాను. అప్పుడు గురువుగారు వాల్మీకి శబ్ద ప్రయోగాన్ని విశ్లేషిస్తూ భ్రాత = తమ్ముడు అని అర్థం సరే. సహోదరః అనే శబ్దాన్ని సహః – అదరః – సహః(స్) అంటే పరాక్రమం, సాహసం చేత – అదరః – భయంలేనివాడు అని అర్థం వచ్చేలా విడదీసుకోవాలిగాని సహ + ఉదరః – సహోదరః – అని గుణ సంధిగా చూడరాదు అని వివరించారు. ఈ ప్రయోగంతో లక్ష్మణుని పరాక్రమాన్ని, నిర్భయత్వాన్ని రాముని నోట వాల్మీకి పలికించాడని నా సందేహాన్ని నివృత్తి చేస్తూ = పాఠకుడు కవి హృదయాన్ని కనిపెట్టి కావ్యాన్ని చదువగలిగితే సంపూర్ణ కావ్యామృత రసాస్వాదనకు మార్గం సుగమం అవుతుందన్నారు. "పరేంగితావగాహబుద్ధి యొక్కటియే పండితుని విశేషము'' అని చెప్పి. ''ఎదుటి వారి మనోభావాలను ఆకళించుకొని మసలుకోవడం సంతోషాన్నిస్తుంద"ని నాకు సూచించారు. గురువుగారి కావ్యవ్యాఖ్యానకౌశల్యానికి ఇది యొక మచ్చుతునక మాత్రమే.

మఱొక సందర్భంలో తరగతి గదిలో ఏకలవ్యుని వృత్తాంతం ప్రస్తావనకు వచ్చింది. విద్యార్థులు కొందరు ద్రోణాచార్యుని వ్యక్తిత్వాన్ని తప్పు పడుతూ – ఏకలవ్యునికి ఏమీ నేర్పక పోయినా అర్జునుని అసూయను తృప్తి పఱచడానికి ఏకలవ్యుని బొటనవ్రేలిని కోసి గురుదక్షిణగా ఇమ్మనడం ద్రోణాచార్యుడు చేసిన పెద్ద తప్పిదం. అది అన్యాయం, అక్రమం, అధర్మం అంటూ ముక్త కంఠంతో వాదించారు.

గురువుగారు శాంతంగా ప్రతిస్పందిస్తూ – విద్యార్థులతో “మీరు నాణెమునకు ఒక వైపున మాత్రమే చూచి మాట్లాడుతున్నారు. మరొకవైపు కూడ గమనించండి. చెబుతావినండి. ద్రోణాచార్యుడు ఏకలవ్యుని బొటనవ్రేలు కోసివేయించి వెళ్ళిన తరువాత కొంతకాలానికి పౌండ్రక వాసుదేవుడు శ్రీకృష్ణుని పట్ల ద్వేషంతో ద్వారకానగరంపై దండెత్తినాడు. ఆనాడు పౌండ్రక వాసుదేవుని సైన్యంలో ఏకలవ్యుడు కూడ ఉన్నాడు. పౌండ్రక వాసుదేవుడు దండెత్తినప్పుడు ద్వారకలో శ్రీకృష్ణుడు లేడు. అయినా బలరాముడు, సాత్యకి, అక్రూరుడు, ఉద్ధవుడు మొదలైన యాదవవీరులు పౌండ్రకవాసుదేవుని ఎదుర్కొన్నారు. ఆ సందర్భంలో ఏకలవ్యుడు విజృంభించి ఒక్కడే –

**శా॥ వీరాగ్రేసరుడేకలవ్యుడు ధనుర్విద్యానవద్యుండు, దో**
**స్సార ఖ్యాతి అరాతి రాజుల రణోత్సాహంబు దూరంబుగా**
**పారావార విహార మందర గిరి ప్రారంభశుంభద్గతిన్**
**తేరొప్పారగ పేరు వాడి కలచెన్ ధీరోద్ధతానీకమున్**

**.............. హస్త**
**లాఘవము వింతగానేకలవ్యుడెచట.**
**ఎచట నున్నాడు సాత్యకి?, ఎందుబోయె**
**హలధరుండని అదలించి అంతబోక....**

**మ॥ సమ దానేకప చక్రవర్తి నవ కాసారంబులో నాదుచం**
**దము చూపన్ కరదీపికా నికరమున్ దట్టించి రాజన్య సై**
**న్యము చెల్లా చెదరయ్యె గుంపులగుచోనవ్వీరుడస్త్రంబులన్**
**జమరన్ జొచ్చిన నొచ్చి విచ్చిపఱచెన్ చక్రాతిపై పోకలై ॥**

**శా॥ ఈ చందంబున ఏకలవ్య విజయంబింతంత కాకున్న వీ**
**రాచారంబునుతించె ...............**

అని ఏకధాటిగా ఈ ఘట్టాన్ని రెట్టించి ఉద్ఘాటించి అయ్యా! అర్జునుడు కూడ అందుకోజాలని గురు అనుగ్రహం – ఆశీర్వాదం ఏకలవ్యుడందుకొన్నాడు. ఇది బయటికి కన్పడకపోవచ్చు గాని గురు

అనుగ్రహం వల్లనే ఏకలవ్యుడొక్కడే బలరామ, సాత్యకి, అక్రూర, ఉద్ధవాదులను యుద్ధంలో జయించినాడంటే అది సామాన్య విషయమా ! అంతేకాదు. ఈనాటికి లోకంలో గురుశిష్య సంబంధాన్ని చెప్పుకొనేటప్పుడు "ఏకలవ్యశిష్యుణ్ణి" అంటారే గాని "అర్జున శిష్యుణ్ణి" అని ఎవరరూ అనరు కదా! అశాశ్వతమైన, భౌతికమైన కాయం పోయినా అజరామరమైన కీర్తి అర్జునాదుల కీర్తికి తక్కువకాకుండా, ఈర్ష్యాసూయలకు అతీతుడై శిష్యుడంటే ఇలా ఉండాలి అనేటట్టు జీవించ గలిగినాడు. నిష్కల్మషమైన జన్మసంస్కారంగల ఏకలవ్యుని జీవలక్షణాన్ని గుర్తించిన గురువు ద్రోణుడు. కావుననే అతనికి కల్పాంత కీర్తి చేకూరే అవకాశాన్ని అదృష్టాన్ని కల్పించాడు. అని గురువు గారు ఉత్తరహరివంశములోని అంశాలను వివరించారు. గురువుగారి వైదుష్యానికి, గంభీరమైన ఆలోచనాసరళికి, ఆపాదనస్తక స్పష్టనిశిత కావ్యపరిశీలనా నైపుణ్యానికి ఆనందపడి ప్రశంసలతో ముంచెత్తినారు.

ఒక రోజు మహాకవి పింగళి లక్ష్మీ కాంతం కవిగారు శ్రీ గౌరిపెద్ది వారింటికి వచ్చినప్పుడు శ్రీనాథుని శృంగార నైషధం గూర్చి కావ్యచర్చ ప్రారంభం కాకా శ్రీపింగళి వారు ఒక విలక్షణ శబ్ద ప్రయోగాన్ని గూర్చి ప్రస్తావిస్తూ శ్రీగౌరిపెద్ది వారితో శ్రీనాథుడీ శబ్దాన్ని ఇదొక్క చోటనే ప్రయోగించాడనగా వెంటనే శ్రీగౌరిపెద్ది వారందుకొని అదేశబ్దాన్ని శ్రీనాథుడు మఱి రెండుచోట్ల ప్రయోగించాడని ఆపద్యాలను వినిపించారట. ఇలా సోదాహరణముగా చెప్పే పాటికి శ్రీపింగళి వారు ఆశ్చర్యచకితులై శ్రీగౌరిపెద్ది వారి నిశిత పరిశీలనా దృష్టిని, గ్రహణ – ధారణలను తెగమెచ్చుకొన్నారట. ఈ సంఘటన జరిగినప్పుడు శ్రీగౌరిపెద్ది వారి అంతేవాసి కర్నూలునివాసి శ్రీ ఇంద్రకంటి వేంకటేశ్వరులు గారు అక్కడే ఉండినారట. వారే స్వయముగా నాకీ విషయం చెప్పినారు. శ్రీనాథుని ఆ శబ్ద ప్రయోగమేమిటో గుర్తుకురావడం లేదన్నారు. శ్రీనాథుడన్నా – శ్రీనాథుని కవితలన్నా శ్రీగౌరిపెద్దివారికి పంచప్రాణాలు. శ్రీనాథుడే తాను, తానే శ్రీనాథుడు అనేంతగా అభిమానించేవారు. ఇది మా అనుభవంలోని మాటలు. ఇక అవధాన నిర్వహణ విషయానికివస్తే ఒక అవధాన సభలో శ్రీ గౌరిపెద్ది వారు అవధానికాగా ఆ సభలో పృచ్ఛకులలో మఱికొందరు శతావధానులు కూడ ఉండినారు. అందులో ఒక శతావధాని (పేరు నాకు తెలుసు చెప్పడం భావ్యంకాదని వ్రాయడంలేదు) సమస్యనిస్తూ

**ఉ॥ వర్జ్యముకాదు మాంస మధుపానము**
**బ్రాహ్మణ జాతి కెయ్యెడన్ ॥** అనే

సమస్య నిచ్చారు. ఈ సమస్య నియ్యడంలో ఇప్పుడు బ్రాహ్మణులు కూడ ఇతరులవలె మాంస మధు పాన మత్తులౌతున్నారన్న ఎత్తి పొడుపు. సహజంగా ఇది లోక వ్యవహారవిరుద్ధము. ఈ భావాన్ని సమంజసంగా ఉండేటట్లు పరిష్కారం చూపించాలి. ఈ క్లిష్టతకు తోడు ఛందఃపరంగా పద్యంలో రెండవ అక్షరం ప్రాస "ర్జ్య" – ఈ అక్షరమే పద్యంలోని తక్కిన మూడు పాదాలలో రెండవ అక్షరంగా ఉండాలి. నిఘంటువులలో సైతం 'వర్జ్యము'లాగా రెండవ అక్షరం 'ర్జ్య' గల పదాలే లేవు. మఱి పద్యం చెప్పడం ఎలా? బ్రాహ్మణులకు మాంస మధుపానము వర్జింప తగినవి కాదు అంటే స్వీకరింపదగినదే అనే లోక సదాచార వ్యతిరిక్త భావాన్ని ఎలా సానుకూలంగా మార్చుకోవడం? సామాన్యుడైతే ఇక అంతే.

అశేష ధిషణా ధురంధరుడైన శ్రీగౌరిపెద్ది వారి పద్యపూరణ చూడండి.

**ఉ॥ భర్జ్యము లౌచు నంజుడులు పాకమునన్ రుచినించవచ్చు పో**
**వర్జ్యము లేక వాని నొక వర్గమువారు భుజింప వచ్చు పో**
**మార్జ్యతగల్గుచోట అనుమానములేక భుజింప వచ్చు – ఆ**
**వర్జ్యము కాదు మాంస మధుపానము బ్రాహ్మణ జాతి కెయ్యెడన్**

**భర్జ్యములు – వేయించబడినవి (వేపుడులు)**

**నంజుడులు – మాంస ఖండములు –**

(నూనెలో) వేయించబడిన మాంసపు ముక్కలు వండిన విధానాన్ని బట్టి రుచికరములుగా ఉండవచ్చు. అట్టి వాటిని ఒక వర్గమువారు వర్జింపకుండ అనగా వదలివేయకుండా భుజింపనూ వచ్చు. మార్జ్యత అంటే పరిశుభ్రత – పరిశుభ్రముగా ఉన్న చోట ఎట్టి అనుమానము పెట్టుకొనకుండ ఆహారాన్ని స్వీకరించవచ్చు. కాని ఆవర్జ్యము కాదు అనగా స్వీకరింప తగినది కాదు అని అర్థము. బ్రాహ్మణజాతికి మాంస మధుపానము ఆవర్జ్యము కాదు అనగా స్వీకరింపతగినది కాదు అని పూరించారు. వర్జ్యము = విడిచి పెట్ట తగినది అని అర్థం కాగా ఆ వర్జ్యము అంటే స్వీకరింపతగినది అని అర్థం – కాగా ఆవర్జ్యము కాదు అంటే స్వీకరింపతగినది కాదు అని సునాయాసముగా అర్థవంతముగా సమస్యాపూరణ గావించారు. పృచ్ఛకుడిచ్చిన వర్జ్యము అను పదమునకు ముందు "ఆ" అనే అక్షరం చేర్చడంతో వర్జ్యము. ఆవర్జ్యముగా నిలిచి సమస్యకు పరిష్కారం లభించింది. "ఆ"

చేర్చితే అర్థం మారిపోతుంది అనే దానిని ఒక చిన్న ఉదాహరణను పరిశీలిద్దాం. గమనము అంటే పోక – వెళ్ళిపోవడం. ఆగమనము అంటే రాక – రావడం. ఆ చేరడంతో ముందున్న మాట అర్థమునకు విరుద్ధార్థం ఏర్పడుతోంది. ఇలా భావసమన్వయముతో పాటు క్లిష్ట ప్రాసను కూడ ఎట్టి క్లేశము లేకుండ పూరించినారు. ఇది శ్రీగౌరిపెద్దివారి పాండిత్య ప్రకర్షణ – వ్యాకరణాది శాస్త్ర నిష్ణాతృత్వమునకు నిదర్శనం. ఈ సమస్యాపూరణ సందర్భంగా పద్య ప్రథమ పాదం చివర 'పో' అని అక్షరం వాడినారు. అలాగే రెండవపాదం చివరర 'పో' అనే అక్షరాన్ని పొమ్ము అనే అర్థంలో వాడినారు. దీనితో సమస్య ఇచ్చిన పృచ్ఛకుడు ఏమిటి? అవధానిగారని "పో" "పో" అంటున్నారే? అని అన్నాడట. "నిన్ను కాదులేవయ్యా!" సమస్యను "పో" "పో" అన్నానులే – అని చమత్కరించారట. ఆనాటి సభలో నున్న సదస్యులు ఎంత అదృష్టవంతులో కదా! నేనీ సందర్భములో గురువుగారితో ఆంధ్ర నిఘంటువులలో లేని ఈ 'భర్జ్యము' – 'మార్జ్యత' అనే పదాలు ఎక్కడి నుండి వచ్చినాయి" అని ప్రశ్నించాను. నా కుతూహలాన్ని అర్థం చేసుకొని సంస్కృత వ్యాకరణశాస్త్రంలో ఉణాది సూత్రములు ఉన్నాయి. వాటి సహాయంతో క్రొత్త క్రొత్త పదాలను అర్థవంతమైన వాటిని సృష్టించవచ్చునని సోదాహరణంగా వివరించారు. అప్పుడు మా గురువుగారిని చూచి ఈయన సాక్షాత్ పతంజలి అనిపించింది నాకు.

ఈ "వర్జ్యము కాదు" అనే సమస్య విన్న తరువాత నాకు శ్రీ గాడేపల్లి వీర రాఘవశాస్త్రి గారు ఎదుర్కొన్న సమస్యల్లో ఒకటి

ఉ॥ **తార్క్ష్యుని బట్టి మ్రింగె బలదర్ప మెలర్పగ సర్పమయ్యెడన్ ॥** – అనేది

గుర్తుకు వచ్చింది. శ్రీగాడేపల్లి వీరరాఘవశాస్త్రి శతావధాని గారి కవితా విన్యాసాలను గూర్చి నంద్యాల శ్రీమద్దులపల్లి వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రి గారు చమత్కార కవిత్వము అనుపేర సంకలనంచేసి యున్నారు. ఆ పుస్తకంలో పై సమస్యకు పూరణపద్యం లేదు. ఈ సమస్య కూడ ఉత్పలమాల పద్య పాదము. రెండవ అక్షరం ప్రాస – "ర్క్ష్య" ఇటువంటి ప్రాసగల పదాలలో "తార్క్ష్యుడు" వంటి పదం మరొకటి తెలుగు నిఘంటువులలో లేదు. మఱి సమస్యాపూరణ కోసం చెప్పే పద్యంలో పైమూడు పాదాలలో ప్రాసాక్షరాలకు పదాలు ఎలా? అని నేను గురువుగారిని ప్రశ్నించగా వారు సులభంగా – వృక్షము – తత్ సంబంధమైనది "వార్క్ష్యము" – దిదృక్ష – చూడవలెననెడి కోరిక – దిదృక్ష భావము – దైదార్క్ష్యము – అలాగై జిఘృక్ష – గ్రహించ వలెననెడి కోరిక – జిఘృక్ష భావం "జైఘార్క్ష్యము" ఇలా

వార్క్ష్యము – దైదార్క్ష్యము – జైఘార్క్ష్యములా పదాలను ప్రయోగించవచ్చునని కిటుకు చెప్పినారు. ఈ సందర్భంలోనే గురువుగారు ఒక ఉదంతాన్ని నాకు చెప్పియున్నారు. పట్నం అనే గ్రామంలో ఒక శతావధానిని అష్టావధానం చేయడానికి ఆహ్వానించారు. అవధానసభ ప్రారంభమైంది. శతావధాని సోంపల్లి కృష్ణమూర్తి శర్మ గారు నిషిద్ధాక్షరి పృచ్ఛకులుగా, మధురకవి బెళ్ళూరి శ్రీనివాసమూర్తి గారు, శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల ఉపన్యాసకులు శ్రీడి.నాగసిద్ధారెడ్డి గారు ఇలా హేమాహేమీలు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. ఆ సభలో సమస్యా పృచ్ఛకుడు అవధానిగారికి –

**ఉ॥ అమ్లపు పల్లవంబులకు ఆమ్రఫలంబులకిద్ది కాలమే**

అనే సమస్య నిచ్చారట. ఇదీ ఉత్పలమాల పద్యమే. పద్యపాదంలో రెండవ అక్షరం ప్రాస "మ్ల" పద్యములో పైమూడు పాదాలలో రెండవ అక్షరం 'మ్ల' ఉండేటట్లు పద ప్రయోగం భావయుక్తంగా పద్యమల్లాల్సి ఉంది. "మాలిమ్లుచ" అనే మరొకపదం నిఘంటువుల్లో ఉంది. దొంగ అని అర్థం. ఆ దొంగను (మాలిమ్లుచపదాన్ని) పట్టుకొని అవధాని గట్టెక్కెదెలా? సభలో అవధాని మౌనం వహించారు. పరిస్థితిని గమనించిన పృచ్ఛకులు సమస్యను మార్చి మరొక సమస్యనిచ్చారట. ఆపై అవధానం హాయిగా పూర్తి చేయబడింది. ఆ అవధాని శ్రీగౌరిపెద్ది వారిని జరిగిన సంగతిని వివరిస్తూ – 'మ్ల' ప్రాస నెలా సాధించాలో అవగతం కాలేదని వాపోయారు. అప్పుడు గురువుగారు ఉణాది సూత్రముల ఆధారంగా కొంగ్రొత్త పదాలను సృష్టించి "ఆమ్లలితంబు... అని ప్రారంభించి ముప్పది పాదముల మాలిక వ్రాసి పంపినారట. ఆ పద్యాన్ని గురువుగారు నాకు వినిపించారు గాని నేను వ్రాసుకొని భద్రపరచలేకపోయినాను. ఆ పద్యం ఆ అవధాని దగ్గరే నిలిచిపోయింది. అది అష్టావధానమైనా, శతావధానమైనా గురువుగారి ధైర్యానికి, ధారణకు, ధారకు, ధోరణికి, సమయస్ఫూర్తికి ఏ లోటు లేకుండా నల్లేరుపై బండి నడక లాగా సాగిపోయేది.

ఇలాగే ద్రోణాచలం ప్రస్తుతం డోన్ లో అష్టావధానం నిర్వహించడానికి శ్రీగౌరిపెద్ది వారిని కళాభారతి సాహితీ సంస్థ వారు ఆహ్వానించగా విచ్చేసినారు. ఆనాటి అవధానసభ స్థానిక శ్రీకోదండరామస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగింది. ఆ సభలో నేను కూడ ఉన్నాను ఆనాటి అవధానసభలో సమస్యాపృచ్ఛకులు అష్టావధాని తాటిచెర్ల కృష్ణశర్మగారు. వారు – "రావణ–బ్రహ్మేలింగన మొంద సీత నిజభర్తన్ ధిక్కృతున్ చేయదే?" అనే సమస్య నిచ్చారు. ఇది శార్దూల విక్రీడిత పద్యం.

సమస్య భావం – రావణాసురుణ్ణి ఆలింగనం చేసుకొనేందుకు సీత తన భర్తయైన రాముణ్ణి తిరస్కరిస్తుంది కదా! అని. ఇది జరిగిన రామాయణ కథా గమనానికే విరుద్ధం. పైగా ప్రాసాక్షరం "హ్మ" అంటే పృచ్ఛకుడిచ్చిన పద్యపాదంలో ప్రాసాక్షరం "హ్మ" కాగా పద్యంలో తక్కిన పై మూడు పాదాలలో రెండవ అక్షరం "హ్మ"యే రావాలి. హ్మ రెండవ అక్షరంగా గల పదం మఱొక్కటి "జిహ్మ" – వంకర యైనది అనే అర్థంలో ఒక్క పదం నిఘంటువుల్లో ఉంది. గురువుగారు ఏమాత్రం తడుముకొనకుండానే అహ్మే! అని పద్యాన్ని ప్రారంభించారు. అహ్మే – అంటే "ఆహా" అని ఆశ్చర్యాన్ని ప్రకటించడం. ఇది గురువుగారు ఉణాది సూత్రాల ఆధారంగా సృష్టించిన అర్థవంతమైన సరిక్రొత్త పదం. సమస్యాపూరణం సునాయాసంగా సాగిపోయింది. ఇలా ఎప్పటికప్పుడు వ్యాకరణ శాస్త్రాధారంగా అర్థవంతమైన సరిక్రొత్త పదాలను సృష్టించి ఆంధ్ర భాషాయోషకు అమూల్యాభరణాల్లోని రత్నాలుగా తాపడం చేయించారు. ఆనాటి సమస్యాపూరణ పద్యం అవధాన పృచ్ఛకులు శ్రీ తాటిచెర్లవారి దగ్గర ఉండిపోయింది. వారిప్పుడు లేరు. కాని నాకు ఆ నాటి సమస్యాపూరణ భావం శ్రీగౌరిపెద్ది వారు వివరించింది బాగా జ్ఞాపకం ఉంది. అది ఇది.

రావణుడు సీత మనస్సును తన వైపు మరలేటట్టు చేయమని కొందరు రాక్షసస్త్రీలను పురమాయించగా శ్రీరామ పరాక్రమాదులు తెలియని అల్పజ్ఞులైన ఆ రాక్షస స్త్రీలలో నొకతె తన వారితో ఇలా అన్నది అని వారు పూరణ గావించారు.

ఇలాగే – సమస్య – "విధవా! నీమగడు నిండు "వేకటిగదవే" అనే కందపద్యం. విధవా! అని అంటేనే భర్త గతించినది అని అర్థం. విధవా! నీ మగడు అనడంతో మరొక పెళ్ళి చేసుకొన్నదేమో అనడానికి వీలు లేదు. ఎందుకంటే పెళ్ళి అయిఉంటే ఆమె విధవగా పరిగణింపబడదు. తరువాత సంగతి చూద్దాం ఆ విధవ మగడు నిండు వేకటి అంటే నిండు గర్భిణి అని అర్థం. ఇది ఎటూ పొందని సమస్య. ఆకునకు అందదు. పోకకు పొందదు. ఇలా తాంబూలం పండేదెలా? అయినా గురువుగారు "హస్త కలితపవిధవా"! – అని పద్య పూరణ చేశారు. ఆ పద్యం నాకు జ్ఞాపకం లేదు. కాని భావం గుర్తుంది. శచీదేవి జయంతుని గర్భస్థశిశువుగా కలిగియున్న సందర్భం. అప్పుడే ఇంద్రుడు బ్రహ్మహత్యాపాతకం వల్ల ఇంద్ర పదవి కోల్పోయి స్వర్గాన్ని వీడి ఏదో సరోవరంలో తామర తూడులో తల దాచుకొంటున్నాడు. ఆ సందర్భంలో త్రిలోక సంచారియైన నారదుడు శచీదేవిని సమీపించి –

హస్త–కలిత–పవి–ధవా! అంటే చేతిలో వజ్రాయుధమును గల వానిని భర్తగా గల దానా! అని సంబోధిస్తూ ఇంద్రుడు తామర తూడులో ఉన్న సంగతి వెల్లడిస్తూ – “తామరతూడులో దాగుకొని ఉన్నాడే – (హస్తకలితపవిధవా!) శచీదేవీ! నీ మగడు ; అని ఇక్కడికి ఆపి – శచీదేవిని నిండు వేకటిగదవే – నిండు గర్భిణివి కదమ్మా! అని ఓదార్చాదని ఇంతంత భావాన్ని చిన్న కందపద్యంలో నిక్షేపించారు. ఇలా గురువుగారి అవధానాల జైత్రయాత్రను పరిశీలిస్తే అవధానుల్లో ఈయన గౌరి పెద్ద – అంటే పరమేశ్వరుడు – సర్వజ్ఞుడు అనిపించకమానదు.

ఒక పర్యాయం తరగతి గదిలో అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర రచనావిధానం “అల్లసాని వాని అల్లిక జిగిబిగి” గూర్చి ప్రస్తావన వచ్చింది. గురువుగారికి శ్రీనాథ మహాకవి యన్నా అల్లసాని వారన్నా – తెనాలి రామకృష్ణుడన్నా వల్లమాలిన అభిమానం, ఆత్మీయత, గౌరవం అన్నీ; వారు అల్లసాని కవితా కౌశల్యాన్ని వివరిస్తూ –

అల్లసాని తన కావ్య ప్రారంభంలోనే భవిష్యత్ కథాగమనానికి కావలసిన బీజం వేసేశాడు. మనుసంభవానికి మూలపురుషుడు ప్రవరుడు. అతడు సద్బ్రాహ్మణుడు. సదాచార సంపన్నుడు. నిత్యాగ్ని హోత్రి. నిష్ఠా గరిష్ఠుడు. శీలవంతుడు. అతడు తీర్థయాత్రాచణశీలియై హిమవత్ పర్వతాలకు వెళ్ళి, అక్కడ చిక్కువడి, ఆకొండ కోనల్లో ఎదురుపడిన పరువాల ముద్దులగుమ్మ వరూధినిని చూచి పలుకరించగా, ఆమె ప్రవరునిపై మనసుపడి కౌగిలింపగా – వరూధినీ పరిష్వంగాన్ని విదిలించుకొన్నాడు. గంధర్వకాంత, అందాల పాలపుంత ప్రవరుని లొంగదీసుకోజాలదను కథా గమనానికి బీజంగా కావ్య ప్రారంభంలోనే ప్రవరుడుండే అరుణాస్పదపుర వర్ణన గావిస్తూ కవి

**“అచటి వెలయాండ్రు రంభాదులైన నొరసి**
**కాసె కొంగును వారించి గడపగలరు”**

అట్టి సౌందర్యరాశులకు సైతం

**“వాని చక్కదనము వైరాగ్యమునజేసి**
**కాంక్ష సేయు జార కామినులకు**
**భోగ బాహ్యమయ్యె”** అని రచించాడు.

వరూధిని ప్రవరునితో తన పరిచయాన్ని చెప్తూకుంటూ –

**కం॥ పేరు వరూధిని, విప్ర కు**
**మార! ఘృతాచీ తిలోత్తమా హరిణీ హే**
**మా రంభా శశిరేఖలు**
**దారగుణాఢ్యలు మదీయలగు ప్రాణ సఖుల్" –**

ఆమె రంభా, తిలోత్తమ మొదలైన వారు తన ప్రాణ సఖులను చెప్తూకొన్నది. అట్టి రంభాదులను సైతము తలదన్నే సౌందర్యవతులను అరుణాస్పదపురంలోనే చూచినవాడు చూచి మనస్సు పారవేసుకొననివాడు ప్రవరుడు. అంతేకాక ప్రవరుని రూపరేఖలు వరూధినిని ఎలా ఆకర్షించాయో కవి చూపిన కవితా శిల్పం నాన్యతో దర్శనీయం అని చెప్తూతూ గురువుగారు వరూధిని చూచిన ప్రవరుని రూపరేఖలు –

**ఉ॥ కమ్మని కుందనమ్ము కసుగందని మేను, ఎలదేటి దాటులన్**
**బమ్మెరవోవదోలు తెగ బారెడు వెండ్రుకలు, ఇందు బింబమున్**
**కిమ్మన నీదు మోము, గిరిక్రేపులు మూపులు, కౌనుకానరా**
**దమ్మక చెల్ల! వానివికచాంబకముల్ శతపత్ర జైత్రముల్"**

ప్రవరుడు చూచిన వరూధినీ సౌందర్యలహరి –

**మ॥ అతదావాత పరంపరా పరిమళ వ్యాపార లీలన్ జనా**
**న్వీత మిచ్చోటని చేరబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్**
**శతపత్రేక్షణ, చంచరీకచికురన్, చంద్రాస్య చక్రస్తనిన్**
**నతనాభిన్ నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్.**

ఈ రెండు పద్యాలను ప్రక్కప్రక్కన పెట్టి పరిశీలింపగా అల్లసానిఅల్లిక జిగిబిగి – శిల్ప సౌందర్యాన్ని మనం చూడవచ్చు.

ప్రవరుడు అన్ని విధాలా వరూధిని కన్నా మిన్నయని కవి నిరూపించాడు.

**"ప్రవరుని శరీరం – కమ్మని కుందనమ్ము కసు**
**కందనిది". మేలిమి బంగారం లాంటిది.**
**వరూధిని మేను – "విద్యుల్లతావిగ్రహ"**

విద్యుల్లత కూడ బంగారు రంగే కాని చంచలం, క్షణికం – బంగారు రంగు చెక్కు చెదరనిది, నిలకడయైనది. దేహకాంతిలో వరూధిని కన్న ప్రవరుడే మిన్న. ప్రవరుని కేశపాశం "ఎలదేటి దాటులన్ బమ్మెర వోవ దోలు తెగబారెడు వెండ్రుకలు" వరూధిని కేవలం "చంచరీక చికుర" తుమ్మెదలలాంటి ముంగురులు కలది. చంచరీకములను బమ్మెర వోవదోలు తెగబారెడు వెండ్రుకలు ప్రవరునివి. కేశముల పొడుగులోగాని మెఋపులోగాని ప్రవరునిదే పై చేయి. లోకంలో మనం చూస్తున్నంతలో స్త్రీలకు తెగ బారెడు వెండ్రుకలుండడం, పురుషులకు కుఱుచైన వెండ్రుకలుండడం కద్దు. కాని యిక్కడ వరూధినీ ప్రవరుల విషయంలో తారుమారు. ప్రవరుని ముఖాన్ని చూస్తే – "ఇందుబింబమున్ కిమ్మన నీదు మోము" చంద్రబింబాన్ని నోరెత్త నీయనిది. వరూధిని "చంద్రాస్య" చంద్రుని వంటిది. ప్రవరుని ముఖ సౌందర్యం చంద్రబింబాన్ని మించిపోయింది. ఇందులోను వరూధిని కన్న ప్రవరుడే మిన్న. ప్రవరుని కన్నులు "శతపత్రజైత్రముల్". వరూధిని శతపత్రేక్షణ – పద్మముల వంటి కన్నులు వరూధినివి. పద్మములను జయించినవి ప్రవరుని కన్నులు. ఇలా చిత్తరువున గీచి నటుల, శిల్పం చెక్కినటుల అల్లసాని వరూధినీ ప్రవరుల రూపావిష్కరణతో పాటు వరూధిని వలలో ప్రవరుడు పడడు. అని ధ్వనిగా పేర్కొన్నాడు. పైగాభోగ భూమికి చెందిన వరూధిని కన్న యోగ భూమిలో పుట్టిన ప్రవరుడే మిన్న అని ధ్వనిగా పేర్కొన్నాడు. పైగా భోగభూమికి చెందిన వరూధిని కన్న యోగభూమిలో పుట్టిన ప్రవరుడే మిన్న అని శీలం యొక్క ఔన్నత్యాన్ని వివరించారు. అంతటితో ఆగక.


**శ్లోకం॥ నవిషయ భోగోభాగ్యః యోగ్యం కిల యత్ర జంతు మాత్ర మపి**
**బ్రహేంద్ర రుద్ర మృగ్యం భాగ్యం – విషయేషు వైరాగ్యమ్** " అంటూ

ఆదిశంకరాచార్యులవారి శ్లోకాన్ని ఉటంకిస్తూ ధర్మబద్ధమైన జీవితం మానవుడు మాధవుడుగా ఎదగడానికి పునాది అవుతుందని వివరించారు. తరగతి గది అన్న సంగతికూడ మరచిపోయి విద్యార్థినీ విద్యార్థులందరు కరతాళ ధ్వనులతో లేచి నిలబడి గురువుగారికి నమస్కరించారు.

ఇలా ఎన్నెన్ని కావ్య చర్చలో గురువు గారి ద్వారా విన్నాం. వారి వాగ్వైఖరి, శబ్ద ఝరి, కావ్య వ్యాఖ్యాన కౌశలం, వైదుష్యం సర్వదా సర్వథా భుక్తి, ముక్తి ప్రదాయకాలని భావిస్తూ గురుదేవులకు స్మృత్యంజలి ఘటిస్తున్నాను. శ్రీ గౌరిపెద్ది వారు సాక్షాత్ గౌరిపెద్ద. అంతే.

**పంచచామరము**

**బిస ప్రసూన గర్భజాత విశ్వసృజ్ వధూటికా**
**ప్రసన్న దృక్ప్రసారలబ్ధ పాండితీ ప్రకర్షునిన్ ।**
**ప్రసిద్ధ శిష్యకోటి పూజ్యపాదు గౌరిపెద్ది రా**
**మ సుబ్బశర్మ సద్గురూత్తమ ప్రభన్ స్తుతించెదన్ ॥**



1965 సం॥న శ్రీ గౌరిపెద్ది వారి సన్మానము – అవధాన సభలో వరుసగా ఎడమ నుంచి కుడికి డా॥ శ్రీనివాసరావు, శ్రీ గౌరిపెద్ది వారు అధ్యక్షులు శ్రీదివాకర్ల వేంకటావధానిగారు, శ్రీసుదర్శనాచార్యులు, (ప్రిన్సిపాల్ ఓరియంటల్ కళాశాల) సంగీత సాహిత్య సార్వభౌములు శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు

# గజరాజు సరియుద్ది గౌరిపెద్ది



ప్రముఖ అవధాని
**డా॥ నరాల రామారెడ్డి**
ప్రొద్దుటూరు.

నేను ప్రొద్దుటూరులో శ్రీకృష్ణ గీర్వాణ ఉన్నత పాఠశాలలో 1964 సం॥లో యస్.యస్.యల్.సి. పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఉన్నత విద్యాభ్యాసం కోసం తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో ఎ. విద్వాన్ కోర్సులో చేరి 4 సంవత్సరాలు సంస్కృతాంధ్రభాషల్ని అధ్యయనం చేశాను.

అప్పటి మా కళాశాలలో సంస్కృతాంధ్ర భాషల్లో ఉద్దండులైన పండితులు అధ్యాపకులుగా ఉండినారు, అంత గొప్ప పండితుల సమక్షంలో విద్యాభ్యాసం చేసే అదృష్టం కలిగినందుకు ఎంతో సంతోషించాను.

మాకు పాఠం చెప్పిన అధ్యాపకులలో అందరికన్నా వయస్సులో పెద్దవారు, పూజ్యులు శ్రీఆర్.రామమూర్తి శర్మ గారు. వారు మాకు మహాకవి కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం సంస్కృత నాటకాన్ని బోధించారు. వీరి తర్వాత వయస్సులో చిన్నవారు శ్రీ యన్.సి.వి. నరసింహాచార్యులవారు మాకు మహాకవి బాణభట్టు రచించిన బృహత్కాదంబరిని బోధించారు. యన్.సి.వి గారితో ఇంచుమించు సమాన వయస్కులైన విద్వచ్ఛిరోమణి బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు తిరుపతి వేంకటకవులు అనువదించిన మృచ్ఛకటిక నాటకాన్ని మాకు తెలుగులో బోధించారు. సంస్కృత వ్యాకరణంలో ఉద్దండ పండితులైన శ్రీ గోపాలన్ గారు మాకు సిద్ధాంత కౌముదిని బోధించారు. వ్యాకరణ కేసరిగా వినుతికెక్కిన శ్రీ చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మగారు మాకు ఆంధ్రశబ్దచింతామణిద్వారా తెలుగు వ్యాకరణాన్ని బోధించినారు. శ్రీనాగసిద్ధారెడ్డి గారు తెలుగు భారతంలో శిశుపాలవధ ఘట్టాన్ని బోధించినారు.

మాన్యులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు సంస్కృతాంధ్ర భాషల్లో ఉద్దండ పండితులు. గౌరిపెద్దివారు మాకు అప్పకవీయం చెప్పినట్లు గుర్తు. అంతేకాదు తిరుపతి వేంకటకవులు ఆంధ్రీకరించిన

మృచ్ఛకటిక నాటకాన్ని బోధించిన సన్నివేశం ఎప్పటికీ మరువరానిది. గౌరిపెద్దివారు గంభీర కంఠస్వరంతో "అహి మోకాళ్ళకు రెండు చుట్టలుగ పర్యంకంబు బంధించి, లోనహముద్రుంచి, మనంబు వుంచి, విషయత్యాగంబుగావించి" అని పద్యాన్ని పాడుతున్నప్పుడు మా చేతుల్లో ఉన్న పుస్తకాలు కంపించేవి. వారి జలదగంభీరస్వరం కళాశాలంతా ప్రతిధ్వనించేది.

నేను 1990 వ సంవత్సరంలో అనుకొంటాను. మాన్యులు శ్రీ జి. నాగసిద్దారెడ్డిగారి ఆహ్వానాన్ని అందుకొని వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో అష్టావధానం చేశాను. 1968 సం॥లో ఎ.విద్వాన్ ఫైనల్ చదివే విద్యార్థిగా గురువుల సమక్షంలో అవధానంచేసి ఆశీస్సులు పొందాను. అవధాన ప్రారంభంలో (రెండవసారి చేసినప్పుడు) కళాశాలలో నాకు వారు చెప్పిన గురువులను స్మరిస్తూ ఒక సీస పద్యం చెప్పాను. అందులో

**"కాదంబరీ కావ్య గద్యమద్యము నిచ్చె**
**ఎస్వీవి మధుర సాహిత్య జీవి**
**మృచ్ఛకటికకథా స్వచ్ఛ గుచ్ఛము విప్పె**
**గజరాజు సరియుద్ది గౌరిపెద్ది"**

గౌరిపెద్ది వారిని ప్రస్తుతిస్తూ "గజరాజు సరియుద్ది" అన్నాను. ఈ మాటలో అతిశయోక్తి అణుమాత్రంకూడా లేదు. ఆయన ఒక సాహితీ దిగ్గజం.

నేను తిరుపతిలో విద్యార్థిగా ఉన్నప్పుడు మా గురువు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు అవధానాలు చేస్తున్నారని విన్నాను. కానీ నేను చూసిన మొట్ట మొదటి అవధానం, దేవస్థాన ఉన్నత పాఠశాలలో 1965 సం॥లో విజయవాడ నుంచి వచ్చిన శ్రీ బులుసు వేంకటరామమూర్తిగారు చేసినది. తర్వాత నేను ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు మా ప్రాచ్యకళాశాలలో అవధానం చంద్రశేఖర శర్మగారు చేసిన అష్టావధానం చూశాను. సహవిద్యార్థుల ప్రోత్సాహంతో 1965 సం॥లో నేను విద్యార్థిగా అవధాన రంగంలో ప్రవేశించాను.

శ్రీ రామసుబ్బశర్మగారు మాకు క్లాసులో కేవలం పాఠం చెప్పడమే కాకుండా, అప్పుడప్పుడూ అవధాన పద్యాలు కూడా వినిపించేవారు. వారు పృచ్ఛకులుగా "విధవా! నీ మగడు నిండు వేకటి గదవే!" అనే సమస్య ఇచ్చినప్పుడు బులుసు రామమూర్తి చాలా ఇబ్బంది పడ్డారని చెప్పారు.

శ్రీ గౌరిపెద్దివారు ప్రముఖ సాహితీ విమర్శకులైన శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారికి చేదోడు వాదోడుగా నిలిచి, వాగ్గేయకారులైన మహాకవి అన్నమాచార్యుల కీర్తనలను పరిష్కరణ కార్యంలో అండగా ఉన్నారని విన్నాం.

శ్రీ శర్మ గారు గ్రామీణప్రాంతాల్లో పుట్టి పెరిగిన వారు కావడం వల్ల, అన్నమాచార్యుల మాండలిక పదాలను చక్కగా అవగతంచేసుకొని, తాళ్ళపాక వాఙ్మయ పరిష్కరణలో అనితర సాధ్యమైన ప్రతిభను ప్రదర్శించి, 32 సంపుటాల వరకు ప్రచురించి, పీఠికలను రాసే బాధ్యతలను స్వీకరించి అన్నమయ్యను అగ్రపీఠంలో అధిష్ఠింపజేయడంలో కృతకృత్యులయ్యారు.

1964 సం॥లో అన్నమాచార్యుల కీర్తనల పరిష్కరణ యజ్ఞంలో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారికి తోడుగా నియమితులైన శ్రీ గౌరిపెద్దివారు 1978 సం॥లో 24, 25 సంపుటాలను ఆవిష్కరించి, “అన్నమాచార్య చరిత్ర – పీఠిక అనే గ్రంథాన్ని మూడవ ముద్రణ చేయడానికి నిర్విరామకృషి చేశారు. ఇంత గొప్ప కృషి చేసినా తన జీవితలక్ష్యమైన అన్నమయ్య పద నిఘంటువు అనే గ్రంథాన్ని ప్రచురించాలన్న వారి కోరిక తీరకపోవడం శోచనీయం.

శ్రీరామసుబ్బశర్మగారు 1951 సం॥ నుండి 1982 సం॥ వరకు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో అధ్యాపకులుగా ఉద్యోగం చేశారు.

1962 సం॥లో శ్రీ శర్మగారు ప్రొద్దుటూరులో ప్రప్రథమ అష్టావధానం చేసినట్లు విన్నాను. వారి అవధానం చూసే భాగ్యం నాకు కలుగలేదు. గౌరిపెద్దివారు తమ 40 ఏట అవధానం ప్రారంభించి సుమారు 100కి పైగా అవధానాలు చేశారు. వారు తమ అవధానాలను అచ్చువేయాలనే ఆలోచన చేయలేదు. అంతే కాదు, వారు రచించిన ముక్తకాలు, భీష్మవిజయము, భార్గవ రామాయణ కావ్యాలు ముద్రణకు నోచుకోకపోవడం విచారకరం.

శ్రీ రామసుబ్బశర్మ గారు నిర్వచించిన వంద అష్టావధానాలు కాలగర్భంలో కలిసిపోవడం మన దురదృష్టం. వారి అవధానవిధాన ప్రతిభకు నిదర్శనంగా నిలిచిన మూడు, నాలుగు అవధానాలను పరిశీలిస్తే వారు సంస్కృతాంధ్ర భాషల్లో ఎంత ఉద్దండులో తెలుస్తుంది.

6-10-1963 సం॥లో కడప పట్టణంలో దిగ్దంతుల వంటి పండితుల సమక్షంలో

శ్రీగౌరిపెద్దివారు అష్టావధానం నిర్వహించారు. రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ గారు సభాధ్యక్షులుగా ఉన్నారు. బ్రహ్మశ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి, శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి మహామహుల సమక్షంలో జరిగిన అవధానమిది. అవధానం చంద్రశేఖర శర్మ, సి.వి.సుబ్బన్న వంటి అవధాని వరేణ్యులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు.

శ్రీ సి.వి.సుబ్బన్న శతావధానిగారిచ్చిన తెలుగు సమస్య :

"వృశ్చికశీలివాని కథివేదనమేటికి గ్రామ్యకేళికిన్" –

**శ్రీ గౌరిపెద్ది వారి పూరణ :**

**నిశ్చయమేగి తాను పరినిష్ఠిత ధర్మమహత్వ తత్వముం**
**బశ్చిమబుద్ధి ద్రోచి పరభామను ద్రౌపది నాత్మజాయగా**
**నిశ్చిత బుద్ధి నెంచె దగునే తలపోయగ గీచకుండు దు**
**ర్వృశ్చిక శీలివాని కథివేదన మేటికి గ్రామ్యకేళికిన్.**

5.1.1964 సం॥ ఒంటిమిట్ట జిల్లా పరిషదున్నత పాఠశాలలో జరిగిన అవధానంలో శ్రీకోడూరి చెంచుసుబ్బయ్య గారిచ్చిన సంస్కృత సమస్య :–

శ్రీ గౌరిపెద్ది వారి పూరణ : "కర్ణః పపాత రఘువీర శరేణ విద్ధః

**"సీతాపహార కలితాతి భుజాప్రదీప్త**
**సూర్యాన్వయాప్త పృథుపౌరుష జృంభితేన**
**తద్రావణానుమతి చారిత వీర కుంభ**
**కర్ణః పపాత రఘువీర శరేణ విద్ధః"**

శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారి అవధాన వైదుష్యాన్ని గూర్చిన ప్రశంసలు :–

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ గారు –

" శ్రీరామసుబ్బశర్మగారు సంస్కృతాంధ్రములలో చక్కని పాండిత్యము కలవారు. అవధాన విద్య వారికి క్రొత్తది. అయినను వారందు మిక్కిలి సమర్థులు. నేనీ అవధానమున పాల్గొనుట నా అదృష్టము" అన్నారు.

శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారు –

"అష్టావధానము కష్టమైన విద్య. కాని ప్రతిభావ్యుత్పత్తులు కూలంకషముగా నిండుకొనిన రామసుబ్బ శర్మగారికి నది ఒక లెక్కలోనిదికాదు. గౌరిపెద్ది వారి అవధానమన్నిటివలె గాక ప్రత్యేకమైనది.

బ్రహ్మ శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి గారు –

"రాయలసీమవారికి నవధాన విద్య క్రొత్తది కాదు. కవి పండితులందరు నీయవధానవిద్య నాదరించిరి. పంచ ధకారములుండిన గాని యవధానము పొసగదు."

బ్రహ్మశ్రీ అవధానం చంద్రశేఖర శర్మ గారు –

**"కండగలయట్టి పాండితీ చండిమమున**
**భండనంబునయందు పార్థుండు వోలె**
**విజయ విఖ్యాత నవధాన నిధి గడించె**
**రామసుబ్బయ సుకవి యుద్దామ కీర్తి.**

రాళ్ళపల్లి, గడియారం, పుట్టపర్తి వంటి ఉద్దండ పండితుల ప్రశంసలు పొందిన శ్రీ గౌరిపెద్దివారు మాకు గురువు కావడం మా అదృష్టం.

1968 సం॥లో నేను విద్వాన్ ఫైనల్ విద్యార్థిగా అనంతపురం జిల్లా మడకసిరలో అవధానం చేసినప్పుడు మాన్యులు శ్రీ రామసుబ్బశర్మ గారు అధ్యక్షులుగా శిష్యవాత్సల్యంతో నన్ను ఆశీర్వదించినారు. వారికి నా హార్దిక కృతజ్ఞతాంజలి.

ప్రొద్దుటూరు
27.07.2022.

**నరాల రామారెడ్డి**
చరవాణి – 94403 53699

శ్రీ మాత్రే నమః

**శ్రీ మహా గణాధిపతయే నమః**

శ్రీ గురుభ్యోనమః



# శ్రీ మతాం గౌరిపెద్ది రామ సుబ్బ శర్మణాం శత జయంతి ఉత్సవ శుభాభివందనాని

**ఆచార్య రాణి సదాశివమూర్తిః**

చరవాణి : 94402 46354

శ్రీ వేంకటేశ వరసంస్తుతిగీతకారాః
శ్రీతాళ్ళపాక ఘన వంశజ భూసురాస్తే ।
యేషాం యశశ్చరితసారణ బద్ధదీక్షాః
తాన్ గౌరిపెద్ది విదుషః ప్రణమామ భక్త్యా ॥1॥


జాతం హి వర్ష శతకం త్విహ చాంద్రమానే
శ్రీ రామసుబ్బ వర పండిత శర్మణాం భోః ।
ఏతత్సు జన్మదివసః సుమహోత్సవోఽయం
తాన్ గౌరిపెద్ది విదుషః ప్రణమామ భక్త్యా ॥2॥

శ్రీ అన్నమార్య పద కావ్య సుభక్తిగీతే –
ష్వానంద వాసపరమాద్భుతవిష్ణుదేవః ।
తత్కీర్తనప్రకటనోచిత బద్ధ దీక్షాః
తాన్ గౌరిపెద్ది విదుః ప్రణమామ భక్త్యా ॥3॥

నక్షత్ర గణ్య ఘన సంపుటి కీర్తనానాం
సంపాదకాస్సతత వంద్య విదగ్ధవర్యాః ।

లోకే హి వంద్య చరితాః సువిమర్శకాస్తే
తాన్ గౌరిపెద్ది విదుషః ప్రణమామ భక్త్యా ॥4॥

వేదాంత శాస్త్ర రస శాస్త్ర చణాః ప్రసిద్ధాః
సిద్ధాశ్చ చారు హృదయాః పరమోత్తమాస్తే
స్థాస్యన్తి యావదిహ భాతి మహాన్నమార్యాః
తాన్ గౌరిపెద్ది విదుషః ప్రణమామ భక్త్యా ॥5॥



సాహిత్య సభలో గౌరిపెద్దివారు, సినీనటులు మిక్కిలినేని రాధాకృష్ణ, శ్రీ వెంకట్రామయ్యగారు

# గౌరిపెద్ది పీఠికాసారస్వతం - పరిశోధన రత్నాకరం

**గంధం బసవ శంకరరావు**
తాళ్లపాక వాఙ్మయ పరిశోధకులు
93464 79649

అన్నమయ్య సంకీర్తనలను సమకాలీనమైన భాషలో చదవగలగటానికి, సాహిత్యాన్ని అర్థం చేసుకోవటానికి, వాటికి వరుసలు కట్టి పాడుకోవటానికి అనేకమంది మహనీయుల కృషి పునాదిగా పాదుకొని ఉంది. ఆ క్రమంలో మొట్టమొదటగా నిలిచి ఉండేది సాహిత్య పరిష్కర్తలు! వీరు వేల రేకుల్లో ఉన్న సంకీర్తనలను పరిష్కరణాశుద్ధితో మనకందించినవారు. అన్నమయ్య పాటలను తనయుడైన పెద తిరుమలయ్య రాగిరేకుల్లో చెక్కించి తెలుగుజాతికందిస్తే, ఆ రేకుల్లోని మేలిమి సాహిత్యాన్ని పరిష్కరణా యజ్ఞం అనే బృహత్తర ప్రయత్నంతో అచ్చుకు అందించినవారు ఈ పరిష్కర్తలు!

సంగీత సాహిత్య విద్వాంసులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారి అంతేవాసిగా గణుతికెక్కి వారితో కలసి, వారి మార్గంలో నడచి వేలకొలది సంకీర్తనలను పరిష్కరించిన పండితులు శ్రీమాన్ గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారు! వీరు సంస్కృతాంధ్ర భాషల్లోనే కాక, జ్యోతిష్యం, ఆయుర్వేదం వంటి శాస్త్రాల్లో లబ్ధ ప్రతిష్ఠులు! తమ శాస్త్ర విజ్ఞానాన్ని సమాజ ప్రయోజనం కోసం వెచ్చించినవారు!

గౌరిపెద్ది వారి పరిష్కరణల్లో అన్నమయ్య పాటల కంటే, ముందు గుర్తించవలసినది "అన్నమాచార్యుల జీవిత చరిత్ర", అప్పటికే 30 సంవత్సరాల క్రితం, తాళ్లపాక వాఙ్మయోద్ధారకులైన శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు పరిష్కరించిన చిన్నన్న కృతమైన "అన్నమాచార్యుల జీవిత చరిత్రము"ను మరోసారి సూక్ష్మ పరిశీలన గావించి, వేటూరి వారికి కృతజ్ఞతలు తెలుపుతూనే, తాము గుర్తించిన విషయాలను "వివేకదీపిక" పేరుతో లోకానికి అందించారు. అందు ప్రధానమైన విషయాలు: అన్నమయ్య జన్మ సంవత్సర నిర్ధారణ, వీరి నిర్ధారణే తి.తి.దే. ప్రామాణికంగా స్వీకరించి 1408ని అన్నమయ్య జన్మ సంవత్సరంగా ప్రకటించింది.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు తాళ్లపాక సంకీర్తన సాహిత్యాన్ని 30 సంపుటాలుగా ప్రకటించారు. వీటిలో 29 సంపుటాలు రాగిరేకుల నుండి ఉద్ధరింపబడినవి కాగా, రేకులలో లుప్తమై

తాళ్లపాక వారి ఇంటి వ్రాతప్రతియైన "శేషాచార్యుల వ్రాతప్రతి"ని ఆచార్య వేటూరి ఆనందమూర్తి, గంధం బసవ శంకరరావు, డా॥కె.ఐ.వరప్రసాద్ రెడ్డి గార్ల సంపాదకత్వ పరిష్కరణలో ప్రత్యేక సంపుటంగా 2022లో ఆవిష్కరించారు! ఇంతటి విశాలమైన సాహిత్య పరిష్కరణలో గౌరిపెద్ది వారి పాత్ర మహత్తరమైనది. రేకుల నుండి ఎత్తి వ్రాయబడిన సంకీర్తన సంపుటాలలో మొత్తం 20 సంపుటాల పరిష్కరణలో గౌరిపెద్దివారు పాల్గొన్నారు. దీనిని విశదంగా పరికించినపుడు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారికి సహాయకులుగా 4 సంపుటాల పరిష్కరణలో బాధ్యతను పంచి, 12 సంపుటాలకు స్వతంత్ర పరిష్కరణ అందించారు.

గౌరిపెద్ది వారి కృషిని, నిబద్ధతను రాళ్లపల్లివారు శ్లాఘించిన విషయం వారు పరిష్కరించిన పీఠికలలోనే ప్రస్తావించడం విద్వాంసులందరికీ ఆదర్శదాయకం!

**13వ సంపుటం పీఠికలో రాళ్లపల్లి వారి స్వర్ణాక్షరాలను గమనించండి :**

"ఈ గొప్ప పనికి నాకు చేదోడువాదోడుగా శ్రీవేంకటేశ్వర సంస్కృత కళాశాల యందలి ఆంధ్ర సంస్కృత సాహిత్యాధ్యాపకులగు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శిరోమణి, విద్వాన్ గారిని ఏర్పరచుట నా యదృష్టము. శ్రీశర్మ గారు అష్టావధానము, ఉభయభాషలందును ఆశుకవిత, మంత్రతంత్రశాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలు విషయములలో పరినిష్ఠితులు. నిష్కలమై, నిష్పక్షపాతమైన మేధ, ప్రామాణికమైన దృష్టి, ఆత్మార్థకమైన సదాచారసంపత్తి కలవారు. ఈ పల్లెపట్టులందలి దేశి తెలుగు నుడికారములు చక్కగా నెరిగినవారు. మీదు మిక్కిలి నా యెడ సుస్నిగ్ధమైన హృదయము గలవారు. కార్యోత్సాహపూర్ణులు.

అలాగే – రాళ్లపల్లివారి పట్ల గౌరిపెద్ది వారికున్న గౌరవం అనంతమైనదనటానికి 18వ సంపుటం పీఠికలో ఈ దిగువ పేర్కొన్న పంక్తులు నిదర్శనాలు :

"ఈ వాఙ్మయమునందలి పవిత్రమైన భక్తి, భాషలోని మాధుర్యము, నేనీ పని చేసినచో శ్రీరాళ్లపల్లి వారికి తృప్తి పాత్రమగుదునని భావము, నన్నీ పనికి పురికొల్పినవి. ఈ దొడ్డ కార్యమును నాచే చేయించుటకు శ్రీశ్రీనివాసుని నిండుదయ, తాళ్లపాక కవుల అనుగ్రహము, పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్లపల్లి వారి మంగళాశాసనములు అండగ నిలిచి కడతేర్పగలవు.

అంతేగాక గౌరిపెద్దివారు తాము పరిష్కరించిన సంపుటాల పీఠికలలో రాళ్లపల్లి వారి పట్ల భక్తిని శ్లోకరూపంలో ఆవిష్కరించారు.

కొన్ని ఉదాహరణలు :

**విశిష్టాద్వైత సిద్ధాంత వీధీ సంతత సంచరమ్ ।**
**అన్నమ ప్రతిరూపం తం రాళ్లపల్లి గురుంస్తువే ॥** (1వ సంపుటం పీఠికలో)

**సంగీతమపి సాహిత్యం యస్య నేత్రే ఇవా సతః ।**
**ఇన్మేషనమిషా జీవే తం వందే కృష్ణదేశికమ్ ॥** (21వ సంపుటం పీఠికలో)

పై దృష్టాంతాలను పరికించినపుడు అన్నమాచార్యుల పురందరదాసుల పరస్పర గౌరవం గుర్తుకొస్తుంది.

తాళ్లపాకవారి విశాలమైన సాహిత్యంపై బహుముఖీనమైన కోణాలలో ఎన్నో విషయాలను ఆవిష్కరించిన గౌరిపెద్దివారి పీఠికాసారస్వతం సాహిత్యం పరిశోధక విద్యార్థులకు ఆణిముత్యాలు దాగియున్న సాగరగర్భం వంటింది.

తాళ్లపాక వాఙ్మయసాగరమున కొంతకాలము మునిగితేలిన వ్యుత్పన్నునికిగాని దీని లోతు తెలియుట కష్టము. మామూలు వాఙ్మయమును చూచిన దృష్టితో గాక దీనిని విశేషదృష్టితో గమనింపవలసిన అవసరమెంతైన గలదు అని గౌరిపెద్దివారు ఓ సంపుటం పీఠికలో పేర్కొన్నట్లుగా వేల రేకుల్లోని సంకీర్తన వాఙ్మయాన్ని తరచి తరచి పలు విశేషాంశాలను పీఠికల్లో ప్రస్తావించి భావిపరిశోధకులకు అందించారు రామసుబ్బశర్మగారు.

భాష, భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో కూడినవేకాక, చారిత్రక, భౌగోళికాంశాలతో కూడిన పలు విషయాలను గౌరిపెద్దివారు తమ పీఠికలలో ప్రస్తావించారు.

సొంపుల నీ వదనపు సోమశిలకనుమ (5-115) అనే సంకీర్తనలలో ఆరు కనుమల ప్రస్తావన ఉండటంతో పొత్తపినాడు ప్రాంతంపై అవగాహన కలిగిన శ్రీ మైనంపాటి సుబ్రహ్మణ్యంగారు వారిని లేఖ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకుని వాటిని పీఠికల్లో పేర్కొన్నారు. పై సంకీర్తనల్లో పేర్కొన్న

కనుమలు షట్చక్రాకృతిలో ఉన్నాయని, ప్రతి కనుమకు దగ్గరలో చెన్నకేశవస్వామి ఆలయం ఉందని తెలిపారు. చరిత్ర జిజ్ఞాసువులు దీనిపై సాధన సాగింతురుగాక అని ముందటి తరాలకు నిర్దేశం చేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే, ఇటువంటి అనేక సందర్భాల్లో శాస్త్రపరిజ్ఞానం కలిగిన పండితులను సంప్రదించి, తాము సేకరించిన విషయాలను పీఠికల్లో ప్రస్తావించడం ద్వారా భావి పరిశోధనలకు బాటలు వేశారు!

భాషాపరంగా పరికించినపుడు దేశీ సంప్రదాయంలో విస్తృతమైన తాళ్లపాకవారి సాహిత్యంలోని సందిగ్ధాలన్నిటిని "సందిగ్ధ పదసమీక్ష" పేరుతో సంపుటాల చివరన అనుబంధంగా అందించి, ఆనాడే తాళ్లపాక వారి వాఙ్మయానికి ప్రత్యేక నిఘంటువు అవసరాన్ని తెలిపారు.

మొదటి సంపుటం పీఠికలో అన్నమాచార్యులవారి సంకీర్తన వేదాంతాన్ని, 3వ సంపుటం పీఠికలో రాగిరేగుల పరిష్కరణ చరిత్రను, 5వ సంపుటం పీఠికలో అన్నమాచార్యులవారి చరిత్రను సంగ్రహంగా తెలిపారు, ఇదే సంపుటం పీఠికలో "ఇదిగాక సౌభాగ్యమిదిగాక..." అనే సంకీర్తనకు వారందించిన వ్యాఖ్య శృంగార సంకీర్తనల పరమార్థమైన ఆధ్యాత్మ తత్వమును 'నిత్యానిత్యవస్తువివేకః', 'ఇహాముత్రఫలభోగవిరాగః', 'శమదమాది సాధన సంపత్తిః', 'ముముక్షత్వం' అనే నాలుగు వేదాంత సూత్రాలతో రూపింపబడి ముక్తిమార్గాన్ని సంకీర్తనాత్మకంగా అందిస్తుంది.

శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్యగారి "అన్నమాచార్య సంకీర్తనామృతము" అనే వ్యాఖ్యాన గ్రంథానికి గౌరిపెద్దివారి మున్నుడిని సైతం ఇక్కడ ప్రస్తావించవలసినదే! ఈ గ్రంథంపై వారి అభిప్రాయాన్ని వెల్లడి చేయటమేకాక, తిరుమల తిరుపతి దేవస్థానములలో సముద్రాల వారి కృషిని, వారి పాండితీ ప్రకర్షను కొనియాడారు.

వేలాది రాగిరేకుల్లోని సారస్వతాన్ని చిలికి సంకీర్తనామృతాన్ని అందించటమేకాక భావి పరిశోధకులకు తమ అమూల్యమైన పీఠికల ద్వారా విలువైన పరిశోధన సామాగ్రిని అందించిన శ్రీమాన్ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి సారస్వత సేవా కైంకర్య ప్రభ సప్తగిరులంత ఉన్నతమై శ్రీనివాసుని సన్నిధిలో స్థిరమై నిలిచి ఉంటుంది.

* * *

# విద్వత్సంస్తవనీయసారస్వతమూర్తి

- సాంప్రతి సురేంద్రనాథ్

79772 10158

బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిని స్మరింపగనే మనఃక్షేత్రమున సాక్షాత్కరించునదొక పుంభావసరస్వతీ స్వరూపము... "భాష యదేషావశ యైన యోష" - అని వారి గురించి అవధానపితామహులు శ్రీ సి.వి.సుబ్బన్న శతావధానిగారి ప్రత్యక్షరసార్థకమైన ప్రశంస...

ఔద్యోగికముగ నేను సప్తగిరీశుని సాన్నిధ్యములో సప్తవర్షములున్నాను.. ఆ ఏడు సంవత్సరములు నా సాహిత్యజీవనమున కేడుగడ శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారే.. మా కార్యాలయము వెనుక వీధిలోనే వారి గృహము.. చిన్న ప్రవేశద్వారము.. ఆవరణ.. ఒకవైపున్న అరుగు.. అదిదాటగనే ఇంటి నట్టిల్లు.. దానికి ముందొకవైపు చిన్న గదిలో వారి అపురూప గ్రంథసంచయము.. సాయంసమయమున ఆవైపు పోవువారికెల్ల అరుగుమీద పద్మాసనమున నున్న శ్రీ శర్మగారి దర్శనము తప్పనిసరి..

ఆ చిన్న ప్రధానద్వారమును తీసి ప్రవేశించునప్పుడే.., "రావయ్యా! రా.. రా.." అని పలకరించి.. అరుగుమీద వారిముందున్న స్థలములో కుడి అరచేతితో చరచి.. "కూర్చో.. కూర్చో"... అని ఆప్యాయత.. ఆదరముతో వారి ఆదేశము.. ఇక ఆ పై రెండుగంటలకాలమెట్లు గడచినదో.. ఎన్ని విషయములు.. ఎన్నెన్ని శాస్త్రవిచారములు.. ఇన్నని చెప్ప వీలులేని శబ్ద వివరణములు.. సంస్కృతాంధ్ర సాహిత్యము.. మహాకవులందరూ వారి జిహ్వాగ్రహము నాశ్రయించి పలకరించి పులకరింతలతో అనుగ్రహించువారే..

ముఖ్యముగ వారికి సంస్కృతమున శ్రీహర్షుని నైషధకావ్యము, ఆంధ్రమున తెనాలి రామకృష్ణుని "పాండురంగ మాహాత్మ్యము" అభిమానకావ్యములు.. 'కవికులాదృష్టాధ్వ గమనాధ్వనీనుండు' శ్రీహర్షుడు.. 'పాండురంగవిభుని పదగుంభనంబును' అని ప్రశంసింపబడినవాడు తెనాలి రామకృష్ణకవి. ఆ ఇరువురు మహాకవుల ప్రౌఢపదసంయోజనము, సమాసకల్పనము, ఉహాశాలిత, భావవైశిష్ట్యము, పద్యశిల్పము, అలంకారరమణీయకత.... - మంత్రముగ్ధులమై శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగురువుగారి వాక్సుధాసేచనమున పరవశమందవలసినదే.. మనసును కదలించిన విషయములు విశ్లేషించి వివరించునప్పుడు వారు సంస్కృతాంధ్ర సకల వ్యాఖ్యాతృసారస్వత సంప్రదాయ సమగ్రమైన

త్రివిక్రస్వరూపముగ భాసించెడివారు..

తెనాలి రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమునకొక ప్రామాణికవ్యాఖ్యానము వ్రాయవలెనని వారికొక అభిలాష.. ఆ అభిలాష వారిగురుస్థానీయులు శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారికి కూడ నుండినదన్నది పలువురు పండితులెఱిగిన రహస్యమే.. శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు కేవలము భాషా సంబంధి సాహిత్యాలంకార వ్యాకరణశాస్త్రములు, తర్కమీమాంసాది వేదాంతశాస్త్రములేకాక, ఆయుర్వేదము, మంత్రశాస్త్రరహస్యములు, జ్యోతిషమును అధ్యయనము చేసినవారు.. ఈ బహుముఖీన శాస్త్రపాండిత్యము వారి విద్వత్ శరీరమునకు శ్రీరామరక్షగా నిలచిన వజ్రకవచము.. అప్పుడు వారు బ్రహ్మశ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి పరిష్కరణ వారసులుగ, తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రచురించుచున్న పదకవితాపితామహుడు అన్నమాచార్య కీర్తనల పరిష్కరణములో తలమునకలుగ నుండేవారు... రాగిరేకులలో.. కొన్ని తావుల సుస్పష్టముగ.. కొన్నిచోట్ల అస్పష్టముగ.. మరికొన్ని పదములలో స్పష్టాస్పష్టముగ అల్లుకొనిన అన్నమయ్య జాతీయములను, దేశిపదములను సరైనకోణములో దర్శించి పరిష్కరించుట సామాన్యమైన విషయము కాదు.. పైగా ఇప్పుడున్న సాంకేతిక సౌకర్యములప్పుడు లేవు కదా.. అయినను... – బహుశః ఆ సాంకేతిక సౌకర్యలోపము.. అదేకారణమని కూడ అనవచ్చు.. – వారికి మరి అన్నమయ్య పదార్చనము నిత్యధ్యానమైనది.. అదొక తపస్సు.. అదొక అలౌకిక సారస్వతారాధన.. **"వ్రతం సారస్వతో యాగః"** అన్నాడు కదా అలంకారికాచార్యుడు క్షేమేంద్రుడు.. అది శ్రీశర్మగారిపట్ల సర్వార్థముగ సార్థకమైన పరిశ్రమ..

ప్రతిపరిష్కృత సంపుటమునకు.. విశేషవిస్తృతమగు పీఠికను రచించుట పరిష్కర్తలననుసరించిన ఘంటాపథమే.. సంప్రదాయమెఱిగిన శ్రీ శర్మగారా మార్గమునకు భిన్నముగ నెట్లుండగలరు.. ఆ విపులపీఠికలో వారు తెలిపిన సామాజిక, సాంస్కృతిక, చారిత్రక భాషావిషయిక సాహిత్య విశేషములనేకములు.. ప్రతి పీఠికను దైవస్తుతిగ ప్రార్థనాశ్లోకముతో ప్రారంభించుట వారు పాటించిన నియమము.. వారి పరిష్కరణమున అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనల సంపుటములెన్నో.. అట్లే శృంగార సంకీర్తనముల సంపుటములు.. తాళ్లపాకవుల ఆధ్యాత్మిక కీర్తనము లెంతటి ఉపనిషదర్థవ్యాఖ్యానముగ వెలసినవో, శృంగార సంకీర్తనములన్ని విధముల సరసరసమయ మనోజ్ఞకములైనవి.. ఇవి పీఠికలలో చర్చకు అవసరమైన తావులలో శ్రీశర్మగారు మోమాటము లేక,

అన్నమయ్య పచ్చిగవెలార్చిన శృంగారమునట్లే నిక్కచ్చిగ నిగ్గుదేల్చి నిరూపించినవారు.. 'శృంగారసంకీర్తనములు' 27వ సంపుటము పీఠిక ప్రారంభమున వారొనరించిన ప్రార్థనము –

**శృంగారాపాంగమాలాభిః వశీకృతవృషేశ్వరమ్**
**నిరస్త్రపుంస్త్వమాత్మేచ్ఛా కామశాస్త్రం నమామి తమ్**

శృంగారరసనిష్ఠమైన సాహిత్యవివేచనమున కామశాస్త్రవిషయస్పర్శ లేనిచో రసాభాసమగును.. అక్కడ అన్ని శాస్త్రములతోపాటు అదికూడ విహితమైన శాస్త్రసంప్రదాయమర్యాద..

శ్రీరాళ్లపల్లివారి కడనే వారికి సహాయులుగ అన్నమయ్య సాహిత్యమును అధ్యయనముచేసి అన్నమయ్య దేశీయపదముల వరవడిని పుక్కిటబట్టించుకొనిన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు నన్నయమహర్షి మహాభారతాంధ్రీకరణమునకు కొనసాగింపుగా సోమయాజియై, కవిబ్రహ్మ తిక్కనగారు – పదిహేను పర్వములనొక్కచేతిమీదుగ సకలాంధ్రజనసమ్మోహనముగ మహాభారతయజ్ఞమును సంపన్నముచేసినట్లే... శ్రీరాళ్ళపల్లి వారి తర్వాత అన్నమయ్య సంకీర్తనములననేక గ్రంథములుగ పరిష్కరించి కృతకృత్యులైనారు..

ఈ పరిష్కరణ పీఠికలలో అన్నమయ్య పదములకు సరైన శబ్దస్వరూపముల నేర్పరించు నైపుణ్యము శ్రీశర్మగారి సుస్పష్టమైన పాణినీయవ్యాకరణపాండిత్యము, తెలుగుభాషామర్యాదలనాకళింపు జేసికొనిన భాషాపరిశ్రమ.. రెండును తోడై సవ్యసాచిత్వముగ తాళ్ళపాకకవుల హృదయమునకు పరితృప్తిగ, పరితోషముగ, సకలజనానందకరముగ.. ఆ మహాయజ్ఞకార్యమును సర్వార్థ సంపన్న మొనర్చినది..

ఈ పరిష్కరణములలో వారు విచారించి నిర్ధారించిన శబ్దశాస్త్రమర్యాదలకతీతముగ నడచిన కొన్ని అన్నమయ్య పదవిన్యాసములు.. 'ఆరజీఁడు', 'చేఁతలాడి', 'మొత్తగాఁడు', 'వైపరి', 'మొక్కలికాఁడు', 'తరువరి', 'నెఱతనీఁడు' – ఇత్యాదులెన్నో.. 'మొక్కలికాఁడు' శబ్దస్వరూప వివరణమున.

"మొక్కలము + ఇ – మొక్కలి
మొక్కలి + కాఁడు – మొక్కలికాఁడు"

తద్ధితముపై ఏకార్థకమైన తద్ధితప్రత్యయము.. "న తద్దితా త్తద్ధిత" అను శాస్త్రము ఏ

మూలనున్నదో.. మా అన్నమయ్య కడ్డపడలేదు..” (అన్నమయ్య శృంగార సంకీర్తనలు - 28వ సంపుటము)

ఇటువంటివి అన్నమయ్య స్వేచ్ఛాపదప్రయోగములకు వారిచ్చిన చేయూత.. ఇవి తర్వాతి అన్నమయ్య పదపరిశోధన.. అన్నమయ్య పదకోశనిర్మాణమున అర్వాచీనులకు ‘సూత్రస్యేవాస్తి మే గతిః’ అన్న విధమున మార్గనిర్దేశకములైనవి.. విశేషముగ వివరింపవలెనన్న వారి పీఠికలనన్నింటిని పునర్ముద్రించినట్లే యగును.. వివరములకు జిజ్ఞాసువులు ఆయా సంపుటములను చూచెదరుగాక.. అని విన్నపము..

చెప్పవలెనన్నో ఎన్నో విశేషములు.. శ్రీ శర్మగారికి సరస్వతీపుత్రులు శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారితో గల సాన్నిహిత్య మపురూపమైనది. సరస్వతీపుత్రుల నిరంకుశ ప్రసంగ వాగ్ధాటి, ధోరణి జగద్విదితమైనదే.. ప్రొద్దుటూరిలో ఒకానొక సభలో వారి ఉపన్యాసములో వారికి సహజమగు ధోరణిలోనే ఘాటైన వాక్యములతో వారి ఉపన్యాసము సాగినది. సహింపలేని కొందరాసభ అయిన కొన్ని దినములకు పుట్టపర్తి నారాయణాచార్యుల వారిపై తీవ్రముగ విమర్శలను ప్రకటించిరి.. సరస్వతీపుత్రులు మిన్నకుండిరి.. కానీ.. మైత్రి సాన్నిహిత్య సాహిత్య బాంధవ్య కర్తవ్యమును త్రోసిరాజనలేని శ్రీ శర్మగారు వానికి సమాధానములు వ్రాసి శాంతపరిచిరి.. ఆ విమర్శన సమర్ధన వ్యాసముల చిరుగ్రంథము నాకడ భద్రముగ నున్నది.

మరొక్క విశేషమును విన్నవించుకొని స్వస్తివాక్యమును పలికెదను.. శ్రీ శర్మగారు సంస్కృతాంధ్రములలో అవధానిశేఖరులు.. వారి అవధానములను నేను విద్యార్థిదశనుండి చూచిన వాడను.. వారి ఆశువు మహేశ్వరజటాజూటనిస్సరద్గంగాఝరీవేగమున ప్రసరించు పద్యప్రవాహము.. అవధానుల ప్రజ్ఞకు ప్రతిభాసామర్థ్యములకు నికషోపలములైన నిషేధాక్షరి, దత్తపదములు, సమస్యాపూరణములు వారికలవోకగా తలవంచెడివి...

**కలలో గర్భము నిల్చె కోమలిని లోకంబింక నిందింపదే**

ఇదొక అవధానమున వారికిచ్చిన సమస్య..

*శ్రీ గౌరిపెద్ది వారి పూరణము..*

**అలఘు స్వాంతుడు కామశాస్త్ర దిషణాఖ్యాతుండు ప్రాయంబునన్**
**లలితాంగీమణి నూత్నయవ్వన సముల్లాస స్ఫురద్రూప తాన్**
**వలపుల్ మానసమందు నాడగను నిర్వక్రంబులా రాకపో**
**కలలో గర్భము నిల్చె కోమలిని లోకంబింక నిందింపదే**

నిర్వక్రంబులా రాకపోలలలో – అన్న సద్యస్స్ఫురణ.. అదిలేనిచో అవధాని సభారంగమున ప్రకాశింపలేడు.. అన్నారు కదా విద్వన్మణులు.. ''స్ఫురణా భగవత్స్వరూపా''.. అది నిరంతరసారస్వతోపాసనాలబ్ధమైన ప్రతిభా విశేషము.

శ్రీ శర్మగారికి నా గురువులైన బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మగారనిన అమితమైన గౌరవము.. స్నేహము.. ఈ శైష్యోపాధ్యాయిక నన్ను శ్రీ గౌరిపెద్ది వారికి మరింత సన్నిహితునిగ చేసినది.. అట్లే వారికి అవధాన పద్యములను ప్రౌఢప్రబంధపదబంధురముగ తీర్చిన శ్రీ సి.వి. సుబ్బన్న శతావధానిగారన్న శిష్యవాత్సల్యము... వీరికి వారన్నచో ప్రామాణిక గురుస్థానీయులు.. అనేకములగు శబ్దములను వారితో విచారించువారు...

ఇక వారి సాహిత్య రాసిక్యము.. అవి చెప్పుకొనవలెనన్నచో.. ఆ విశేషములు మరియొకమారు..

1961 సత్యవేడు అవధానసభలో శ్రీ సి.వి.సుబ్బన్న శతావధానిగారు బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి కర్పించిన పద్యసుమార్చనము.

**పయికిం దోఁచెడు సాధుమూర్తియు హృదబ్జస్ఫూర్తియున్ జిన్న మం**
**తయు భిన్నస్థితినొంద కెవ్వనియెడన్ సారూప్యముం జెందె, "భా**
**ష యదేషావశయైనయోష" తదుదంచత్కీర్తి మా రామసు**
**బ్బయ విద్వన్మణి గౌరిపెద్దికుల శుభ్రాంశుం బ్రశంసించెదన్.**

స్వస్తి

సుధీవిధేయుడు

**సాంప్రతి సురేంద్రనాథ్**

ముంబాయి,

18-08-2023.

# శబ్ద సిద్ధుడు

– శతావధాని ఆముదాల మురళి
తిరుపతి – 94404 32683

ఉ॥ శ్రీమహిమానురాగ రససింధు సముద్భవ చిత్సుధానిధిన్
ధీమీయు గౌరిపెద్ది వరదేశిక వర్యువధాని చంద్రునిన్
స్వామిహృదంతరాళ నిజవాస విలాస విపశ్చితాగ్రణిన్
ప్రేమగ రామసుబ్బయను వేఁగొనియాడెద శబ్ద సిద్ధునిన్

మ॥ అవధానంబులు చేసి కావ్యరచనా వ్యాపారపారీణ సం
స్తవనీయాత్ములు గౌరిపెద్దికుల విద్యామూర్తి మాబోంట్లకున్
కవనంబల్లు పథంబు జూపెననగాఁ గాదింత దోషంబు త
జ్జవ సత్త్వంబులు శారదాంబ యిడుతన్ సత్కావ్యముల్ వ్రాయగన్

చం॥ పదకవితా పితామహుడు భక్తుడు నిర్మల తాళ్ళపాక వం
శధవళపూర్ణచంద్రుడు ప్రశస్త సుధామయ గేయకర్త, ని
ర్మదముఖ శత్రుషట్కుడు పరాత్పరు నందకమన్నమయ్యలో
మెదలిన సాధుభావముల మేల్మి వచించిన వాణిఁగొల్చెదన్

మ॥ తనకంటెన్ బదిరెట్లు పండితులుగా ధర్మాను సంధాతృలై
మని కీర్తిన్ గొనునట్లు శిష్యులను నిర్మాణంబు గావించె నే
ఘనుడాపండిత రామసుబ్బకవి రాకాచంద్రునాంధ్రావనీ
వినయోదంచిత పుత్రరత్నమును భావింతున్ మహాప్రాజ్ఞునిన్

శా॥ గాంభీర్యంబున కాటపట్టు తనువున్ గారుణ్యవారాశి వా
క్సుంభత్త్రాభవ మెన్న కంఠమున వ్యాకోచించు మాధుర్యమున్
శంభుధ్యానపరైక చిత్తము శుభాశంసాశిషంబుత్ సదా
కుంభస్ఫార సమంతవృష్టియగు వాగ్యోగాత్ము నగ్గించెదన్

# పద్యవందనము

– శతావధాని ఉప్పలధడియం భరతశర్మ

చరవాణి : 82478 28200

శా. గీర్వాణాంధ్రకవిత్వసుందరకళార్ణున్ వధానక్రియా
స్వర్వాహిన్యుపమాశుభావయుతభాస్వత్పద్యనిర్మాత నాం
ధ్రోర్వీగౌరవదాయకున్ సుకవిమాన్యున్ వేంకటేశాంఘ్రిరో
చిర్వాంఛాయుతు గౌరిపెద్దిఁ గొలుతున్ శ్రీరామసుబ్బాహ్వయున్. 1

మ. అవధానమ్ములలో చమత్కృతులవిన్యాసంబుతో వేదమం
త్రవిశేషార్థవివేచనమ్ము మెయి విద్వద్రాజి శ్లాఘింపఁగా
కవితాసుందర పారిజాతసుమసౌగంధ్యమ్ములన్ బంచుచున్
స్తవనీయుండయి రామసుబ్బకవి విశ్వఖ్యాతి పొందెన్ దగెన్. 2

ఉ. ఆయతసాధనప్రభవమంది సమస్తసుకావ్యజాలమున్
ధీయుతుడై మదిన్ నిలిపె, దీపితపాండితియున్ గడించె ; నా
ప్యాయతఁజూపె శిష్యనిచయంబుపయిన్; వినుతింప శక్యమే
యా యనఘాత్మునిన్ సుకవితార్జితకీర్తిని రామసుబ్బనిన్ 3

చం. వివిధవధానకర్తలకు వెన్నుగ నిల్చుచు ప్రోత్సహించి స
త్కవులుగఁ దీర్చి శిష్యుల నుదారదయామయచిత్తపద్ముఁడై
అవిరళశేముషీలసితుడై, వెలుగొందు మహాప్రబంధకా
వ్యవిసరసంభృతాత్ముని సభక్తి నుతింతును రామసుబ్బనిన్. 4

మ. మృదులసుగీతమాధురుల నేర్పడఁజేసిన యన్నమయ్య సత్
పదములకున్ మహాయశము తద్దయుఁగూర్పఁగ పీఠికావచో
విదితము చేసి గ్రంథములఁ బేర్కొనినట్టి మహానుభావు హృ
త్సదనమునందు జేర్చి మనసా భజయించెద రామసుబ్బనిన్ 5

# బహుముఖ ప్రజ్ఞాశాలి - గౌరిపెద్ది

**గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్**
న్యాయవాది, తిరుపతి
94927 04983

గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి శతజయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి... వాస్తవానికి తి.తి.దే. వారే ఆ వేడులను ఘనంగా జరిపారు. అందులకు శతథా కృతజ్ఞతలు.

తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలను వెలుగులోనికి తేవటంలో తి.తి.దే.కు కీర్తిని చేకూర్చటంలో క్రీ.శే. గౌరిపెద్ది వారి పరిశ్రమ, సేవ సదా సంస్మరణీయం. 27 సంపుటాల పరిష్కరణలో, 21 సంపుటాల పరిష్కరణ స్వయంగా చేపట్టినవే. 1964 నుంచి 1983వ సంవత్సరం మధ్యకాలంలో, వారు పలుహోదాలలో పరిష్కరణ బాధ్యతలయందు లీనమై చేసిన పరిశోధనాశ్రమ ఫలితమది.

గత ఏడాది శతజయంతి వేడుకల సందర్భంగా విశేష సంచిక ఆవిష్కరించాక శ్రీ గౌరిపెద్ది వారి గురించి మరెన్నో విషయాలు బహుముఖ ప్రజ్ఞాసంబంధమైనవి, పలువురు మేధావులు నాతో పంచుకున్నారు. వాటిని ప్రస్తావించటం నా ధర్మం.

**అవధాన ప్రజ్ఞ**

ఆనాడు..తి.తి.దే. వారి శ్వేత భవనంలో ఉద్దండులైన పండితులు శివపురాణ పరిష్కరణకు సంబంధించి సమావేశమై యున్నారు. శ్రీయుతులు విభీషణశర్మగారు నన్ను వారికి గౌరిపెద్ది వారి పుత్రుడిగా పరిచయం చేశారు. వారి వదనాల్లో గౌరవంతో కూడిన సంతోషం, నాపట్ల ఆశీః భావన గమనించాను. వారిలో మహామహులు అవధాని శ్రీ సూరపు శ్రీరాములుగారు. ప్రస్తుతం తి.తి.దే.లోని ధర్మప్రచార పరిషత్తుకు కార్యదర్శి వున్నారు. వెంటనే శ్రీ గౌరిపెద్ది వారు పూరించిన అమోఘమైన సంస్కృత సమస్య పూరణను గుర్తుకు తెచ్చుకుని వివరించారు. ఆ అవధానం జరిగింది – నెల్లూరులోని వేదసంస్కృత పాఠశాలలో.. 1969–70 సంవత్సరాల మధ్య.. సమస్యను పూరించటంలో శ్రీ గౌరిపెద్ది వారి భావం, పద్యనిర్మాణాన్ని సమావేశమైన పండితులు కొనియాడారు.

సమస్య :

**"నారీ స్తనంధయతి సింహశిశుం విచిత్రమ్"**

సంధించినవారు : శ్రీమాన్ కె.యస్.రామానుజాచార్యులు.

పూరణ ఇలా :

**పుణ్యాశ్రమేషు యువతీ జనపాలితేషు**
**విశ్వాసయోగమహితేషు మహామృగేషు ।**
**వాయౌస్తనాంచల ముదాసయతి ప్రభాతే**
**నారీస్తనంధయతి సింహశిశుం విచిత్రమ్ ॥**

వైద్య ప్రజ్ఞ :

బ్రః॥వేః॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు ఆయుర్వేద వైద్య ప్రక్రియలన్నీ స్వాధ్యాయానుభవాల మిళితమైనది. అవసరమైనచో, అవశ్యమైనచో దైవవ్యపాశ్రయ విధానాన్ని ప్రయోగించి ఫలితాలు పొందినవారే.

ఒక ఆశ్చర్యకరైన విషయం, దివంగతులు మహామహొపాధ్యాయ శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారి ద్వారా తెలిపినది. శతజయంతి ఉత్సవ సంచికలను అందుకుంటూ "మీ తండ్రిగారి మేధా సంపత్తి సాహిత్యం, పరిష్కరణలలోనేకాక ఆయుర్వేద వైద్యంలోనూ విశేషమైనది. వారు పాటించిన వైద్య ప్రక్రియల్లో నాడీ స్పర్శ ద్వారానే కాక, రోగి స్వరమును బట్టి గ్రహించినారు." వారు నాతో పంచుకున్న కీ.శే. గౌరిపెద్ది వారి అనుభవంలో రోగి  శరీర, వ్యాధిస్థితి నిర్ధారణ యిలా...'

ఒకరోజు... రోజూలాగే ఒకావిడ ఆకుకూరలు అమ్ముకుంటూ వీధిలో "ఆకుకూర" అని అరుస్తూ వెళుతున్నదట. శ్రీగౌరిపెద్ది వారు ఆమెను పిలిచి ఆకుకూరల ధర ఎంతని అడిగి, మొత్తం గంపెడు ఆకుకూర ఎంతకిస్తావు" అని విచారించి అడుగగా...

"ఏం చేసుకుంటావు స్వామీ... మొత్తం ఆకుకూర" అని అడిగినదట.

"నీవిచ్చిపో" అని మొత్తం గంపలోని ఆకుకూరలు కొన్నారట. సాయంకాలం తెలిసిన విషాదకరమైన వార్త ఏమిటంటే ఆ మధ్యాహ్నమే ఆమె మరణించిందట. 'ఆకుకూర' అని అరిచే ఆమె గొంతులో స్వరాన్ని బట్టి గ్రహించి ఆమె "అంతకన్నా శ్రమ పడకూడదని గ్రహించారో, అలాగే తక్కువ శ్రమపడనిచ్చి ఆమెకు ధనసహాయం చేయదలచుకున్నారో తెలియదు.

ఆమెకు ఆ విధంగా సహాయం చేశారు.

అనూహ్యమైన అటువంటిది వారవలంబించిన రోగనిర్ధారణశక్తి. ఈ విధానము మానవుని అతిమానుష శక్తికి ఉదాహరణయా...? ఏమో..? ఇలాగ పూర్వీకుల నుంచి గ్రహించిన శక్తులు అసామాన్యము.

**జ్యోతిష ప్రజ్ఞ**

జ్యోతిష శాస్త్రంలోనూ బ్ర॥వే॥ గౌరిపెద్ది వారిది అందెవేసిన చేయి. ప్రవృత్తిగా, జ్యోతిష విద్యను నమ్మి, పరిమిత వర్గాలకు సలహాలు, పరిష్కారాలు తెలుపుతూ, ధనార్జనకోసం ఏనాడూ ఉపయోగించుకొనలేదు.

మహామహోపాధ్యాయ కీ.శే. సముద్రాల లక్ష్మణయ్యగారు ఈ విషయంలోనూ వారి ప్రతిభను పొగుడుతూ, వారు ప్రచురించిన శ్రీమలయాళ స్వాములవారి గ్రంథములోని విషయాన్ని నాకు అందించారు. భవిష్యత్తులో శ్రీ గౌరిపెద్ది వారు గురించిన ప్రచురించే పుస్తకములో పొందుపరచమని సలహా యిచ్చారు.

ఆ విషయం వున్నదున్నట్లుగానే ఇచట  పొందుపరుస్తున్నాను.

## శ్రీ మలయాళ స్వాములవారి జాతకము

**జనన సమయము**

వృషభ శని కుంభగురు – మీనమాసము 15వ తేదీన గురువారము అస్తమానమై (పూర్తి అయి) శుక్రవారమున అనగా తెల్లవారుటకు 7 ఘడియలు, 15 విఘడియలు ఉండగా, ఆశ్లేష

నక్షత్రమునందు, పూర్వపక్ష (శుక్ల పక్ష) ద్వాదశిన సింహకరణ ధృతినామ నిత్యయోగముతో కూడిన యోగ మాయాసమయమున, మకరరాశి (ద్రేక్కాణంజ్యో) పురుష జననము.

**సవరణలు** (ఇక్కడ నుండి జాతకము లఘు వివరణముతో సహా కల భాగము బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిచే పరిష్కరింపబడినది.)

(1) 'షష్టి వత్సర దృగ్గణిత పంచాంగములు' (1867-68 నుండి 1926-27 వఱకు) అను గ్రంథము ఆధారముగా చూడగా, కేరళదేశ ప్రసిద్ధమగు కొల్లం శకము 1060 అని గుర్తింపబడుట న్యాయమే. మీనమాస శుద్ధ ద్వాదశీ శుక్రవారమునకు సరియగు క్రీస్తుశకపు తేది 27-03-1885 అగుచున్నది. కాన పై తేది సవరింప వలసి యున్నది.

(2) 'మీన మాసము 15వ తేదీన గురువారము అస్తమానమై శుక్రవారమున తెల్లవారుటకు 7-15 గడియలుండగా' అని వారు తెలిపి యుండుటచే స్వామి వారి జన్మతిథి ఏకాదశిగా నిర్ణయింపవలసి యున్నది. మీనమాసము 15వ తేది గురువారము ఏకాదశి 53-2 గడియలు అని పై పంచాంగమున గలదు. అహర్నిశా మానము 60 గడియలలో వారు తెలిపిన 7-15 గడియలు తీసివేసినచో 52-45 గడియలకు స్వాములవారి జననమని తేలుచున్నది. అప్పటికి ఏకాదశి యుండుట స్పష్టమే

(3) మీన మాసము 15వ తేదికి సరియగు 26-3-1885వ తేది రాత్రి 3-18-20 ఏ.ఏమ్.కు (తెల్లవారితే 27-3-1885) జననము గాన, భారతీయ ఆంగ్ల-ఉభయ మాసములతోను 27-3-1885వ తేది 3-18-20 ఏ.ఎమ్. శ్రీవారి జననకాలమని గుర్తింపవలసి యున్నది.

ఈ సవరణతో ఆంధ్రదేశ ప్రసిద్ధ చాంద్రమానము ప్రకారము :- శా.శ.1807 స్వస్తిశ్రీ పార్థివనామ సంవత్సర-చైత్ర-శుద్ధ-ఏకాదశీ-గురువారము 53-2, పుష్యమి 11-48, సు.23-43 గల శుభధినమున సూర్యాస్తమాది 22-49 గడియలకు (27-3-1885వ తేది 3-18-20 ఏ.ఎమ్. శుక్రవారము) శ్రీవారి జననమని తీర్మానించడమైనది. దీనికి సరియగు జన్మకుండలి -

ఋక్షాద్యంతము 56-54, నక్షత్రభుక్తి 40-52, ఆశ్లేష 3 పా.

| | | | |
|---|---|---|---|
| ర,కు,బు శు,కే. | | శ | |
| | **జన్మరాశి కుండలి** | | చం |
| ల | | | గు(ప) |
| | | | రా |

| | | | |
|---|---|---|---|
| బు.ల | రా | గు(ప) | |
| చం | **అంశ కుండలి** | | |
| ల | | | కు.శు.శ |
| | ర, కే | | |

## జాతకము - లఘు వివరణము

## జాతక భాగమున ప్రవ్రజ్యా యోగములు

ఏకస్థైః చతురాదిభి ర్బలయ తైః జాతాః పృథగ్వీర్యగైః
శాక్యాజీవిత భిక్షువృద్ధ చరకా నిర్గ్రన్థ వన్యాశనాః ।
మాహేయజ్ఞ గురుక్షపాకరసిత ప్రాభాకరీనైః క్రమాత్
ప్రవ్రజ్యా బలిభి స్సమాః పరజి తైః తత్స్వామిభిః ప్రచ్యుతిః ॥
(బృహజ్జాతకము - ప్రవ్రజ్యా యోగాధ్యాయము -1)

ఇత్యాదిగా నున్నవి. పై జాతకము తృతీయస్థానమున గ్రహపంచకముండి, నవమ కోణాధిపతియగు బుధునికి వర్గోత్తమాంశమై, కర్మ స్థానాధిపతి శుక్రుడు ఉచ్చగతుడై ఆ బుధునితో రాశి చక్రమున కలిసి యుండుటచే, రవికుజ సంబంధము వలన ఇట్టి జాతకులకు అద్వైత సన్న్యాసము అప్రతిహతమని తెలియుచున్నది.

ఇదేకాక శ్రీమాన్ రాళ్ళపల్లి వారి జాతక చక్రాన్ని తయారు చేసి, దాని పరిశీలనలో ఎన్నో విషయాలను వారి కుటుంబీకులతో చర్చింటమేకాక, గతంలో యువభారతి ప్రచురించిన "ఆలోచనాలహరి" సంచికలో ప్రస్తావించారు.

**తాళ్ళపాక సంకీర్తనల పరిష్కరణ ప్రజ్ఞ**

తాళ్ళపాక వారి సంకీర్తనల పరిష్కరణ బ్రాIIవేII గౌరిపెద్ది జన్మకు సాక్షాత్తు శ్రీనివాసుని కటాక్షమే. ఏవిధంగానంటే, శ్రీ గౌరిపెద్ది వారి జన్మ సంవత్సరమూ, తాళ్ళపాక వారి కీర్తనలు వెలికి తీసిన సంవత్సరమూ... ఒకటే కావటం... అదే 1922 కావటం మరియొక విశేషము... శ్రీ వేంకటేశ్వరుడే సర్వాభరణాలంకార భూషితుడై బ్రాహ్మీముహూర్తమున ప్రత్యక్షమై "నాదీ, అన్నమయ్యదీ, నీదీ భారద్వాజ గోత్రమే కదూ" అని నవ్వుతూ అంతర్ధానమయ్యారన్న విషయం తెలిసి, సందిగ్ధంలో వున్న శ్రీ గౌరిపెద్ది వారు పరిష్కరణ బాధ్యతను అంగీకరించారు. తర్వాతనే తి.తి.దే. అధికారులకు ఆమోదం తెలిపారు.

తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల రాగిరేకులను పరిశీలించటమేకాక, బ్రహ్మశ్రీ గౌరిపెద్ది వారు అపార కృషితో అనేక విషయాలను విశ్లేషించి నిర్ధారించారు.

అతిముఖ్యంగా తాళ్ళపాక వారి జన్మదిన నిర్ధారణపై వీరి వాదన అంగీకారయోగ్యమై, నేడు టి.టి.డి. వారు జరుపుతున్న జయింతి, వర్ధంతి వుత్సవాలు, వాటి ప్రామాణికంగానే నిర్వహిస్తున్నారు.

శివకేశవుల అభేదం, వైష్ణవ ఆగమశాస్త్ర అంశాలపై వివరణ, అన్నమయ్య రచించిన శృంగార కృతులలోని భక్తితత్త్వాలను గోపికాభక్త్యన్వయముగా వివరించటం యిలా సున్నితమైన అంశాలను చర్చిస్తూ పాఠక లోకాన్ని ఆలోచించేలా నడిపించారు.

ఇకపోతే, రాగిరేకులకు సంబంధించిన సంఖ్యాపరమైన చర్చ, వాటిని క్రమపరిచేప్రక్రియ, 50 నుంచి 100 సంకీర్తనలకు ఒక సంపుటంగా మార్చి, పరిష్కరించిన వైనం మరొక పరిశోధనాంశం. అన్నమయ్య పదనిఘంటువును తయారుచేయాలనుకున్న వారి శ్రమ ఫలించకముందే గతాసువులయ్యారు.

బ్రహ్మశ్రీ గౌరిపెద్ది వారి అన్నమయ్యగారి సంకీర్తనల పరిష్కరణ విశేషాలను అర్హులైన మహాపండితులు ఎందరో వివరించారు. కాబట్టి అల్పజ్ఞానుడిని అయిన నేను దానిని స్పృశించలేను.

* * *

# గౌరిపెద్ది ఆ పేరే చాలు



గురుసహస్రావధాని
డా॥ కడిమిళ్ళ వరప్రసాద్
92478 79606

ఒక్కొక్క ఇంటి పేరు వినగానే ఒక్కొక మహానుభావుడు గుర్తుకు వస్తాడు. బమ్మెర అనగానే పోతన, అల్లసాని అనగానే పెద్దన, దివాకర్ల అనగానే తిరుపతిశాస్త్రి, చెళ్లపిళ్ల అనగానే వేంకటశాస్త్రి, విశ్వనాథ అనగానే సత్యనారాయణ ఇలా ఎందరో ఎందరెందరో వారి వారి వంశానికి వెలుగు తెచ్చిన మహనీయులు. అలాగే గౌరిపెద్ది అనే ఇంటి పేరు వినగానే రామసుబ్బశర్మగారు గుర్తుకు రావలసినదే ఏ రసజ్ఞునికైనా. "ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాః" అని కాళిదాసు అంటే ఏదో కవిసమయంలే అనుకొన్నాను. కాని శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారిగురించి తెలిసాక అది అక్షరసత్యమనిపింది. అరే! ఎన్నో జన్మలనుండి మూటగట్టి తెచ్చుకొన్న పాండిత్యం ఒకే జన్మలో ఆవిష్కృతమైతే, ఆ విద్యకు ఒక రూపం ఏర్పడితే అదే శ్రీ రామసుబ్బశర్మ.

ఆయన నడయాడిన నిఘంటువు. వేదం, వేదాంతం, సాహిత్యం, ఆయుర్వేదం, జ్యోతిష్యం, మంత్రశాస్త్రం ఇన్నిటిలో ఆరితేరిన మహామనీషి. అవధానవిద్యలో అందెవేసిన చేయి. విచిత్రమేమంటే ఇంత పాండిత్యం, లాక్షణికభాషా కవిత్వం కలబోసిన వ్యక్తి వ్యావహారికభాషలో చేసిన రచనలపై పెద్దగా మక్కువ చూపరు. అటువంటిది అన్నమయ్య సంకీర్తనల విషయంలో ఆయన చేసిన కృషి అమోఘం, అసాధారణం, అత్యున్నతం. అంటే శ్రీరామసుబ్బశర్మ ప్రేమించినది కవిత్వాన్నే కాని, ప్రక్రియను కాదు అన్నది సుస్పష్టమౌతోంది. విశాలహృదయం ఉన్నవారు మాత్రమే అలా ఉండగలరు.

సంస్కృతభాషలో పాండిత్యం ఉన్నవారికి సంస్కృతకావ్యాలను పరిష్కరించుట, వ్యాఖ్యలు పీఠికలు వ్రాయుట కరతలామలకం. అలాగే తెలుగుభాషా పాండిత్యం ఉన్నవారికి తెలుగు కావ్యాలు. కాని అన్నమయ్య కీర్తనలను పరిష్కరించాలన్నా, అర్థాలు వ్రాయాలన్నా, వ్యాఖ్య చేయాలన్నా, పీఠికలు సమకూర్చాలన్నా అదొక అసాధారణ పరిశ్రమ. అన్నమాచార్యులవారు అచ్చ తెనుగు పదాలను


బహుళంగా ఉపయోగించారు. మాండలిక పదాలకు పెద్దపీట వేసారు. వాటిని అర్థం చేసికోవడానికి తల ప్రాణం తోకకు వస్తుంది. ఒక్కొక్కసారి ఒక్క పదం తెలియడంకోసం ఎన్నో నిఘంటువులు వెదకాలి. అయినా తెలియకపోతే ఆ ప్రాంతానికిపోయి, అక్కడి సామాన్య జనానీకాన్ని అడిగి తెలిసికోవాలి. కీర్తనలోని విషయాన్ని విడిచిపెట్టకూడదు. కవిహృదయం దాటి వెళ్లకూడదు. నిజంగా కత్తిమీద సాము అన్నమయ్య పదాలపై పరిశ్రమ చేయడమంటే.

కాలికి గాయం కలుగకుండా కత్తిమీద సాము చేసి ఔననిపించుకొన్న మహా పాండితీవీరుడు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ. వారికి శతజయంతి ఉత్సవాలు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములవారు సంకల్పించడం నిజంగా సరస్వతికి సమర్చనం చేయడం. భాషకు పట్టాభిషేకం కావించడం. కవిత్వానికి కైదండలర్పించడం. నిలువెత్తు జ్ఞానానికి నీరాజనాలు పట్టడం.

గౌరిపెద్ది వంశమ్ము విఖ్యాతి గాంచె
సుజనుడైనెట్టి శ్రీ రామసుబ్బశర్మ
పుట్టుటం జేసి, యా మహాత్మునకు మ్రొక్కి
నాదు జన్మకు నిజము ధన్యతను గూర్తు ॥

*హరిఁ గొలువని కొలువులు మఱి యడవిఁగాసినవెన్నెలలు*
*గరిమల నచ్యుతు విననికథలు బువి గజస్నానములు*
*పరమాత్మునికిఁ గానితపంబులు పాతాళములనిధానములు*
*మరుగురునికిఁగానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు*

**- అన్నమయ్య**



# శ్రీ గురుభ్యో నమః

**డా॥ సురభి నరసింహప్రసాద్**
చీఫ్ కన్సల్టంట్, సంజీవని ఆయుర్వేద హాస్పిటల్
మరియు పంచకర్మ సెంటర్, కరకంబాడి రోడ్,
బాలాజికాలని, తిరుపతి.

శ్రీమాన్ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి గురించి చెప్పాలంటే చంద్రుణ్ణి అద్దంలో చూపడం వంటిది. కారణం వారు బహుముఖ ప్రజ్ఞాశాలి. మామూలుగా వారి శిష్యులు, ప్రశిష్యుల ప్రకారం వారు ఓరియంటల్ కళాశాలలో తెలుగుశాఖాధ్యక్షులు మరియు అన్నమాచార్య ప్రాజెక్టులో ప్రత్యేక అధికారి. వారికి తెలిసిన మరో కోణం అవధానం. దీనిలో కూడా వారు ఎందరినో ప్రభావితం చేశారు. కానీ నేను చెప్పదలుచుకున్న విషయం, నాకు తెలిసిన విషయం – వారు ఆయుర్వేదం మరియు జ్యోతిష్యం రెండింటిలోనూ అందేవేసిన చెయ్యి. వారు ఎందరికో ఆయుర్వేద వైద్యంతో స్వస్థత చేకూర్చారు. ఆ విషయంలో వారు నాకు ప్రత్యక్షగురువులు. వారు పలుమార్లు ఒక ఆయుర్వేద విషయాన్ని దాని శ్లోకంతో సహా ఉటంకించి వివరించేవారు. ఉదాహరణకు వారు "మేహగజాంకుశమ్" అనే ఆయుర్వేద ఔషధం (షుగర్ / మధుమేహ) వ్యాధిపై పనిచేసే ఔషధం గురించి తెలియచేస్తూ ఇలా ఒక అద్భుతమైన శ్లోకాన్ని తెలియజేశారు.


**"దరద దారద వంగ లవంగకమ్**
**శరద శారద నీరద పారదమ్ ।**
**గరళ గారాటి తద్రస మర్దితమ్**
**పిబతి మేహగజాంకుశమ్ ॥**

పై శ్లోకంలో ఉన్న ఆయుర్వేద ఔషధంలో ఉన్నవి ఆయుర్వేద మూలికలు మరియు ఇతర ఔషధద్రవ్యాలు. వాటిల్లో ఒక 3 ద్రవ్యాలు వాటి అసలు పేర్లతో వుంటాయి. అవి, వంగము (Tin), లవంగము (తినే లవంగం) మరియు పారదము (పాదరసము), మిగతా ద్రవ్యాలన్నీ పర్యాయ పదములు. అవి నిఘంటువుల ఆధారంగా, అనగా ధన్వంతరీ నిఘంటువు, క్షైయదేవ నిఘంటువు మొదలగు

గ్రంథాల ఆధారంతో చెప్పినవి. వాటిని కూడా ఆయన ధారణ చేసి సునాయసంగా నాకు వాటి అసలు పేర్లతో చెప్పేవారు. మచ్చుకి ఇది ఒక ఉదాహరణ. ఇటువంటివి ఎన్నో చెప్పారు. మరో ఉదాహరణ "కళ్యాణకఘృతం" అనే ఔషధం. దీనిని వంధ్యత్వానికి (infertility), మానసిక వ్యాధులకు వాడతారు. దీనిని గురించి కూడా వారు విస్తృతంగా తెలియ జేశారు. రసార్ణవము, రసయోగ రత్నాకరము, రసతరంగిణి వంటి ఆయుర్వేదగ్రంథాలు కూడ వారి గ్రంథాలయంలో ఉండేవి.

ఇక పోతే జ్యోతిష్యం గురించి చెప్పాలంటే కూడ వారి వద్ద గొప్ప విషయ పరిజ్ఞానం వుంది. ముఖ్యంగా ముహూర్తాల విషయంలో వారు గొప్ప దిట్ట. మరీ ముఖ్యంగా "పుష్కరాంశ"ను లెక్క కట్టి వివాహానికి అత్యంత గొప్ప సమయమైన పుష్కరాంశను వారు అత్యంత సూక్ష్మ బుద్ధిలో లెక్క కట్టి దానిని చక్కగా వ్రాసి, తనవద్దకు తమ బిడ్డల వివాహ ముహుర్తం కోసం వచ్చిన వారికి ఇచ్చేవారు. నిజంగా చెప్పాలంటే వివాహముహూర్త విషయంలో వారిది అమృతహస్తం. వారు ముహూర్తం పెట్టిన వివాహాలు అద్భుతంగా దీర్ఘ కాలం నిలబడ్డాయి. ఇక పోతే తిథుల విషయంలో కూడా వారు చాలా ఖచ్చితంగా కుండ బ్రద్దలు కొట్టినట్టుగా ఒక విషయం చెప్పేవారు. వారు చెప్పే ఆ సూత్రం "ఉదయాది, ఉదయాదింవా" అనే సూత్రం అంటే, సూర్యోదయం ఏరోజు, ఏతిథిలో అవుతుందో దానినే ఆరోజంతా తిథిగా గ్రహించాలని, అది కేవలం ఒక గంట, $1^{1/2}$ గంట మాత్రమే వున్నా సరే, సూర్యోదయం కనుక ఏ తిథిలో అవుతుందో, అదే ఆ రోజు తిథి. దీనిని శాస్త్ర ప్రమాణాలలో వారు నిరూపించారు. కానీ ఈ రోజుల్లో పూర్ణ తిథి ఎప్పుడో దానిని గ్రహిస్తున్నారు సూర్యోదయం గురించి పట్టించుకోవటం లేదు. అయితే దాని గురించి నేను తర్కించదలచుకోలేదు. కాలానుగుణంగా బహుశా జ్యోతిష్యం కూడ మారిందేమో! మారు తుందేమో. మరో విషయం వీరి గురించి. వీరు ఆయుర్వేద వైద్య జ్యోతిష్యం (Medical Astrology) లోనూ అందేవేసిన చెయ్యి. ఒక దీర్ఘకాల రోగి, ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు, అతని జాతకచక్రం పరిశీలించి, ఆయుఃప్రమాణాన్ని, దశాభుక్తులను పరిశీలించి వారికి తగిన పారాయణాలు సూచించడంకాక,లేక తనే స్వయంగా, తన సహాధ్యాయులతో కానీ ఆ పారాయణ కార్యక్రమాన్ని 40 (మండలం) రోజులు నిర్వహించి, రోగిని ఆ విపత్తు నుంచి కాపాడటం వంటివి జరిగింది. ఇది ఒక విధంగా చెప్పాలంటే, ఆయుర్వేదంలో "దైవ వ్యపాశ్రయ చికిత్స" క్రిందికి వస్తుంది. దీనినిబట్టి చూస్తే తాతగారు గౌరిపెద్ది వారు ఎన్ని శాస్త్రాలను అనుసంధానం చేసే వారో అనిపిస్తుంది.

మరొక్క విషయం - ఆయన దగ్గర కేవలం, ఆయన కాలేజీ విద్యార్థులే కాక, ఎందరో జిజ్ఞాసువులు శాస్త్రాధ్యయనపరులు, ఆయుర్వేద వైద్యులు (రఘునాథ రెడ్డి గారు, టి.టి.డి వైద్యాధికారి), కథా రచయితలు (పులికంటి కృష్ణారెడ్డి, డి. నాగసిద్ధారెడ్డి) మొదలగువారు, ప్రొఫెసర్లు (జి.యన్.రెడ్డి మొ॥) కవులు (అవధానం చంద్రశేఖర శర్మ,) అవధానులు (శిష్యుడు మాడుగుల నాగఫణి శర్మ, శతావధాని సి.వి.సుబ్బన్న) మొదలగువారు విచ్చేసి వారితో సాహిత్య చర్చలు జరిపేవారు. తమ సంప్రదాయానికి బద్ధుడైనప్పటికీ అన్ని ఇజాల (సిద్ధాంతాలు) వ్యక్తులను తనతోపాటు నడిపించిన మహామనీషి శ్రీగౌరిపెద్దివారు.



శ్రీ దివాకర్ల వారిచే సన్మానింపబడుతూ శ్రీగౌరిపెద్ది వారు.

# బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారితో అమరవాది శేషయ్య అనుభవాలు



**డా॥ విద్వాన్ అమరవాది శేషయ్య**
నెఱబైలు వై.వి.పాళ్యం మండలం
తిరుపతి జిల్లా,, ఆంధ్రప్రదేశ్

మహావధానులు వదాన్యులు సత్యశీలురు ఎందరో విద్యార్థులకు సాహితి భిక్ష పెట్టిన మహా పండితవరేణ్యులు "అభినవ తిక్కన బిరుదాంకితులు" తాళ్ళపాక అన్నమయ్య తాళపత్ర ప్రతులను పరిష్కర్తలైన మహా మేధావులు. అమరవాది ఇంటి అల్లుడని చెప్పుకునే మా బావ గారు మా గురువరేణ్యులు కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారి గురించి వారి శతవార్షికోత్సవ కార్యక్రమంలో నా ఈ చిన్ని అభిప్రాయమును వారితో నాకున్న అనుభవాలను క్రింది విధముగా తెలియపరుచుటకు ఆనందపడుతున్నాను ముఖ్యంగా ...

1. వారికున్న జ్ఞాపకశక్తి గూర్చి-1968-72 సమయంలో శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో వారు మాకు విద్వాన్ తరగతులకు వ్యాకరణమును బోధించెడివారు. ఆ సమయంలో హాజరుపట్టిని తెలిపిడి సమయంలో ఎవరైనను విద్యార్థులు తమ చోటు మార్చి వేరోక చోట కూర్చుని హాజరు పలికినచో ఆ నెంబరును పలికి సవ్వడి మారినట్టున్నదే అని అనెడివాడు, అలాగే ఎవరైనా పాత విద్యార్థులు కనబడినచో ఉదా- నాది 1972 వ సంవత్సరపు విద్యార్థిగా హాజరు పట్టిలో 52వ నెంబరు ఉండగా ఆ! ఏమయ్యా 72-52 బాగున్నవా అనెడివారు.

2. నేను 1973వ సంవత్సరమున జూలై నెలలో హైదరాబాద్‌లో ఆంధ్రసాహిత్య కళాపరిషత్ లో తెలుగు పండిట్ ట్రైనింగ్‌కై దరఖాస్తు చేసినప్పుడు మా నాన్న గారు కీ॥శే॥ అమరవాది రామకృష్ణయ్య గారు అడిగిన వెంటనే అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ బుర్రా వెంకటప్పగారికి ఉత్తరము వ్రాసి నా సీటుకు సహాయపడ్డారు.

3. 27-07-1974 సం॥మున నేను తెలుగు పండిట్ ఉద్యోగమునకై ది హిందు తియలాజికల్ ఉన్నత పాఠశాలలో ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు నన్ను ఇంటర్వ్యూ చేసిన కీ॥శే॥ విద్వాన్ నడాదూరి

విజయరాఘవచారి గారు నా ఇంటర్వ్యూలో నన్ను సెలక్ట్ చేసిన తర్వాత కొన్ని పరిచయ వాక్యముల ప్రస్తావనలలో మాట్లాడుతు నేను తిరుపతిలో తెలుగు విద్వాన్ చదివాను అని చెప్పగానే వారు మా బావ గారుతో కలిసి చదువుకున్న వారని తెలిసి చాలా సంతోషపడ్డాను. వీరు 1939–45 వరకు శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో కీ॥శే॥ బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి దగ్గర చదువుకున్నామని వరుసగా తనతో కలిసి 6మంది విద్యార్థుల పేర్లలో మా బావ గారు కీ॥శే॥ రామసుబ్బ శర్మగారు, శ్రీ సింగరాజు సచ్చిదానందమూర్తి, శ్రీ ఆర్ శ్రీనివాసాచార్యులు మొదలగు వారి పేర్లను వారు చెప్పారు. అదే సమయమున అప్పటి మా హెచ్ఎమ్ గారితో నా గురించి వీరి కుటుంబము బాగా చదువుకున్నవారు. వీరు ఇంటర్వ్యూలో నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం బాగా చెప్పారు. వీరి బావ గారు శ్రీ రామసుబ్బ శర్మగారు నాతో చదువుకున్నారని మా హెచ్.యమ్. గారితో చెప్పిన సన్నివేశం ఇప్పటికి నాకు గుర్తు. ఇదే విషయమును నేను మా బావగారితో ప్రస్తావించినప్పుడు “అవునవును విజయరాఘవుడు నేను కలిసి గంటకు ఎన్ని పద్యాలు చెప్పగలమని పోటి పడేవారు. వాడు మంచి కవి వాడు ఒంటిమిట్టలో శ్రీ వావిలకొలను సుబ్బరావుదగ్గర కూడా చదువుకున్నవాడే అని గుర్తు చేసాడు.

4. 1981లో తెలుగు ఎమ్ఎ పరిక్షకు హాజరవుతున్న సమయంలో నాకు ఆంధ్రమహాభారతం ఉద్యోగ పర్వం పద్యభాగమును చక్కగా విశ్లేషించి చెప్పారు అలాగే ఎమ్.ఫిల్ కూడా నీవు నేను రచించిన పద్యభాగము శ్రీ తలకోన “శిరోద్రోణతీర్థం”' గూర్చి చేద్దువులే అని భరోసా ఇచ్చారు కాని అనివార్యకారణాలు వలన నాకు ఆ పుస్తకం లభించలేదు.

5. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు సాహితీ సభలు జరిగిన సమయంలో కీ॥శే॥ శ్రీబిరుదురాజు రామరాజు దగ్గర నన్ను పరిచయం చేసి “వీడు నా చిన బావమరిది” అని చెప్పిన సన్నివేశం ఇప్పటికీ నాకు గుర్తు.

6. ఇక పోతే వీరి శిష్యులు ప్రశిష్యులు ఎంతో మంది తెలుగు రాష్ట్రంలోనే కాక తమిళనాడులోను తెలుగు పండితులుగా అనేక పాఠశాలలలో వారి నిత్యస్మరణలో మెలిగిన వారేందరో కలరు. అలాగే తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో మేము చదువుకున్న రోజులలో వారి శిష్యులైన శ్రీ సర్వోత్తమరావు, శ్రీ కేజె కృష్ణమూర్తి, శ్రీ పి.వి. శ్రీనివాసమూర్తి శ్రీ నర్సింహారెడ్డి లాంటి వారు మా పాఠశాలలోనే ఉపన్యాసకులుగా పని చేశారు.

7. ఇవన్ని ఒక ఎత్తైయితే వారికి బంధుప్రీతి ఎటువంటిదో అది మరోఒక ప్రక్కగా ప్రేమకు చిహ్నాముగా అభిమానపాత్రలుగా బంధుప్రీతికై ఎంత పరితపించేవారో వారు నివసించిన 113వ నెంబరు పొర్లవీధి గృహము పండిత పామరులకు ఒక అమృత సదనముగా ఉన్నదనుటకు మా అక్కగారు కీ॥శే॥ శ్రీమతి శివకావమ్మగారు అన్నదాన శీలిగా ఎంతో మంది అతిథులను సత్కరించిన తీరు ఎంతయో ముదావహము.

8. చివరగా వారు మా అమరవాది ఇంటి అల్లుడైనందుకు ఎంతో గర్వకారణముగా మా పెద్దమ్మ పెద్దనాన్నలుగా కీ॥శే॥ సావిత్రమ్మ సుబ్బరామయ్య గార్ల అల్లుడైనందుకు మా అమరవాది వంశం ఎంతో ధన్యమయిందని భావించుచున్నాము. అలాగే మా అమరవాది కుటుంబంలో ప్రతి ఒక్కరితోను వారు చూపిన ప్రేమాభిమానములు ఆనందదాయకము.

2-12-1986లో మా అమ్మగారు శివైక్యం చెందినప్పుడు వారు దశాహస్సు కార్యక్రములకు వచ్చి ఎంతో ఆత్మీయులుగా మమ్ములను పలకరించి, మా అమ్మగారి అస్తికలు శ్రీకాళహస్తి సువర్ణముఖి నదిలో నిమజ్జనం చేసిన సమయంలో వారు చెప్పిన మాటలు వారు మమ్ములను ఓదార్చిన విషయములు అలాగే మొత్తము ఆ కార్యక్రమములలో వారు చూపిన ఔదార్యము ఎప్పటికిని మరువలేనిది.

ఇంతటి గణనీయమైన మహోన్నత అభిమానధనులకు ఈ సంవత్సరము శతవర్షికోత్సవం జరుగుట ఎంతో ఆనందదాయకము. ముఖ్యంగా శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించి ఇటు ప్రాచ్య కళాశాలతోను, అటు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల సాహిత్య పరిష్కర్తగాను వారు పనిచేసినందులకు వారి కాంస్య విగ్రహము కూడా తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించిన ప్రదేశములలో ప్రతిష్ఠాపన చేయుట ఎంతయో ముదావహము.


చివరిగా కవితాంజలిగా నా నివాళులు ఇలా సమర్పిస్తున్నాను.

ఓం కవివతంసా! అభినవ తిక్కన బిరుదంకిత వర్యా!
అవధాన చక్రవర్తీ! గౌరిపెద్ది వంశాబుధి చంద్రమా!
శిష్య ప్రశిష్య కోటను కోటి సౌకుమార్య అభిమాన వర్యా!
అమరవాదిగా ఆరాధించెద సాష్టాంగ దండ ప్రణామముల!

మీ విద్యార్థి మరియు చిన బావమరిది

ఓం

# నా స్మృతిపథంలో గౌరిపెద్దివారు



**శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్**
ఆస్థాన సంగీత విద్వాంసులు
తి.తి.దేవస్థానములు,
శ్రీ కంచికామకోటి పీఠము
శ్రీ అహోబిలమఠము.
చరవాణి - 98662 53475

తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలు గానం చెయ్యటమంటే కేవలం సంగీతపరమైన స్వరూపాన్ని మాత్రం కర్ణపేయంగా పాడితే చాలు ననుకోవటం పొరబాటే. ఆ యా పాటలలోని పదాలకు మాత్రం అర్థాలు తెలిసినా న్యాయం జరిగినట్లు కాదు. ఆ సంకీర్తనలోని అంతరార్థాలు, వేదపురాణేతిహాసాలతో ఈ సంకీర్తనతో ముడిబడి వున్న రహస్యాలు ఇవన్నీ తెలియాలి. ఈ విషయాలు గాయకులకు అందుబాటులోకి వచ్చే లోపు అంచెలంచెలుగా ఎంతో మంది మహాపండితుల పరిశ్రమ అడుగడుగునా చోటుచేసుకుంటుంది. అటువంటి పరిశ్రమ చేసిన వారిలో ప్రత్యేకించి చెప్పుకోతగినవారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. సుశబ్ద, అపశబ్ద నిర్ణయం దగ్గరనుండి తాళ్ళపాక కవుల పద రచనా వైభవం వంటి ఆసక్తికరమైన, మిక్కిలి ఉపయుక్తమైన అంశాలతో 27 సంపుటాలవరకు తి.తి.దేవస్థానం వారి ద్వారా వెలువరించి ఆంధ్రజాతికి మహోపకారం చేశారు గౌరిపెద్ది వారు. అటువంటి మహానుభావుల దర్శనం నేను తిరుపతికి వచ్చిన తొలి రోజుల్లో కలిగింది. శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు శెట్టి గారి ద్వారా క్రమంగా గౌరిపెద్ది వారితో కొంత సాన్నిహిత్యం కూడా కలిగింది.

గౌరిపెద్దివారికి నా పాట అంటే చాలా ప్రీతి. స్పష్టమైన ఉచ్ఛారణతో భావయుక్తంగా సంకీర్తనలు గానం చేస్తున్నానని నన్ను మెచ్చుకొనేవారు. ఈరకమైన ప్రేమాభిమానాలు నాపై వారు చూపటంతో వారి ఇంటికి వీలున్నప్పుడల్లా వెళ్ళే వాణ్ణి. వారు కూడా ఎంతో ప్రేమతో - ఈ సంకీర్తనల పరిష్కరణ సందర్భంగా వారికెదురౌతున్న ఇబ్బందుల గురించి కూడా చెబుతూండేవారు. అవి నాకు అనేక విధాలుగా ఉపకరించినై కూడా. ఆ సంకీర్తనలకు నేను సంగీతం సమకూర్చే సమయంలో నా కెదురౌతున్న

చిన్న చిన్న సమస్యలకు చక్కని పరిష్కారం చూపిన సందర్భాలు అనేకం. నా పాటధోరణిలో కొంత లలిత సంగీత పోకడ ఉండటం కూడా వారికి కొంత రుచించటంతో తరచు నేను పాడుకుంటూ వుండే లలిత సంగీత గేయాలు కూడా అప్పుడప్పుడు వినిపిస్తూండేవాణ్ణి. అలాగే – నా 20 సం॥ ప్రాంతంలో నేను స్వయంగా రచించిన కొన్ని శాస్త్రీయ సంగీత కీర్తనలు వినిపించాను.

మొత్తం మీద వారికి, నాలో ఒక వాగ్గేయకారుడు కూడా వున్నాడన్న భావం కలిగింది. అది అదనుగా తీసుకుని వారికి ఒక విన్నపం చేసుకున్నాను. అదేమిటంటే –

అది 1990వ సంవత్సరం. ఆ రోజుల్లో నేను రచించిన కొన్ని లలిత సంగీత రచనలని "కృష్ణరవళి(–2వ భాగం)" గా పుస్తక రూపంలో వెలువరించే ప్రయత్నంలో వున్నాను. ఒక రోజు ధైర్యం చేసి – "ఆశీర్వాద పూర్వకంగా నా గీత రచనలపైన వారి అభిప్రాయం వ్రాసి ఇవ్వగలరా" అని అభ్యర్థించాను. వారు ఆ పుస్తకాన్ని ఆమూలాగ్రం ఎంతో ఓపికగా చదివి, చక్కని ఆశీర్వాద వాక్యాలు వ్రాసి ఇచ్చారు. అందులో మచ్చుకకి కొన్ని – "వీరికి గాన కళాసక్తియె గాక గేయరచనా శక్తియు కలదని తెలియుచున్నది. ఈ లలితగీతములు –ప్రణయ, విరహ, భక్తి భావములతో పెనగొనియున్నవి... ఈ పాటలలో పాకము మరింత బాగా కుదిరినది. ఉదా॥ 'ఆపదమొక్కులస్వామీ, ఆదుకోవేమీ! ఆకాశమంటే ఆ గిరి దిగిరావేమి!' అన్న ఈ పాట చాల వరకు అన్నమయ్య కోవలో నడచినది. దీనిలో – స్వామికై తపించి తపించి ఆయనను కనుగొనలేని తపన స్పష్టమగుచున్నది. అట్లే – "నిండెనదే లోకమెల్ల నిరుపమానగతిని! కొండలరాయని లీలలు కొల్లలై చవులార" పాటలో భక్తునికి పరమాత్మ సంబంధమైన మానసికానందము పెల్లుబికి గంతులు వేయుచున్నది. మరొక పాటలో – "కాలకన్యకా! ఓ కాలకన్యకా!" (ఈ పాట పూర్తిగా ఇస్తే బాగుటుంది. విస్తరణ భయముతో ఇచ్చుట లేదు – గౌ.రా.) – బహుజనామోదశీలి యగు బాలకృష్ణ ప్రసాదుకు అభ్యుదయ పరంపరాభివృద్ధి కలగునట్లు నా మంగళాశాసనములు."

నాలో ధైర్యము, తృప్తి మొదలైన సుగుణాలు వర్ధిల్లుతూ నా గానము దినదినాభివృద్ధిగా వర్ధిల్లటంలో గౌరిపెద్ది వారి ప్రేమ, అభిమానం మొ॥ వాటి పాత్ర చెప్పుకోతగింది. వారి శతజయంతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా శ్రీ గౌరిపెద్ది భగవాన్‌గారు ఈ మహాపురుషుని స్మరించే సద్భాగ్యాన్నిచ్చినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తూ – శ్రీవారి పాదసన్నిధిలో సదా వెలుగొందే శ్రీరామసుబ్బశర్మగారి దివ్య పాదాలకు నా సాష్టాంగ దండ ప్రణామాలు తెలియజేసుకుంటున్నాను.

# జయంతి తే సుకృతి నః



'అవధానసుధీమణి' 'కాశీకవి'
'కళారత్న డా॥పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

గౌరిపెద్ది సుధాబ్ధీందుమ్
రామ సుబ్బ సుధీమణిమ్
అన్నమాచార్యతత్త్వజ్ఞమ్
వందే వర్షశతోత్సవే

సకల శాస్త్ర శిరోమణి, సర్వవిద్యాసహస్రఫణి, నడయాడే నిఘంటువు నక్షత్రమండలం దాటిన జ్ఞానవటువు, మేధాదక్షిణామూర్తి, అమేయాఖండకీర్తి, వేదవేదాంతసాహిత్య పరమావధి, ఆయుర్వేద జ్యోతిష మంత్రశాస్త్ర నిధి బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ మహోదయుల శతజయంతి ఉత్సవసందర్భంలో ప్రచురితమౌతున్న సంచికలో వారి ప్రతిభావిశేషాలను అనేకకోణాలలో, బహుముఖంగా ప్రస్తుతిస్తూ సంస్మరిచుకోవల్సిన చారిత్రకనేపథ్యం సాకార, నిరాకార భాండాగారంగా ఎంతో సమాచారం ఉంది. నిరాకారమంటే గ్రంథాలకెక్కనిదీ, బంధుమిత్రులకు, సహపాఠకులకు, సహవాసులకు స్థానికులకు మాత్రమే తెలిసిన విశేషాలు. మావంటివారికి వారి సాకారాక్షర శాశ్వతమూర్తి దర్శనం లభ్యం కనుక ఆ సౌలభ్యంతో, తాళ్లపాకవారి సంకీర్తనల ప్రచురణ, పరిష్కరణలలో వారి సింహభాగ విశేషాలను సింహావలోకనంగా స్పృశిస్తూ, స్మరిస్తూ రాబోయే తరాలకు కొండను అద్దంలో చూపించి ఋషిఋణం తీర్చుకొంటాను.

తొలుత వారు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారికి సహాయకులుగా 1964 సంవత్సరములో 19, 20 సంపుటాలను, 1974లో అపరిష్కృతమైన ఇరవై రెండవ సంపుటాన్ని 1976లో పన్నెండో సంపుటాన్ని ఇరవైనాలుగు, ఇరవై అయుదు సంపుటాలను, 1979–82 మధ్య సంవత్సరాలలో ఇరవై ఆరు నుండి ముప్పది ఒకటో సంపుటం వరకు, 1982–84 సంవత్సరాల మధ్య ముప్పది రెండు నుండి ముప్పది ఐదు వరకు, 1, 2, 3, 4 సంపుటాల పునర్ముద్రణలను పరిష్కరించి విపులమైన పీఠికలతో ప్రచురణకు తిరుమల తిరుపతి దేవస్థానములకు అందించిన నిత్యకృషీవల శిరోమణి

గౌరిపెద్దివారు. 1922లో సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారితో ఆరంభించి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు మొదలైన వారి కృషితో నెమ్మదిగా సాగుతున్న అన్నమాచార్య తాళ్లపాక వారి సంకీర్తనల పరిశీలన, పరిశోధన, పరిష్కరణ, ప్రచురణలు బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి దృఢదీక్ష, నిబద్ధత, సమర్థతలతో వేగవంతమై తాళ్లపాకవారి సంకీర్తనలన్నీ ప్రజలకు చేరువ కావటం శ్రీవేంకటేశునిపై, అన్నమాచార్యులవారిపై వారికున్న భక్తప్రపత్తులు, ఆత్మీయతలకు నిదర్శనం. ఎక్కడ పేర్కొన్న వారు 'మా అన్నమయ్య' అనే పేర్కొన్నారు. తాళ్లపాక వారి పలుకుబడులు, మాండలికాలు, వ్యాకరణాది విషయాలు, ఆచారవ్యవహారాలు, మతసిద్ధాంతాలు అన్నీ సప్రమాణంగా విశ్లేషించి వివరించిన 'అభినవ అన్నమయ్య' గౌరిపెద్దివారు.

పూర్వపరిష్కర్తలను ప్రశంసిస్తూ గౌరవిస్తూ తదనంతర పరిశోధనలో తనకు లభించిన తాను కనుగొన్న విశేషాంశాలను ప్రస్తావించటం వారి విధేయతకు నిదర్శనం. అష్టాధ్యాయి రచించిన పాణిని తనకు తానుగా వ్రాసుకొని పోకుండా పూర్వవైయాకరణులను మరచిపోకుండా ప్రస్తావిస్తూ స్మరిస్తూ పూజిస్తూ సూత్రరచన చేసిన సంప్రదాయాన్ని గౌరిపెద్ది వారు అడుగడుగునా పాటించారు.

'సుప్రసిద్ధులగు శాస్త్రిగారు, శర్మగారు విడివిడిగ పరిష్కరించి ముద్రింపించిన అన్నమాచార్యుల ఆధ్యాత్మ కీర్తనల మొదటి వంద రేకుల పాటలను ఒక సంపుటముగ నేనిపుడు పరిష్కరింపవలసివచ్చినది. అన్ని విధముల పెద్దలకు వారిద్దరు పరిష్కరించిన భాగములను నేను పరిష్కరింపబూనుట సాహసమే' అంటూ శాస్త్రిగారి పరిష్కరణలకు తాను చేసిన సవరణలను సప్రమాణంగా వివరించటం, అలాగే శర్మ గారి పరిష్కరణల గురించి కూడా విడిగా చెప్పటం తన తరువాత రాబోయే పరిష్కర్తలకు సూచనగా, హెచ్చరికగా ఉండి, ముందు వారు చెప్పించి ఎత్తి వ్రాయటం కాక పరిశోధనలో క్రొత్తగా చెప్పవలసినవి ఉంటే నిర్భయంగా చెప్పటమే నిజమైన పరిష్కరణ విధానమని వారు సోదాహరణంగా, సప్రమాణంగా, సశాస్త్రీయంగా తాను వ్రాసిన పీఠికల్లో సవినయంగా పేర్కొన్నారు. 'పరిష్కర్త బాధ్యత' అనే శీర్షికన వారు వ్రాసిన పరిష్కరణ ప్రణాళిక భావిపరిష్కర్తలకు పథనిర్దేశము.

'వ్రాతప్రతులు మొదలగు వానిలో నున్న అక్షరములను అచ్చులోకి తెచ్చుట మాత్రమే పరిష్కర్త బాధ్యత కాదని పెద్దలెరిగినదే. సుబోధ దుర్బోధములకు భావములను, సుగ్రహ దుర్గ్రహములను పదములను, దురన్వయ దురాన్వయములగు వాక్యములను గమనించి వివరించి, కామాలు,

సెమికోలన్లు, ఆయా సందర్భములకు తగిన విరుపు గుర్తులను చూపి పాఠకుని మనస్సు రసాస్వాదనకు మళ్లించుటకు కూడ పరిష్కర్త బాధ్యతలలో ముఖ్యమైనది'

అంటూ వారిచ్చిన ఉదాహరణలు, చూపిన ఉపపత్తులు గౌరిపెద్ది వారి గాఢాధ్యయన శీలాన్ని, పరిష్కర్తృహృదయాన్ని, పరిశోధనాస్వాతంత్ర్యాన్ని, వినయవిధేయతలను స్పష్టపరుస్తున్నాయి.

'మామూలు వాఙ్మయమును చూచిన దృష్టితో కాక దీనిని విశేషదృష్టితో గమనింపవలసిన అవసరమెంతైన గలదు'. అన్న వాక్యం తాళ్లపాకవారి వాఙ్మయాన్ని ఎలా చూడాలో చెప్పారు. సంగీత సాహిత్య సమన్వయం, పునర్లేఖన పరిశ్రమ, రేకుల గజిబిజి, అన్నమయ్య వేదాంతము, భాషాప్రయోగాలు, నవనారసింహులు, అద్వైతవాసన, దశావతారములు, శబ్ద-అర్థ-వ్యాకరణ చర్చ అన్న ఉపశీర్షికాలతో మిగిలిన అన్ని సంపుటాల పీఠికలకు మూలాధారపీఠికగా తొలి సంపుటి పీఠికను తాళ్లపాకవారి సంకీర్తనల కోటగుమ్మానికి తాళంచెవిగా వ్రాసి ధన్యచరితులయ్యారు. అన్నమయ్య విశిష్టాద్వైతి అయినా వంశానుగతంగా వచ్చిన అద్వైతవాసలను ప్రస్తావించారు. 'ఇతనికి జన్మాంతరాద్వైత వాసన ఇంకను పూర్తిగా వదలలేదేమో అనిపించుచున్నది' అని ముక్తాయించారు.

బహుముఖప్రజ్ఞాధురీణులు, వేదపురాణేతిహాసకావ్యాధ్యయన పారీణులు, సంస్కృతాంధ్ర ద్రావిడ భాషానుబంధపరాయణులు అయిన గౌరిపెద్ది వారు తాళ్లపాక వారి వాఙ్మయమూలాలను భాగవత రామాయణాదులనుండి సోదాహరణంగా చూపించారు. తృతీయ సంపుటం పీఠికలో సమకాలికులైన పోతన-అన్నమయ్యల రచనల మధ్య ఉన్న సారూప్యాన్ని అన్నమయ్య సంకీర్తనలో వాడిన నిఘంటువు కెక్కని పదాల అర్థాలు నిర్ధారించటానికి వాల్మీకిరామాయణ శ్లోకాలను సమన్వయపరచటం వంటి అద్భుతాలు సామాన్యపరిష్కర్తలు చేయలేరు.

తొడికి మింటి తాపలు తుంచి దూప దాకినమ్ము (3 సం. 133 సం.కీ.)

అనే చరణానికి సరియైన అర్థం చెప్పటానికి వారు మరల మరల చేసిన పరిశీలన సంస్కృతాంధ్రాలు స్థానిక మాండలికాలు తెలిసినవారికి మాత్రమే సాధ్యం. "మింటితాపలు - ఊర్ధ్వలోకపుమెట్లు. పరశురాముడు దీర్ఘకాలతపస్సుతో ఊర్ధ్వలోకములకు నడచిపోవు శక్తిని సంపాదించుకొని యుండినాడు. ఆ ఊర్ధ్వలోకములను రామబాణము హరించినది' అని గౌరిపెద్దివారు అర్థాన్ని సాధించటానికి

'సహతాన్ దృశ్యరామేణ స్వాన్ లోకాన్ తపసార్థితాన్'

అనే బాలకాండ శ్లోకం ఆధారమైంది. లేకపోతే అన్నమయ్య ఏం చెప్పాడో ఎవరికీ తెలియదు. అక్కడే 'దూప' అనే పదానికి కూడ అలిసిన, దప్పికగొన్న అనే అర్థాన్ని సాధించారు. అచ్చ తెలుగు పదాలను ఇలా సాధించినట్లే సంస్కృత పదాల విషయంలో వారి వైదికపాండిత్యం, సంస్కృత వ్యాకరణం సాధుత్వాసాధుత్వే నిర్ణయంలో వారు నిజనిర్ధారణ చేయగలిగారు'. అగ్నీకరణ అని అన్నమయ్య వాడినది అసాధువని అగ్నౌకరణంగా సవరించటం సరికాదని పితృకార్యాలలో మాత్రమే దానిని అలా అంటారని అగ్నీకరణమే ఉంచాలని వైదిక విజ్ఞానంతోనే వారు పరిష్కరించగలిగారు. అలాగే 'చెళ్లపిళ్ల' 'శెల్వప్పిళ్ళై' అనే తమిళపదం నుండి వచ్చిందని తమిళం వచ్చిన భాషా శాస్త్రజ్ఞులకే తెలుస్తుంది. అది ద్రావిడుల ఇంటి పేరుగా ఉండటం దానిని రూపిస్తుంది. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు ద్రావిడులు. ఇలా ఎన్నో పదాలను గౌరిపెద్దివారు బహుభాషా జ్ఞానంతో పరిష్కరించారు.

ఇరవై ఏడో సంపుటానికి గౌరిపెద్దివారు పరిష్కర్తలుగా వ్రాసిన పీఠిక తెలుగు భాషకు, వ్యాకరణానికి, వ్యాకర్తలకు పెద్ద పరీక్ష.

'ఈ తాళ్లపాక కవుల వాఙ్మయము భక్తి పీఠమైనట్లే భాషామర్మములకు కూడ పీఠమే. భారత కవులను, శివకవులను వదలినచో భాషావిషయమున తాళ్లపాకకవులను తాకగల దాటగల మొనగాండ్లు లేరన్నచో అతిశయోక్తికాదు. ఈ తాళ్లపాకకవుల భాషాసాగరమున మథింపవలసిన దెంతయో గలదు. మథించువారు ఎందరో ముందుకు రావలసియున్నది. రాగలరు. ఆ పనికి ఉడుతసేవగా నాయీపీఠికలు పనికిరావచ్చునని ఒక ప్రత్యాశ. అందుకే ఈ ప్రయత్నము."

అంటూ గౌరిపెద్దివారు ఈ పీఠికలో చేసిన వ్యాకరణ చర్చ పరమాద్భుతం. సమాస నిర్మాణ విషయంలో సంస్కృత వ్యాకరణమే అందరికీ శరణ్యం. ఎవరి సంధులు వారికి వారి భాషలో వేరుగా ఉండవచ్చుగాని సమాస ప్రణాళిక సాంస్కృతికమే. అని అందరూ భావించుచుండగా 'తెలుగులో అవ్యయీభావము' అను శీర్షికన తెలుగు పదములతో కూడ అవ్యయీభావ సమాసాన్ని ఏర్పరచవచ్చునని 'నారాయణునట్లు' అను శీర్షికన తెలుగు పదములతో కూడ అవ్యయీభావ సమాసాన్ని ఏర్పరచవచ్చునని 'నారాయణునట్లు' 'వానివలె' మొదైలన వానిని వానియొక్కవలె వంటి విగ్రహవాక్యములతో సమర్థించారు. ఇది తెలుగు వ్యాకరణానికి దక్కిన ప్రత్యేక గౌరవం. తెలుగు భాషకు స్వతంత్రావ్యయీభావ సమాసాన్ని

సాధికారికంగా చూసిన ఘనత గౌరిపెద్ది వారిది. తెలుగు వ్యాకరణ చరిత్రలో వారి స్థానం శాశ్వతం.

'తెలుగులో ఏకాదేశాన్వయము' శీర్షికన వారు చూపిన విశేషాలు, అన్నమయ్య ప్రయోగాలు పదకవితా సరస్వతికి పంచహారతులు. కవిత్రయీ, శ్రీనాథాదులు చేసిన ఏకాదేశాన్వయ ప్రయోగాలు తెలుగు భాషలో ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. ఆ దారిలో అన్నమయ్య చేసిన అత్యద్భుతమైన ఏకదేశాన్వయ ప్రయోగాలను విశ్లేషించి చూపిన మహామనీషి. తెలుగుతల్లి ముద్దుబిడ్డ గౌరిపెద్దివారు. నేను వ్రాసిన దాంట్లో ఇన్ని రహస్యాలున్నాయా అని అన్నమయ్య కూడా ఆశ్చర్యపడే ప్రయోగాలను గౌరిపెద్దివారు చూపించి 'మా అన్నమయ్య' అనకుండా 'మన అన్నమయ్య స్వేచ్ఛగా ఈ ఏకాదేశసమాసములను పండించినాడు' అని గోపురమెక్కి ప్రకటించారు.

'చిగురించే నాలో సిగ్గులకు గాక' 'నీ రేపల్లెలో చేతలు' మొదలైన ప్రయోగప్రదర్శనలో తిక్కన, శ్రీనాథుడు, అధర్వణుడు, చిన్నయసూరి, శ్రీహర్షుడు, కాళిదాసు, విష్ణుసహస్రనామం, వామనాలంకార సూత్రాలు మొదైలనవెన్నో ఉట్టంకించారు.

'ఘనురాలు' 'నీయాపెసంది' 'తన నాకింతే' 'నీయింతైన వెనుక' 'చేతి నీ వుంగరము' వంటి సమాస విశేషాలు అన్నమయ్యకు ప్రత్యేకం. ఆధునికులలో ఆ ప్రయోగాలు విశ్వనాథవారు చేశారు. బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి యశః కాయానికి జరామరణ భయం లేదు.

గౌరిపెద్ది వారు కారణజన్ములు
రామసుబ్బశర్మ ప్రథితయశులు
లక్ష్యమన్నమయ్య లక్షణమీతడై
శతజయంతు లెన్నో జరుపుకొంద్రు



# ప్రాతః స్మరణీయులు

- మృణాళిని
విశ్రాంత ఆచార్యులు
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు
చరవాణి : 98490 65147

చామన చాయలో నిండైన విగ్రహం, మధురమందహాసం, గంభీరమైన స్వరంనుంచి మృదువైన పలుకు, కలుపుగోలుతనం, పిన్నలనూ, పెద్దలనూ సమాదరించే స్వభావం, యథాలాపంగా మాట్లాడుతున్నట్టే కనిపిస్తూ పాండిత్యపులోతులను ప్రకటించే నిండుకుండ స్వరూపం.... వెరసి గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు.

తాళ్లపాక అన్నమాచార్యుల మీద ఎవరికి వారే సాధికారత ఉందని భావిస్తున్న రోజులివి. ఆయన పదకవితలకు రకరకాల రాగాల పోహళింపే కాక, ఆయన రచనలకు విశేష వ్యాఖ్యానాలు కూడ తరచుగా వెలువడుతున్న రోజులివి. కానీ నేరుగా రాగిరేకుల నుంచి వాటిని చదివి, అర్థం చేసుకుని, పరిష్కరించి, అక్షరదోషాలు పరిహరించి, రాగతాళ నిర్దేశం చేసిన మహానుభావవులు లేనిదే ఇప్పుడు పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్న వ్యాఖ్యానాలకు ఉనికి ఉండేదే కాదు. ఎవరికి వారు అన్నమయ్య నిపుణులవుతున్న నేటి తరానికి కూడ ప్రాతఃస్మరణీయులు కొందరున్నారు. వారిలో ముఖ్యులు సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు. వారి కోవకు చెందినవారే గౌరీపెద్ది రామసుబ్బశర్మగారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు అన్నమయ్య కృతుల పరిష్కరణకు చేసిన దోహదం తెలిసిందే. రాళ్లపల్లివారి శిష్యుడినని తరచు చెప్పుకున్నా, సాహిత్యమర్మజ్ఞతలో వారికి ఏ మాత్రం తీసిపోని శర్మగారు తాళ్లపాక కవుల పదకవితల పరిష్కరణలో, వాటి విమర్శనంలో అద్వితీయమైన మౌలికతను ప్రకటించారు. అన్నమయ్య కృతుల సంపుటాల్లో 16, 18, 21 సంపుటాలకు రాసిన పీఠికల్లో అన్నమయ్య భాషను గురించి ఆయన విశ్లేషణ, కవిత్రయం, శివకవుల తర్వాత, ఒక్క అన్నమయ్య కలంలోనే తెలుగు తన తీయదనాన్ని ఎలా నింపుకుందో చెప్పిన తీరు అమోఘం.

అన్నమయ్య పదకవితల్లో భక్తి తత్వం, శృంగార సిద్ధి, ఆధ్యాత్మికం వివరించడం ఒక ఎత్తయితే, ఆయన వ్యాకరణ నియమాలను ఎంత చక్కగా ఉల్లంఘించాడో, గ్రాంధిక భాషతో సరిసమానంగా వ్యావహారిక భాషను ఎంత సొగసుగా ఉపయోగించాడో చెప్పడం మరో ఎత్తు. ఇక్కడే రామసుబ్బశర్మగారి ప్రతిభ నీరాజనాలందుకుంటుంది. పదకవితల్లో ప్రయోగించిన తెలుగుభాషా పలుకుబడిలో బహుశా తిక్కన అన్నమయ్య గురువని శర్మగారు ఊహించడంవెనక, రాళ్లపల్లివారి సావాసప్రభావం స్పష్టమే.


అన్నమయ్య పదకవితలను అతని సమకాలికులైన శ్రీనాథ, పోతనలు కూడ ఎక్కడా ప్రస్తావించలేదన్నది సాహిత్య చరిత్ర పాఠకులందరూ ఎరిగినదే. పురాణకావ్యాదులముందు తక్కిన అన్ని ప్రక్రియలూ దిగుదుడుపేనని బహుశా అప్పటి కవులు భావించివుండవచ్చు. లేదా వారసలు అన్నమయ్యను విని వుండకపోవచ్చు. కానీ అంత మాత్రాన పదసాహిత్య వైభవానికి కొరత లేదు. అన్నమయ్య పరిష్కరణ ద్వారా పండితులు ఆ విషయాన్ని తేటతెల్లం చేశారు. మరీ ముఖ్యంగా, తెలుగు సాహిత్యంలో భాషాపరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవాలన్నా, గ్రాంథిక, వ్యావహారిక ప్రయోగాల అన్యోన్య దాంపత్యం ఎప్పటినుంచి తెలుగులో ఉందో తెలుసుకోవాలనుకున్నా, అన్నమయ్య చేసిన భాషా ప్రయోగాలను విధిగా చూడాలని గౌరిపెద్ది వారు తమ సంపాదకీయాల్లో ఘంటా బజాయించి మరీ చెప్పారు.

అన్నమయ్య గురించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ('చాలామంది ప్రబంధ కవులకు సాహిత్య భిక్ష పెట్టిన తాళ్లపాక అన్నమయ్య') సాహిత్య విశ్లేషణకు మార్గదర్శకాలు. రాగిరేకును ఎలా చదవవాలి, వాటి కొలతలను ఎలా వ్యాఖ్యానించాలి అన్న లోతైన వివరణలు సాహిత్య పరిశోధనకు ప్రామాణికమైన వనరులు. గ్రాంథిక, వ్యావహారిక భాషల లక్షణాల్లోనూ, వ్యాకరణంలోనూ లోతైన పాండిత్యం కలిగిన శర్మగారు, తాళ్లపాక కవులు భాషకు ఒనగూర్చిన సౌందర్యాన్ని, వారి పదప్రయోగరీతులను, సమాసచాలనాన్ని విశేషంగా విశ్లేషించి చూపారు. ఆ తర్వాత ఈ విషయాలపై ప్రసంగాలు చేసి, గ్రంథాలు రచించిన ఎందరికో వీరు మార్గదర్శకులయ్యారు. (అందరూ ఆ విషయం చెప్పకపోయినా).

ఒక జ్ఞాపకం

తరచు రాళ్లపల్లివారిని తన గురువుగా ప్రస్తావించే గౌరిపెద్దివారిపట్ల, ఆయనే చెప్పినట్టు, రాళ్లపల్లివారికి పుత్ర వాత్సల్యమే ఉండేది. 1965-68 సంవత్సరాల్లో తిరుపతిలో గోవిందరాజస్వామి దక్షిణమాడవీధిలో

తాతగారివద్ద మేం ఉన్నపుడు, రామసుబ్బశర్మగారిని చూడని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. నిత్యం సాయంత్రం ఆయన ఇంటికి రావడం, తాతగారితో కొన్ని గంటలు గడపడం కళ్లారా చూసిన దాన్నే. ఎన్నో సాయంత్రాలు, తలుపు చప్పుడు కాగానే బాల్యపు చాపల్యంతో 'తాతా రామసుబ్బయ్యా' అని అరుస్తూ లోపలికి పరిగెత్తడం గుర్తు. ఆయనని ఏకవచనంతో సంబోధించినందుకు తాతతో, అమ్మమ్మతో చివాట్లు తిన్న గుర్తు. ఆయన మాత్రం ఎంతో అపేక్షగా నవ్వుతూ నా తల మీద చిన్న మొట్టికాయ వేసారు ఓసారి ఇలాగే అరిచినపుడు, తాతగారితో పాటు, మేం (నా అక్కలు, అన్న) కూడ ఆయన రాకకోసం ఎదురు చూసేవాళ్లమేమో. ఆయన రాని రోజు ఏదో వెలితి ఏడెనిమిదేళ్ల నాకే అనిపించేది. ఆ వెలితిని తీర్చగలిగినవి ఆయన రచనలే.




టి.టి.డి. వారి సప్తగిరి మాసపత్రిక బృందంతో శ్రీ గౌరిపెద్ది వారు – అప్పటి ఈ.ఓ.గారు శ్రీపి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు తదితరులు.

# పరిశోధన కళా సంరంభకులు



**కోలవెన్ను మలయవాసిని**
విశ్రాంతాచార్యులు
ఆంధ్ర విశ్వకళాపరిషత్
విశాఖపట్నం

శ్రీ తాళ్లపాక వారి సంకీర్తనల ముద్రణా యజ్ఞం నిర్వహించిన పండిత ప్రకాండులలో శ్రీయుతులు గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారొకరు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రకటించిన సంకీర్తనా సంపుటాలలో అధిక శాతం శ్రీశర్మగారి పీఠికలకు నోచుకున్నాయి. 'వైలక్షణ్యం కలాసుచ' అన్న సూక్తికి నిదర్శనంగా శ్రీ శర్మగారు పీఠికా నిర్మాణంలో ఒక ప్రత్యేక ప్రణాళికను ఏర్పరచుకున్నారు. విభిన్న శీర్షికలను స్వీకరించి విశ్లేషించి వివరించి పాఠకులకు ఆయా విషయాలను అరటి పండు ఒలిచి ఇచ్చినట్లుగా అందించారు. శ్రీశర్మగారిది పరిశోధనా ప్రణవమైన దృష్టి కావడంతో – భావి పరిశోధకులను మార్గదర్శకసూత్రాలను, సిద్ధాంత వ్యాసనిర్మాణానికి శీర్షికలను సమకూర్చి పెట్టిన మహోత్తమ పర్యవేక్షకులు వీరు.

శ్రీశర్మగారి బహుముఖీనమైన పాండిత్యము, సంకీర్తన వాఙ్మయము పట్ల వారికి గల నిబద్ధతను తెలుసుకోవడానికి వారి పీఠికలన్నీ ఆధారాలే. నాకు లభించిన సంపుటాలలోని వారి పీఠికలను పరిశీలించి వారి సాహితీవ్యక్తిత్వాన్ని ఆవిష్కరించడానికి చేసిన ప్రయత్నమే ఈ చిన్న వ్యాసం.

12-1-1975 లో-16వ కొత్త సంపుటములోని పీఠికలో – శ్రీ గౌరిపెద్ది వారు వ్రాసిన విషయాలు – వారి విద్యా వినయసంపన్నతకు అద్దం పడుతున్నవి.

"పూజ్య పాదులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారికి సహాయకుడుగా, 1964 ఆగష్టు నుండి దాదాపు సంవత్సరకాలమునకుపైగా నేనీ పరిష్కరణ కార్యమున పాలుపంచుకొంటిని ఆ సేవయే సుమారు పది సంవత్సరములకు తరువాత రెండవసారిగ మరల నన్నీ కార్యమున నియోగించుటకు కారణమైనది.... "ఇహపర సాధకమైన ఈ తాళ్లపాక కవుల రచనల పరిష్కరణమునకు పూనుకొంటిని శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారితో కలిసి పని చేయుటచే సిద్ధించిన అనుభవముతో వారి

యొరవడి లోనే నేనీ కార్యము నడుపు పూనిక గలదు." అని తమకు ఈ పరిష్కరణ కార్యక్రమములో పాల్గొనే అర్హతను, అదృష్టమును స్పష్టపరచారు. 19, 20, 22 సంపుటాలు వీరు శ్రీరాళ్లపల్లి వారితో కలిసి పరిష్కరించారు. 19, 20 సంపుటాలలోని తాళ్లపాకకవుల అపూర్వ పద ప్రయోగములు కొన్నింటికి సందిగ్ధ పద సమీక్ష' అనే ఒక అనుబంధాన్ని కూడా కూర్చారు.

శ్రీమాన్ రాళ్లపల్లి వారు 'అన్నమయ్య కన్నివిధముల ప్రతిరూపులుగా సంభావించారు. −16సం॥పీఠిక.

ఇంతగా రాళ్లపల్లి వారి ఎడల భక్తి కలిగి ఉన్నా – పరిష్కరణ విషయంలో అభిప్రాయ బేధాలు ఏర్పడినప్పుడు – తాము నమ్మిన సిద్ధాంతాన్నే గౌరవించిన సందర్భాలు లేకపోలేదు.

"య, వ కారాది తెలుగు పదములను అజాదిగా, తెలుగు పదము లలోని 'శ' కారము – సకారము చేసి తక్కినదంతయు ఉన్న రూపుననే ఉంచి ప్రకటించిరి. ఆత్రోవననే నేనును నడువ దలచితిని అని వినయంగా చెప్పిన శ్రీగౌరిపెద్దివారు – ఆవిషయమై పరిశోధన చేసారు. పదాది 'యకారము' కారము గురించి నన్నయ ఆంధ్రశబ్ద చింతామణి సూత్రాలను పరామర్శించారు. అంతే కాక – బహుగ్రంథ పరిశోధకులు, వ్యాఖ్యాన పరిష్కరణములందు అనుభవము, ప్రసిద్ధి గల వారగు బ్రహ్మశ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారి మాటలు – ఉట్టంకించారు. 'సారంగధర చరిత్ర' – పీఠిక – లో

'కవి యిష్టపడి వాడుకొన్న భాషను మార్చుటకు పరిష్కర్త కేమధికారము? అట్లు మార్చుట 'లిటరరీ ఫోర్జరీ' అనిపించుకొనును, కనుక పరిష్కర్తలు చేయుచున్న పని అక్రమమైనది' అని వ్రాసినారు. ఇది అందరూ గమనింపవలసినదే – అని చిన్న హెచ్చరిక చేసారు గౌరిపెద్ది వారు.

అలాగే 'సారంగపాణి పదములు' అనే గ్రంధానికి పీఠిక వ్రాసిన శ్రీమండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు కూడా – ఆ పదసాహిత్యము లోని వ్యావహారిక పదసంపదకు మురిసి, అది మన తెలుగు వారి 'అకృత్రిమ సాహిత్యసంపద' యని భూషించి యధాలిఖితముగ ముద్రింపించి, ఆంధ్రుల మన్ననలకు పాత్రుడైనారనుట మనము మరువరాని విషయము."

ఈ మాటలను బట్టి శ్రీగౌరిపెద్ది వారు రచయిత భాషను పరిష్కర్తలు మార్చరాదు అనే అభిప్రాయాన్ని కలిగినవారని స్పష్టమవుతున్నది.

ఈ సంకీర్తన వాఙ్మయమును ప్రకటించుటలో పరిష్కరించుటలో – తమ ప్రణాళికను శ్రీగౌరిపెద్దివారు – 18వ సంపుటి పీఠికలో స్పష్టపరచారు.

'ఈ వాఙ్మయమునందు గల క్రొత్తలను వరుసగ ఒక్కొక్క అంశమును, ఒక్కొక్క సంపుటమున లఘువుగ చర్చింప దలచి, నాటి నేటి వ్యావహారిక భాషాపద్ధతిని సంగ్రహముగా దీనిలో చర్చించితిని. వ్యుత్పన్నులు, రసికులు నగు వారు, ఇంకను పైపైచర్చలు సాగించి, తాళ్లపాక కవుల భాషలోని రహస్య రత్నములను అంగడి బెట్టగలరు" – 18సం. పే. 11

తాళ్లపాక వారి వాఙ్మయం లో పరిశోధకులకు క్రొత్త అంశాలు లభిస్తాయనీ, ఆరహస్య రత్నాలను భావిపరిశోధకులు వెలికితీసి ప్రకాశమానం చేయాలనీ వారి ఆకాంక్ష.

ప్రథమ సంపుటిలో అన్నమయ్య – వైష్ణవము అనే అంశం మీద, ద్వితీయ సంపుటిలో శరణాగతి అనే విషయం మీద విశేషమయి విశ్లేషణ తో కూడిన అంశాలు వెలువరించారు.

18వ సంపుటి పీఠికలో 'రసభావములు – అన్నమయ్య దృష్టి' అనే శీర్షికలోని విషయం పరిశోధకులకు దారి దీపము వంటిది.

19వ సంపుటిలో – అనుస్వార విశేషాలు అత్యంత నిశితంగా పరిశీలించారు. సిద్ధ సాధ్య ఖండాఖండ బిందు స్వరూపాన్ని వివరించి, అన్నమయ్య కీర్తనలలో పైవిధుల నన్నిటిని దాటిన ప్రయోగములు కొన్ని కానవచ్చుచున్నవని – ఎత్తి చూపారు.

20వ సంపుటములో – 'భక్తి శృంగారము–అన్నమయ్య' అనే అంశాన్ని చర్చిస్తూ – భాగవతము, విష్ణుపురాణము, నారాయణీయము, నారద భక్తి సూత్రములు, మధుసూదన సరస్వతి భక్తి రసాయనము, శ్రీకృష్ణ కర్ణామృతము, యాజ్ఞ వల్క్య స్మృతి, శివానందలహరి వంటి గ్రంధాలను పరిశీలించి లక్ష్యలక్షణ సమన్వయం చేసి అన్నమయ్య శృంగార కీర్తన లలోని శృంగార స్వరూప స్వభావాలను నిరూపించారు. శ్రీ శర్మగారి పరిశోధనా పాటవానికి ఈ వ్యాసం పరమ నిదర్శనం. ఈ పీఠికలోని మరొక్క విశేషాంశం – 'అధ్యాత్మ శృంగార సంకీర్తనల పౌర్వాపర్యము' అనే వివేచనాత్మక వ్యాసం.

22వ సంపుటం – పీఠిక ఆరంభంలో –

'తాళ్లపాక కవుల సారస్వతము ఆంధ్ర భాషా మర్మములకు గని. అందునను అన్నమాచార్యులు

చాల స్వతంత్రుడు. ఈతడెంత రసికుడో అంత భక్తుడు. ఎంతభక్తుడో అంతకంటే భాషావిదుడు కూడ, శాస్త్రము గాని, లోక వ్యవహారము గాని తన ప్రయోగము లందు వ్రేలుచూపరాదు, అన్నంత తెగువకలవాడు. 'ఈ సంపుటమున – కృత్తద్ధితములను గూర్చియు నామధాతువుల గూర్చియు చర్చింప దలచితిని.'.

'నామ ధాతువులు ఉదాహరించి – మమకరించు, భండారించు అని – నామ ధాతువులుగా కల్పించుట వింతే. ఇట్టివి మరికొన్ని గూడ ఈతని స్వాతంత్ర్యమునకు గుర్తుగ చూపవచ్చు. పైపై పాఠకులు పరిశోధనము చేయు సహృదయులు ఆ పదరాశి నంతటిని చర్చింపగలరు' – అని ఆశించారు.

23వ సంపుటములో – 'తాళ్లపాక కవుల సారస్వతము సర్వ కావ్యధర్మములకు కాణాచి. ఈ సంపుటమున – అన్నమాచార్యుల గుణాలంకార సరణి లఘువుగ చర్చింపదలచితిని' అంటూ

సమాసములను కూర్చడం లో అన్నమయ్య విధానం 'తునుక తునుక తెలుగు పదములతో తిక్కన గారు చెప్పినట్లు 'సాహళ' సంధించిన విధముగా కూర్చుట ఈతని సరళి. ఈతని రచనపైకి తేటగా కనబడినను యోచించుకొద్దీ లోతులుదాకుపద్ధతి అడుగడున కన్పట్టు చుండును.' కవుల కవితను విలువకట్టుటలో పూర్వమహాకవులతో పోల్చిచెప్పడం ఒకపద్ధతి. శ్రీగౌరిపెద్ది వారు సంస్కృతాంధ్రమహాకవుల రచనలలో అన్నమయ్య సాహిత్యమును పోల్చి చెప్పిన పట్టులు చాలానే ఉన్నాయి.

అన్నమయ్య అలంకార రచనలో శబ్దాలంకారాలు, అర్థాలంకారరాలు అందగించడమే కాక – కొన్ని కీర్తనలలో అలంకార సంకరముగ భాసించిన విధానాన్ని వివరించారు.

24వ సంపుటములో – 1. అన్నమాచార్య శృంగార భండారము 2. అన్నమయ్య మనస్తత్వము అనే అంశాలను కూలంకషంగా చర్చించారు. అన్నమయ్య ప్రత్యేకతను వివరిస్తూ –

'లోక సాధారణమైన నాయికా నాయకుల విషయమున శృంగారరసమును వర్ణించిన మహాకవుల ధోరణికిని, తాను నాయికగా, శ్రీవేంకటేశ్వరస్వామి నాయకుడుగా అన్నమయ్య సాగించిన శృంగార వర్ణనకును చాల వ్యత్యాసములున్నవి. ఇతర మహాకవులకు అన్నమయ్యకు అలంకార శాస్త్రమొక్కటే యైనను, ఆ శాస్త్రమును అన్నమయ్య మూడుపూవులారుకాయలుగా దాని కొక వింత సొగసు సంతరించినాడు.

'అన్నమయ్య కొన్ని వేల ప్రబంధకవులకు ఊహలకందని వర్ణనలు సేయుటలో మేటి. గౌరిపెద్ది వారి ఈ ఒక్క ప్రతిపాదనను – పరిశోధించగలిగితే ఒక గొప్ప సిద్ధాంత గ్రంథం వెలువడుతుంది.

శృంగార కీర్తన రచన – అన్నమయ్య ఎందుకు చేసాడు అని ప్రశ్నించుకుని వీరు చెప్పిన సమాధానము అన్నమయ్య మనస్తత్వమును ఆవిష్కరిస్తున్నది.

'ఆయన జీవితములో సగభాగమునకు పైన శృంగార కీర్తనలే రచించి, అందులో నాయికగా, ప్రతినాయికగా, దూతిగా, చెలికత్తెగా, తానే బహురూపములు ధరించి వేంకటేశ్వరుని శృంగార సర్వస్వముగా తానే నిలిచిన అన్నమయ్య, తన శృంగారారాధనకు ప్రతిఫలముగ అలమేల్మంగా సారూప్యమును కోరుకొనుట అసంభావ్యమేమికాదు'.

**'అలమేలుమంగ వలె నటల శ్రీవేంకటేశ్వరుఁ**
**గలయఁగ వలెఁ గాక గామిని కి'** (24–447)

అన్నమయ్య భావన ఎంతటి ఉదాత్త రమణీయమైనదో ఈ ఒక్క మాట చాలు. అందుకే గౌరిపెద్దివారు –

'అన్నమయ్య లో ఎంత శృంగారము తొణికిసలాడుచుండినను, పరమాత్మపై భక్తి పట్టు దప్పకుండ కన్పట్టుచునే యుండును' – అనే సత్యాన్ని ఆవిష్కరించారు.

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు అన్నమయ్య సంకీర్తనా వాఙ్మయ సముద్రాన్ని తమ బుద్ధి బాహువులతో తరియంగ నీది, ఆ సంకీర్తనా సాగరాంతర్గతములయిన అనర్ఘరత్నాలను వెలికి తీసి ఆంధ్ర పాఠకులకు అందించారు. అన్నమయ్య – భాష, సాహిత్యం, వ్యాకరణం, అలంకారాలు, రసం, మతం – మొదలయిన సర్వ సౌందర్యాలను శ్రద్ధతో పరిశోధించి భక్తితో వ్యాఖ్యానించిన ఉత్తమ విమర్శకులువారు. వీరి సామర్థ్యాన్ని గురించి వీరి పీఠకలే వివరించగలవు.


అన్నమయ్య సంకీర్తనలకు వ్యాఖ్యానం వ్రాసే వారికి వారి పీఠికలు ఎంతగానో ఉపకరిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. ప్రథమ సంపుటానికి వ్యాఖ్యానం వ్రాసే సందర్భంలో నేను వీరి పీఠికలోని అనేక అంశాలను కళ్లకద్దుకుని వినియోగించుకున్నాను. శ్రీ గౌరిపెద్దివారికి సర్వదా కృతజ్ఞురాలను.

తమ పీఠికల గురించి శ్రీగౌరిపెద్ది వారు వెలిబుచ్చిన అభిప్రాయం తో ఈ వ్యాసం ముగిస్తాను.

"ఈ తాళ్లపాక కవుల వాఙ్మయము భక్తి పీఠమైనట్లే భాషా మర్మములకు కూడా పీఠమే. భారత కవులను, శివకవులను వదలినచో భాషావిషయమున తాళ్లపాక కవులను తాకగల, దాట గల మొనగాండ్లు లేరన్నచో అతిశయోక్తి కాదు. ఈ తాళ్లపాక కవుల భాషాసాగరమున మథింపవలసిన దెంతయో కలదు. మథించువారు ఎందరో ముందుకు రావలసి యున్నది. రాగలరు.

ఆ పనికి ఉడుత సేవగా నాయీ పీఠికలు పనికి రావచ్చునని ఒక ప్రత్యాశ. అందులకే యీ ప్రయత్నము." – పీఠిక – సంపు – 21

మాన్యులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారిది అన్నమయ్య సంకీర్తనావాఙ్మయసాగర పరిశోధకులకు నలసేతు నిర్మాణమే. కేవల ఉడుత సేవమాత్రము లేదు – అని భావిస్తూ – ఈ శతజయంతి పవిత్రకార్యక్రమంలో నాలుగు పత్రాలు సమర్పించే అవకాశం కల్పించిన శ్రీ భగవాన్లు గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.



*స్వయంగా శ్రీరాములవారి పూజ చేస్తూ శ్రీ గౌరిపెద్ది.*

# కరదీపికలు - ఈ పీఠికలు



డా॥ శ్రీమతి రెడ్డిశ్యామల
ప్రొఫెసర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైదరాబాద్
చరవాణి – 98496 97688

మహాపండితులు కీ.శే.గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు అనగానే ఒక అద్భుతమైన దృశ్యం నా కళ్ళముందు నిలుస్తుంది. నేను నా పరిశోధనలో భాగంగా వారిని కలిశాను. అన్నమయ్య మధురభక్తి గురించి వారితో చర్చించడానికి వారి గృహానికి వెళ్ళాను. మాటల సందర్భంగా వారు తమ గురువులైన శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారిని స్మరించారు. అంతే! వారు కన్నులు మూసుకున్నారు, చేతులు జోడించారు. కళ్ళనుండి అశ్రుధార ప్రవహిస్తూనే ఉంది. వారి గురుశిష్యబంధాన్ని ఆయన వివరిస్తుంటే సుమారు అరగంటపాటు నేను ప్రాన్పడిపోయాను. అదొక అద్భుత సన్నివేశం. ఎప్పుడో కీర్తిశేషులైన గురువును తలచుకొని వారు విలపించిన విధానం నన్ను అమితాశ్చర్యానికి గురిచేసింది. వారి పాండిత్యం గురించి శిష్యవత్సలత గురించి చెబుతూనే ఉన్నారు. వారి పైలాల్చీ తడిసిపోయింది. దానినుంచి బయటకువచ్చి తేటపడిన మనస్సుతో నాకు అన్నమయ్య గురించి ఎన్నో విశేషాలు తెలిపారు. కానీ మొదటిసారి నేను 'అశ్రుతర్పణం' అన్న పదానికి ప్రత్యక్ష అర్థం చూసాను. శ్రీ గౌరిపెద్దివారు అనగానే ముందుగా నాకు ఈదృశ్యమే గోచరిస్తుంది. వారికి నా నమోవాక్కులు.

నా చిన్నతనంలో వారితో చాలా చనువుగా ఉండేవాళ్ళం. ఆయన పసిపిల్లలతో బాగా సరదాగా మాట్లాడేవారు. ఆయన విద్వత్తు గురించి తెలియని అమాయకత్వంతో బాల్యచేష్టలతో వాళ్ళ ఇంటి అరుగుల మీద ఆడుకున్న జ్ఞాపకాలున్నాయి. మేం అప్పుడు తిరుపతిలో ఉండేవాళ్ళం. వారి సతీమణి శివకామమ్మ మా ఊరి ఆడబడుచు కావడం వలన పరిచయం. ఊరిబంధాలు కుటుంబ బంధాలకన్నా బలీయమైనవి ఆకాలంలో.

తాళ్ళపాక పదసాహిత్యాన్ని పరిష్కరించి సంపుటాలుగా ప్రచురించే కార్యక్రమాన్ని తిరుమల

తిరుపతి దేవస్థానం 1936 నుండి చేపట్టింది. ఈ కార్యక్రమం గురించి 'గ్రంథ పరిష్కరణశాస్త్రం' అనే రచనలో ఆచార్య ఆర్వీయస్ సుందరంగారు చాలా విపులంగా చర్చించారు. సంస్కృత మహాభారత పరిష్కరణ ప్రణాళికకు, ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణ కార్యానికి తుల్యమైన బృహత్ప్రణాళికగా వారు అభివర్ణించారు. పద్నాలుగువేల పై చిలుకు సంకీర్తనలు, రాగిరేకుల రూపంలో ఉండటం, తెలుగు భాష, సాహిత్యంలోని అన్ని వైవిధ్యాలను కలిగి ఉండడం వంటి ఎన్నో ప్రత్యేకతలున్న వీటి పరిష్కరణ ఒక గొప్ప అధ్యయనాంశం. పైగా తాళ్ళ పాక వంశీయులలో ఏ సంకీర్తన ఎవరి కృతం అనేది కూడా ఒక ప్రశ్నే.

పరిష్కరణను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఒక శాస్త్రంలా దీనిని కొనసాగించారంటారు సుందరంగారు. ఇక్కడి నుండి శ్రీరాళ్ళపల్లి వారు మొదలైన పెద్దలు ఉండగా అత్యధిక సంకీర్తనలను పరిష్కరించినవారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. నా పరిశోధన గ్రంథం 'అన్నమాచార్యుల పద కవితలు – మధురభక్తి'లో అనుబంధంలో అప్పటివరకు ప్రచురితమైన సంపుటాలు పరిష్కర్తలు ఎవరు ఎన్ని సంకీర్తనలు వెలువరించారు, ఏ సంపుటపు పీఠికలో ఏ విషయంపై చర్చించారు అనేవి ప్రోది చేశాను.

శ్రీయుతులు వి.విజయరాఘవాచార్యగారితో (1936) మొదలైన ప్రచురణ నుండి వేటూరి వారు, ఉదయగిరి శ్రీనివాసాచార్యులవారు, రాళ్ళపల్లివారు, పి.టి.జగన్నాథం వారి వరకు సుమారు 500 రేకులు పరిష్కృతమయ్యాయి. 501 నుండి 800 వరకు రాళ్ళపల్లి వారితో కలిసి గౌరిపెద్దివారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తరువాత 801 నుండి 2002 వరకు గల రాగిరేకులను వీరు పరిష్కరించారు.

వీరి విద్వత్తు గురించి రాళ్ళపల్లివారు చెప్పిన మాటలనే ఇక్కడ ఉటంకిస్తాను.

"ఈ గొప్ప పనికి నాకు చేదోడు వాదోడుగా తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాల యందలి ఆంధ్ర సంస్కృత సాహిత్యోపాధ్యాయులగు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ శిరోమణి – విద్వాన్ గారిని ఏర్పరిచారు. నాయదృష్టము : శ్రీ శర్మగారు అష్టావధానము ఉభయ భాషలందును ఆశుకవిత, మంత్రతంత్ర శాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలు విషయములలో పరిణితులు, నిష్కల్మషమైన, నిష్పక్ష పాతమైన మేధ, ప్రామాణికమైన దృష్టి, ఆత్మార్థమైన సంచార

సంపత్తిగలవారు. ఈ పల్లెపట్టులందలి దేశి తెలుగు నుడికారములు చక్కగా నెరిగినవారు...” సంకీర్తనల పరిష్కరణకు ఇంతకన్నా ప్రమాణపత్రం ఏముంటుంది.

రేకులు 1001 నుండి 1100, 1401 నుండి 1500 వరకు గల సంపుటాలలోని పీఠికలను పరిచయం చేయవలసిందిగా నాకు పురమాయించారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి కనిష్ఠ పుత్రులు శ్రీ భగవాన్ గారు. ఈ రెండు సంపుటాలలో “అన్నమాచార్య శృంగార భండారము”, “అన్నమయ్య మనస్తత్వము”, “భక్తి శృంగారము – అన్నమయ్య” అన్న మూడు అంశాలు ఉన్నాయి. సంకీర్తనలను పరిష్కరించి పరిష్కరణ విధానము, అందులోని భాషా విశేషాలు, సాహిత్య సౌరభాలు పీఠికలలో పరిచయం చేయడం ఒక ప్రణాళికగా శ్రీ గౌరిపెద్ది గారు ఏర్పరచుకుని పాటించారు.

20వ సంపుటిలోని పీఠిక నిడివి 26 పుటలు. 12వ సంపుటంలో ‘అన్నమయ్య భక్తి’ గురించి చర్చించి యుండిరి. అయినా అక్కడ “పూర్వపక్ష సిద్ధాంతములతో అన్నమయ్య భక్తి శృంగారమును చర్చించని” కారణంగా ఈ సంపుటంలో సప్రమాణాలతో అన్నమయ్య శృంగార సంకీర్తనల నేపథ్యాన్ని నిరూపించారు శ్రీ గౌరిపెద్దిగారు. భావితరాలలో ఉదయంచనున్న ప్రశ్నలను లేదా వాదనలను ఊహించి ఈ వ్యాసంలో భక్తిశృంగారంలోని లోతులను విశదీకరించారు. వీరి భక్తిని ‘భాగవత సంప్రదాయం’గా నిరూపితం చేయడం బాధ్యతగా భావించి స్పష్టపరిచారు.

ఈ పీఠికలో వీరు చర్చించిన విషయాలను క్లుప్తీకరించడానికి ప్రయత్నిస్తాను. విరక్తుడైన వాడు యోగమార్గం అనుసరించవచ్చు. పరమార్థ సాధనకు ఇది ఒక మార్గం. అయితే తరించుటకు తరింపచేయుటకు అనేక మార్గాలున్నాయి. వీటిని గౌరిపెద్దిగారు స్థూలంగా వివరించారు. విష్ణుపురాణ ప్రోక్తమైన “ధ్యాయన్ కృతే, యజన్ యజ్ఞైః త్రేతాయాం, ద్వాపరేఽ ర్చయన్, యదాప్నోతి, తదాప్నోతి కలౌసంకీర్త్య కేశవమ్” అన్న దానికి ప్రమాణంగా పేర్కొంటూ తన వాదానికి ప్రాతిపదికగా చేసుకున్నారు.

శ్రీ శంకర భగవత్పాదులకు ముందు ఉన్న 64 తంత్రముల గురించి తెలుపుతూ వాటిని శ్రీశంకరులవారు ఖండించి వాటి వ్యాప్తికి మందగింపజేసిన విధానం తెలిపారు. అవైదికములుగా పరిగణించి వాటిని పూర్వపక్షం చేశారు. వారి మాటలలో చెప్పాలంటే ‘పాపచర్చను ముగించుచున్నానని’ పేర్కొన్నారు.

ఈ సంపుటంలో ప్రధానచర్చ అన్నమయ్య "భాగవత సంప్రదాయంలో కచకుచాది వర్ణనము, రతిలంపటము" గలిగిన సంకీర్తనల గురించి. ఇది ఏవిధంగా అవైదికము కాదో నిరూపించారు. భాగవత విష్ణుపురాణాలలో తొమ్మిది, పదకొండు విధాలుగా భక్తి పేర్కొనబడినది. నారద భక్తి సూత్రాలలోని "పరమ విరహాసక్తి భక్తి"కి గోపికలు ప్రాతిపదికలైనారు. ఈ పురాణాలు గోపికాభక్తిని అలౌకిక శృంగారమునకు పాత్రములైనారు.

దీనిని గురించి చర్చిస్తూ గౌరిపెద్ది వారు తానే ప్రశ్నలను వేసుకున్నారు. అలాగే పరీక్షిత్తు శుకబ్రహ్మ నడిగిన ప్రశ్నలను మనముందుంచి, వాదాన్ని ఎలా నిర్మించుకుంటూ వెళ్ళాలో తెలుసుకోవడానికి ఈ పీఠిక పాఠం వంటిది. శ్రీధరస్వామి వారి వ్యాఖ్యానం, భాగవత ప్రమాణంగా "సాత్వికమైన తపస్సుకంటే కూడ స్వామి సాయుజ్యమునకు వైరము-భక్తి-కామము ప్రధానముగా" పేర్కొన్న విధానంతో సైద్ధాంతిక నేపథ్యాన్ని స్పష్టపరచారు. శ్రీవైష్ణవ మతమునకు చెందిన పండ్రెండుగురు ఆళ్వారులు నాయికాభావమునకు అగ్రపూజ యిచ్చారు. అన్నమయ్యకు గల గోపికాభక్తి దీనిని శృంగార సంకీర్తనా రచనకు ప్రోత్సహించింది. ఇక గౌరిపెద్దివారు మధుసూదన సరస్వతి 'భక్తిరసాయనము' (లక్షణ గ్రంథాన్ని)తో లక్ష్య లక్షణ సమన్వయం చేశారు. భక్తిలోని స్థాయీభేదాలను తీసుకుని అన్నమయ్యను అద్భుతంగా ఆవిష్కరించారు. వారి మాటలలోనే "అన్నమయ్యది నేను తొలుత పేర్కొన్న, పాషండ దురాచార భక్తి శృంగారము కాదనీ. యోగసూత్ర, భక్తిసూత్ర, భాగవత, విష్ణుపురాణము మొదలగు పరమ పవిత్ర గ్రంథములచే చెప్పబడి ఏ కొందరి మహానుభావులకో, ఎన్ని జన్మల తపఃఫలముగనో సిద్ధించునట్టి సాత్త్వికము, శుద్ధము. సంకారకము అయిన భక్తి శృంగారము" అని మనవి చేశారు.

అన్నమయ్య శృంగార సంకీర్తనలలోని 'పచ్చిదనాన్ని' అర్థం చేసుకోవడానికి, ఆత్మ సంస్కారానికి, ఈ పీఠిక మిక్కిలి ఉపకరిస్తుంది. కొన్ని కీర్తనలను తీసుకొని శ్రీ గౌరిపెద్దిగారు వివరించిన తీరు దీనికి నిదర్శనం. "నాయికా రూపము ధరించిన అన్నమయ్య తన ప్రాణేశ్వరుడగు వేంకటేశ్వరునితో విచ్చలవిడి సంచరింపక, మనలను జూచి భయపడి నంగినంగిగా నడుచుకోవలెనా?" అంటూ యశోద చిన్నికృష్ణుని పక్షం వహించి "మా యింట జతనాలు మీరు చేసుకొనక పాయక దూరేరే జతిలేని బిడ్డను" అన్నట్లు ప్రశ్నించారు గౌరిపెద్దివారు. అన్నమయ్య పక్షం వహిస్తారు. అన్నమయ్య సంకీర్తనలను సాహిత్యస్థిలో కాక ఆత్మార్పణ చేసుకున్న నాయిక స్థాయిలో నిలిచి పాడుకొనవలసినవిగా నిరూపిస్తారు.


అధ్యాత్మ శృంగార సంకీర్తనల పౌర్వాపర్యము గురించిన వీరి చర్చ తరువాత విమర్శకులు అంగీకరించినదీ, మన్ననలను పొందినది.

1401 నుండి 1500 వరకు గల రేకులలోని 600 శృంగార సంకీర్తనలు గల 30 సంపుటం ఇది. దీనిలో "అన్నమయ్య శృంగార భండారము, అన్నమయ్య మనస్తత్వము" అనే అంశాలు 23 పేజీలలో చర్చించారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. అన్నమయ్య శృంగార వర్ణనకు ప్రబంధ కవుల శృంగార వర్ణనకు గల భేదసాదృశ్యాలను విశ్లేషించారు. కావ్యగౌరవము లేని పదాలను అన్నమయ్య వాడిన తీరు, పాఠకులకు అనుకున్న భావాన్ని సాక్షాత్కరింపచేయడంలో కృతకృత్యులైన విధం సోదాహరణంగా నిరూపించారు ఈ పీఠికలో. 'లంజకాడా' వంటి దాక్షిణాత్య శృంగార పదాలకు గల ప్రాదేశిక భాష వాడుకను భగవంతునిపై గల చనువును కారణంగా చూపుతారు.

ఈ పీఠికలో "చక్కని మానిని నీసరి యెవ్వరే" అనే సంకీర్తనకు ఇచ్చి వ్యాఖ్యానంలోని అలంకార శాస్త్ర చర్చ వారి పాండిత్యానికి దివిటీలెత్తినవి. ఈ సంకీర్తనపై జరిగిన చర్చను చూసినట్లయితే అన్నమయ్య రచనను అర్థం చేసుకోవడానికి ఎన్ని శాస్త్రాల పరిజ్ఞానము అవసరమవుతుందో తెలుస్తుంది. కాముడు వేటగాడు. నాయికను నాయకునికి ఉరులొడ్డటం, నాయకుడు అందులో చిక్కుకొనడం. పురుష సింహమనాయకుడు, ఆయనకు నాయిక సింహమధ్య ఒక దరులు. ఇలా మొత్తం మూడు చరణాలలో మూడు రూపకాతిశయోక్త అలంకారంతో ఏ విధంగా అన్నమయ్య అద్భుతంగా రచించారో నిరూపించారు గౌరిపెద్దివారు. వీరి విద్వత్తుకు, శాస్త్ర పరిశీలనకు ఈ వ్యాఖ్యానం తార్కాణం. వేట గురించి అలంకార ప్రయోగంలోని కించిత్ భేదాల గురించి ఎంత లోతుగా చర్చించినా సులభంగా అర్థమయ్యేలా వివరించారు. మరొక సంకీర్తన "విపరీతములివి వినరాదు"లో చేసిన అలంకారశాస్త్ర చర్చ పఠనీయం.

తాళ్ళపాక వారి సాహిత్యాన్ని పాఠపరిష్కరణనే కాక, అన్నమయ్య హృదయము ఆవిష్కరించిన పండితులు, భగవతోత్తములు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. వీరి పీఠికలు పాఠ పరిష్కర్తలకు అన్నమయ్యను అర్థం చేసుకోవాలనుకునేవారికి కరదీపికలు. నేను 'అన్నమయ్య పదకవితలు – మధురభక్తి'పై పరిశోధన చేయడానికి ప్రారంభించినప్పుడు వీరు నాకు చూపిన త్రోవ ఎంతో విలువైనది. తరువాత ఆ మార్గం నడుస్తూ అన్నమయ్యను అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపకరించింది. వారిని కలువగలగడం నా పూర్వజన్మ సుకృతం. ధన్యురాలను.

# శ్రీ గురువందనం!



– జూలకంటి బాలసుబ్రమణ్యం
సహాయకుడు (1979–84),
అన్నమాచార్య వాఙ్మయ ప్రాజెక్టు, తి.తి.దే.,
విశ్రాంత సంపాదకులు, "సప్తగిరి" పత్రిక,
తి.తి.దేవస్థానములు.

**వేంకటేశ సమారంభాం అన్నమాచార్య మధ్యమామ్**
**శ్రీ గౌరిపెద్ది పర్యంతాం వందే గురు పరంపరామ్.**

సుమారు నలభైమూడేండ్ల కిందటి పైమాట ఇది!

1979 జనవరి 10వ తేదీ బుధవారం! ఆ రోజు నా జీవితంలో ఆధ్యాత్మిక పంటలు పండడానికి నాంది అయిన దివ్యమైన రోజు, భవ్యమైన రోజు.

తిరుమల తిరుపతి దేవస్థానంలో కేవలం చిన్న ఉద్యోగం అనే నిమిత్తంగా, నన్ను శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారి శ్రీ చరణ సన్నిధికి చేర్చిన రోజు అది! ఈ గురువుగారి ద్వారానే, సప్తగిరీశుని తన సంకీర్తనలతో అలరింపజేసిన పరమగురువు అన్నమాచార్యులవారి నిండైన అనుగ్రహాన్ని చూరగొన్న రోజు కూడా ఇదే! పరమగురువు అన్నమయ్య "అదివో! అల్లదివో హరివాసము!" – అంటూ చేయెత్తి చూపిస్తూ ఆ హరివాసంలో "తానే తానే ఇందరి గురుడు సానబట్టిన భోగి ఈ జ్ఞానయోగి"ని తన పదకవితలనే సోపానమార్గం ద్వారా పరమేష్ఠి గురువు వేంకటేశ్వరుని సన్నిధికి దారిచూపించి "హరి కొలువు"ను దర్శింప జేసిన పవిత్రాతి పవిత్రమైన రోజు కూడా ఇదే! ఇదే !!

ఆ రోజునే, తాళ్లపాకవారి రాగిరేకులమీది సంకీర్తనల పరిష్కరణకోసం స్థాపించిన "అన్నమచార్య వాఙ్మయ ప్రాజెక్టు"కు స్పెషలాఫీసరుగా శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, వారికి సహాయకుడుగా నేను ఒకే రోజు చేరాం.

చేరిన మొదట్లో శ్రీ గౌరిపెద్ది వారి స్ఫురద్రుపాన్నీ బలిష్ఠమైన ఆకృతినీ, గాంభీర్యాన్ని చూచి

కాస్త బెరుకుగా వుండింది. భయంగానూ వుండింది. ఆయన దగ్గర చేరిన తర్వాత, వెన్నలాంటి, సుతి మెత్తని మనస్సు కలవారని అర్థమయ్యింది. 'ఎందుకయ్యా అంత బెరుకుగా వున్నావు. నీవు మా అబ్బాయివి' అంటూ నా భుజాన్ని తట్టారు. అంతేకాదు. ఆయనకోసం వచ్చిన వారందరికీ మా అబ్బాయి చి॥బాలసుబ్రమణ్యం అంటూ పరిచయం చేసేవారు. అప్పటినుంచి వారితో నేను అత్యంత చనువుగా, ఆత్మీయంగా మెలిగే వాణ్ణి.

ఆ తర్వాత తర్వాత కొద్ది కాలానికే శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిలో అద్భుతమైన ఒక మహామనీషిని దర్శించినాను.

ఈయన కేవలం ఓరియంటల్ కాలేజీలో పాఠం చెప్పే లెక్చరరుమాత్రమే కాదు. ఆయన ఒక విజ్ఞాన ఖని! కవీ! పండితులు! అవధాని! సంస్కృతాంధ్ర నిఘంటువు! అద్భుతమైన ఆయుర్వేద భిషక్కు! తూ.చ. తప్పకుండా జాతకాలను చెప్పగలిగిన జ్యోతిశ్శాస్త్ర పండితులు! ఇంకా... ఇంకా... ఎందరికో ఎన్నో విధాలుగా ఆధ్యాత్మికంగా లౌకిక జీవనపరంగా ఎన్నో ఎన్నెన్నో ధర్మసందేహపరంపరలను నివృత్తి చేసే ధర్మసింధువు! ఇంతేనా! ఎందరికో గోప్యంగా ఎన్నో విధాలుగా ఆర్థికంగా, మాటసాయంతో ఉపకారాలను చేసే పరోపకార పరాయణులు.

ఇక ఆయన ఇంటి మధ్యలో వున్న నాలుగు స్తంభాల నడుమ వున్న చతురస్రప్రదేశం. అద్భుతమైన పండిత సాహిత్య పరిషత్పీఠం! ఆ పీఠానికి శ్రీ గౌరిపెద్ది వారే భోజమహారాజు! ఆ పీఠంలో జరిగే చర్చల్లో, వాదోపవాదాల్లో, అన్నమాచార్యుల పదకవితలు మొదలుగా ఎన్నెన్నో సంస్కృతాంధ్ర కావ్యాలు, విషయాలు అలవోకగా చోటు చేసుకొనేవి. శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు, శ్రీ అవధానం చంద్రశేఖర శర్మ, శ్రీమాన్ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, శ్రీ.ఈ.కృష్ణమాచార్యులు, శ్రీ సింగరాజు సచ్చిదానందం వంటి పండిత ప్రకాండులెందరో ఆ చర్చల్లో పాల్గొనేవారు.

ఇంక శ్రీ గౌరిపెద్ది వారి ఇల్లో! అది నిరంతరం అన్న సంతర్పణలు సాగే నిత్యాన్నదాన సత్రం! ఒక్క పండితులేనా, విద్యార్థులేనా, బంధువులేనా, మిత్రులేనా... ఇలా వారింటిలో తృప్తిగా ఆరగించిన వారెందరో! ఎందరెందరో!

**తాళ్లపాక కవుల చరిత్ర – రాగిరేకుల వివరం**

అన్నమాచార్య వాఙ్మయ ప్రాజెక్టులో సహాయకుడిగా చేరిన తొలిరోజుల్లోనే గురువుగారైన శ్రీగౌరిపెద్దివారు తాళ్లపాక అన్నమాచార్యులవారి జీవితచరిత్రను పూర్తిగా తెలియజేశారు. అన్నమాచార్యులు – ఈయన పుత్రుడు పెదతిరుమలాచార్యులు – ఈయన పుత్రుడు చిన తిరుమలాచార్యులు – వీరినే "తాళ్లపాక కవులు" అంటారనీ వీరందరు వేంకటేశ్వరునిపై చెప్పిన సంకీర్తనలు అన్నీ పెదతిరుమలయ్య కాలంలోనే రాగిరేకుల్లో నిక్షిప్తంగా చేయబడి, తిరుమల శ్రీవారి ఆలయంలోని "సంకీర్తన భండారంలో"లో భద్రపడ్డాయని చెప్పారు. ఇంకా కాలాంతరంలో పోయిన రేకులు పోగా 1.సాధారణ రేకులు, 2.పెద్దరేకులు, 3.శాసనపురేకులు, 4.నిడురేకులు – అని నాలుగు రకాల కొలతల్లో వున్న రేకుల్లో కేవలం సుమారు 2701 వరకు మాత్రం లభ్యమవుతన్నాయని చెబుతూ, శ్రీ గౌరిపెద్ది వారు తాళ్లపాక కవుల చరిత్రతోపాటు, వారి రాగిరేకులపైన ఒక చక్కని అవగాహన కల్గించారు. ఒక ఆసక్తిని కలిగించారు. వారి ప్రేరణతోనే తొలిగా అన్నమయ్య సంకీర్తనల వ్యాసాలు 'సప్తగిరి'లో ప్రచురితమయ్యాయి.

## రాగిరేకుల మీద వ్రాత

అంతమాత్రమే కాదు. రాగిరేకుల మీది సంకీర్తనలను ఎలా అధ్యయనం చెయ్యాలో చెబుతూ సున్న, అరసున్న, దిత్త్వాక్షరాలు, దీర్ఘాలు, హ్రస్వాలు... వలపలగిలక... లాంటి వాటిని వివరిస్తూ అక్కడక్కడ ఏ ఏ పదాలను ఎలా విభజించి రాసుకోవాలో కూడా చక్కగా ఎంతో ఓపికగా ఓర్పుతో నాకు బోధించారు గురువుగారు శ్రీ గౌరిపెద్దివారు.

వారు కీర్తనలను చెబుతుండగా నేను రాసేవాణ్ణి. ఒక్కొక్క చోట తటస్థించిన కఠిన పదాలను, పదబంధాలను, సందిగ్ధంగా వున్న పలుకు బడులను ప్రత్యేకంగా ఎత్తి రాసుకునేవాణ్ణి. ఆ తర్వాత ప్రతిరోజు రాత్రి 8 గంటలకు భోజనంచేసి గురువుగారింటికి వెళ్ళి రాత్రి పదింటి దాకా నేను రాసుకున్న కఠిన పదాలకు వారు వివరించగా నేను రాసుకునేవాణ్ణి.

ఎప్పుడైనా నేను పొరపాటు చేస్తేనో, చెప్పిన పని మరచిపోతేనో ఆయన విచిత్రంగా కోపపడేవారు. అయితే నోరెత్తి ఒక్కమాటకూడా అనరు. కానీ మాట్లాడకుండా కఠిన మౌనాన్ని పాటించేవారు. అదే శిక్ష! అంతే వారి మౌనాన్ని నేను భరించలేక "స్వామీ! క్షమించండి స్వామీ!" అంటూ కండ్ల నీళ్ల పర్యంతం అయ్యేవాణ్ణి. అంతే! శ్రీ గౌరిపెద్ది వారి గొంతుక కూడ ఆర్ద్రమై, నా

భుజాన్ని తడుతూ నన్ను అనునయిస్తూ, నా యీ శిక్ష, నీ పాలిట 'శ్రీరామరక్ష'! అయ్యా! అనేవారు. అంతే! అదే మొదటిదీ, చివరిదీ అయిన సంఘటన.

ఒకమారు అడిగాను గురువుగారూ! ఓరియంటల్ కాలేజీలో పాఠం చెప్పే మీరు ఎలా అన్నమయ్యకు అంకితమయ్యారు? – అని

దానికి వారు రెండు మూడు అద్భుత సంఘటనలు తెలియజేశారు.

1965లోను, 1975 లోను అన్నమాచార్యుల శృంగార సంకీర్తన సంపుటాలు వరుసగా 19, 22 సంపుటాలను శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారితో కలిసి పరిష్కరించే భాగ్యం కలిగినదనీ, అప్పట్లో శ్రీరాళ్లపల్లి వారు అన్నమాటలను స్మరించి ఆనందంతో నాకు ఇలా చెప్పారు.

'ఇదిగో! రామసుబ్బయ్యా! గ్రాంధిక వాదిగా వున్నావు. నీ గ్రాంధికాన్ని గట్టిగా మూటగట్టి అటకపైన పడవేయి" అన్నారట. ఆనాటినుండి శ్రీ గౌరిపెద్ది వారి రచనలు, వ్యాసాలు, అన్నమయ్య సంపుటాల పీఠికలు, సరళవ్యావహారిక రచనలో కొనసాగిస్తున్నట్లుగా చెప్పారు.

ఆ తర్వాత అన్నమాచార్యుల రాగిరేకుల పరిష్కరణ కార్యం కుంటుపడగా ఒక రోజున అప్పటి దేవస్థానం ఈ.ఓ. శ్రీ చెలికాని అన్నారావుగారు శ్రీ గౌరిపెద్ది వారిని పిలిపించి ఇలా అన్నారట!

"స్వామీ! ఆ రాగిరేకులమీది పాటలను మీరే పూర్తిగా పరిష్కరించే బాధ్యతను స్వీకరించండి" అంటూ వారు మరోమాట అన్నారు.

"అయితే ఈ పాటల పరిష్కరణకు ఎలాంటి పారితోషికం ఇవ్వము. ఉదయం పూట ఓరియంటల్ కాలేజీలో పాఠం చెప్పండి. మధ్యాహ్నం పూట రాగిరేకుల పాటల పరిష్కరణ చెయ్యండి దీనికి సమ్మతమైతేనే రెండు మూడు రోజుల్లో తప్పక తెలియజెయ్యండి. ఇది ఆదేశం కానే కాదు. అభ్యర్థన మాత్రమే" అన్నారట అన్నారావుగారు.

ఉదయం పాఠం చెప్పడం, మధ్యాహ్నం పాటల పరిష్కరణ శ్రమతో కూడిన పని అనుకొంటూ రెండుచోట్లా న్యాయం చెయ్యాలికదా అని శ్రీ స్వామివారిని ఏమిటి నీ ఆనతి అని ప్రార్థించారట.

ఆనాటి తెల్లవారురఘామున, బ్రాహ్మీముహూర్తంలో నిలువెత్తు మూలవిరాణ్మూర్తి

శ్రీవేంకటేశ్వరస్వామి సర్వాభరణాలతో ప్రకాశిస్తూ సాక్షాత్కరించాడు. గౌరిపెద్ది వారు ఉలుకూ పలుకూ లేకుండా ఆ మూర్తిని ఆశ్చర్యంగా దర్శించారట! ఇంతలో "నీదీ, నాదీ, అన్నమయ్యదీ భారధ్వాజ గోత్రమే కదా!" అంటూ శ్రీ స్వామివారు చిరునవ్వులు చిందిస్తూ అదృశ్యమయ్యారట"

ఈ అనుభవాన్ని నాకు చెబుతూ, ఆనాటి నుంచి ఉదయం కాలేజీలో పాఠము, మధ్యాహ్నం దేవస్థానం ప్రెస్సు ఆవరణలో రాగిరేకుల పరిష్కరణ కార్యాన్ని నేనొక్కణ్ణే చేస్తున్నానయ్యా" అంటూ ఈ మధురసన్నివేశాన్ని గూర్చి చెప్పారు.

మరి ఇప్పటి పరిస్థితికి కారణం కూడా చెబుతానువిను. అంటూ ఇలా కొనసాగించారు.

1978 సంవత్సరంలో ఆగష్టు సెప్టెంబర్లో దేవస్థానం తెలుగు పండితుల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. దానికి నేను పరీక్షాధికారిని. వచ్చిన అభ్యర్థులను "మీకు వచ్చిన, లేదా నచ్చిన పద్యమో, శ్లోకమో చెప్పమని అడిగాను" ఏ ఒక్కరు పూర్తిగా చెప్పలేనందువల్ల, వాళ్లు మొదలు పెట్టిన పద్యాన్ని శ్లోకాన్ని నేనే పూరించేవాణ్ణి. నా పక్కనే వున్న దేవస్థానం ఈ.ఓ. శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు దీన్నంతా గమనించి, "మీరేం చేస్తుంటారు స్వామీ!" అని అడిగారు. నేను నా ఉద్యోగ పూర్వాపరాలు, అన్నమయ్య రాగిరేకుల పరిష్కరణ కార్యక్రమాన్ని వివరించాను! మీ అంతటి పండితులు పాఠం చెప్పినా వినే పరిస్థితుల్లో లేని విద్యార్థులకు ఎందుకు? ఇకమీదట పూర్తిగా అన్నమయ్య పాటల పరిష్కరణకే ఉద్యోగ సమయాన్ని వినియోగించండి అంటూ "అన్నమాచార్య వాఙ్మయ ప్రాజెక్టు" ఏర్పాటు చేసి, దానికి మీరు ప్రత్యేకాధికారిగా (స్పెషలాఫీసరు) వుండండి. దానికోసం మీకు ఒక సహాయకుణ్ణి మీరే నియమించుకొనే ఏర్పాటు చేస్తానన్నారు. మరి 1975 నుంచి మీరు పనిచేసిన సంపుటాలకు కూడ పారితోషికం ఇప్పించడానికి ఏర్పాటు చేస్తానని ఆ పని పూర్తి చేశారు కూడా.

అప్పట్లోనే నా శిష్యుడూ, నా సహోద్యోగి అయిన మీ సోదరులు చి॥కె.జె.కృష్ణమూర్తిగారు కనపడగా, క్షేమమా! అంటూ ఇలా అడిగాను. "అయ్యా! నీలాగా చక్కగా గుండ్రంగా రాయలగల సమర్థుడూ, వినయశీలీ, వ్యుత్పత్తి గలవాడూ, శ్రద్ధగలవాడూ నాకు అన్నమయ్య రాగి రేకుల పరిష్కరణలో **"సహాయకుడు"** గా కావాలన్నాను. అంతేనయ్యా! ఆ అదృష్టం నీకు కలిగిందంటూ శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు వివరిస్తూ నన్ను మరోసారి ఆశీర్వదించారు.

ఇలా 1979 జనవరి నుండి 1984 సెప్టెంబరువరకు ఈ వాఙ్మయ ప్రాజెక్టు కొసాగింది.

శ్రీ గౌరిపెద్ది వారి ఆధ్వర్యంలో మొత్తం అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల సంపుటాలు - 15, అన్నమాచార్యు శృంగార కీర్తనల 12వ సంపుటం, అన్నమాచార్యుల జీవిత చరిత్ర పీఠికా, అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనల సంపుటాలు-4... ఇలా మొత్తం 21 గ్రంథాలు ప్రచురితమయ్యాయి. ఇవిగాక శ్రీ రాళ్లపల్లి వారితో కలిసి చేసిన సంపుటాలు-2.

రాగిరేకుల పరిష్కర్తలలో అందరికంటె ఎక్కువమొత్తం చేసినవారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు.

శ్రీ గౌరిపెద్ది వారు పదవీవిరమణ చేసి వెళ్తున్న సమయంలో వారి పాదాలకు నమస్కరిస్తూ కళ్ల నీళ్ల పర్యంతమయ్యాను. వారు ఒకే ఒక మాట అంటూ నాకు ధైర్యం చెప్పారు.

“అయ్యా! ఈ పనిని సాక్షాత్తు వేంకటేశ్వరుడే చెప్పి చేయించుకున్నాడయ్యా? ఇందులో నీవూ పాలుపంచుకున్నావుకదా! ఇన్ని రోజుల సేవ వృథాగా పోనేపాదు. నీకు ఉత్తరోత్తరా ఆ సప్తగిరీశుడే అనుగ్రహించుగాక! అనుగ్రహిస్తాడు కూడా!” అంటూ నిండుగా రెండు చేతులతో నన్ను దీవించారు.

వారి ఆశీర్వచనబలం వల్లే ‘సప్తగిరి’ పత్రికలో ఉపసంపాదకుడుగా, తదుపరి సంపాదకుడుగా ఉద్యోగ విరమణ చెయ్యడం జరిగింది. వారు నేర్పిన “రాత” వల్లే ఉత్తరాల శైలి వల్లనే “హరికొలువు” “సిరికొలువు” వంటి ఆధ్యాత్మిక రచనలు చెయ్యగలిగాను.

ఇంతటి భాగ్యాన్ని పొందిన నేను, బ్రహ్మశ్రీ వేదమూర్తులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గురువరేణ్యుల శతజయంతి వేడుకల సందర్భంగా ప్రచురింపబడుతున్న ప్రత్యేక సంచికలో చోటుచేసుకున్న “శ్రీగురువందనం” అనే చిన్ని వ్యాసం ద్వారా గురువుగారితో గడిపిన మధుర క్షణాలను నెమరు వేసికుంటూ, వారి దివ్య చరణాలను ఆనందంగా, భక్తిగా స్పృశిస్తున్న అనుభూతిని పొందుతూ వున్నాను.

**వేంకటేశ పరబ్రహ్మ రసతుందిల మానసమ్**
**అధ్యాత్మ విద్యా మర్మజ్ఞం అన్నమార్యం నమామ్యహమ్**

**-- శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ**

# శ్రీ గౌరిపెద్ది అంతరంగం



**శ్రీ గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్**
న్యాయవాది, తిరుపతి.
చరవాణి - 94927 04983

వేద వేదాంత సాహిత్య శిరోమణి - ఆయుర్వేద, జ్యోతిష, మంత్ర శాస్త్ర ఖని - బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. ఉపాధ్యాయ వృత్తిలో వుంటూ ఉద్దండ పండితులను సాహితీ లోకానికందించి, వైదిక ధర్మ సదాచార ప్రవృత్తిలో రాణించి, అవధాన విద్యలో రాటుదేలి, గ్రంథ, సంకీర్తనల పరిష్కర్తగా రాచబాట నడిచి, సమకాలీన సాహితీసీమలో "నడయాడే నిఘంటువు"గా ప్రశంసలందుకున్న మహామనీషి.

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు 1922వ సంవత్సరం సెప్టెంబర్ 10వ తేదీన ఒకప్పటి చిత్తూరు జిల్లాలోని గర్నిమిట్ట గ్రామంలో జన్మించారు. తండ్రి శ్రీ గౌరిపెద్ది శేషయ్యగారు. తల్లి శ్రీమతి రామలక్ష్మమ్మగారు. భారధ్వాజ గోత్రంలో జన్మించిన వీరి బాల్యంలో చిత్తూరు జిల్లాలో వెంకటరామరాజపురం అగ్రహారం (మడిచెఱువు అని కూడా పిలువబడేది) లోనూ, నూతనకాల్వ లోనూ గడిపినారు.

**విద్యాభ్యాసం**

శ్రీ చదువుల వెంకట్రాయలు గారి చెంత వీధిబడిలో ప్రాథమిక విద్యాభ్యాసంతో మొదలైనది. తాత గారైన శ్రీ మర్మాల చెంగయ్య గారి వద్ద అమరము, రఘువంశము ప్రథమ సర్గ, శబ్దములు, ధాతువులు, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణము, ఆంధ్రనామ సంగ్రహము, సులక్షణసారము, కొంత వేదభాగము, జ్యోతిషము చదువుకున్నారు.

తర్వాత 1934వ సంవత్సరంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలలో చేరిరి. కీ॥శే॥ పురసి కృష్ణమాచార్యుల వారు వీరిని పరీక్షించి ఎలిమెంటరీ థర్డ్ ఫారంలో చేర్చిరి. తరగతిలో అత్యుత్తములుగా ఉత్తీర్ణత సాధించటం మూలాన మరియు ఎంట్రన్స్‌లో విశేషప్రతిభ కనబరచినందున

న్యాయ-వ్యాకరణ-మీమాంస-వేదాంత-సాహిత్య శిరోమణులలో దేనిలోనైనా చేరి చదువుటకు అర్హత సంపాదించిరి.

చివరికి వేదాంత శిరోమణిలో చేరిన వీరు వారాలు చేసుకుని విద్యనభ్యసించినారు. బాల్యమునుంచి ఆశువుగా పద్యాలు చెప్పటం వీరి ప్రతిభ. అప్పటి వారాల భోజనం గురించి చెప్పిన ఆశువు ఇలా...

**వారము వారమొక్క కరి వాటికి యేగి మదీయ భోజనం**
**బో రమణీ త్వదీయ గృహ మందని చెప్పగ నొప్పుకొంటి ప్రా**
**గ్ధీరత కోలుపోయితి మనంబున ప్రాణము వోని శాంతమా**
**చారము గేహగేహమున యంతకునంతకు హెచ్చెనౌరయా ॥**

పేదరికం, దృఢమైన దీక్షతో వీరి విద్యాభ్యాసం సాగిందట. ఆ రోజుల్లో రవాణా సౌకర్యాలు కష్టమే. నూతనకాల్వ నుంచి పాదచారియై తలకోన అడవిమార్గం (శేషాచలం కొండలు) ద్వారా పులిచర్ల చేరుకుని రైలులో తిరుపతి చేరుకునేవారు. మార్గమధ్యంలో పరచినట్లుండే బండలు కడిగి వాటిపై కట్టుభోజనం పూర్తిచేసుకునే వారట. సదుపాయాలు తక్కువయినా, కటిక బీదతనం తోడయితే ఇట్టి కష్టాలు ఎదుర్కోవడంతప్ప వేరేగతి లేదనేవారు.

నెల్లూరులో కొన్నాళ్ళు విద్యాభ్యాసం గడిచిందని చెప్పేవారు (ఇది లీలగా గుర్తు). బ్రహ్మశ్రీ మండలీకం వేంకట శాస్త్రుల వారు అద్వైత వేదాంతము బోధించేవారు. చదువులో కూడా దూకుడు స్వభావమే. సహాధ్యాయి విజరాఘవాచార్యులతో పోటీపడి గంటకు నూరు పద్యాలు ఆశువుగా చెప్పేవారు. ఏమి జవాబివ్వాలనన్నా పద్యాలలోనే. తుదకు గురువుగారితో కూడా అదే ధోరణే. వీరి కవిత్వ ఆగడాలు గమనించి “అబ్బాయ్! మూడిళ్లలో మధుకరమెత్తి భోంచేయమని శిక్షలాగా ఆజ్ఞాపించారు. ‘భవతీ భిక్షాం దేహి’ అని మూడు బ్రాహ్మణ యిండ్లలో భిక్షాటన చేసి గడిపినారు. అదీ ఆనాటి శిక్షణాక్రమం. ఆ నేపథ్యంలో ఒక రాత్రి భిక్షమెత్తుకుని విస్తరిలో తెచ్చుకున్న భోజనాన్ని పెన్నానది ఒడ్డున తినటానికి ఉపక్రమించారు. ఇంతలో ఘోరుమని జోరువాన. భోజనములోని సారమంతా వర్షంపాలై కొట్టుకుపోయి మిగిలిన అన్నం మెతుకులు, కంది పప్పు గింజలు మాత్రం ఏడుస్తూ భుజించారట. అప్పుడు ఆశువుగా చెప్పుకున్న పద్యం కూడా భోజనంలాగే.. ఎక్కడో కొట్టుకుపోయింది (మా కందక).

బ్రహ్మశ్రీ టి.ఏ. వేంకటేశ్వర దీక్షితుల వారి వద్ద ప్రస్థానత్రయము, పంచపాదిక వివరణము మాత్రము చదివిన పిదప, వేదాంతముతో లౌకిక వ్యాపారము జరుగుట కష్టమని గ్రహించి సాహిత్య శిరోమణిలో చదివి 1944వ సం॥న ఉత్తీర్ణులైరి.

ఆపై కడప పట్టణమున రామకృష్ణ ఉన్నత పాఠశాలలో సంస్కృత అధ్యాపకునిగా పని చేస్తూ 1950వ సం॥లో 2(బి) విద్వాన్ ప్రయివేటుగా చదివి ఉత్తీర్ణులయిరి. అలా వీరు నిరంతర విద్యార్థి.

**ఉద్యోగ విశేషాలు**

శ్రీ శర్మగారు మొట్టమొదట 1944లో టి.టి.డి.కి సంబంధించిన ఓరియంటల్ లైబ్రరీలో కాపీయిస్టుగా ఉద్యోగంలో చేరినారు.

1945-46లో మద్రాసు వావిళ్ళ ప్రెస్ నందు ప్రూఫ్ రీడర్‌గా పనిచేసిరి.

1948వ సం॥ కడప రామకృష్ణ ఉన్నత పాఠశాలలో సంస్కృత పండితులుగా చేరి 1951 ఆగస్టు వరకు పనిచేసిరి.

20-08-1951న తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో ఆంధ్రశాఖలో అధ్యాపకులుగ చేరిరి. అప్పటి నుంచి వీరి జీవితగమనం మారింది. సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామి పాదసేవలో జీవనమెన్నో మలుపులు తిరిగింది.

**గౌరిపెద్ది - హాస్యరసికత**

సన్నిహితంగా జీవించే భాగ్యమబ్బినందున వారి అంతరంగములో హాస్యప్రియత్వం గ్రహించే అవకాశం లభించింది.

మా తండ్రిగారి బాల్యస్నేహితులు శ్రీ ఈయుణ్ణి గోపాలకృష్ణమాచార్యుల వారు, మహామహోపాధ్యాయ శ్రీ యన్.సి.వి. నరసింహాచార్యులవారు, శ్రీ సింగరాజు సచ్చిదానందం గారు ప్రతిరోజు సాయంకాలం మా యింట కలిసేవారు. వారిమధ్య చతురోక్తులు హాస్యభరితమై వుండేవి. ఒకరినొకరు ఎగతాళిగా ఏకవచన సంబోధనతో మాట్లాడుకున్నా అందరూ హాస్యాన్ని రసవత్తరంగా పండించేవారు. అశ్లీలత ఎక్కడా కనిపించదు.

సరస్వతీ పుత్రులు డా॥ శ్రీ పుట్టపర్తి నారాయణాచర్యులు వారికి మా ఇంటనే బస. ఉదయం 11 గం॥ల ప్రాంతంలో వారు రాగానే స్నానపానాదులు ముగించుకుని భోజనాల పర్వంలోకి వెళ్ళాలి.

వీరు దేవతార్చన, అభిషేకాలతో ఆలస్యం చేసేవారు. ఆకలితో భరించలేక శ్రీ పుట్టపర్తి వారు “ఒరే! ఆ శివుడి నెత్తిన నీళ్లు పోసింది చాలు. ఇకఆపేయిరా. మరీ ఎక్కువయితే వాడు జలుబుతో చస్తాడు” అని తొందరించేవారు. మా తండ్రిగారితోపాటు మేమూ నవ్వుకునేవారము.

**శతావధాని సుబ్బన్నగారి ప్రహసనం**

1977 ప్రాంతం... సుబ్బన్న శతావధానిగారు అవధాన విద్య పరిశోధనలో నుండిరి. ఒకపరి వివరణమునకై వాత్స్యాయనకామశాస్త్రమునకు గల జయమంగళుని బృహద్వ్యాఖ్య చూడవలెనని ప్రయత్నము... ఆ వ్యాఖ్యాన గ్రంథము, గౌరిపెద్ది వారి కడ ఉన్నది. కాని వారి గ్రంథసంచయమునుండి ఏరి వెదకుట ఒక బృహత్ప్రయత్నము... సుబ్బన్న శతావధానిగారికి వారివద్ద చాలా చనవు.. పలుమార్లు వారిని కదిపిరి. కాదనరు.. పనికి కదలరు. తర్వాత తర్వాత వారికి సుబ్బన్నగారాప్యాయముగ నొసగిన బిరుదము.. వారితోనే లేఖలో నన్నమాట..

“స్వామీ! తమరు ఉదారులు.. కానీ **‘ఘరట్టప్రతిమల్లస్వరూపులు’**...కదలక హస్తనిర్దేశముతో భక్తుల కభయమొసగుచున్న వేల్పు సేవలో నుంటిరి... మీరును అట్లే యుండిన యెడల మా పనులెట్లు తీరును..” అని వారి ఛలోక్తి.

**‘ఘరట్టము’** – అంటే విసరురాయి.. యంత్రములు రాని ఆ కాలమున ధాన్యమును పిండిగ చేసికొనుటకై ప్రతి గృహమున నుండు సాధనము.. క్రింద ఒకరాయి గుండ్రముగ.. దాని మధ్య ఒక సీల.. దానిపై మరియొక రాయి.. అదే పరిణామముగ గుండ్రముగ.. మధ్యలో రంధ్రము.. క్రిందరాయిలో నున్న సీలలో దూర్చి నిలుపుటకు.. ఆ రంధ్రమున కిరువైపుల ఏటవాలుగ తొలువబడిన రెండు రంధ్రములు.. గుండ్రముగ నున్న ఈ పై రాయి పరిధిసమీపమున అంగుళముపై లోతుగ చిన్ని గుంత.. దానిలో సరిగా సరిపోవు చిన్న కొయ్య గుంజ.. ఈ కొయ్యగుంజ నా కన్నములో ఇరికించి, పట్టుకొని త్రిప్పినచో ఆ పై రాయి క్రిందనున్న రాతిపై తిరుగును.. నడుమ సీల కిరువైపులగల ఏటవాలు రంధ్రములలో నుండి పిడికిలి ధాన్యపు గింజలు వేసి, పై రాయిని త్రిప్పుచున్నచో ఆ రాపిడికి గింజలు నలిగి పిండి ప్రక్కలకు ఆ విసరురాయి క్రింద పరచిన వస్త్రముపైకి జారిపడుచుండును.

అయితే ఆ **‘ఘరట్టము’** న ఎంతసేపటికి పైరాయి తిరుగవలసినదే కాని, క్రిందరాయి తిరుగదు.. అట్లే ఎప్పటికినీ మా ప్రయత్నములే కాని తమరు కదలరు కదా.. అని ఆ ఘరట్టములో **‘ప్రతిమల్ల’** –

పోటీకివచ్చు సమానస్థాయిగలవారు.. అని చమత్కారము...

గౌరిపెద్ది వారెప్పుడూ ఈ వాక్యమును చెప్పి చెప్పి నవ్వుచుండెడివారు.

-- (శ్రీ సాంప్రతి సురేంద్రనాథ్ గారి సేకరణ నుండి)

శ్రీ గౌరిపెద్ది వారి అవధానాలలో అప్రస్తుత ప్రసంగ ఘట్టాలు మరెంతో హాస్య ఒరవడిని పండించేది. కర్నూలు సిల్వర్ జూబిలీ కళాశాల అధ్యాపకులు శ్రీ షేక్ దావూద్ హాస్యచాతుర్యాన్ని చాలాసార్లు గుర్తుచేసుకునే వారు. ఒక అవధానంలో నిషిద్ధాక్షరి మొదలయి ఆలోచిస్తుండగా శ్రీదావూద్ గారు “అప్పుడే ప్రసవ వేదన మొదలయ్యిందా” అని పరిహసించగా...

“ఫరవాలేదులే. మంత్రసానియైన మీరు ప్రక్కనుంటే నాకు భయం లేదు” అని సుకుమారంగా జవాబిచ్చారు.

వేరే సందర్భంలో, ఇంకొక అప్రస్తుత ప్రసంగి

“మాణిక్య వీణాం.. అను శ్లోకంలో ‘నీలద్యుతి’ ‘కుంకుమ రాగం’ ‘మరకత శ్యామా’ అని రకరకాల రంగులు కాళికకు చెప్పారు. అంటే రంగులు మార్చే రాజకీయ వాదుల లాగానా?” అని అడిగారు. దానికి సమాధనంగా “ఇది దృష్టి భేదం. ఒక్కొక్క భక్తునికి ఒక్కొక్క విధంగా కాళిక కనిపిస్తుంది” అని సున్నితంగా జవాబిచ్చారు.

మరో అవధానంలో “అమ్మాయిలు పెండ్లి కాక ముందు రెండు జడలు, ఆ తర్వాత పెళ్లయ్యాక ఒక జడ వేసుకోవటంలో అంతర్యమేమిటని అడిగారు. “పెండ్లికాక ముందు అమ్మాయికి తల్లిదండ్రులు ఇద్దరి ఆశ్రయం, రక్షణ వున్నాయి. పెళ్లయ్యాక భర్తే ఒక్కడే సర్వస్వం” అని సమాధానమిచ్చారు.

ఇంకొక ప్రశ్నయిలా...

“ఆరేసుకోబోయి పారేసుకొన్నాను హరీ హరీ! కోకెత్తు కెళ్లింది కొండ గాలీ”... ఈ పాట మధ్యలో హరి ఎందుకు?

శ్రీ గౌరిపెద్ది వారి చమత్కారమిలా...

“హరికి – కోకలకున్న సంబంధం ద్వాపరకాలం నుండి ఉంది”

కొంత అశ్లీలతకు లాగినా తొణక్కుండా హాస్యాన్ని ఛలోక్తితో తిప్పికొట్టడం అవధానుల చాతుర్యం.

ఒకసారి...

సమాధానమిలా. అప్రస్తుత ప్రసంగంలో కూడా ఆధ్యాత్మిక భావాలను సమయస్ఫూర్తితో గుప్పించేవారు. ఒకసారి... "తాంబుట్ట బాగుంది - బిరటాలు బాగుంది -తంతెట్టా కొరికెరా యెలకా" అన్నదానికి భావమేమిటని అడిగితే...

"శరీరాన్ని తంబుట్టతో పోల్చారు. బిరటాలు అవయవాలు. తంతి ప్రాణం. ఎలుక మృత్యువు. ప్రాణం తీసిందని భావ"మని సమాధానమిచ్చారు.

**గౌరిపెద్ది - అపర కుచేలుడు**

గౌరిపెద్ది వారి జీవితంలో సాఫీగా, సుఖమయంగా సాగలేదు. విద్యనభ్యసించేటప్పటి కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి... కానీ వెరవక సాహితీసేవలో ముందడుగే వేశారు. మంచి ఉద్యోగమే అయినా సంసారం జీవనం బీదరికంతోనే నెట్టుకొచ్చారు. కారణం వ్యవహార జ్ఞానలోపంతో పాటు బంధు, స్నేహజన ప్రీతి ఎక్కువై, స్తోమతకు మించిన భారమధికం కావటం. ఎప్పుడూ పండిత గోష్ఠులు, బంధుసేవలు కారణంగా ఇల్లు ఒక సత్రం లాగా ఉండేది. స్నేహితుల ఇళ్లకు వెళ్లి బియ్యం, డబ్బు చేబదుళ్లకు నేను వెళ్ళి తెచ్చిన సందర్భాలు చాలవున్నాయి. ఇది మా విషయంలోనేకాదు...అప్పట్లో తిరుపతిలో చాలా మంది ఇళ్లలో ఇదే పరిస్థితి. Pilgrim allowance (యాత్రిక భత్యం) ఇచ్చినా చాలేది కాదు.

మా తండ్రి గారికి ఏ దురలవాటు లేదు. కాకపోతే నశ్యం (ముక్కు పొడుం) సేవించేవారు. అది ఆ రోజుల్లో పండితులకుండే ఒక హోదాగా మారిన దురలవాటు. శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి గారు కూడా దీని అలవాటు ఉన్నవారే. పండితుల మధ్య ఒకరకమైన హుందాతో ఈ నశ్యం ఇచ్చిపుచ్చుకునే ధోరణి, క్రియ దృశ్యభాగ్యం.

ఎన్ని ఒడుదుడుకులున్నా సాహిత్య చర్చలు, సేవలు నిరంతరం నిరాఘాటంగా సాగేవి. మా ఇంట ఉదయం పరచిన చాపలు రాత్రి వరకు తీసే ప్రసక్తి ఉండదు. ఎంతటి ఉద్దండ పండితులైనా, ఐశ్వర్యవంతులైనా, ఉన్నతాధికారులైనా, రాజకీయ ప్రముఖులైనా (అప్పటి రెవిన్యూ శాఖ మంత్రి శ్రీపెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు తదితరులు) చాపలపై కూర్చునేవారు. కుర్చీలు, సోఫాలు లేవు. మధ్యలో

చర్చలు ముగించి వెళ్ళే వారుంటారు... కానీ ఉదయం కూర్చుంటే రాత్రి 9 గం॥ల వరకు లేవరు... మధ్యలో భోజన, శయనాదులకు తప్ప.

**అన్నమయ్య ఆత్మ-ఆవాహన**

1964 సంవత్సరంలో అన్నమయ్య ఆత్మ మా తండ్రి గారిలో ప్రవేశించిందేమో. వారికి జీవిత సోపానాన్ని అందించి మహోన్నత స్థాయికి తీసుకువెళ్ళినట్లు నా భావం. మధ్యలో కొంత విరామం ఉన్నా, 1974 నుంచి సంపూర్ణబాధ్యతలతో అన్నమయ్య సంకీర్తనల పరిష్కరణ సాగించినారు. కార్యాలయంలోనే కాక ముద్రణ దోషాలను సవరించే పనిని ఇంట కూడా చేసేవారు.

అకాలభోజనానికి, నిద్రలేమికి, గురవుతున్న వారిని గమనించి "మిమ్మల్ని అన్నమయ్య దయ్యమై పట్టినాడా"ని వాపోయేది మా తల్లి. అన్నమయ్య దయ్యమైతే... శ్రీ గౌరిపెద్ది వారు రాక్షసుడు... అంటే పని రాక్షసుడు. అంతటి దీక్షతోనే వారు 27 సంపుటాల పరిష్కరణ, 19 సంపుటాలకు సుదీర్ఘ, పరిశోధనాత్మక పీఠికలను భావితరాల పరిశోధకులకు మార్గదర్శకాలుగా అందజేసినారు. వారి పీఠికలను పరిశీలించి, ప్రసిద్ధులైన పండితులు ప్రసాదించిన వ్యాసాలే ఈ విశేష సంచికలో దర్పణాలుగా వెలువడ్డాయి. తానే అన్నమయ్యగా తాదాత్మ్యం చెంది సాగించిన బృహత్కార్యమది.

**గౌరిపెద్ది - అన్నమయ్య బంధం**

ఒకవిధంగా యోచిస్తే శ్రీ గౌరిపెద్ది వారు, తాళ్ళపాక కవులు రాయలసీమ ప్రాంతానికి, అందునా శేషాచలగిరులలో వారిరువురి సంచారం పరిశీలిస్తే... వారి నడుమ అనూహ్యా దివ్యానుబంధాన్ని తలపింపజేస్తుంది. ఇద్దరూ భారద్వాజ గోత్రీయులే... శ్రీ వేంకటేశ్వర స్వామి వారితో సహా. ఇద్దరూ నెత్తికెత్తుకున్నది ఒకే అంశం... శ్రీ తిరుమలరాయని సంకీర్తనల రచనలు ఒకరు చేస్తే, ఇంకొకరు వాటిని పరిష్కర్తగా లోకానికి అందజేసిన వారు. ఇక్కడ నేను మరో అంశం ప్రస్తావించాలి.. అపరఅన్నమయ్యగా సంకీర్తనలను శ్రుతిపరచి సంగీతరూపకంగా ప్రచారం చేస్తున్నవారు శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారు. పూజ్యులు శ్రీ మల్లిక్, శ్రీ రాళ్లపల్లి, శ్రీ నేదునూరి మరి శ్రీమతి యమ్.యస్.సుబ్బలక్ష్మి గారల బాటను బట్టిన వీరు అభినందనీయులు.

**గౌరిపెద్ది - నిర్యాణం**

'జాతస్య మరణం ధ్రువమ్'... అయినా అది బాధాకరమే. శ్రీ గౌరిపెద్ది వారు తనకున్న మధుమేహ వ్యాదిని కొంత నిర్లక్ష్యం చేసినారనే చెప్పవచ్చు. తీపిపై మమకారం జీవితానికే పెనుతీర్పునిచ్చింది. తుది దశలో వారికి మోకాలు దాక నిర్జీవమైనది. పర్యవసానం పాఠకులే ఊహించుకొనవచ్చును. గత జన్మలో నేను బోయవాడినై ఏ ప్రాణినో శిక్షించినానేమో.. అందుకే ఈ కర్మ ఫలం. ఈ జన్మలో నేనెఱింగి ఏపాపమూ చేయలేదు అని వాపోయేవారు.

వారికి తుదిక్షణం వరకు సేవచేసిన భాగ్యవంతురాలు నా ధర్మపత్ని పద్మజను ఇచట స్మరించవలసినదే. ఆమెను అందరూ కూతురనుకున్నారే కానీ, కోడలిగా కొద్దిమందికే తిరుపతిలో తెలుసు. ఆమె చేతులలోనే 1991వ సం॥ జనవరి 21న వారు వైకుంఠ ప్రాప్తిని పొందినారు...

అశ్రుతర్పణములతో పుత్రుడు...

**--శ్రీ గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్**

చరవాణి - 94927 04983



*శ్రీ గౌరిపెద్ది వారిని అన్నమయ్య కీర్తనల పరిష్కరణ చేపట్టవలసినదిగా కోరుచున్న అప్పటి (1964 సం॥) కార్యనిర్వహణాధికారి శ్రీ చెలికాని అన్నారావు గారు*

# రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ

కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
తిరుపతి

*(యువభారతి సౌజన్యంతో)*

శ్లో॥ సంగీత సాహిత్యే చాంగీకారాయ శారదాముద్రామ్ ।
యస్య నిరీక్షేత స్వయమభివందే రాళ్ళపల్లి కులమందారమ్ ॥

ఒకనాటి కృష్ణుడు (కృష్ణదేవరాయలు) కర్ణాటాంధ్రరమాధురంధరుడు. ఈ కృష్ణుడును (శ్రీశర్మగారు) అట్లే కర్ణాటాంధ్ర సంగీత సాహితీరమాధురంధరుడు. ఆ కృష్ణుడు సాహితీ సమరాంగణ సార్వభౌముడు. ఈ కృష్ణుడు సంగీత సాహిత్య సార్వభౌముడు. బ్రాహ్మణ క్షత్రియ జాతిభేదముచే నేర్పడిన భేదమింతమాత్రమే. కత్తినెత్తురులు లేని సాహిత్యసమరములం దీకృష్ణుడూ బిరుదుమగడే. ఆ కృష్ణుని సమరములు చూచువారికి కండ్లు చిమ్మచీకట్లు గ్రమ్మించును. ఈ కృష్ణుని సమరములు వినువానికి, చదువుకొనువారికి మనసుల మైలకడిగి తేటపరచును. ఆ కృష్ణుని కొలువునకు దూరదూరములనుండి కవిపండితులు వచ్చి, తమతమ సామర్థ్యములను చూపి, తగినట్లుగ ధన కనక వస్తువాహనాగ్రహారాది సంభావనలు పొందుచుండిరి. ఈ కృష్ణుని గోష్ఠికట్లే దూరదూర ములనుండి కవిపండితులు వచ్చి, తమతమ నేర్పుచూపి, తగినంతగ పీఠికలు, అభిప్రాయములు, వారివారి సమ్మానసభలందు సభాధ్యక్షత మొదలగు సత్కారములంది ధన్యమ్మన్యులై తనియుచుందురు. ఏ గ్రంథమునకైనను శ్రీశర్మ గారి సంభావనాముద్ర శారదాముద్రగ, వారి తలయూపు శారదాకటాక్షముగ యావదాంధ్రమున చలామణి యగుచుండినది.

ఆ ఈకృష్ణులిద్దరును ఒకే సీమవారు, ఒక పట్టువారు, ఒక మనసువారు. ఈ కృష్ణుని 'రాయలనాటి రసికత' తెలుగునేల గల పండితుల గుండెలత్తుకొని ఇంపుతలపులను పండించినది. ఆ కృష్ణుడీ సీమనే తనపేర నిలిపినాడు. ఈ కృష్ణుడీసీమ పేరు తనచేవతో పైకి తెచ్చినాడు. ఇద్దరూ "ఎల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి, దేశభాషలందుఁ దెనుగు లెస్స" అను పూనికతోనే యెన్ని బాస లెరిగినా తెలుగుబాసవైపే మొగ్గినారు. శ్రీమాన్ శర్మగారి భాషా సేవ కన్నడమున కంటె తెలుగుననే

ఎక్కువ. కానీ, కర్ణాటప్రభుత్వము వారి విలువను గుర్తించి సత్కరించినంతగ, మనప్రభుత్వము అనుకొనలేదేమో? పై పటారములకు తొలిపూజ సేయు నలవాటు మనది. గుణప్రధానమైన గుప్తసేవ శ్రీశర్మగారిది. ఇందాశ్చర్యమునకు తావులేదు. వీరీ సీమలో పుట్టిన దానికేమో శక్తికీ, సేవకూ తగిన సత్కారము లందలేకపోయిరి. దీనికి చింతించుటకంటె సంతోషించుటే శ్రీశర్మగారిలోని విశేషము. బిరుదములను, ఆడంబరములను, కన్నెత్తి చూడక, దైన్యము చవిచూడని ధైర్యముతో ముందుకు నడచుట శ్రీశర్మ గారిలోని విశిష్టత. నా వ్యాసమున కీ యుపోద్ఘాతము చాలు.

ఈ 'యువభారతీ' సమితివారు పై శీర్షికను నాకు ప్రసాదించిరి. శ్రీశర్మ గారి బహుముఖ సాహిత్య కృషినిగూర్చి పలువురు వ్రాయగలవారుందురు. శ్రీశర్మగారి శీలము, గోష్ఠీ ప్రియత్వము, లోకమును, సాహిత్యమునూ వారు చూచే పద్ధతి, వారి కుటుంబమర్యాద మొదలగు అంతరంగిక వ్యక్తిత్వముపై నేనీ వ్యాసము సాగింపదలచితిని. శ్రీశర్మగారికి సంబంధించిన పై విషయములపై వారితో సన్నిహిత సంబంధము[1] గలిగి నిష్పాక్షికముగ చెప్పగలవారు నాయంతవారు లేరని నాకొక యహంకారము (నమ్మిక). ఈ విశ్వాసమును నేనొక పెద్ద భాగ్యముగ తలచి మురియుచుందును. ఈ వ్యాసమును చూచిన పెద్దలు నాయీ విశ్వాసమునకు తలపంకిస్తే నేను తలయెత్తుకొన్నట్లు.

### శ్రీశర్మగారి జన్మాదికము

అనంతపురము జిల్లా కల్యాణదుర్గము తాలూకా రాళ్ళపల్లి శ్రీ శర్మగారి జన్మస్థలము. కన్నతండ్రి కర్నమడకల-కృష్ణమాచార్యులు, కన్నతల్లి - అలమేలమ్మ, శ్రీవత్సగోత్రము, దత్తుతండ్రి రాళ్ళపల్లి - అనంతాచార్యులు (శ్రీశర్మగారి మాతామహులు), దత్తుతల్లి లక్ష్మమ్మగారు, శఠమర్షణగోత్రము)

### శ్రీశర్మగారితో పరిచయము

నా చిన్నతనముననే, శ్రీశర్మగారి 'నాటకోపన్యాసములు' వగైరాలు చదివి ఆ మాటల బిగువునకు మురిసి, వీరిని చూడవలెనను సంకల్పము నెలకొన్నది. వారు మైసూరులో ఉద్యోగులు, నేను తిరుపతిలో విద్యార్థిని, కుదురుటెట్లు? బహుశః 1943లో నేమో శ్రీశర్మగారు యాత్రార్థము సద్వితీయులుగ తిరుపతికి

1. "శీలం సంవతాజ్ఞేయం తచ్చ కాలేన భూయసా"- అని వ్యాసుడు.

వచ్చి, ఇక్కడి పరకాల మఠములో విడిసియున్నారని తెలిసినది. అది నా శిరోమణి నాల్గవ సంవత్సరము. మా విద్యార్థిసోదరులతో కలిసి శ్రీశర్మగారిని, మా కళాశాలకు (శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి) ఉపన్యాసకులుగ పిలుచుటకు పై మఠమునకు పోయితిమి. వారు అక్కడ లేరు. తిరిగి చూచు నంతలో, కపిలతీర్థమున స్నానము చేసి, నారమడిపంచె ఒకటి కట్టుకొని, ఒకటి కప్పుకొని, సౌభాగ్యవతి అమ్మగారితోకూడ లోపాముద్రా-అగస్త్యులను తలపించునట్లు వచ్చిరి. నమస్కరించి మా కోరిక తెల్పుకొంటిమి. అది తిక్కన భారతముపై నుపన్యసింపవలె తామని.

వెంటనే వారన్నమాటలివి :- 'నాయనా! తిక్కన భారతములోతు, మీ కందరకు తెలియనిది నేనేమి చెప్పగలను? మీరు పిలిచినందున వచ్చి, మీరు కోరిన యేదో ఒక ఘట్టమును సావకాశముగ చదివి, మీతోపాటు నేనూ ఆనందింతును" అని. దానికే మేమేనుగు నెక్కినంతగ సంతసించి సభ యేర్పాటు చేసితిమి, తేదీ జ్ఞాపకము లేదుగానీ, ఆనాటి సభాధ్యక్షులు కీ.శే. వేటూరి-ప్రభాకరశాస్త్రిగారు. చదివిన ఘట్టము కృష్ణరాయబారము. ఆ పఠనముతో మాలో ఒక క్రొత్త చైతన్య మేర్పడినది. వీరితో దగ్గరగ మెలగవలెననే దురాశ అందరికివలె నాకూ కలిగినది. అది ఫలించేదెట్లా?.

మైసూరులో ఉద్యోగమునుండి విరమించిన శ్రీశర్మగారు. 1951 ఏప్రిల్ నెలలో తాళ్ళపాక అన్నమాచార్యుల కీర్తనల పరిష్కర్తలుగ తిరుపతిలో పునరుద్యోగులైరి. నేనప్పటికి కడపలో నుద్యోగిని. నా యాశ ఫలించేదెట్లు? ఇంతలో దైవికముగ 1951 ఆగష్టులో నేనూ తిరుపతిలో శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలలో తెలుగుశాఖలో ఉద్యోగినైతిని, కానీ శ్రీ శర్మగారిని కలిసేదెట్టా? నే నెక్కడ, వారెక్కడ?.

ఇట్లు సతమతమౌచు వారికి దగ్గరగుటకు జంకుచింటిని. వారు పరిశోధనా కార్యాలయమునుండి, నేను కళాశాలనుండి వచ్చుచు ఒకనాడు దైవికముగ త్రోవలో కలసివచ్చుట తటస్థించినది. నా నమస్కారమూ వారి ప్రతిక్రియ ముగిసి, నన్ను ఫలానా అని వారు తెలుసుకోవడంతో నాత్రోవ చీలే సమయమై వీడ్కోలు ప్రణామము చేస్తిని. 'అప్పుడప్పుడు వస్తూ ఉండండి' అని తమ యింటి గుర్తు చెప్పిరి. నా వెలితి యెంత ఉన్నా పోదామనే ఉబలాటతో ఒకనాడు ధైర్యముగ పోతిని. నాకు జంకుదీర్చే సంభాషణమూ, కొంత సాహిత్య చర్చ సాగినదానాడు.

**పరిచయాభివృద్ధి**

రెండునాళ్లకు మూడునాళ్ల కొకసారి పోయి అప్పటికి ప్రస్తుతములైన చర్చలలో పాల్గొంటూ, సాహిత్యమూ, మతమూ, శాస్త్రమూ వగైరాల గోష్ఠిలో భాగరినై, పల్లెపట్టుల భాష సంప్రదాయములు, పల్లె జీవిత రసాస్వాదనములతో మా పరిచయము దినదినానికి గట్టిపడినది. రానురానూ వారింటికి పోనిదినము నాకు దుర్దినము. ఒక వేళ నేను పోకపోతే వారైనా మా యింటికి వచ్చి గంటల కొద్దీ మాటలాడి యేవేవో చర్చించుచుండుట పరిపాటియైనది. క్రమముగ చిన్న నాడు మా తాతగారివద్ద (మా నాయన మేనమామ) నేర్చిన అత్యల్పమైన వైద్యవిద్యను, జ్యోతిషమును అంగడి పెట్టితిని. ఇంతయేల? వారింటి సభ్యులలలో నేనొకడైతిని. వారి బంధువర్గములో గూడ నన్నెరుగని వారు లేరు. రానురాను శ్రీశర్మ గారింటి పిన్నలకు పెద్దలకూ నేనొక ధన్వంతరి. కీ.శే. వారన్నగారు (గోపాలకృష్ణమాచార్యులు) ఊరిలో లేకుంటే నేను శ్రీశర్మగారింటికి వరాహమిహిరుడు. ఇదీ నా పరిచయాభివృద్ధి. నేను వీరింటికి ధన్వంతరినైనా వీరి మాతామహి చెప్పినట్లుగ వీరు చెప్పిన కొన్ని యౌషధయోగములు రెండు వీరినుండి గిల్లుకున్నాను. ఒకటి కుసుమవ్యాధికి, మరొకటి నారకురుపుకు.

ఆతరువాత ఎక్కడనైనా సభలకు నేనూ వారూ కలిసి పోవుటయు గలదు. కొంతకాలానికి ఆహ్వానించేవారు మమ్ము కలిపి పిలుచుటయు పరిపాటియైనది, ఎక్కడికి పోయినా ఆ సభలకు వచ్చిన వారందరిలో మాయిద్దరి స్థానము విశిష్టమైనదిగ (ఆచార వ్యవహారములలో) ఉండేది. త్రిమతస్థుని యిండ్లలోనూ మా కాసన–శయన–భోజనాదులు అవిభక్తముగ సాగుచుండెడివి. మాయిద్దరి సన్నికర్షను చూచి, సభలకు విచ్చేసిన స్మార్తులూ వైష్ణవులూ గూడ మనవారు చెడిపోయెనే అని మాయిద్దరిని గూర్చి చింతించేవారు. దానిని మేము పట్టించుకోము. 'శర్మగారు వైష్ణవపక్షపాతి, స్మార్తుల గ్రంథాలకు పీఠికలు వ్రాయరు' అని నాతో వాదించి, సోదాహరణమైన నా ప్రతివాదముతో తోక ముడుచుకున్న పండితమ్మన్యులూ లేకపోలేదు. ఇందుకనే శ్రీశర్మగారి అంతరంగిక వ్యక్తిత్వముపై వ్రాయు నధికారము నాకంటె వేరొక్కరికి లేదని ముందే మనవిచేసితిని.

ఆ మధ్యలో శ్రీ శర్మగారు, తాళ్లపాకవారి వాఙ్మయ పరిశోధనమునుండి వైదొలగవలసి వచ్చెను. దానికి కారణము యూనివర్శిటీవారు ఏర్పరచిన వయః పరిమితి. ఐనను వీరి రెండవ కుమారులు శ్రీజయంతగారు, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర కళాశాలలో ఆంగ్లపండితులుగ నియమింపబడుటచే,

వీరికుటుంబము తిరుపతిలోనే స్థిరపడి యుండెను. కావున మా యనుబంధము చేవమీరుచుండెను.

**శ్రీ శర్మగారి గురువులు**

వీరి గురువులు 1. జనకపిత, 2. మైసూరు పరకాల మఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ కృష్ణ బ్రహ్మతంత్ర యతీంద్రులు 3. శ్రీ చామరాజనగరం రామా శాస్త్రులు 4. శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డిగారు. జనకపిత వద్ద వీరు ప్రాథమికములైన సంస్కృత కావ్యములు, తెలుగులో 'నీలాసుందరీ పరిణయము' మాత్రమే చదివిరట. తరువాత మైసూరు కళాశాలయందు విద్యార్థిగా వీరి ప్రవేశము. అక్కడ రామాశాస్త్రులుగారి యొద్దనే వీరి కావ్యపాఠమంతా జరిగిందట. మామూలు కళాశాలలోని ఉపాధ్యాయులు వ్యాకరణము వగైరాలను బోధించు చుండిరట. వ్యాకరణ శాస్త్రమునందు (సంస్కృత, ప్రాకృతాంధ్ర వ్యాకరణము లందు) వీరి గాఢప్రవేశము సన్నిహితులకు మాత్రమే బాగా గోచరించేది. కొన్ని వ్యాసములందు గూడ ఆ పట్టులు కనబడుచుండును. శ్రీశ్రీశ్రీకృష్ణ బ్రహ్మతంత్ర యతీంద్రులకడ విద్యావ్యాసంగము, మతగ్రంథ పర్యాలోచనము జరిగినవి. ఆ రోజులలో వీరు స్వాములవారి దగ్గరనున్నప్పుడు పలువురు పండితులు స్వాములవారి వద్దకు వచ్చి చర్చలు జరుపుచున్నపుడు బాల్యమున నిశితమైన మేధగల వీరి పాత్ర యెంతైనా గురుతింపదగి యున్నది. శ్రీతిరుమల రామచంద్ర గారు 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'మఱపురాని మనీషి' శీర్షిక క్రింద చాల విషయములు చూపియున్నారు. తరువాత వీరికి కట్టమంచివారితో స్నేహసంబంధము. కట్టమంచివారి సాహిత్యకళాసక్తిని వీరు వేనోళ్ళ కొనియాడెడివారు. ఏదైనా రసవద్ఘట్టమును చదివినప్పుడు రెడ్డిగారికి ఒడలు పులకరించుట, కన్నుల నీరుగ్రమ్ముట, మేనిపై చెమట గారుట వగైరాలను వీరు పలుమారులు ప్రస్తావించెడివారు. వారే వీరికి ఉద్యోగమిప్పించిరని చెప్పుచుండెడివారు. ఉపకార స్మరణము మాత్రమేకాక, రెడ్డిగారిలోని స్నేహ సౌశీల్యములను చాలగ కొనియాడెడివారు.

శ్రీ శర్మగారు కావ్యగురువులగు రామాశాస్త్రిగారిని సాహిత్య రసికతను గొప్పగా కొనియాడేవారు. ఆ తీపు మాకూ కొంత చూపినారు. దానిలో అభిజ్ఞాన శాకుంతలము (సంస్కృతము)లో ప్రథమాంకమున చెలులతో ప్రణయదుర్మనస్కుయై నేను పోతానంటే, ప్రియంవద నీవు నాకు రెండు కడవల నీళ్ళు బాకీ పడినావంటే, అప్పుడు రాజు :– "తదహమేనా మనృణాం కరిష్యామి"[1] అని (ఇత్యంగులీయకం దాతు

1. శ్రీ శతావధానం శ్రీనివాసాచార్య వ్యాఖ్యలో నాగరలిపి వావిళ్ళవారి ముద్రణము. 47 వ పుట.

మిచ్ఛుతి) 'ఇక్కడ "దాతు మిచ్ఛతి" అనేదానికి వ్యాఖ్యాతలందరూ, రెండుకడవల నీళ్ల అప్పుకు బదులుగా రాజుగారుంగర మివ్వ దలచినట్లే వ్యాఖ్యానించిరి. పలువురి పాఠ ప్రవచనమూ అంతే. అది అనుచితమని మేమనుకొన్నాము గానీ, ఉచితార్థమెరుగము. శ్రీ శర్మగారు తమ శాస్త్రిగారు చెప్పినట్లుగ :- అక్కడ దానమంటే నీళ్ళపోతకు బదులుగా నిచ్చుట కాదు, ఈ యుంగరం కొంచెము సేపు పట్టుకో అని యిచ్చుటయే. ఎందుకంటే, మనమేదైనా పనిచేసేట్లయితే చేతిలోనున్న గడియారము వగైరా లింకొకరి చేతికిస్తాముగదా, ఆ మాదిరి ఇచ్చి తాను నీళ్లు పోయుటకు సిద్ధపడినాడని యర్థము - అనిరి. ఇది చాల మనోహరమూ మాకు క్రొత్త గూడా.

**అంతర్గత ప్రార్థన మంతికస్థం, జయంత ముద్వీక్ష్య కృతస్మితేన ।**
**ఆముక్తవక్షో హరిచందనాంకా, మందారమాలా హరిణా పినద్ధా ॥**

అభిజ్ఞానశా - 7-2

అను పద్యములో క్రీగీతలు గల పదాని కర్థము విమర్శించుటలో మాలో మాకు అభిప్రాయభేదము లుండినవి. వ్యాఖ్యాతలూ సరిగ వ్రాయలేదు. శ్రీశర్మగారు వారి శాస్త్రులుగారు చెప్పినట్లుగ :- ఇంద్రుని కొడుకు జయంతుడు, తన అతిథి యైన దుష్యంతునికి పూలమాల తాను వేయవలెనని (బాల్య చాపలముతో) ఉంటే ఇంద్రుడు వారించి, గొప్పవాడగు దుష్యంతునకు తానే మాలవేసినట్లర్థమనిరి. ఇట్టి వెన్నియో గలవు. మాసలాకు రెండు చూపితిని. ఇట్టి మాభాగ్య మెంతను కొనవలెనో. మా కళాశాలలో ఉపాధ్యాయులు కొందరూ, విద్యార్థులు కొందరూ కలిసి, ఒకటి రెండు పర్యాయములు వేసిన సంస్కృత 'శాకుంతల నాటకము' నకూ, 'స్వప్నవాసవదత్తము' నకూ వీరు దర్శకులుగా నుండి మాకెంత విచిత్రానుభవము గూర్చిరో మరువరానిది. 'సంస్కృత మృచ్ఛకటికలో నీవు శర్విలకుడుగా వేస్తే చూడవలెనని ఉంది రామసుబ్బయ్యా' అని పలుమారూరించేవారు.

### శ్రీ శర్మగారి కభిమాన కవులు

సంస్కృతమున భాస కాళిదాసులు, తెలుగున తిక్కన, ఎఱ్ఱన, అన్నమాచార్యులూ శ్రీశర్మగారి మనసు గుత్తగొన్నవారు. నా కొంటెతనము వారిలో గూడ ఏదైన నలుసెత్తి చూపుటకు వెనుకాడదు. వెంటనే శ్రీశర్మగారు చిరునవ్వు నవ్వి 'పెద్దపని చేసినారు నాయనా, ఈ చిల్లర విషయములతో వారిని కించపరచరా'దని మందలించేవారు. 'మీ బారికి తప్పిన పుణ్యాత్ములు వీరే' అని నేననుటయు గలదు.

తక్కిన కవులపై వారికి మక్కువా తక్కువగాదు, వ్యాసంగమూ చిన్నది కాదు. కానీ పై వారిపై మోతాదుపెద్దది. వ్యాసవాల్మీకులు శ్రీశర్మగారికి దేవతాస్వరూపులే.!

**శ్రీశర్మగారి గోష్ఠీ ప్రియత్వము**

శ్రీశర్మగారికి గోష్ఠీప్రీతి యెక్కువ. ఈ రోజులలో చాలామంది పండితులలో కరవైన దిదే. నలుగురు చేరి యేదైనా ప్రామాణికముగ చర్చిస్తామంటే వెనుకాడే పండితులను నేను పలువుర నెరుగుదును. ఎక్కడ తమ వెలితి బయట పడుతుందో అనే భీతి వారికి, శ్రీశర్మగారి కదిలేదు. తాను చెప్పినది యుక్తి యుక్తమైనది ఇతరులు మెచ్చినా, అట్లే ఇతరులు చెప్పేదాన్ని తాము సమ్మతించేదానికి వీరు వెనుకాడరు. ఇంకా నిండుసభలో గూడా ఆ విషయాన్ని, ఆ చెప్పిన వ్యక్తిని పేర్కొని చెప్పడము వీరి యలవాటు. సభలూ సమావేశాలంటే ప్రశాంతి కోల్పోయిన చప్పట్ల సంతలని వీరి భావన.

శ్రీ శర్మగారి గోష్టిలో ప్రధానపాత్రలుగా నేనూ, నా సహపాఠి చిరకాల మిత్రుడు శ్రీ యన్.సి.వి. నరసింహాచార్యులు (సంస్కృత సాహిత్య విభాగము పెద్ద, ఓరియంటల్ కాలేజీ, తిరుపతి) ఉండేవారము. ఇతరులు కొందరెప్పుడైనా వస్తే కలుస్తారు. వీరిలో పొరుగుల నుండి వచ్చే ఆగంతుకు లెక్కువ. శ్రీశర్మ గారు లేని మాగోష్ఠిలో మేము, వీరి సంస్కృతాంధ్ర ప్రాకృత, తమిళ, కన్నడ భాషల విజ్ఞానమును, అట్లే పలువురెరుగని వీరి యాంగ్లభాషాభిజ్ఞతను కొనియాడు కొనుట గలదు.

"పరిదానమిచ్చితే పాలింతునేమో" అను త్యాగరాజకృతిలో పరిదాన శబ్దము వినిమయార్థకమని నామిత్రము యన్.సి.వి గారన్నప్పుడు శ్రీ శర్మగారు 'బాగున్నదబ్బా' అని మెచ్చిన ఘట్టము మరువలేము. ఇట్టివెన్నో గలవు. మా మిత్రుడు సంస్కృతాంధ్రాంగ్ల ప్రాకృత తమిళములందు దిట్ట. సాహిత్య మర్మజ్ఞత, కవిహృదయ పరిజ్ఞాన మాతనికి ఉగ్గుపాల విద్య.

**ప్రాస్తావికములు**

దాదాపు పదునెన్మిది సంవత్సరాల చర్చలలో ఎన్నో ప్రాస్తావికములైన శ్లోకాలూ పద్యాలూ వారినోట విన్నాను. కానీ రెండూ మాత్ర ముదాహరిస్తాను.

1. వీరి గురువులు శ్రీ రామాశాస్త్రిగా రెందుకో ఎప్పుడో చెప్పినట్లుగ.

**అరణ్యరుదితత్వధీః స్మృతిపురాణశాస్త్రేషు,త**
**త్ప్రవక్తృషు పశుత్వధీః, పరగతౌ ఖ పుష్పత్వధీః ।**
**అతద్విది నిజే పితర్యపి తృణాదపీషత్వధీ**
**యయైవ ఖలు విద్యయోన్మిషతి హూణవిద్యావతామ్ ॥**

ఈ శ్లోకమును చెప్పిరి.

2. ఒక పర్యాయము నేను, 'వందవాసి' మీదుగ పాండిచ్చేరి పోతినని చెప్పగా, 'వందవాసియా' అని యోచించి యోచించి జ్ఞాపకము చేసుకొని,

**సురాపగోదార జడాన్వితా యాం**
**ద్విజప్రభాహృద్యవనాన్వితాయాం**
**వసంతి కాశ్యామివ వందవాస్యాం**

అని మూడు పాదాలుచెప్పి 'నాల్గవపాదము జ్ఞాపకమురాలేదబ్బా' అనిరి. అంటనే నేను "పునర్నతేషాం నరకాధివాసః" అని పూరించగా, 'బాగుందే అట్లే ఉందేమో' అని అభినందించారు.

**పరిష్కరణములు – పాఠ నిర్ణయము**

శ్రీ శర్మగారి బుద్ధి పాఠపరిష్కరణమునందునూ, కవిహృదయ గ్రహిష్ణు వగు విమర్శనమునందును చాల పదునైనది, ఆ పరిష్కరణ మెట్లాంటిదంటే, ఏపూర్వకవి పాఠమునైనా వీరు సవరిస్తే, నిజానికాకవి బ్రతికివస్తే, తన పూర్వ పాఠము వేరైనా శ్రీ శర్మగారి సవరణపాఠమునకే మొగ్గుతాడు. దీనికొక యుదాహరణము :–

ఒకసారి శ్రీ పరవస్తు రామానుజస్వామిగారు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టరుగా నుండగా, ఏదో సంస్కృత గ్రంథము పరిష్కరించు వారిలో శ్రీ శర్మగారొకరు. అది తప్పుల తడక పుస్తకము. ఆగ్రంథము యొక్క శుద్ధప్రతి తంజావురిలో నున్నదని, దాని పరిశోధనకై పోయివచ్చిన కీ.శే. కోడియాలం శఠగోపాచార్యులు, అంతా శ్రీ శర్మగారు చెప్పిన పాఠములే అక్కడున్నాయని చెప్పిరి. వీరు జాయపసేనాని రచించిన నాట్యశాస్త్రమును సంస్కరించి ప్రకటించినపుడు, మే మీయనుభవమును కడుపార జుఱ్ఱినాము.

ఏ కవిపద్యమైనా అర్థము కాకుంటే, కొంత నిబ్బరముగ పరిశీలించి, అప్పటికి అర్థము వీడకపోతే 'గట్టి ప్రకరణ గ్రంథ పరిజ్ఞానము కలిగి, కొన్ని దశాబ్దములుగ ఈ వాఙ్మయమున పరిశ్రమించే మన కర్థముకాకపోతే ఈ కవి ఎవరి కోసము వ్రాసినట్లయ్యా!' అంటారు. ఈ మాట శర్మగారి విషయమున యథార్థాక్షరము. భాషతో భావముతో సందర్భముతో ప్రకరణముతో సూటిగ కవిహృదయమున వన్నెకట్టే ఒరగల్లు శ్రీ శర్మగారి సహృదయత. వ్యాఖ్యాతలను, నిఘంటుకర్తలను పలువురిని గూర్చి 'నెమరులేని కూర్పు, లోతెరుగని నేర్పు వీరిది' అని అనేవారు. ఆ యా పట్టులందు వీరు చేసే భావ వివరణమూ చూపే ఉపపత్తులూ పరిశీలిస్తే పైమాట యెంత త్రిసత్యమో తెలుస్తుంది. అమరవ్యాఖ్యాతలలో క్షీరస్వామిపై వీరి కపారమైన భక్తి.

1964 లో తి.తి.దేవస్థానపుటధికారులు శ్రీబి. నరసింగరావుగారు శ్రీ శర్మగారిని మరల తాళ్లపాకవారి రచనల పరిష్కరణమునకు ప్రార్థించిరి. వీరు నన్ను పిలిచి 'దేవస్థానమువారు పై పనికై నన్నొత్తిడి చేయుచున్నారు. ఒంటరిగ నేనిపుడాపని చేయలేను. మిమ్ములను సహాయముగ కోరవలెననియున్నది. మీరు దేవస్థానపుటుద్యోగులు గావున, దీనికి ప్రతిఫలముగ మీకేమి యివ్వకయే వెట్టిచాకిరి చేయించుకొందురేమో అని నా భయము. నేనేమో చెప్తాను. వింటారో, వినరో' అని చెప్పిరి. నేను 'స్వామీ! మీతో కలిసి సాహిత్యసేవ చేయుట నాకొక వరముగా భావించుచున్నాను. చెరకు దినుటకు కూలెందుకు? మీ మాటపై దేవస్థానమువా రిచ్చినా చేదుగాదు. ఇవ్వకున్నా బాధలేదు' అంటిని. 1964 ఆగష్టు నుండి దాదాపు ఒక సంవత్సరముపైగా మేము కలిసి ఆ పని చేసి 19, 20వ సంపుటములు ప్రకటించి మరియొక సంపుటము వ్రాతప్రతి చాలభాగము పూర్తి చేసితిమి. ఆ పరిష్కరణమున వారి పెద్దరికము క్రింద నేను గ్రహించుకొన్న వెన్నో కలవు. పాఠ పరిష్కరణములందు పదచర్చలందు ఇతరకవుల సంవాదములందు నాలో నొక క్రొత్త చైతన్య మంకురించినది.

దీనికి తోడుగ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి ఆధిపత్యముకింద 'పాండురంగ మాహాత్మ్యము' ను పరిష్కరించుపని శ్రీ శర్మగారి కబ్బినది. దానిలోగూడ పైవిధముగానే శ్రీ శర్మగారు నన్ను సహాయమడిగిరి. అర్థలబ్దికేమి గానీ నాకు పెద్ద సాహిత్యధన మబ్బినది. నాకు పలువురు పెద్దలతో సన్నిహిత సంబంధము గలదు. కానీ, అందరిలో శ్రీ శర్మగారివలె లోతులు తాకువారు నా దృష్టికి రాలేదు.

పరిష్కరణములందు వారి నిశితదృష్టికి కొన్ని ఉదాహరణములు. పాండురంగమాహాత్మ్యములో 3-24వ వచనములో "వనకేళిఫలాశదోహదంబునగుటకు" అన్ని ముద్రణముల పాఠము. ఈ పాఠ మర్థములేనిది. 'అడవి మొక్కలకు చేసిన దోహదక్రియ' అని వ్యాఖ్యాతలు గూడ వివరించినారు. కాచే, పూచే అడవి మొక్కలకు ఎరువువేస్తే మరింత బాగా కాస్తాయి, పూస్తాయి. ఇక్కడ ప్రకరణము నిగమశర్మ అక్క పుట్టినింటికి వచ్చి, తమ్ముడులేనియింటిని, గుట్టుగా మెలగు నట్టి మరదలిని గమనించి, ఆ మరదలి సౌశీల్యమును, సౌందర్యమును గమనించి వగచి వగచి పోయిందట! ఇక్కడ వాక్యమిది :- "గుట్టీక నలంగియు, అత్త మామల చిత్తంబు వచ్చునట్టు భక్తిశక్తుల మెఱపి, పాటులంబడు మఱందలి సౌందర్యంబు ననివార్య విజృంభణంబగు యౌవనారంభమును, వనచంద్రికా వైభవంబును, నవకేశిపలాశిదోహదంబు నగుటకు వగచి వగచి, తెగచి కడుపు చుమ్మలు చుట్టఁ గన్నీరుట్టిపడం బొట్టుపొరలగుచుండునంతన్"

మరదలి సౌందర్యము అడవిగాచిన వెన్నెలగా, ఆమెయందు దుడుకుగ పెరుగుచున్న యౌవనము అవకేశిఫలాశిదోహదముగా కవి రూపించియున్నాడు. భర్తృసౌఖ్యమున్న కామినికి యౌవనము విజృంభించినను సార్థకమే. భర్త యుండి, అతని సౌఖ్యమునకు నోచుకొనని యువతి యౌవనము పెరుగుట కాయని, పూయని చెట్టుకు ఎరువు వేసినట్లు. "వంధ్యోఫలో వకేశీచ", "పలాశీ ద్రుద్రుమాగమాః" అని ఉభయత్ర అమరము. అది 'నవ' 'వన' గా ముద్రిత మై యుంటుందనీ 'కేశి' 'కేళి' గా ముద్రితమై యుంటుందనీ, ఈ భ్రాంతికి సాధారణ సంస్కారుల వ్రాత తోడ్పడియుంటుందని వారి భావన.

అట్లే 2-133 వ పద్యము

**ఆ మహనీయక్షేత్ర శి**
**ఖామణిపైఁ బిదపఁ బర్వెఁ గామిని నానా**
**భూములను నిగిడి మదగజ**
**భైమి బహులహరి గహనభయదాకృతియై.**

అను పద్యమున మదగజభైమి - మదించిన యేనుగులకు భయము గొల్పునది" - అని ఒక టీకాకర్త. "పర్వెన్" అను క్రియకు కర్తను వెదకుకోవలసి వస్తుంది. "నిగిడి మదంగజభైమి" అను పాఠమే

సరియైనదని వీరి పరిష్కరణము. ఇది శివుడు పార్వతికి పౌండరీక క్షేత్ర విశేషములను సంగ్రహముగా తెలుపుచున్న సన్నివేశము అక్కడి ముఖ్యమైనది భైమి-భీమరథి, ఆ నది శివుని చెమటనుండి పుట్టినది. ఈ విషయము అంతకు కొంచెము వెనుకనే 2-74లో "భీమఘర్మాంబుసంభూతభైమి" అని స్పష్టపరచినాడు. శివుడు వక్త గావున "మదంగజ - నాదేహమునుండి పుట్టినది" అను నర్థము సుగమము. ఇట్టి వెన్నియైన చూపవచ్చును.

ఈ పరిష్కరణములందు జరిగే చర్చలలో యుక్తి యుక్తమైన దానికే స్వీకారము. అది నాదై నా సరే, వారిదైనా సరే. ఈ సౌజన్య సౌమనస్యములు ఇతరులలో దుర్లభములు. శ్రీ శర్మగారి సౌజన్యమున కొక చక్కని తార్కాణ:- శైవుడై 'ఉద్భటారాధ్యచరిత్ర' కర్తగా తెనాలి-రామలింగడనీ, వైష్ణవుడై 'పాండురంగమాహాత్మ్య-ఘటికాచలమాహాత్మ్య' కర్తగా తెనాలి-రామకృష్ణుడనీ శ్రీ శర్మగారి వాదము వానికీ రెండు పేరు లుండవచ్చుననీ, వాడు శైవుడూ వైష్ణవుడూకూడాకాడని, అద్వైతియనీ నావాదము. నేను చూపిన ఉపపత్తులన్నీ యథావత్తుగ పీఠికలో పొందుపరచి, నేను చెప్పిన మాప్రాంతము తెనాలివారి - వంశమును గూడ ఆ పీఠికలోనే జతపరచిరి. ఈ మంచితన మితరపండితులందు మృగ్యము.

శ్రీ శర్మగారితో నాకు గట్టిగా నిలిచిపోయిన అభిప్రాయభేద మింకొకటి కలదు. వ్రాతలో అచ్చులోగూడా పదములను విరిచి (Space) వ్రాయునపుడు తెలుగులోగూడా, సంధిగలచోట విరచరాదని శ్రీ శర్మగారు. అర్థానుకూలముగ ఒకటి రెండక్షరముల సంధులను కలిపివ్రాసినా, పదస్వరూపజ్ఞానమునకు విరచ వలసినదే అని నేను. సంస్కృతములో శ్రీశర్మగారి సంప్రదాయము నాకూ సమ్మతమే. 'నీయిష్టం, నీవు చెప్తే వినవు', అని వారిమాట.

మహాభారతాది గ్రంథములలో ఛందోవ్యాకరణములు, పాఠస్వరూపములనుగూర్చి చర్చ జరిగినపుడు 'నీవు దుర్మార్గుడవబ్బా చెప్పింది చెప్పినట్లొప్పుకోవు' అంటూ, కొన్ని పట్టుల నేను చూపిన ప్రయోగములకు ప్రయోగాంతర - పాఠాంతరములు చూపుతూ, వీలుగాని వానిని సౌజన్యముతో నంగీకరించుచుండిరి. సహజముగ పండితులలో పరస్పరము పరిచయములు పెరిగేకొలది, దానికంటె ఏపుగ ద్వేషము పెరుగుట పరిపాటి. కానీ, మా పరిచయమున రానురాను శ్రీశర్మగారికి నాపై పుత్రవాత్సల్యమూ, నాకు వారిపై పితృభక్తి పెరిగినవి. మేము బండ్లతరబడి చేసిన చర్చల నిచ్చట నిలుపలేను.

## శ్రీ శర్మ గారితో నాలో మార్పు

తొలుత జాబులలో గూడ అరసున్నలు, శకటరేఫలు వదలని వ్రాతపద్ధతి నాది. 'వ్యాసాలలో ఈ బెడదెందుకబ్బా, ఇవి ఇక్కడలేకుంటే మనకవి తెలియవంటారా' అనేవారు శ్రీశర్మగారు. దానితో నాపూర్వపద్ధతి పూర్తిగ మాసిపోక, క్రొత్త పద్ధతి ఒంటబట్టక కాకినడకైనదేమో నావ్రాత అని నాకు సందేహము. ఏదైన విషయములో గట్టిగ వాదిస్తే 'అంత హఠమెందుకబ్బా' అని మందలించేవారు. మరీ యీమధ్య పూర్తిగ వ్యావహారిక భాష మామూలు వ్యవహారాలకూ, వ్యాసాలకూ చాలుననేది శ్రీశర్మగారి సిద్ధాంతము. రాయలసీమ వ్యావహారికభాషంటే వారికి చాల ముచ్చట. మనసీమభాష మాని ఎక్కడ నుండియో దిగినట్లు మరింత యాసగా మాట్లాడే యీసీమవారిని 'ఈవాతలు మన కెందుకయ్యా?' అంటారు.

## శ్రీ శర్మగారిపేర వెలసిన గ్రంథములు (పరిష్కరణములుకాక)

1. వేమన 2. నాటకోపన్యాసములు 3. సారస్వతాలోకము (ఈమూడును విమర్శనాత్మకములైన గద్యరచనలు), 4. శమీపూజ 5. తారాదేవి 6. మీరాబాయి (ఈమూడును పద్యకృతులు). 7. పెనుగొండనుగూర్చినపాట 8. శాలివాహన గాథాసప్తశతీసారము 9. ఆర్యాతిద్విశతి (ఇవి రెండును ఆంధ్రీకరణములు) 10. లీలాదేవి (నవల) 11. మహిశూరరాజ్యాభ్యుదయాదర్శచంపూః (సంస్కృత గ్రంథము)

వీరు అన్నమాచార్య కీర్తనలలో నూటయెనిమిదింటిని స్వరపరచి ఆ రాగముల పుట్టు పూర్వోత్తరముల నంతటిని చర్చించుచు వెలయించిన రెండు సంపుటములు సంగీతలోకమునకు నేటికినీ అధ్యాపకస్థానమున నుండదగినవి. ఆ సంపుటము లిప్పుడలభ్యములు.

వీరి రచనలనుండి మచ్చుకు ఒకటి రెండుదాహరణలు.

1. గాథాసప్తశతిసారమునుండి.

కం॥ నీకొఱకుఁ గొడుక యెప్పుడు
నా కోమలి పాపమింటి యంగణమున పెన్ –

వాకిటనె వాడెడిని విను -
మా కట్టిన తోరణపు మాలికవోలెన్.

తే.గీ॥ తెరువరికి రాత్రిపూట నిద్రించుకొఱకుఁ
గసరి తిట్టుచు నిచ్చిన గడ్డిమోపె
యేద్చుకొనుచు మరలఁదా నీడ్చివైచు -
చున్న దిల్లాలు కంటె ప్రత్యూషవేళ.

వీనిలోని భావమును సహృదయులు గుర్తింపగలరు.

2. పెనుగొండపాటలో ఒక చరణము మాత్రము:

వెరపు లెఱుగని బిరుదునడకల
విజయనగరపు రాచకొడుకులు
పొరలఁ బోయఁగ కరుదుగట్టిన
పచ్చినెత్తురుకండ యీ పెనుగొండకొండా

ఇక, శ్రీ శర్మగారు నానాగ్రంథములకు వ్రాసిన అవతారికలు, పీఠికలు మొదలగునవి. గ్రంథములు బండ్లకెత్తునట్లు వ్రాయలేదుకాని, వ్రాసిన ప్రతి పద్యము, ప్రతిగద్యము సహృదయులందరు చాలసార్లు నెమరువేయదగినవి.

తెలుగుదనము తొణికిసలాడురచన, పదిమాటల బరువుగా ఒక మాట - వీరి కృతులలో క్రొత్తగా కనబడునవి.

**ధీరత - కృతజ్ఞత**

మెర మెచ్చులకు పొగడేదిగానీ, స్తోత్రాలకు పరవశించేదిగానీ, సమయానుకూలముగ తాళమువేసేదిగానీ శ్రీశర్మగారికి తెలియని విద్య. తెలిసిన విషయమున తెగి మాట్లాడుట వారి స్వభావము. అట్లాని ఉద్రేకించి ఒడలు విరుచుకొని మిట్టపల్లములు లేక మాట్లాడుట వారికి చాల దూరమైన విషయము. అసత్యము లను ఖండించవలసివచ్చినా, వ్యంగ మర్యాదలతో సహస్రధారములైన మెత్తని మాటలాడుట వారికి వెన్నతోపెట్టిన విద్య. గురువులకైనను సత్యదూరములైన విషయములలో

ఎదిరించుటకు వెనుకాడని 'మెత్తని పులి' శ్రీ శర్మగారు. దీనికి గురిగా, శ్రీశర్మగారికి గురుస్థానీయులైన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారితో, రంగనాథరామాయణ కర్తృత్వ విషయమున తలపడిన వీరి వ్యాసమే సాక్షి. ఆ సందర్భమున నెందరోపండితులు తమకే సమ్మతముగాని వ్రాతలు వ్రాసి, వాటితో పొందిన ప్రతిఫలాలు సుప్రసిద్ధములే. అట్లని శ్రీ రెడ్డిగారిపై వీరికి కృతజ్ఞతా భరము తక్కువకాదు. శ్రీరెడ్డిగారి నిర్యాణానంతరము, వీరి 'గాథాసప్త శతిని శ్రీ రెడ్డిగారికి అంకితమిస్తూ వ్రాసిన,

సరసమిత్రుఁడనఁగ, గురుఁడనఁ జేపట్టి
పైకి నెత్తినట్టి ప్రభువనంగ,
ముత్తెఱఁగుల మనసు ముడిగొన్నవారు, నా
జీవితమున లేరు నీవు దక్క

ధర్మ తత్త్వ దృక్పథంబుల భిన్నవా
దంబు కొంత మనది, దానికేమి,
నీదు సౌహృదంబె నిన్నును నన్నును,
దాని యెల్లలెల్ల దాఁటఁజేసె.

ఈ రెండు పద్యములు సాక్షి.

ఇట్టిదే మరియొకటి :-

"ధనుంజయప్రవరు కరమ్మునన్" అను భారతపద్యవ్యాఖ్యానమున వీరూ దీపాలవారూ బాగా ఒరచుకొన్నవారే. ఆవిషయము 'భారతి'కి తెలుసు. ఆ వాదము జరిగిన కొన్నాళ్ళకే శ్రీ శర్మగారికి నెల్లూరులో సన్మానము, ఆ సభలో నేనూ ఒక పాత్ర. మేము సరాసరి శ్రీదీపాలవారింటికే పోతిమి. మా యిద్దరి రాకకు బ్రహ్మానందపడిన శ్రీ దీపాలవారు, మీ రాకతో మాకు "రజతగిరిమీద హరిహరా రాధనంబు" అని చమత్కరించిరి. ఏదో విషయమున అభిప్రాయభేదమున్నను వ్యక్తిగత గౌరవాలకు వెలితిలేని దశ నేను వారిద్దరియందు సమముగ గుర్తించితిని.

శ్రీశర్మగారి విషయమున భేదాభిప్రాయముగల పలువురితో నేను వాదించిన సన్నివేశములు గలవు. ఆవాదములలో నాకే యెప్పుడూ విజయము, నా వాదముతో మనసుమారిన పెద్దలలో కీ.శే.

విశ్వనాథ వారొకరు. శ్రీ విశ్వనాథవారన్నమాట ఇది :– 'నీవే వారినింత భక్తితో చూస్తే వారునిజముగ లోకారాధ్యులే!' అని. ఇందులో నా గడుసుదనము గర్భితమైనా నేను పట్టించుకోలేదు.

**మత సామరస్యము**

నే నద్వైతిని, శ్రీశర్మగారు విశిష్టాద్వైతులు. మామధ్య యెన్నో పర్యాయములు మతచర్చలు సాగినవి. పరమతద్వేషము లేని స్వమతాభినివేశ మిద్దరికీ గట్టిదే. ఏ మతమును గురించి చర్చించినా తత్త్వదృష్టితోనే గాని దూషణ దృష్టితోగాదు. 'అద్వైతులు పంచాయతన పూజతో మతసామరస్యము గొప్పగా సాధించినా'రని వారు నాతో ఎన్నో పర్యాయము లన్నారు. ఇంతకంటె మరియొక గొప్పవిశేష మేమంటే వీరి గురువులు పరకాల మఠాధీశ్వరులగు శ్రీకృష్ణబ్రహ్మ తంత్రయతీశ్వరులే వీరితో 'నీకు మతమిష్టమైనా కాకపోయినా చక్కని సంస్కృత భాష కావాలంటే శాంకరభాష్యము (బ్రహ్మసూత్ర భాష్యము) చదువు' మని నారని శ్రీశర్మగారే నాతో చెప్పినారు. దీనితో వీరి గురువుగారికీ వీరికి గల సౌజన్య సౌమనస్యములు బట్టబయలే కదా?.

ఇంతకంటె గొప్పవిషయ మింకొకటి. సాధారణముగ వైష్ణవులు స్మార్తులను చూస్తే యెగిరిపడే అలవాటు కలదు. కానీ శ్రీశర్మగారిలో ఈ గుణము మందుకైనా లేదు. ఇంకా విశేషమేమంటే, 1972 మే మాసములో వీరి కనిష్ఠ పుత్రికా వివాహము బెంగుళూరులో జరిగితే, దానికి నేనూ పోయినాను. అంత బంధు సమ్మర్దములో గూడ, ఆ వివాహ భోజన పంక్తిలో శ్రీశర్మగారి ప్రక్కననే నేను భోజనము చేయవలెను. సమయానికి నేను కానరాకపోతే, 'ఎక్కడప్పా రామసుబ్బయ్య, రాప్పా' అని చేతితో తమ ప్రక్కస్థానమును తట్టిచూపి పిలిచేవారు. ఎప్పుడైనా చాల వంగి దండము పెట్టితే, తాము సెలవిచ్చినట్లు–ఇత్యాదిగ మాట్లాడితే, 'మనకెందుకయ్యా ఆ అతివినయము. అవంతా తిరుపతి వైష్ణవుల సొమ్మప్పా' అని పలికేవారు. వైదిక లౌకికములైన ఆచార వ్యవహారము లేవైనను ఒక మితికి లోబడిన వానినే వీరు సమ్మతింతురు.

**కుటుంబ మర్యాద**

వీరి కుటుంబములో నేనొకడని ముందే మనవి చేసితిని. వీరుద్యోగ విరమణము చేసిన తర్వాతనే నాకు వీరితో పరిచయము. సంతానమందరూ వారివారి శక్తికొద్ది సంగీత సాహిత్యములను

చంకకెత్తుకొన్నవారే. అందరూ మాతాపితృ భక్తి పరాయణులు, మర్యాదదాటని మాటవారు, ఆస్తికులూను అల్లుండ్లూ కోడండ్లూ పౌత్రదౌహిత్రులూకూడ నంతే. లక్ష్మీ సమానురాలగు అమ్మగారు వీరి ధర్మపత్ని బయటి జగమెరుగని యేకాంత పరిశ్రమజీవి. ఆమెకు నిద్రాసమయమే విశ్రాంతి కాలము. వీరి కీర్తికి ఆయమ పరిచర్యమే మూల స్తంభము. పాతపల్లె సంప్రదాయములను బాగుగ తెలిసిన మనిషి. మంచి పండు టెంకాయలుంటే చాలు, "వందనలయదు వేవురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి" అనుమాట ఈమె పట్టున అక్షరసత్యము. ఈమెవలన గృహిణులు నేర్వవలసిన వెన్నో కలవు. ఆ యమ్మగారి పేరు రుక్మిణమ్మ.

**తుది ఘట్టము**

వీరి తుదిదినములలో ఇప్పటి టి.టి.డి. ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారగు శ్రీపి.వి.ఆర్.కె. ప్రసాద్ ఐ.ఎ.యస్.గారు వీరిని ఆస్థానవిద్వాంసులుగా గుర్తించి, ఆమర్యాదను జరుపుటకు రాకపోకల కశక్తులగు శర్మగారివద్దకు బెంగుళూరికే పోయి, వారి యింటిలోనే, వారికి శ్రీవారి ప్రసాదములు, బంగారు పతకములు వగైరాల నిచ్చి వారిని సత్కరించి వీరి విడిదికి వీరు వచ్చిరి. ఈ సత్కారము "అభిగమ్యకృతే దానం"[1] అన్నట్లు కృతయుగ మర్యాదగా సాగినది. స్వామివారి ప్రసాదమునకే కాచుకొనియుండినారేమో ఆ ప్రసాదమందుకొన్న కొన్ని గడియలకే శర్మగారు భౌతికకాయమును వదలి వైకుంఠ సాన్నిధ్యమును చేరిరి.

శ్లో॥ నమో స్త్వనంత కృష్ణాయ మమ పుణ్యఫలాత్మనే ।
వాణీ స్తనద్వయాస్వాదద్వైరాజ్యారూఢకీర్తయే ॥

తిరుపతి

10-11-80

1. అభిగమ్య కృతేదానం త్రేతాయా స్వాహూయదీయతే
ద్వాపరే యాచమానాయ సేవయా దీయతేకలౌ ॥ – పరాశరస్మృతి

# కవితా మహేంద్రజాలం

– డా॥ ప్రసాదరాయ కులపతి
(పూర్వాశ్రమ నామము)
ప్రస్తుత శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతి
కుర్తాళం (తమిళనాడు)

తిరుపతి వాస్తవ్యులు, సుప్రసిద్ధ పండితులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు వివిధ శాస్త్ర కోవిదులు. చిన్నతనంలో సరదాగా ఒకటి రెండవధానాలు చేసినా, దాని మీద పెద్ద ఆసక్తి కలగలేదు. తరువాత నలభయ్యేళ్ళ ప్రాయంలో ఒకసారి ప్రొద్దుటూరులో సి.వి.సుబ్బన్న శతావధాని బలవంతం మీద అష్టావధానం చేశారు. అప్పుడు చెప్పిన పద్యాలు చూడండి!

**ఉ ॥ ఏ నవధానిగా నలువ దేడులు నిండిన యిప్డు సభ్యస**
**న్మానము లందుకొన్న అవధాన కళా చతురుండు భారతీ**
**ధ్యాన వికస్వరుండు గడియారము వారి అనుంగు శిష్యుడున్**
**సూనృతవాది యా కడప సుబ్బన కూర్చు సఖుండు నాకు అ**
**న్యూన పదాంబు రాశి నను నూరక నీ వవధాని వంచు నే**
**పూనిక నుగ్గడించెనొ సుబోధము కా దవిమృష్ట వృత్తి కా**
**లూనితి నీ పురంబున బుధోత్తములార! భవ ద్రసజ్ఞతా**
**ధీనత తోడు గాగ పరమేశ్వరు డోముత నీ వధానమున్.**

**ఉ ॥ చేసితి నే వధానమని చిన్నరికంబున నొండు రెండు వి**
**ద్యాసముపాత్తదర్ప సము దగ్ర సతీర్థుల గోష్ఠీ నాకు వి**
**శ్వాసము లేదు వానిపయి పాండితిపై గల దాశ ఏ తదా**
**భ్యాసమునన్ సుమా రిరువదైదు సమంబుల దీ యుదంతమున్.**

ఆలస్యంగా మొదలు పెట్టినా ఎంతో సమర్థతతో పాండితీ ప్రకర్షతో, ధారణా శక్తితో శర్మ గారి అవధానాలు సహృదయరంజకంగా ఉండేవి. ప్రొద్దుటూరు తర్వాత తిరుపతి, నెల్లూరు, ఒంటిమిట్ట,

చిత్తూరు, వరంగల్లు మొదలైన ఎన్నో చోట్ల అష్టావధానాలు చేసి వారు ప్రశస్తి గాంచారు. వరంగల్ అవధానంలో పూరించిన ఒక సమస్య చూడండి.

సమస్య – **భీష్మునితో గూడి రంభ భీముని గనియెన్.**

పూరణలో గ్రీష్మ వేళ ఒకడు పగటికల కంటూ ఈ దృశ్యాన్ని చూశాడని చమత్కారంగా చెప్పాడు.

**కం ॥ గ్రీష్మంబున భారత మ**
**త్యూష్మం బెగదొట్ట చదివి ఉ త్స్వప్నించెన్**
**భీష్మని గూరిచి యొక డిటు**
**"భీష్మునితో గూడి రంభ భీముని గనియెన్!"**

చిత్తూరు జిల్లా సంతవేలూరు అవధానంలో ఇచ్చిన సమస్య గమనించండి.

**"కలలో గర్భము నిల్చె కోమలికి లోకంబింక నిందింపదే!"**

దీని పూరణ చూడండి.

**మ ॥ అలఘుస్వాంతుడు కామ శాస్త్ర ధిషణాఖ్యాతుండు ప్రాయంబునన్**
**లలి తాంగీమణి నూత్న యౌవన సముల్లాస స్ఫుర ద్రూపతన్**
**వలపుల్ మానస మందు నిండగను నిర్వక్రంబు లౌ రాకపో**
**కలలో గర్భము నిల్చె కోమలికి లోకం బింక నిందింపదే!**

కలలో కాదు. ప్రియుని రాకపోకలలో గర్భమైంది. బహుశా పెళ్లి కాలేదు. కనుక లోక నింద కాస్పదమైంది. శబ్దాల కూర్పులో, మలుపులో, అందమైన పూరణ వచ్చింది.

చిత్తూరు అవధానంలో ఇచ్చిన సమస్య పరికించండి –

**"కన్నెకు మీసముల్ మొలిచె కాంతుని కన్గొను సంభ్రమంబునన్"**

పూరణ –

ఉ ॥ ఎన్నడు వచ్చునో విభు డదేమని న న్గని పల్కరించునో
అన్న కుతూహలంబున మనోజ్ఞము విచ్చగ కజ్జలంబు గై
కొన్నది కన్నులందిడ నగో! విభు దన్నను చేయి జారగా
కన్నెకు మీసముల్ మొలిచె కాంతుని కన్గొను సంభ్రమంబునన్! ”

భర్తకై ఎదురు చూసే విరహోతుర –అతడు వస్తున్నాడన్న తొందరలో అలంకరించుకొంటుంది. కాటుక తీసుకొని కండ్లకు పూసుకుంటున్నది, ఇంతలో పక్కన ఉన్న చెలి ‘అదుగో! విభుడు వస్తున్నా’ డన్నది. ఆ తొందరలో చేయి జారి కాటుక మూతి మీద పడింది. అది మీసాలు మొలిచిన భ్రాంతిని కలిగిస్తుంది.

నెల్లూరు అవధానంలో పార్వతీ పరమేశ్వర సమాగమాన్ని సీసంలో వర్ణించమంటే వచ్చిన పద్యం ఎంత పొంకంగా, బింకంగా ఉందో పరిశీలించండి –


సీ ॥ బంధూక కుసుమ ప్రభాహారి కౌశేయ
వీచికా బంధంబు వెలుగు లుమియ
శింజాన మంజీర మంజుల ధ్వని పాద
విన్యాస తాళంబు విధము దోవ
శివు జూడ నడ సాగు చిన్నారి చూపులే
దారి జూపెడి ప్రతీహారి గాగ
గిరిరాజ సుత వచ్చె తరలి పొందను లీల
మొలనూలిడెల్ బరాబరులు సేయ.

తే ॥ మేని కలపంబు వాసన మిడిసి పడగ
సుమకరందము వల చేత సొగసు కూర్ప
మరుని యూపిరి త న్గని మసలుకొనగ
అభవు కొలువంగవచ్చు మా యమ్మ దలతు.

ఆలోచించి రచించే ఇటువంటి ప్రబంధ శైలీ మనోహరమైన పద్యాలను అవధానంలో చెప్పగల దక్షులు గౌరిపెద్ది వారు.

జనమంచి వేంకట సుబ్రహ్మణ్యశర్మ గారు, గడియారం వేంకట శేష శాస్త్రి గారు, పుట్టపర్తి నారాయణాచార్యుల వారు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు, పింగళి లక్ష్మీకాంతం గారు మొదలైన విద్వాంసు లెందరో రామసుబ్బశర్మగారి అవధాన దక్షతను, పాండితీ ప్రాభవాన్ని ప్రశంసించారు. ఇటువంటి విబుధేంద్రుల వలననే అవధానానికి గౌరవం నిలబడిందంటే అతిశయోక్తి కాదు.

ముద్రిత వ్యాసం
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
26-12-1990



*ఒకానొక విద్వత్సభలో శ్రీ గౌరిపెద్ది వారు*

# అష్టావధాని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

– రాపాక ఏకాంబరాచార్యులు

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనల పరిశోధనలను తలంచగానే శ్రీయుతులు వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారల సరసన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు ప్రత్యక్ష మవుతారు. వారు సంస్కృతాంధ్రాలలో తలస్పర్శిగా పాండిత్యం కలిగి ఉండి చాలాకాలం తిరుపతి శ్రీవేంకటేశ్వర సంస్కృత కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు.

శర్మగారు 1922 సెప్టెంబరు 10వ తేదీన (దుర్మతి నామ సంవత్సర భాద్రపద శుద్ధ చతుర్దశినాడు) చిత్తూరు జిల్లా వాయలపాడు తాలూకా గర్నిమిట్ట గ్రామంలో జన్మించారు. 12 సంవత్సరాలు వచ్చే వరకు తండ్రి గారి మేనమామ శ్రీ మర్మాల చెంగయ్య గారి వద్ద విద్యనభ్యసించారు. తరువాత వారు తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించి "సాహిత్య శిరోమణి" పట్టాను పొందారు. ఆ కాలంలో వారు శ్రీమాన్ చేట్లూరు రామవాచార్యులు, వెంకట వరదాచార్యులు, సుదర్శనాచార్యుల వారివద్ద కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. శ్రీ మండలీక వెంకటశాస్త్రి గారు తిరుపతిలో ఉండగా వారి వద్ద వేదాంతం, ప్రస్థానత్రయం పూర్తిచేశారు.

విద్యాభ్యాసానంతరం వారు 1948 నుంచి 51 వరకు కడపలోని రామకృష్ణ హైస్కూలులో సంస్కృతాంధ్రోపాధ్యాయులుగా పనిచేశారు. తరువాత వారు 1951 నుంచి 1974 వరకు తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో గీర్వాణాంధ్ర భాషలలో ఉపన్యాసకులుగా విలసిల్లారు. ఈ కాలంలో వారు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారితో కలిసి అన్నమాచార్య సంకీర్తనలపై పరిశోధన, ప్రచురణ గావించారు. ఈ సమయంలోనే వారు రాళ్ళపల్లి వారితో కలిసి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన పాండురంగ మాహాత్మ్యమును పరిష్కరించారు. వారీకాలంలోనే ఆయుర్వేదము మంత్రశాస్త్రము, జ్యోతిషము, ధర్మశాస్త్రములను లోతుగా అధ్యయనం చేశారు. 1974 సెప్టెంబరు నెలనుంచి శర్మగారు ప్రత్యేకంగా తాళ్ళపాక అన్నమాచార్యుల వారి కీర్తనల పరిష్కారానికి నియుక్తులయ్యారు. చాలాకాలం అక్కడ ఉండి అనేక కీర్తనలు పరిష్కరించి ప్రకటించారు.

శర్మగారు ప్రప్రథమంగా 40 సంవత్సరాల వయస్సులో 1962లో సి.వి.సుబ్బన్న శతావధాని గారి సోదరుల వివాహంలో ప్రొద్దుటూరులో అష్టావధానం చేశారు. వారు సుమారు 60 అవధానాల వరకు నిర్వహించారు. వారు ప్రొద్దుటూరు కడప, తణుకు, భద్రాచలము, చిత్తూరు, నెల్లూరు, వరంగల్, బెంగుళూరు, ఒంటిమిట్ట, కోడూరు, మదనపల్లి, పీలేరు, కర్నూలు, సంతవేలూరు, అనంతపురము, కదిరి, ధర్మవరము, మడకసిర, కళ్యాణదుర్గము, తూంగుంద్రం, అరగొండ, తిరుపతి, పుంగనూరు, చంద్రగిరి, తణుకు, పుత్తూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి మంగళం పేట మొదలైన స్థలాలలో "నహిప్రతి" యనే విధంగా విజయవంతంగా అష్టావధానాలు గావించారు.

గౌరిపెద్ది వారి అష్టావధానాలలో (1) వర్ణన, (2) సమస్య, (3) దత్తపది, (4) నిషిద్ధాక్షరి (5)న్యస్తాక్షరి (6) వ్యస్తాక్షరి (7) ఘంటాగణనము/పుష్పగణనము. (8) వారకథనము, (9) అప్రస్తుత ప్రసంగము, (10) ఆశువు, (11) పురాణ పఠనము అను అంశాలను స్వీకరించి అవధానాలు నిర్వహించారు.

పుత్తూరు అష్టావధానంలో ఒక పృచ్ఛకుడు "సహగమనము చేసి యతని సతి జీవించెన్" అను సమస్యనిచ్చి శర్మగారిని పూరింపుమన్నాడు. పతితో సహగమనము చేసిన స్త్రీ జీవించడమేమిటి? చనిపోతుంది కాని .. పూరణ చూడండి.

**కం॥ "ఇహమున్ బరమున్ దెలియక**
**అహమున్ కైకేయి రాము నడవికి పంపెన్**
**సహియించి పనికి పతితో**
**సహగమనము చేసి యతని సతిజీవించెన్"**

(ఇహ లోకము, పరలోకము తెలియక గర్వముతో కైకేయి శ్రీరాముని అరణ్యానికి పంపింది. దీనిని సహించి సీతాదేవి భర్త రామునితో సహగమనము (కూడా వెళ్ళుట) చేసి రాముని భార్య సీత జీవించి ఉన్నది. ఇక్కడ సహగమనము సతీ సహగమనము కాదు. కూడా వెళ్ళుట అను అర్థములో సరసముగా పూరించారు.

సంతవేలూరు అష్టావధానములో వారికి "కలలో గర్భమునిల్పె కోమలిని లోకంబింక నిందింపదే" అను సమస్యను శర్మగారిని పూరింపుమన్నారు. కలలో గర్భము దాల్చడమేమిటి? అది రాకపోకలలో – ఇప్పుడు పూరణ తిలకించండి.

**మ॥ అలఘు స్వాంతుడు కామశాస్త్ర ధిషణ ఖ్యాతుండు ప్రాయంబునన్
లలితాంగీమణి నూత్నయౌవన సముల్లాస స్ఫురద్రూప తాన్
వలపుల్ మానసమందు నాడగను నిర్వక్రంబులౌ రాకపో
కలలో గర్భము నిల్చె కోమలిని లోకంబింక నిందింపదే"**

(గొప్ప మనస్సు కలవాడు (కామశాస్త్ర విశారదుడు), యౌవనములో నున్నవానికీ నూత్న యౌవనముతో ప్రకాశించే కోమల రూపము కలిగిన స్త్రీపై మనస్సులో కోరిక కలిగి ఆమె దగ్గరకు అడ్డులేని రాకపోకలు జరుపుటవలన ఆమె గర్భము ధరించినది. కోమలిని ఇక లోకము నిందించదా? నిందించును.)

కడప అష్టావధానములో "ఉమా ముఖం చుంబతి వాసుదేవః" అను సమస్యనిచ్చి శర్మగారిని పూరింపుమన్నారు. విష్ణుమూర్తి పార్వతి ముఖమును ముద్దు పెట్టుకోవడమేమిటి? చిత్రమైన సమస్య శర్మ గారి పూరణ చూడండి.

**శ్లో॥ "రమాసతీ పర్వత కన్యయోః పురా పరస్పరం వాక్కలహం ప్రవృత్తే ।
రమాం ఋషోద్వేగముదీక్ష మాణా! ముమాముఖం చుంబతి వాసుదేవః ॥**

"అలిగిన రుక్మిణిని శ్రీకృష్ణుడు చుంబించెననుట విషయము.

లక్ష్మీదేవి (రుక్మిణి) పార్వతి పరస్పరము కలహించుకొనిరట. ఆ కలహ కారణముగా రుక్మిణీదేవి కోపావేశముతో తీక్షణముగా పార్వతీదేవి ముఖమును చూచు చుండినట. పార్వతి వైపు చూచుచుండిన రుక్మిణిని శ్రీకృష్ణుడు ముద్దాడెనట.

వాసుదేవుడు కృష్ణుడు. ఉమ పరమశివుని పత్ని. కృష్ణుడు పార్వతిని చుంబించుట అసంగతము కనుక కవి ఒక సన్నివేశమును కల్పించి అలిగిన అతివను ముద్దాడెనని విరోధాభాసము చేసెను.

శర్మగారు కర్నూలులో (20.9.1974) చేసిన అవధానంలో ఒక పృచ్ఛకుడు "మంచాలన్ బిగియించె గూటముల కమ్మా బిందియన్ దేగదే" అను సమస్య నిచ్చి పూరింపుమన్నారు. మంచాలకు గూటాలను బిగించడమేమిటి? అర్థం లేకుండా ఉన్న సమస్యను శర్మగారేవిధంగా అర్థవంతంగా పూరించారో చూడండి.

**శా॥ "సంచారంబులుమాని ధేనువులు నిశ్శంకంబుగా దొడ్లలో**
**చంచద్వత్సతరావళీ కలిత దుస్సంబాధలై తోచు నా**
**పంచన్ పెత్తనమేల దూడలవిగో పారెన్ వడిన్ పిండని**
**మ్మంచాలన్ బిగియించె గూటముల కమ్మా బిందియన్ దేగదే!"**

(కూతురుతో తల్లి అంటున్నది – సంచారములు మాని ఆవులు సంకోచము లేకుండా దొడ్లలో కదిలే లేగదూడలు ఇరుకుగా నున్న స్థలంలో బాధ పడుతున్నాయి. నీకు ఆ పంచలో పెత్తనమెందుకు? అవిగో దూడలు పరిగెడుతున్నాయి. పాలుపిండుటకు ఆవులను గూటములకు బిగించాను. ఓ అమ్మా! బిందెని పట్టుకొనిరమ్ము). ఇక్కడ మంచాలన్ అల్లా పిండనిమ్ము + అంచు + ఆలన్ – అయి చక్కగా అర్థం వచ్చేటట్లు పూరణ సాగింది.

వర్ణనలో కన్య – వర్షాకన్య వచ్చేటట్టు శ్లేషతో శ్లోకం చెప్పుదని కోరగా శర్మగారు చెప్పిన శ్లోకం వంశస్థవృత్తం (కర్నూలు అష్టావధానం)

**శ్లో॥ తటిల్లతా చారు పయోదరోజ్వలా నవాంబు ధారా రశనోజ్జ్వల త్కటీ ।**
**సుబర్హిణోపాత్త మనోహర స్వరా నికామయా నృత్యతి వర్షకన్యా ॥**

(స్త్రీ పరంగా – మెఱుపు వంటి శరీరం అందమైన వక్షోజాలతో ప్రకాశిస్తూ నూతన మేఘంవలె సౌందర్యవతియై మొలత్రాటి కాంతిచే మిక్కిలి శోభాయమానముగా నుండి నెమిలి కంఠ ధ్వనివలె మనోహర ధ్వని కలదై యథేచ్ఛగా వర్ష సమయంలో ఒక కన్య నృత్యం చేస్తున్నది.)

(వర్షాకన్య పరంగా – మెఱుపు తీగలు అందమైన మేఘాలచే ప్రకాశిస్తూ నూతనమైన జలధారలు కలిగి కటిభాగము రశనా (మొలత్రాడు) కాంతి వలె ప్రకాశమానమై మంచి నెమిళ్ళ మనోహర రావములచే సంతోషిస్తూ యథేచ్ఛగా వర్షాకన్య నృత్యం చేస్తున్నది). విద్వత్కవిగా పరిశోధకులుగా, విమర్శకులుగా, అవధానిగా, ఉపన్యాసకులుగా ఖ్యాతి నార్జించిన గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు తిరుపతిలో ది. 21.1.1991వ తేదీన పరమపదించినా, సాహితీ రససింధువులైన పాఠకుల హృదయాలలో నేటికీ చైతన్య జ్యోతిని వెలిగిస్తూనే ఉన్నారు.

ముద్రితవ్యాసం (ఆంధ్రజ్యోతి 16 మే, 2004)

# నడిచే నిఘంటువు గౌరిపెద్ది

**కీ॥శే॥ కామిశెట్టి శ్రీనివాసులు**
మాజీ డైరెక్టర్,
యస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు, తిరుపతి

అన్నమయ్య కీర్తనల పరిష్కర్త, సంస్కృతాంధ్ర పండితుడు, కవి, విమర్శకుడు గౌరిపెద్ది రామసుబ్బశర్మ చిత్తూరు జిల్లాలోని గర్నిమిట్టకు చెందిన వారు. రాగిరేకుల మీద ఉన్న అన్నమయ్య కీర్తనలను సంపుటాలుగా రావడానికి పరిష్కరించారు. "నడిచే నిఘంటువ"ని రాళ్లపల్లి వారితో పిలిపించుకున్న గౌరిపెద్ది వారి గురించిన జ్ఞాపకాలను ఆయన ప్రియ శిష్యుడు కామిశెట్టి శ్రీనివాసులు 'సాహితీ నేత్రం'తో పంచుకున్నారు.

తిరుపతి 113 పొర్లవీధి సందుకానుకొని ఉన్న ఇల్లు. బాగా పాత పద్దది. పంచటరుగు మీద ఒక నిండైన విగ్రహం. ఆ గురుమూర్తి చెంత ఒదిగొదిగి కూర్చున్న విద్యార్థులు. జలదస్వన గంభీర కంఠంతో పద్యాలు చదువుతున్నారు. 1961లో తొలిసారిగ గౌరిపెద్దివారిని దర్శించుకున్నాం నేనూ నా మిత్రుడు శేషాద్రి. ఆ బ్రహ్మమయమూర్తి పరిచయ భాగ్యం కలిగించిన వారు మిత్రులు మద్దిరేల హరనాథ్‌బాబు. ఎం.ఏ. తెలుగు చదవడానికి వచ్చినామంటూనే కన్నడ 'యెమ్మేలు కాదుగదా అన్నారు. (కన్నడంలో ఎనుములని అర్థం). అట్లా మొదలైన పరిచయం ప్రణయలతలను తొడిగింది. పుత్ర వాత్సల్యంతో నన్ను 'శీనూ' అని పిలిచేటంతగ.

గౌరిపెద్దిగారి కుటుంబంలో సభ్యులమయ్యాం నేనూ శేషాద్రి. అమ్మ శివకామమ్మ సాక్షాత్తు అన్నపూర్ణ. 'వందనలయదు వేవురు వచ్చి దేని...' అతిథి అభ్యాగతులతో కళకళలాడే ఆ ఇంట్లో అగ్నిహోత్రునికి యెప్పుడూ విశ్రాంతి ఉండదు. తల్లిదండ్రుల సంస్కారాన్ని సంప్రదాయాన్ని వారసత్వంగ పొందిన సంతానం చిరంజీవులు కార్తికేయుడు. భగవాన్, అబ్బయ్య, భారతి, చంద్రమణి ప్రణయగౌరవాలతో నిండిన మంచి కుటుంబమది. ఒక విద్యార్థిగ అధ్యాపకునిగ, అన్నమయ్య సారస్వత

ప్రచారకునిగ యెదగడానికి దోహదం చేసిన దేశికులు గౌరిపెద్దివారు. నా వంటి వారికెందరికో ఆశ్రయాన్నిచ్చి సారస్వత భిక్షను పెట్టిన అమృతహృదయులు. అది సంస్కృతమా, ప్రాకృతమా, తెలుగా మంత్ర తంత్ర శాస్త్రాలా, జ్యోతిష్యమా, ఆయుర్వేదమా, ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి గృహం కవులకు పండితులకు, శాస్త్రవేత్తలకు నిలయం. ఒకవైపు సాహిత్యం మరొకవైపు వారి సాన్నిహితత్వం కోరి వచ్చే జనం. పండితగోష్ఠి లో వారి మాటతీరు వేరు. గర్నిమిట్ట, నెరబైలు గ్రామాల నుండి వచ్చిన జనపదులతో వారు వ్యవహరించే విధానమే వేరు. గ్రాంధిక వ్యవహారికాల వింతశైలి ముగ్ధమనోహరంగా ఉండేది. చిన్నా పెద్దా యెవరినైనా 'యేమయ్యా' అని సంబోధించేవారు. కడప అన్నా కడప భాషన్నా కడప మనుష్యులన్నా వారికి చాలా ఇష్టం. కడప రామకృష్ణా హైస్కూల్లో వీరు అధ్యాపకులుగా కొంత కాలం పనిచేసినారు. పుట్టపర్తి వారితో వారికి సన్నిహిత సంబంధం. గడియారం వారంటే యెనలేని గౌరవం. వాళ్లిద్దరిని గురించి, మనసీమకు రెండు కళ్లయ్యా' అనేవారు. నారాయణాచార్యులు, శేషశాస్త్రి ఇద్దరు గౌరిపెద్ది వారింట వారాల తరబడి తిష్ఠ వేసేవారు. ఇద్దరూ కలిసికాదు. కొన్ని గంటల తరబడి ఆ మహానుభావులతో గౌరిపెద్దివారు గోష్ఠి చేసేవారు. భాసుడు, కాళిదాసు, భారవి, మాఘుదు భోజుదు, నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, నాచన సోమన, ఎర్రన్న ప్రధానంగా సాగే చర్చల్లో అప్పుడప్పుడూ ప్రబంధకవులు తొంగిచూసేవారు. అన్నమయ్య ప్రమేయం ఉండేదికాదు. పుట్టపర్తివారు త్యాగయ్యను ప్రస్తావించేవారు.

గౌరిపెద్దివారికి సన్నిహిత మిత్రులు ఈయుణ్ణి గోపాలకృష్ణ మాచార్యులు (గొప్ప వ్యాకరణ పండితులు). ఎన్‌సివి.నరసింహాచార్యులు (సంస్కృత ప్రాకృత భాషలలో గొప్ప దిట్ట). సింగరాజు సచ్చిదానందం (స్నేహశీలి). వీళ్లంతా కలిసినప్పుడు సంభాషణ సరసోక్తులతో చతురచతురంగ సాగేది. వాళ్ల గురువుల గురించి సాధ్యాయుల గురించి బాల్యస్మృతులను నెమరువేసుకొనే వారు. అమ్మ శివకామమ్మ అందించే చిరుతిండ్లను తింటూ పరిహాసాలతో కొట్టుకుంటూ, తిట్టుకుంటూ గడిపే వాళ్లు. అది సందడే సందడి.

ఆముక్తమాల్యద కావ్యాన్ని, రఘువంశం, భారతంలో భీష్మ పర్వం గురువుగారి వద్ద చదువుకొనే భాగ్యంకలిగింది. రాళ్లపల్లివారు గౌరిపెద్ది వారు సాగించే చర్చలు కొన్ని వందల మార్లైనా మేము విన్నాం. పరస్పర ప్రణయగౌరవాలతో వారు నెరపిన గోష్ఠులు మా హృదయాలలో పదిలమైనవి. ఆ సంస్కారమే మా అధ్యాపక జీవనానికి వర్చస్సును ప్రామాణికత్వాన్ని కలిగించినది. గౌరిపెద్దివారిని **'నడిచే నిఘంటువని'** రాళ్లపల్లి వారు పేర్కొనేవారు. భగవంతుడు రెండుచెవులిచ్చి నోరు ఒక్కటే

పెట్టిందిందుకేమరి. వినడం అనేది అభ్యాసమైనప్పుడు మనం వేసే ప్రతి అడుగు ఆదర్శవంతమౌతుంది.

తాళ్లపాకవారి సేవలో అగ్ర తాంబూలం గౌరిపెద్ది వారిది. రాళ్లపల్లి వారితో కలిసిపని చేసిన గౌరిపెద్దివారు తాళ్లపాక వాఙ్మయ పరిష్కరణ స్వతంత్రంగా సాగించి పూర్తి చేసినారు. చివరి రెండు సంపుటాలు పూర్తి చేసే భాగ్యం నాకు కలిగింది. పరిష్కరణ కార్యంలో తోడ్పడిన గౌరిపెద్దివారిని గురించి మా గురువుగారు రాళ్లపల్లి వారు వ్రాసిన వాక్యాలను యథాతథంగా అందిస్తున్నాను. 'ఈ గొప్ప పనికి నాకు చేదోడువాదోడుగ వారు శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాల యందలి ఆంధ్రసంస్కృత సాహిత్యోపాధ్యాయులగు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ శిరోమణి విద్వాన్ గారిని ఏర్పరచుట నా యదృష్టము. శ్రీ శర్మగారు అష్టావధానము, ఉభయభాషలందును ఆశుకవిత మంత్ర తంత్ర శాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలు విషయములలో పరిస్థితులు నిష్కల్మషమై నిష్పక్షపాతమైన మేధ, ప్రామాణికమైన దృష్టి, ఆత్మార్థమైన సదాచారసంపత్తి గల వారు. ఈ పల్లె పట్టులందలి దేశి తెలుగు నుడి కారములు చక్కగ నెరిగినవారు. మీదుమిక్కిలి నాయెడ సుస్నిగ్ధమైన హృదయముగలవారు. కార్యోత్సాహ పూర్ణులు. ఇంతకంటే గౌరిపెద్ది వారి గురించి ప్రస్తావించడం పునరుక్తే అవుతుంది. రాళ్లపల్లి వారు "శ్రీనివాస కైంకర్యము నకు వయోదోషము చేత నేను మరల చేయివేయలేని స్థితిలో నున్నానే అని నిర్వేదాన్ని పొందినారు. కాని యా కార్యము సంపన్నముగ నిర్వహింపగల శక్తి యుక్తిరక్తులు నిండిన నా అంతరంగమిత్రులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారే ఇందుకు నియమింపబడుట నా హృదయమున కెంతో నెమ్మది నిచ్చినది" అని నిట్టూర్చినారు. గౌరిపెద్ది వారు పరిష్కరించి ప్రకటించిన సంపుటాలు వారి పాండిత్యానికి నిదర్శనాలు. తాళ్లపాకవారి వాఙ్మయం పరిష్కరిస్తూ వారు రచించిన పీఠికలు ఆంధ్రశారదకే పాదపీఠాలు. 1978లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా ఉన్న పివిఆర్కె.ప్రసాద్‌గారు నా అన్నమాచార్య వాఙ్మయ ప్రచార కృషిని గమనించి నన్ను అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టరుగా నియమిస్తూ పరిష్కరణ కార్యక్రమాన్ని సాగిస్తున్న గౌరిపెద్ది వారిని సూచించగ వారిని స్పెషల్ ఆఫీసరు 'అన్నమయ్య వాఙ్మయ ప్రాజెక్టుగా' నియమించి తమ ఔదార్యాన్ని ప్రకటించినారు. గౌరిపెద్దివారు ప్రణయ సుందరంగ అనేవారు "నేను మూలమూర్తినయ్యా అక్కడ్నుండి కదిలే ప్రసక్తి లేదు మా 'శీను' ఉత్సవమూర్తి' ఊరూర వాడవాడా తిరుగుతూ మంచి పలుకులతో సుస్వరంతో అన్నమయ్య వాఙ్మయాన్ని ప్రచారం చేస్తున్నాడు. ఆ చిరంజీవిని మనసార ఆశీర్వదిస్తున్నా" నని వారు.

గౌరిపెద్దివారి వ్యక్తిత్వం హిమాలయోన్నతము. మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడేవారు. ఎమ్మే చదివేరోజుల్లో గంగుండ్రమండపం వీధిలో పదవనెంబరు ఇంట్లో ఉండేవాళ్లం (1961-63). రెండు రోజుల్లో ఎం.ఏ ఫైనల్ పరీక్షలు. నాకు జబ్బుచేసింది. గౌరిపెద్దివారు నాడిచూసి 'విషజ్వరం' అన్నారు. స్వయంగ పొలాల వెంటతిరిగి యేవో వనమూలికలు సేకరించి కషాయం కాచి నాకు తాపించారు. రాత్రంతా మేలుకొని నాకు తైలాలు రాస్తూ కషాయం ఇస్తూ చూసుకున్నారు. ఒక్కరోజులో నయం కావడం, నేను పరీక్షలు రాయడం అన్నీ సవ్యంగా జరిగిపోయినవి. ఎక్కడి 'నేను' ఎక్కడి వారు ఏమిటీ అనుబంధాలు వారికి పౌరోహిత్యం తెలుసు. కాని ఎక్కడా పౌరోహిత్యం చేయరు. నా తల్లి ఆబ్దీకాన్ని మాత్రం వారు నిర్వహించేవారు. 'శివకామమ్మ రామసుబ్బశర్మ లతో మా తల్లిదండ్రులనే చూసుకొనేవాళ్లం.

గౌరిపెద్దివారి చివరిదశ విషాదగ్రస్తం. అంత గొప్ప ఆయుర్వేదవైద్యులు తనకున్న చక్కెరవ్యాధిని నిర్లక్ష్యం చేసినారు. గ్యాంగ్రిన్ యేర్పడి ఒక కాలును తొలగించినారు. గురువు గారి రెండు పాదాలు తాకి నమస్కరించే నాకు దుఃఖం కలిగింది. 'వారు నా కన్నీళ్లు తుడుస్తూ తలను స్పృశించి 'దీర్ఘాయుష్మాన్‌భవ' అని ఆశీర్వదించినారు. ఆనందబాష్పాలు రాలుస్తూ నిన్ను చూస్తే నాకు గర్వంగ ఉందన్నారు. గురువుగారు గర్వించినా శిష్యుని గుండెలో విషాదమే అలముకొన్నది. గౌరిపెద్దివారు కేవలం గురువేకాదు, అంతకు మించి. ఆ మహావ్యక్తికి, ఆ సారస్వత మూర్తికి, తిరుపతి ప్రజలు సముచితమైన నివాళులర్పించలేదనే సంకోచం నాకుంది. వారి గురించి నాలుగు మంచి విషయాలు పంచుకోవడానికి నా ప్రాణ మిత్రుడు శేషాద్రిలేరు. కాని ఈ 'సాహితీ నేత్రం' నాకు కొంత ఊరటను కలిగించింది. శ్రీనివాసోరక్షతు.

*( రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారితో, గౌరి పెద్ది వారితో పరిచయం ఒకే సమయంలో జరిగింది. రాళ్లపల్లి వారితో మాది కేవలం సారస్వత బంధమే. గౌరి పెద్ది వారితో మా అనుబంధం అంతకు మించినది. మాకు అంటే నేనూ నా బాల్యమిత్రుడు చేట్లూరు శేషాద్రి 'సన్నియోగ విశిష్టానాం సహవా ప్రవృత్తి...' అని వ్యాకరణ సత్యాన్ని అసంపూర్ణంగా తెలిపేవారు. అంటే మేమిద్దరమూ యెప్పుడూ కలిసే ఉంటామని తాత్పర్యం. అది కొంతవరకే సత్యమయింది. మాకు గౌరి పెద్దివారి కన్నాకూడా, వీరి ప్రమేయం వల్లనే మాకు 'రాళ్లపల్లివారి శిష్యులనే' ముద్రపడింది. )*

ముద్రితవ్యాసం (సాక్షి-16-09-2009)

# వరుణుని మెప్పించిన గౌరిపెద్ది

**ఆచార్య తిరుమల రామచంద్ర**

ఆంధ్రపత్రిక ప్రత్యేక ప్రతినిధి

ఆ రాత్రి అష్టావధానం గొప్పగా జరిగిందంటే అతిశయోక్తి లేదు. శ్రీ తిరుపతి కవుల, అనంతపురం జిల్లాలోని కుంటిమద్ది రామాచార్యుల వారి అవధానాలను విన్న వృద్ధులింకా దేశంలో అక్కడా అక్కడా వున్నారు. వాటితో పోల్చలేముగాని, ఇటీవల ఇలాటిది చూడలేదంటే ఉత్ప్రేక్షకాదు...

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గొప్ప పండితులు. ఉణాదులతో సహా సిద్ధాంతకౌముది మొదలయినవి నిత్యవృత్తిలోవున్న ఉపాధ్యాయులు కనుక నిషేధాక్షరిని అతిసులభంగా పాదం అల్లారో లేదో, అవధానంలో నెగ్గుకుపోయారనే భావం ఏర్పడింది. నిషేధాక్షరి పండితుడు "అయ్యా ఇక్కడ వానలు లేవు. కంఠంలో 'వరుణస్తోత్రం చెప్పండి' వానపడుతుందేమో అన్నారు. 'శ్రీ' అని ప్రారంభించారు అవధాని. మ నిషేధం. అలాగే అన్ని నిషేధాలతో శ్రీమత్పాశాధానా అయింది. అధానా అనేమాట వినగానే అవధాని గెలిచాడనిపించింది. అలాగే రెండవపాదం "స్వామీ, నక్రాంగ వాహచతుపాధారా" అన్నది. చతుష్పతుః అని నీటికి ద్విరూపకోశంలోమాట. ఇంతగా కోశాలు తలలో పెట్టుకున్నవారికి నిషేధాక్షరి లెక్కా?---

అష్టావధానం మధ్య వరుణస్తోత్రం ప్రభావంతోనో ఏమో, పెద్దగా వర్షం కురిసింది, పిడుగులు కూడా పడ్డాయి. లైట్లు ఆరిపోయాయి. అయినా, శ్రోతలు కదలకుండా, కొంతసేపు చీకటిలోనే అవధానం వినడం చూడగా ఈ పట్టణజనంలో సాహిత్యాభిరుచి, ఆసక్తి ఎంతగా పెరిగాయని ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది.---

*(శ్రీ తిరుమల రామచంద్రగారు ఆంధ్రపత్రిక ప్రత్యేక ప్రతినిధిగా చిత్తూరు జిల్లా రచయితల మహాసభలకు వచ్చి ఆంధ్రపత్రికలో వ్రాసిన సమీక్షను వ్యాసరూపంగా ప్రకటించాము.)*

*- చిత్తూరు జిల్లా రచయితల మహాసభలు*

*సేకరణ - శ్రీమధురాంతకం జానకి రామరెడ్డి*

*విద్వాన్, ఎం.ఏ.*